www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 23-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 278
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 8.41 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఆర్ద్ర తె. 6.27 తదుపరి పునర్వసు; వర్జ్యం: మ. 1.53-3.35; దుర్ముహూర్తం: ఉ. 9.07-9.51, రా. 10.15-11.05; అమృతఘడియలు: రా. 7.50-9.32; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.02 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జోడో యాత్రకు బ్రేకులు

అసోంలో బతద్రవ సత్ర ఆలయ దర్శనానికి రాహుల్‌కు అనుమతి నిరాకరణ

- వెళ్లకుండా అడ్డుకున్న యంత్రాంగం
- పాదయాత్ర, సమావేశానికీ ఆటంకం
- పార్టీ శ్రేణులతో కలసి రాహుల్ ధర్నా
- ఆలయానికి ఎవరెవరు వెళ్లాలో మోదీ నిర్ణయిస్తున్నారని ధ్వజం


ఆలయ దర్శనానికి అనుమతి నిరాకరించినందుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన రాహుల్


12

> ఇప్పుడు ఈ భూమ్మీద అత్యంత అదృష్టవంతుడిని నేనే. నా పూర్వీకులు, కుటుంబ సభ్యులతోపాటు ఆ శ్రీరాముడి ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయి.
> - బాలరాముడి విగ్రహ రూపశిల్పి అరుణ్ యోగిరాజ్

రామయ్యా.. వచ్చాడయ్యా..

5 శతాబ్దాల తర్వాత సొంత గూటికి శ్రీరాముడు

- అయోధ్యలో ఆవిష్కృతమైన ఆధ్యాత్మిక అద్భుతం
- సాకేతపురిలో ఐదేళ్ల బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ
- కళ్లకు కట్టిన వస్త్రం తీసి.. కాటుక దిద్ది.. అద్దం చూపి నరేంద్ర మోదీ చేతుల మీదుగా చారిత్రక మహోత్సవం
- తొలి హారతి ఇచ్చి దర్శనం చేసుకున్న ప్రధాని మోదీ
- అభిజిత్ లగ్నంలో 84 సెకన్లపాటు కొనసాగిన క్రతువు
- గర్భగుడిలో యోగి, ఆనందీ, మోహన్ భాగవత్ కూడా
- తర్వాత శివుడికి అభిషేకం, జటాయు విగ్రహావిష్కరణ
- రామ మందిర నిర్మాణ కార్మికులకు మోదీ సత్కారం
- 8000 మందికిపైగా అతిథులు హాజరు


బాలరాముడికి పట్టు వస్త్రాలు, వెండి ఛత్రం తీసుకెళ్తున్న ప్రధాని నరేంద్ర మోదీ


దాదాపు నాలుగు దశాబ్దాల కిందట దేశవ్యాప్తంగా కోట్లాదిమంది రామ భక్తులు అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ఇటుకలు పంపించారు గుర్తుందా!? ఆ ఇటుకలు ఎప్పుడో మట్టిలో కలిసి పోయాయి! కానీ, ఆ సంకల్పం ఇప్పుడు దివ్య, నవ్య, భవ్య రామ మందిరంగా కళ్ల ముందు సాక్షాత్కరించింది!

రాముడి వనవాసం 14 ఏళ్లే! కానీ, అయోధ్యలో తిరిగి రామ మందిరం నిర్మించాలన్న హిందువుల పోరాటానికి మాత్రం 500 ఏళ్లు! ఐదు శతాబ్దాల ఆ ఉద్యమం దైవత్వం ఉట్టిపడే ప్రసన్న బాల రాముడి రూపంలో ఇప్పుడు ఫలించింది!

అయోధ్య, జనవరి 22: మనం జీవించి ఉండగా ఈ జన్మలో కళ్ల జూస్తామా!? అని ఎంతోమంది భారతీయులు ఆకాంక్షించిన అద్భుతం అయోధ్యలో ఆవిష్కృతమైంది! అక్కడ రామ మందిరం నిర్మించాలన్న హిందువుల కల సాకారమైంది! టెంట్‌లో ఉన్న రాముడు మందిరంలోకి రావాలన్న రామ భక్తుల ఆకాంక్ష ఫలించింది! భారత రాజకీయ, ఆధ్యాత్మిక చరిత్రలోనే మహోన్నత ఘట్టానికి శ్రీకారం చుట్టుకుంది! అయోధ్యలో దాదాపు 8000 మంది అతిథులు; ప్రపంచవ్యాప్తంగా టీవీ తెరలపై కోట్లాది మంది భారతీయులు భక్తి తన్మయత్వంతో చూస్తుండగా సాకేతపురిలో కొత్తగా నిర్మించిన ఆలయంలో 51 అంగుళాల(4.25 అడుగుల) బాల రాముడు కొలువుదీరాడు! ప్రధాని మోదీ చేతుల మీదుగా రామయ్య ప్రాణ ప్రతిష్ఠ వేడుక సోమవారం అభిజిత్ లగ్నంలో అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ మధ్యాహ్నం 12 గంటలకు ప్రాణ ప్రతిష్ఠ క్రతువు ప్రారంభమైంది. తొలుత ప్రధాని మోదీ

మిగతా 11వ పేజీలో...

సమగ్ర కథనాలు 10, 11, 12లో



రామాలయ ప్రతిష్ఠ.. నవ శకానికి శ్రీకారం

- పురోగామి భారతానికి నిదర్శనం
- రాముడు ఇక టెంట్లో ఉండక్కర్లేదు
- అద్భుత ఆలయంలో నివసిస్తాడు
- శబరి, గుహుడు, ఉడుత, జటాయువు జీవితాలే మార్గదర్శకం
- కృషి చిన్నదైనా పెద్దదైనా.. దానికంటూ ప్రత్యేకత ఉంటుంది
- అయోధ్యలో ప్రధాని మోదీ



అయోధ్యలో ఇక కర్ఫ్యూలుండవు

కాల్పుల మోతలు వినిపించవు
అంతా రామోత్సవమే: యోగి

ప్రపంచవ్యాప్తంగా సంబరాలు

- న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్‌స్క్వేర్ వద్ద లడ్డూల పంపిణీ
- మార్చి 25 నుంచి అమెరికా, కెనడాల్లో వీహెచ్‌పీ రథయాత్ర

అయోధ్య రామోత్సవంలో బాబు, పవన్, చిరంజీవి

వారిని పలకరించిన ప్రధాని మోదీ

నేటి నుంచి అందరికీ దర్శనం

ఉదయం 7-11.30, మ. 2 నుంచి రాత్రి 7 గంటల దాకా


'చలో బెజవాడ'కు తరలివచ్చిన అంగన్వాడీలపై విరుచుకుపడేందుకు సోమవారం తెల్లవారుజామున దీక్షా శిబిరం వద్ద భారీగా మోహరించిన పోలీసు బలగాలు. (ఇన్‌సెట్) బలవంతంగా బస్సులో కుక్కుతున్న వేళ మగ పోలీసు చేతచిక్కి ఓ అంగన్వాడీ కార్యకర్త విలవిల



రాక్షసకాండ

అంగన్వాడీలపై ఉక్కుపాదం.. ఎక్కడికక్కడ ఈడ్చిపారేసిన పోలీసులు

- గ్రూపులు గ్రూపులుగా తరలివచ్చిన అంగన్వాడీలు
- మహిళల దుస్తులు ఊడిపోతున్నా.. సొమ్మసిల్లినా కనికరించని పోలీసులు.. వెంటాడి, బస్సులో కుక్కి.
- తొలగింపు ఉత్తర్వులు.. భయంతో కొందరు విధుల్లోకి

3

అంగన్వాడీల సమ్మె విరమణ

- బొత్స, సజ్జలతో అర్ధరాత్రి చర్చలు
- జూలై నుంచి జీతాల పెంపునకు హామీ
- సమ్మెకాలానికి జీతం, కేసుల ఎత్తివేతకు ఓకే

ఫిబ్రవరి మూడో వారంలో ఎన్నికల షెడ్యూలు!?

8

- ముమ్మరమవుతున్న కసరత్తు
- నెలాఖరులోపు బదిలీల ప్రక్రియ పూర్తి

బెడిసికొట్టిన 'వ్యూహం'!

- ఆర్జీవీకి ఎదురుదెబ్బ.. సెన్సార్ సర్టిఫికెట్ రద్దు
- చిత్రంలో వ్యక్తుల పరువు, హక్కులకు భంగం కలిగించే సన్నివేశాలున్నాయి: టీ-హైకోర్టు
- రివైజింగ్ కమిటీ సర్టిఫికెట్ కొట్టివేత

3

క్షీణించిన కోడికత్తి శ్రీను ఆరోగ్యం!

- ఆస్పత్రిలో చేర్పించిన జైలు అధికారులు
- జైలులో దీక్ష విరమించినట్టు ప్రకటన
- లేదు.. కొనసాగిస్తున్నాడన్న న్యాయవాది

8

మహిళలే నిర్ణేతలు

రాష్ట్రంలో వారి ఓట్లే అత్యధికం.. ఏకంగా 24 జిల్లాల్లో పైచేయి

- యువతలోనూ ఓటుపై చైతన్యం
- 8,13,544 మందికి తొలిసారి హక్కు
- 2024-తుది జాబితా విడుదల
- ముసాయిదా జాబితా నుంచి 16,52,422 ఓటర్లు అవుట్
- కొత్త ఓట్ల చేర్పులు 22,38,952
- తొలగింపు కంటే చేరికలు అధికం
- నామినేషన్ వరకు నమోదుకు చాన్స్
- సీఈవో ముఖేష్‌కుమార్ మీనా వెల్లడి



8

వారంలో డీఎస్సీ!

3

- 6 వేలకు పైగా ఖాళీలతో ప్రకటన.. అధికారులతో మంత్రి బొత్స సమీక్ష
- నాలుగున్నరేళ్లుగా పట్టించుకోకుండా ఎన్నికల ముందు జగన్ హడావుడి

ఆంధ్రజ్యోతి
బిజినెస్
విజయవాడ ● మంగళవారం 23 జనవరి 2024

సోనీ-జీ బ్రేకప్

రూ. 83,000 కోట్ల విలువైన విలీన ఒప్పందం రద్దు
రూ. 747 కోట్లు చెల్లించాలని 'జీ'కి నోటీస్ పంపిన సోనీ

న్యూఢిల్లీ: భారత మీడియా, వినోదం రంగంలో రెండేళ్ల క్రితం కుదిరిన మెగా విలీన ఒప్పందం రద్దయింది. భారత్‌కు చెందిన జీ గ్రూప్‌తో జపాన్‌కు చెందిన సోనీ గ్రూప్ కార్పొరేషన్ తెగదెంపులు చేసుకుంది. జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కుదుర్చుకున్న 1,000 కోట్ల డాలర్ల (రూ.83,000 కోట్లు) విలువైన విలీన ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు సోనీ గ్రూప్ భారత అనుబంధ విభాగమైన సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ప్రస్తుతం కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్) సోమవారం ప్రకటించింది. డీల్ రద్దు నోటీసును జీ గ్రూప్‌నకు పంపిన సోనీ.. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించడంతో పాటు మధ్యవర్తిత్వం కోరిన నేపథ్యంలో బ్రేకప్ ఫీజు కింద 9 కోట్ల డాలర్లు (రూ.747 కోట్లు) చెల్లించాలని డిమాండ్ చేసింది. విలీనం తర్వాత ఏర్పడే సంస్థకు ఎవరు నేతృత్వం వహించాలన్న విషయంపై ప్రతిష్ఠంభన తొలగకపోవడంతో సోనీ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

ఇరు వర్గాలకూ కీలక ఒప్పందం: భారత్‌లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మీడియా రంగంలో పోటీని తట్టుకునేందుకు ఈ విలీన ఒప్పందం ఇరు కంపెనీలకూ కీలకమే. ఎందుకంటే, 70కి పైగా టీవీ చానెళ్లు, 2 వీడియో స్ట్రీమింగ్ సేవల వేదికలు (జీ5, సోనీ లివ్), రెండు ఫిల్మ్ స్టూడియోల (జీ స్టూడియో, సోనీ పిక్చర్స్ ఫిల్మ్స్ ఇండియా)తో విలీన కంపెనీ దేశంలోనే అతిపెద్ద ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్‌గా అవతరించి ఉండేది. అంతేకాదు, తమ ప్రధాన ప్రత్యర్థులైన స్టార్, డిస్నీ నెట్‌వర్క్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకునేందుకు, సోనీ అనుబంధ సంస్థ ఎస్‌పీఎన్‌ఐకి భారత్‌లో వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు ఈ ఒప్పందం దోహదపడి ఉండేది.

సోనీ వాదనలను ఖండించిన జీ: డీల్ రద్దుకు సంబంధించి సోనీ గ్రూప్ వాదనలను ఖండించిన జీ.. చట్టపరంగా పరిష్కారాలను అన్వేషిస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. ఈ నేపథ్యంలో తమ సంబంధిత వర్గాల ప్రయోజనాలను రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని తన ప్రకటనలో పేర్కొంది. విలీనాన్ని పూర్తి చేసేందుకు అగ్రిమెంట్‌కు లోబడి అన్ని చర్యలు చేపట్టామని జీ అంటోంది.

రూ.366 కోట్లు వెచ్చించాం: ఈ డీల్ కోసం ఇప్పటివరకు రూ.366.6 కోట్లు వెచ్చించామని జీ గ్రూప్ అంటోంది. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో రూ.176.20 కోట్లు, ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) ప్రథమార్ధంలో మరో రూ.190.39 ఖర్చు చేశామని అంటోంది.

గోయెంకా సారథ్యం ఇష్టంలేకే..

2021 డిసెంబరు 22న కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎండీ, సీఈఓ పునీత్ గోయెంకానే విలీన సంస్థకూ సారథ్యం వహించాల్సింది. కానీ, ఆ తర్వాత అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. అధికార దుర్వినియోగానికి పాల్పడటంతో పాటు స్వప్రయోజనాల కోసం కంపెనీ నిధులు దారి మళ్లించారన్న ఆరోపణలపై జీ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర గోయెంకా, ఆయన కుమారుడు పునీత్ గోయెంకాపై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ వేటు వేసింది. ఏ లిస్టెడ్ కంపెనీలోనూ డైరెక్టర్ లేదా మేనేజ్‌మెంట్‌లో కీలక పదవి చేపట్టకుండా ఇద్దరిపై ఏడాదిపాటు నిషేధం విధించింది. వీరిపై సెబీ దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో విలీన కంపెనీకి పునీత్ గోయెంకా సారథ్యాన్ని సోనీ నిరాకరించింది. అయితే, ఈ విషయంలో జీ వెనక్కి తగ్గకపోవడమే డీల్ రద్దుకు ప్రధాన కారణమైంది. ఒప్పందం ప్రకారం విలీనాన్ని రెండేళ్లలో (2023 డిసెంబరు 21 నాటికి) పూర్తి చేయాల్సింది. గడువు ముగియడంతో సోనీ మరో నెల రోజుల (2024 జనవరి 21 వరకు) గడువును పొడిగించింది. డెడ్‌లైన్ నాటికి విలీనానికి పరిస్థితులు ఏమాత్రం సంతృప్తికరంగా లేకపోవడం తీవ్రంగా నిరాశ కలిగించిందని సోనీ పేర్కొంది.

స్పందన స్ఫూర్తి లాభంలో 79% వృద్ధి

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.127 కోట్ల నికర లాభం నమోదు చేసింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 79 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం 75 శాతం పెరిగి రూ.657 కోట్లకు చేరింది. నికర మొండి బకాయిల భారం 2.52 శాతం నుంచి 0.48 శాతానికి తగ్గింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ		విజయవాడ	555
హైదరాబాద్	536	విశాఖపట్నం	563
23 జనవరి		వరంగల్	538
చిత్తూరు	563	డజను గుడ్లు రూ.72	
గోదావరి	555		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	87	గోదావరి	96
వరంగల్	87	విజయవాడ	96
కరీంనగర్	87	గుంటూరు	97
మహబూబ్‌నగర్	87	ఒంగోలు	97
కర్నూలు	87	చిత్తూరు	93
విశాఖపట్నం	96		

32% పెరిగిన సిప్లా లాభం

న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం సిప్లా.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,056 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.801 కోట్లు)తో పోల్చితే లాభం 32 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.5,810 కోట్ల నుంచి రూ.6,604 కోట్లకు పెరిగిందని సిప్లా ఎండీ, గ్లోబల్ సీఈఓ ఉమాంగ్ వోహ్రా వెల్లడించారు. అన్ని విభాగాల్లో మంచి పనితీరు కనబరచటంతో భారత వ్యాపారం 12 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఆయన పేర్కొన్నారు. అలాగే అమెరికా వ్యాపారం కూడా సానుకూలంగా ఉండటంతో 23 కోట్ల డాలర్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు చెప్పారు.

కేవీబీ లాభం రూ.412 కోట్లు

చెన్నై: తమిళనాడు కేంద్రంగా పనిచేసే కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి బ్యాంక్ రూ.412 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఇది 42.56 శాతం ఎక్కువ. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.2,012.71 కోట్ల నుంచి రూ.2,497.17 కోట్లకు పెరిగింది. మరోవైపు బ్యాంక్ మొత్తం వ్యాపారం 14.74 శాతం వృద్ధి చెంది రూ.1,58,357 కోట్లకు చేరుకుంది. కాగా ఈ కాలంలో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 2.7 శాతం నుంచి 1.58 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు 0.9 శాతం నుంచి 0.42 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ పేర్కొంది.

టెక్ కొలువులపైనే జెన్-జెడ్ విద్యార్థుల ఆసక్తి

ఐటీ ఉద్యోగుల్లో 90% వారే
గిగ్ వర్కర్ల వైపే కంపెనీల మొగ్గు
నాస్కామ్-ఇన్‌డీడ్ సర్వే

న్యూఢిల్లీ: ఐటీ, టెక్నాలజీ కొలువులపై నవ యువతలో ఆసక్తి కొనసాగుతోంది. ఎన్ని ఆటుపోట్లు ఉన్నా.. ఐటీ కొలువులే సో బెటర్ అంటున్నారు. నాస్కామ్-ఇన్‌డీడ్ సంయుక్తంగా జరిపిన ఒక సర్వేలోనూ ఇదే విషయం తేలింది. 1990వ దశకం చివరి నుంచి 2010వ దశకం ప్రారంభంలో జన్మించిన (జెనరేషన్ జెడ్) విద్యార్థుల్లో 77 శాతం మంది.. మాకు వేరే జాబ్స్ వద్దు, ఐటీ జాబే బెటర్ అని సెలవిచ్చారు. దీనికి తగ్గట్టే ప్రస్తుత భారత ఐటీ, టెక్నాలజీ కంపెనీల ఉద్యోగుల్లో దాదాపు 90 శాతం మంది జెనరేషన్ జెడ్, మిల్లీనియల్స్‌గా పేరొందిన 1980-1996 మధ్య కాలంలో జన్మించిన వారే ఉండడం విశేషం. మొత్తం 185 కంపెనీలకు చెందిన 2,500 మందికి పైగా ఉద్యోగుల అభిప్రాయాలను క్రోడీకరించి నాస్కామ్-ఇన్‌డీడ్ ఈ సర్వే విడుదల చేశాయి.

ఎంపికలో జాగ్రత్తలు : ఐటీ, టెక్నాలజీ ఉద్యోగాల మీద ఆసక్తి ఉన్నా విద్యార్థులు, యువకులు.. ఏ కంపెనీలో పడితే ఆ కంపెనీల్లో చేరడం లేదు. మంచి ప్యాకేజీతో పాటు ఉద్యోగంలో పైకి ఎదిగేందుకు,కొత్త నైపుణ్యాలు నేర్చుకునేందుకు ఉన్న అవకాశాలు, ఆయా కంపెనీల పని కల్చర్, నైతిక విలువలు వంటి విషయాలు చూసి మరీ కంపెనీలను ఎంచుకుంటున్నారు. కంపెనీలు కూడా దీనికి తగ్గట్టే కొత్త ఉద్యోగులకు మంచి శిక్షణతో పాటు జాబ్‌కు తగ్గట్టు ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి మరీ వారిని తీర్చిదిద్దుతున్నాయి.

'గిగ్' ఉద్యోగులపైనే ఆసక్తి : ఐటీ కొలువుల నియామక ప్రక్రియలోనూ మార్పు కనిపిస్తోందని సర్వే వెల్లడించింది. కంపెనీలు ఇదివరకటిలా పర్మినెంట్ ఉద్యోగులను తీసుకోవడం లేదు. తమ ప్రాజెక్టుల అవసరాలకు తగ్గ ప్రత్యేక నైపుణ్యా లు ఉన్న గిగ్ (తాత్కాలిక) ఉద్యోగుల నియామకాలకే మొగ్గు చూపుతున్నాయి. జీతాలు కొద్దిగా ఎక్కువైనా ప్రాజెక్టు పూర్తయిన తర్వాత వీరిని ఉద్యోగాల్లో కొనసాగించాల్సిన అవసరం ఉండదు. అదే పర్మినెంట్ ఉద్యోగులను తీసుకుంటే కొత్త ప్రాజెక్టులు రాకపోయి నా వారికి జీతభత్యాల ఖర్చులు తప్పవు. దీంతో సర్వే లో పాల్గొన్న కంపెనీల్లో 84 శాతం కంపెనీలు గిగ్ వర్కర్లకే ఓటేశాయి. ప్రస్తుతం అమెరికా, ఈయూ దేశాల కంపెనీల్లో గిగ్ వర్కర్ల సంఖ్యే ఎక్కువ. ఇదే ట్రెండ్ మన దేశంలోనూ ముఖ్యంగా స్టార్టప్, బీపీఎం కంపెనీల్లో ప్రారంభమైందని భావిస్తున్నారు.

ఎక్కువ క్యాంపస్‌లకు వెళ్లం: పర్సిస్టెంట్ సిస్టమ్స్

మరోవైపు ఐటీ రంగంలో నియామకాల సంక్షోభం కొనసాగుతోంది. గతంలోలా కంపెనీలు ఫ్రెషర్స్‌ను పెద్దగా తీసుకోవడం లేదు. ఒకవేళ కొద్దోగొప్పో తీసుకున్నా గతంలోలా ఎక్కువ ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్లడం లేదు. మిడ్ టైర్ ఐటీ కంపెనీ పెర్సిస్టెంట్ సిస్టమ్స్‌ది ఇదే పరిస్థితి. కంపెనీ సీఎఫ్ఓ సునీల్ సప్రే ఈ విషయం స్వయంగా ప్రకటించారు.

బ్యాంక్, ఫైనాన్స్ షేర్లపై కన్నేయండి..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మరింత డౌన్‌ట్రెండ్‌లో సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కీలక మద్దతు, నిరోధ స్థాయిల్లో సూచీలకు గట్టి పరీక్ష ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మార్కెట్లో బేరిష్‌నెస్ ఉండటమే ఇందుకు కారణం. సూచీలు ఇప్పటికీ గరిష్ఠ స్థాయిల్లోనే ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడుతున్నారు. అయితే ఆకర్షణీయ ధరల్లో లభించే బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లను కొనుగోలు (అక్యుములేట్) చేసుకోవటం ఉత్తమం.

స్టాక్ రికమండేషన్స్

ఫినోలెక్స్ కేబుల్స్

గత ఏడాది డిసెంబరు రెండో వారంలో కుదుపునకు లోనైన ఈ కౌంటర్‌లో ఇప్పుడు స్థిరత్వం వచ్చింది. నెల రోజులుగా కన్సాలిడేషన్ జరుగుతోంది. గత శనివారం సెషన్లో ఈ షేరు రూ.1,091.65 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.1,080/1,060 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి ప్రవేశించి రూ.1,185/1,320 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,035 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్

కొన్నాళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ కౌంటర్‌లో ఇటీవల మూమెంటమ్ పెరిగింది. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. కీలక మద్దతు స్థాయి రూ.255 స్థాయిల్లో నిలదొక్కుకుంది. గత శనివారం సెషన్‌లో ఈ షేరు రూ.271.30 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు రూ.270/260 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి అడుగుపెట్టి రూ.300/ 345 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.245 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్

డిసెంబరు 2022లో మొదలైన ఈ షేర్ల పరుగు ఇంకా కొనసాగుతోంది. దిద్దుబాటుకు ఆస్కారమే లేకుండా సుదీర్ఘ అప్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. నెల రోజులుగా ఈ షేరు కన్సాలిడేట్ అవుతూ వస్తోంది. గత శనివారం ఈ షేరు రూ.834.40 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.840/830 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ. 960/1,140 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.810 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

షాపర్స్ స్టాప్

గత ఏడాది నవంబరు నుంచి ఈ షేరు కన్సాలిడేట్ అవుతూ వస్తోంది. అంతకు ముందు కొన్ని నెలల వరకు ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లోనే ఉన్నాయి. క్యూ3 ఆర్థిక ఫలితాలు అంచనాల మేరకు ఫలితాలు లేనప్పటికీ ఈ కౌంటర్‌లో మూమెంటమ్ పెరుగుతోంది. గత శనివారం ఈ షేరు రూ.711 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.710/690 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి ప్రవేశించి రూ.900/940 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇండియన్ బ్యాంక్

గత ఏడాది ఆరంభం నుంచి ఈ షేరు మంచి పనితీరును కనబరుస్తూ వస్తోంది. ప్రస్తుతం అప్‌ట్రెండ్ కన్సాలిడేషన్ జరుగుతోంది. గత శనివారం ఈ షేరు రూ.459.95 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.450/430 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.555/630 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.410 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

స్పోర్ట్స్

ఆంధ్రకు తొలి విజయం

● 172 పరుగులతో అసోం చిత్తు

డిబ్రూఘర్: బౌలర్లు విజృంభించడంతో.. రంజీ సీజన్‌లో ఆంధ్ర తొలి విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-బిలో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 172 పరుగుల తేడాతో అసోంను చిత్తు చేసింది. ఆంధ్ర నిర్దేశించిన 363 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు ఆఖరి రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 81/5తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన అసోం 190 పరుగులకు ఆలౌటైంది. రియాన్ పరాగ్ (75), సుమిత్ (60) పోరాటం వృథా అయింది. లలిత్ మోహన్ నాలుగు వికెట్లు దక్కించుకోగా.. మనీష్, గిరినాథ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. సెంచరీ చేసిన కెప్టెన్ రికీ భుయ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఆంధ్ర 188, 334 పరుగులు చేయగా.. అసోం తొలి ఇన్నింగ్స్‌లో 160 రన్స్‌కు ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన ఏపీ ఆరు పాయింట్లను సొంతం చేసుకొంది.

మార్చి 22 నుంచి ఐపీఎల్!

న్యూఢిల్లీ: ఐపీఎల్ 17వ సీజన్ పోటీలు మార్చి 22 నుంచి మే 26 వరకు జరుగనున్నట్టు సమాచారం. అయితే ఈ లీగ్ ముగిశాక ఐదు రోజులకే వెస్టిండీస్/అమెరికా దేశాల్లో టీ20 వరల్డ్‌కప్ ఆరంభం కానుండడం గమనార్హం. కానీ భారత జట్టుకు మాత్రం ఐపీఎల్ అయ్యాక తొమ్మిది రోజుల విశ్రాంతి లభిస్తుంది. జూన్ 5న ఐర్లాండ్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అలాగే మహిళల ప్రీమియర్ లీగ్ ఫిబ్రవరి 22 నుంచి మార్చి 17 వరకు బెంగళూరు, ఢిల్లీ నగరాల్లో నిర్వహించనున్నారు. అయితే లీగ్ షెడ్యూల్‌ను బీసీసీఐ ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మరీ ముఖ్యంగా ఇంచుమించుగా అదే సమయంలో దేశంలో జరిగే సాధారణ ఎన్నికల షెడ్యూల్‌పై ఐపీఎల్ ఆధారపడి ఉంది. ఎలాగైనా లీగ్‌ను భారత్‌లోనే నిర్వహించాలన్న పట్టుదలతో బీసీసీఐ ఉంది.

అల్కారజ్ అలా..

మొదటిసారి క్వార్టర్స్‌కు • అజరెంకా అవుట్

ఆస్ట్రేలియన్ ఓపెన్



కలిన్‌స్కయా



అల్కారజ్

మెల్‌బోర్న్: ప్రపంచ రెండో ర్యాంకర్ కార్లోస్ అల్కారజ్ తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. రౌండ్-8లో ఈ స్పెయిన్ స్టార్..ఒలింపిక్ చాంపియన్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో తలపడతాడు. 20 ఏళ్ల వింబుల్డన్ చాంపియన్ కార్లోస్ గాయంతో గత ఏడాది ఈ టోర్నీలో ఆడలేకపోయాడు. ఇక..సోమవారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో 6-4, 6-4, 6-0తో మోమిర్ కెక్‌మనోవిక్ (సెర్బియా)పై అల్కారజ్ సునాయాసంగా గెలిచాడు. క్వార్టర్స్ చేరే క్రమంలో అతడు కేవలం ఒక సెట్టే కోల్పోవడం గమనార్హం. మరోవైపు 19వ సీడ్ బ్రిటన్ ఆటగాడు కామెరాన్ నోరీతో ప్రీక్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) ఐదుసెట్ల పాటు పోరాడాల్సి వచ్చింది. నాలుగు గంటల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జ్వెరెవ్ 7-5, 3-6, 6-3, 4-6, 7-6 (3)తో గెలిచి మూడోసారి ఇక్కడ క్వార్టర్స్ చేరాడు. ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జ్వెరెవ్-నోరీ మ్యాచ్ 32వ ఐదు సెట్ల పోరు కావడం విశేషం. ఓపెన్ ఎరాలో ఈ టోర్నీలో ఇది రికార్డు కూడా. మరో ప్రీక్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 7-6 (4), 5-7, 6-1తో 69వ ర్యాంకర్ నునో బోర్గెస్ (పోర్చుగల్)పై నెగ్గాడు. 9వ సీడ్ హుబర్ట్ హుర్కాజ్ (పోలెండ్) 7-6 (6), 7-6 (3), 6-4తో ఫ్రెంచ్ సంచలనం ఆర్థర్ కజాక్స్ జోరుకు చెక్ పెట్టాడు.



అజరెంకా

అయ్యో.. అజరెంకా: పురుషుల్లో టాప్ ర్యాంక్ ఆటగాళ్లంతా ముందంజ వేయగా.. మహిళల్లో మాత్రం సీడెడ్‌ల ఓటమి కొనసాగుతూనే ఉంది. 18వ ర్యాంకర్, రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ విక్టోరియా అజరెంకా (బెలారస్)కు 7-6 (6), 6-4తో అన్‌సీడెడ్ డయానా యాస్ట్రెమ్‌స్కా(ఉక్రెయిన్) నాలుగో రౌండ్‌లో షాకిచ్చింది. మరో ప్రీక్వార్టర్స్‌లో లిండా నోస్కోవా (చెక్ రిపబ్లిక్)తో 0-3తో వెనుకంజలో ఉన్న దశలో 23వ సీడ్ ఎలీనా స్విటోలినా (ఉక్రెయిన్) గాయంతో మ్యాచ్ నుంచి వైదొలగింది. ఇతర నాలుగో రౌండ్ మ్యాచ్‌ల్లో అన్‌సీడెడ్ అనా కలిన్‌స్కయా (రష్యా) 6-4, 6-2తో 26వ సీడ్ జాస్మిన్ పాలిని(ఇటలీ)ని, 12వ సీడ్ జెంగ్ (చైనా) 6-0, 6-3తో డోడిన్ (ఇటలీ)ని చిత్తు చేసి క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. కాగా, డయానా, లిండా, జాస్మిన్, జెంగ్ ఈ వేదికపై క్వార్టర్స్ చేరడం ఇదే మొదటిసారి.

దూసుకుపోతున్న బోపన్న జోడీ

భారత స్టార్ రోహన్ బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పురుషుల డబుల్స్‌లో జోరు కొనసాగిస్తూ రౌండ్-8కి చేరింది. మూడో రౌండ్‌లో బోపన్న ద్వయం 7-6 (6), 7-6 (4)తో వెస్లీ (హాలెండ్)/నికోలా (క్రొయేషియా) జంటను ఓడించింది.

ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టులకు కోహ్లీ దూరం



వ్యక్తిగత కారణాలవల్లే..

న్యూఢిల్లీ/ హైదరాబాద్: మరో రెండు రోజుల్లో ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆరంభం కానుండగా టీమిండియాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అనూహ్యంగా తొలి రెండు టెస్టుల నుంచి వైదొలిగాడు. అయితే వ్యక్తిగత కారణాలతోనే అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీసీసీఐ ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది. తొలి టెస్టుకోసం కోహ్లీ ఆదివారం హైదరాబాద్ చేరుకున్నాడు. గురువారం నుంచే హైదరాబాద్‌లో ఇరు జట్ల మధ్య మొదటి టెస్టు ఆరంభం కానుండగా, రెండో టెస్టు విశాఖపట్నంలో ఫిబ్రవరి 2 నుంచి జరుగుతుంది. 'ఇంగ్లండ్‌తో జరిగే తొలి రెండు టెస్టుల్లో ఆడలేనని విరాట్ బీసీసీఐకి విజ్ఞప్తి చేశాడు. ఈ విషయమై కెప్టెన్ రోహిత్, టీమ్ మేనేజ్‌మెంట్, సెలెక్టర్లతో కూడా తాను మాట్లాడాడు. దేశం తరపున ఆడడం గర్వకారణమే అయినా.. ఈ సమయంలో కుటుంబంతో గడపాల్సిన కచ్చితమైన పరిస్థితి ఏర్పడిందని చెప్పాడు. బీసీసీఐ కూడా విరాట్ నిర్ణయాన్ని గౌరవిస్తూ అతడికి మద్దతుగా నిలుస్తోంది. అలాగే మీడియా, అభిమానులు కూడా ఈ క్లిష్ట సమయంలో అతడి ప్రైవసీకి భంగం కలిగించవద్దని కోరుతున్నాం. అలాగే ఇంగ్లండ్‌తో సిరీస్ విజయం కోసం జట్టుకు అండగా నిలవాలి' అని బోర్డు కార్యదర్శి జైషా తెలిపాడు.

రేసులో పటీదార్, సర్ఫరాజ్!

ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టుల కోసం విరాట్ స్థానంలో రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. భారత్ 'ఎ' తరపున వీరిద్దరు చక్కగా రాణిస్తున్నారు. ఇంగ్లండ్ లయన్స్‌పై పటీదార్ 151 రన్స్ చేయగా, సర్ఫరాజ్ హాఫ్ సెంచరీ సాధించాడు. పుజార పేరు కూడా చర్చకు రావచ్చని సమాచారం.

ఏం జరుగుతోంది?

విరాట్ కోహ్లీ ఇటీవలి కాలంలో వ్యక్తిగత కారణాలతో తరచూ జట్టుకు అందుబాటులో లేకుండా పోతున్నాడు. గతంలో ఇలాంటి పరిస్థితి కనిపించేది కాదు. అఫ్ఘాన్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌కు ఎంపికైనా హఠాత్తుగా తొలి మ్యాచ్ నుంచి వైదొలిగాడు. అంతకంటే ముందు దక్షిణాఫ్రికా టూర్‌లో ఇదే కారణంతో ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ గేమ్స్ నుంచి తప్పుకొని లండన్ వెళ్లాడు. మరోవైపు ఇంతలా అతడిని చుట్టుముట్టిన కుటుంబ సమస్యలు ఏమై ఉంటాయనే ప్రశ్నలు అభిమానులను కలవరపెడుతున్నాయి.

ఐసీసీ టీ20 జట్టు కెప్టెన్ సూర్య



న్యూఢిల్లీ: పొట్టి ఫార్మాట్‌లో గతేడాది ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లతో కూడిన జట్టును ఐసీసీ ప్రకటించింది. దీనికి సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయడం విశేషం. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలతో జరిగిన సిరీస్‌ల్లో సూర్య జట్టును విజయవంతంగా నడిపించాడు. అలాగే గతేడాది సూర్య ఆడిన 18 మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలతో 733 రన్స్ సాధించాడు. ఇక ఈ టీమ్‌లో భారత్ నుంచి జైస్వాల్, బిష్ణోయ్, అర్ష్‌దీప్‌లకు కూడా చోటు దక్కింది.

జట్టు: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ (భారత్), ఫిల్ సాల్ట్ (ఇంగ్లండ్), పూరన్ (వెస్టిండీస్), చాప్‌మన్ (న్యూజిలాండ్), సికిందర్ రజా, రిచర్డ్ ఎన్‌గరవ (జింబాబ్వే), మార్క్ ఐడెర్ (ఐర్లాండ్), రమ్‌జాని (ఉగాండా).

రవిశాస్త్రికి 'లైఫ్‌టైమ్' అవార్డు



నేడు హైదరాబాద్‌లో పురస్కారాల ప్రదానం

హైదరాబాద్: గతేడాది పరుగుల వరద పారించిన డాషింగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు బీసీసీఐ 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కింది. కాగా, టీమిండియా మాజీ ఆల్‌రౌండర్, కోచ్ రవిశాస్త్రి జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో మంగళవారం ఈ అవార్డుల కార్యక్రమం ఉంటుందని భారత క్రికెట్ బోర్డు తెలిపింది. దీనికి భారత్, ఇంగ్లండ్ టెస్ట్ ఆటగాళ్లు హాజరయ్యే అవకాశాలున్నాయి. 61 ఏళ్ల శాస్త్రి భారత్ తరపున 80 టెస్టులు, 150 వన్డేలు ఆడాడు. రిటైరైన తర్వాత టీమిండియా కోచ్, డైరెక్టర్‌గా పనిచేశాడు. క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌కు పాలీ ఉమ్రీగర్ అవార్డు, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్‌కు సీకే నాయుడు పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

ఆధిక్యంలో గుకేష్

వీకాన్ జీ (నెదర్లాండ్స్): టాటా చెస్ టోర్నీ మాస్టర్స్ విభాగం ఎనిమిదో రౌండ్‌లో..మహిళల వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్‌తో గేమ్‌ను డ్రా చేసిన గుకేష్ (5) అనిష్ గిరీతో కలిసి సంయుక్త ఆధిక్యంలో నిలిచాడు. మరో భారత జీఎం ప్రజ్ఞానంద (4.5) మ్యాక్స్ వార్మెడమ్‌తో ఎనిమిదో రౌండ్‌ను ఫలితం లేకుండా ముగించాడు. చాలెంజర్ విభాగంలో జెమీ సాంటోస్‌తో ఎనిమిదో రౌండ్‌ను జీఎం హారిక డ్రా చేసుకుంది.

టైటాన్స్..మరో'సారీ'



తెలుగు జట్టు పరాజయం

హైదరాబాద్: గత మ్యాచ్ విజయంతో పరాజయ పరంపరకు చెక్ పెట్టినట్టే కనిపించిన స్థానిక జట్టు తెలుగు టైటాన్స్ మళ్లీ నిరాశపరిచింది. ప్రొ. కబడ్డీ లీగ్‌లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో 30-37 స్కోరుతో హరియాణా స్టీలర్స్ చేతిలో ఓడింది. ఆల్‌రౌండర్ సంజీవి (6), రైడర్ ప్రఫుల్ (6) తప్ప టైటాన్స్‌లో ఎవరూ ఆకట్టుకోలేదు. హరియాణాలో..డిఫెండర్ రాహుల్ (8), వినయ్ (6), మోహిత్ (6), శివమ్ (6) సమష్టిగా రాణించారు. టైటాన్స్‌కు ఇది ఓవరాల్‌గా 15 మ్యాచుల్లో 13వ పరాజయం కావడం గమనార్హం. కేవలం రెండు విజయాలే అందుకున్న తెలుగు జట్టు 16 పాయింట్లతో పట్టికలో అట్టడుగు స్థానంలో కొనసాగుతోంది. ఇక, టేబుల్ టాపర్ జైపూర్ పింక్ పాంథర్స్ తన జోరు కొనసాగిస్తోంది. స్టార్ రైడర్ అర్జున్ దేశ్వాల్ (15) అదరగొట్టిన వేళ అంతకుముందు జరిగిన మొదటి మ్యాచ్‌లో 42-25 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది. జైపూర్ మరో రైడర్ భవానీ రాజ్‌పుత్ (7), డిఫెండర్ అంకుశ్ (6) సత్తా చాటారు. బెంగాల్ జట్టులో మణిందర్ సింగ్ (9), వైభవ్ (5) పర్లేదనిపించారు.

కఠినమైన గ్రూపులో భారత్



పారిస్ ఒలింపిక్స్ పురుషుల హాకీ డ్రా

లౌజాన్ (స్విట్జర్లాండ్): పారిస్ ఒలింపిక్స్ పురుషుల హాకీలో భారత జట్టుకు కఠినమైన డ్రా ఎదురైంది. ఈ మేరకు పోటీల డ్రాను సోమవారం ఇక్కడ ప్రకటించారు. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యంతో చరిత్ర సృష్టించిన భారత్..రాబోయే ఒలింపిక్స్‌లో క్లిష్టమైన గ్రూప్ 'బి' నుంచి బరిలో దిగనుంది. ఈ గ్రూపులో ప్రస్తుత ఒలింపిక్ చాంపియన్, వరల్డ్ నెం.2 బెల్జియం, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్జెంటీనా, బలీయమైన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఐర్లాండ్ జట్లు ఉన్నాయి. గ్రూప్ 'ఎ'లో నెదర్లాండ్స్, జర్మనీ, బ్రిటన్, స్పెయిన్, ఫ్రాన్స్, సౌతాఫ్రికా జట్లు తలపడనున్నాయి. మహిళల్లో..గ్రూప్ 'ఎ' నుంచి నెదర్లాండ్స్, బెల్జియం, జర్మనీ, జపాన్, చైనా, ఫ్రాన్స్, గ్రూప్ 'బి' నుంచి ఆస్ట్రేలియా, అర్జెంటీనా, బ్రిటన్, స్పెయిన్, అమెరికా, సౌతాఫ్రికా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. భారత మహిళల జట్టు ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైన సంగతి తెలిసిందే.

పాక్‌కు మళ్లీ నో చాన్స్

కరాచీ: పాకిస్థాన్ పురుషుల హాకీ జట్టు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఒమన్‌లో జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీలో మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 2-3తో న్యూజిలాండ్ చేతిలో ఓడింది. దరిమిలా..ఆ జట్టు వరుసగా మూడోసారి విశ్వక్రీడలకు దూరమైంది.



విలపిస్తూ.. విధులకు!

- అంగన్వాడీలపై అధికారుల తీవ్ర ఒత్తిడి
- ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అనంతపురం జిల్లాలో అంగన్వాడీలపై అధికారులు తీవ్ర స్థాయి ఒత్తిళ్లు తెచ్చారు. విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో కన్నీటిప ర్యంతమవుతూ పలువురు విధుల్లో చేరారు. సమ్మె చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో హెల్పర్ సరిత విష రసాయనం తాగి ఆత్మహత్యకు యత్నించారు. ఆమె చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వం తమ మెడపై కత్తి పెట్టి విధుల్లో చేరమంటోందని, ఇది అన్యాయమని పలువురు వాపోయారు. కొందరు వర్కర్లు, హెల్పర్లు సీడీపీఓ ఆఫీస్ వద్ద కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళలతో కన్నీళ్లు పెట్టిస్తున్న జగన్ మట్టి కొట్టుకుపోవడం ఖాయం అని శాపనార్థాలు పెట్టారు. గుత్తి సీడీపీఓ కార్యాలయం వద్ద పలువురు కార్యకర్తలు, ఆయాలు బోరున విలపించారు. గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన అంగన్వాడీలు గుత్తి సీడీపీఓ కార్యాలయంలో జాయినింగ్ లెటర్లు ఇచ్చారు. ఈ క్రమంలో పామిడికి చెందిన జయంతి అనే కార్యకర్త సొమ్మసిల్లి పడిపోయారు. ఆమెను తోటి వర్కర్లు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షిస్తుండగా, పక్కనే ఉన్న టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సావిత్రి, పామిడికి చెందిన యశోద, గుంతకల్లుకు చెందిన రేష్మాఖాన్ సొమ్మసిల్లి పడిపోయారు. మహిళల ఏడ్పులతో గుత్తి సీడీపీఓ కార్యాలయం, ఆస్పత్రి వద్ద విషాద వాతావరణం కనిపించింది. కాగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 5,468 మందికి తొలగింపు ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఉదయంలోగా విధుల్లో చేరాలని, లేకుంటే ఉద్యోగాలు ఉండవంటూ అధికారులు మెసేజ్‌లు పంపారు. చిత్తూరు జిల్లాలో సోమవారం వరకు 836 మంది మినహా మిగిలినవారంతా విధుల్లో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 500 మంది, అనకాపల్లి జిల్లాలో 1,697 మంది కార్యకర్తలు, 1,650 మంది సహాయకులు, 172 మంది మినీ కార్యకర్తలు ఉండగా..421 మంది కార్యకర్తలు, 426 మంది సహాయకులు, 16 మంది మినీ వర్కర్లు విధుల్లో చేరారని అధికారులు తెలిపారు.



బీఆర్‌టీఎస్ రోడ్డు వద్ద అంగన్వాడీలను బలవంతంగా బస్సులోకి లాక్కెళ్తున్న పోలీసులు

అంగన్వాడీలపై ఉక్కుపాదం

- 'చలో విజయవాడ' భగ్నం.. ఎక్కడికక్కడ అరెస్టులు
- విజయవాడలో దీక్షా శిబిరం ధ్వంసం
- బీఆర్టీఎస్ రోడ్డులో రోజంతా అరెస్టులే!

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

పోలీసుల దాడులు... అంగన్వాడీల ప్రతిఘటనలు.. ఆర్తనాదాలతో సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ విజయవాడ రణరంగంలా మారింది. ధర్నా చౌక్‌లో దీక్ష చేస్తున్నవారిపై తెల్లవారుజామున వందలాది మంది పోలీసులు విరుచుకుపడ్డారు. దొరికిన వారిని దొరికినట్టుగా ఈడ్చుకెళ్లి బస్సుల్లో పడేశారు. మహిళల దుస్తులు ఊడిపోతున్నా.. ఊపిరి అందక సొమ్మసిల్లి పడిపోతున్నా.. పోలీసులు లెక్కచేయలేదు. వందలాది మంది ఆడ, మగ పోలీసులు అంగన్వాడీలను వెంటపడి అరెస్టులు శారు. పోలీసులతో జరిగిన పెనుగులాటలో కొంతమంది అంగన్వాడీ కార్యకర్తలు గాయపడ్డారు. అంగన్వాడీలను ఆ ప్రాంతం నుంచి తరలించిన తర్వాత నిరాహారదీక్షా శిబిరాన్ని పోలీసులు నేలమట్టం చేసి, ఆ ప్రదేశాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అక్కడి నుంచి సీన్ బీఆర్టీఎస్ రోడ్డుకు మారింది. ధర్నాచౌక్‌లో దీక్షా శిబిరం కూల్చివేశాక పోలీసులంతా బీఆర్టీఎస్ రోడ్డుకు చేరుకున్నారు. 'చలో విజయవాడ'కు పిలుపు ఇచ్చిన అంగన్వాడీలు బీఆర్టీఎస్ రోడ్డులో సమావేశమవ్వాలని నిర్ణయించుకున్నారు.పోలీసులు బీఆర్టీఎస్ రోడ్డుకు వెళ్లే అన్ని మార్గాలను మూసివేశారు. రోడ్డును తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు, సీఐటీయూ నేతలు ఉమామహేశ్వరరావుతోపాటు పలువురు ప్రజాసంఘాల నేతలు బీఆర్టీఎస్ రోడ్డులోకి వస్తుండగా అరెస్టు చేసి, బస్సుల్లో తరలించారు. అతర్వాత దఫదఫాలుగా అంగన్వాడీ కార్యకర్తలు చొచ్చుకు రావడం, వచ్చినవారిని వచ్చినట్టుగా పోలీసులు అరెస్టు చేయడం జరిగాయి. అరెస్టు చేసిన వారిని తరలించేందుకు బీఆర్టీఎస్ రోడ్డు పొడవునా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు అంగన్వాడీలు వస్తూనే ఉండటం.. వారిని పోలీసులు అరెస్టు చేయడం వంటి దృశ్యాలు కనిపించాయి. వివిధ జిల్లాల నుంచి విజయవాడ వస్తున్న వారిని జిల్లా సరిహద్దుల్లోనే అడ్డుకుని వెనక్కి పంపేశారు. అరెస్టులను ప్రతిఘటించిన సందర్భాల్లో పోలీసులకు, అంగన్వాడీలకు మధ్య తోపులాటలు జరిగాయి. ఈ తోపులాటలో కొంతమంది అంగన్వాడీలు ఎగ ఊపిరి రావడంతో కింద పడిపోయారు. తోటి అంగన్వాడీలు సపర్యలు చేశారు. కొంతమంది పోలీసులు, అంగన్వాడీలకు స్వల్ప గాయాలయ్యాయి. కొంతమంది సెల్‌ఫోన్లు పోయాయి. బీఆర్టీఎస్ రోడ్డు చెంతనే ఉన్న సీఐటీయూ భవనంలో కొంతమంది అంగన్వాడీలు ఉండిపోయారు. వారు బయటకు వస్తే అరెస్టు చేయడానికి భవనం ఎదురుగా పోలీసులు కాపు కాశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో వారంతా బయటకు వచ్చి రోడ్డుపై బైఠాయించారు. వారిని అరెస్టు చేసి ఆయా జిల్లాల్లో వదిలిపెట్టారు. అయినా అంగన్వాడీలు ఇళ్లకు వెళ్లలేదు. తిరిగి మరో బస్సుల్లో విజయవాడ చేరుకున్నారు. అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బాలోత్సవ్ భవనంలో నిరాహార దీక్ష చేపట్టారు. కృష్ణా జిల్లాలో అరెస్టు చేసిన రెండు వేల మందిని మచిలీపట్నం సముద్రతీరంలో ఉన్న జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. భోజనం తెచ్చిన బంధువులను కూడా పోలీసులు వెనక్కి పంపేశారు. అక్కడి నుంచి ఏలూరు, భీమవరం, తణుకు ప్రాంతాలకు బస్సుల్లో తరలించి వదిలేశారు. కాకినాడ నుంచి వచ్చిన క్రాంతి అనే యువకుడిపై ఓ పోలీసు ఇన్‌స్పెక్టర్ దురుసుగా ప్రవర్తించారు. అతడిని అరెస్టు చేసి బస్సులో ఎక్కించగా.. సీఎం డౌన్ డౌన్ అంటూ చెయ్యెత్తి నినాదాలు చేశాడు. దీంతో పోలీసులు ఆ యువకుడిపై దురుసుగా ప్రవర్తించారు. ఎత్తిన చేతిని బలవంతంగా దింపారు. పోలీసులు తనను కడుపులో తన్నారని క్రాంతి వాపోయాడు.

వందలాది మంది అరెస్టులు

ఏలూరు జిల్లా నుంచి 'చలో విజయవాడ' బయలుదేరిన అంగన్వాడీలు పోలీసులు విరుచుకుపడ్డారు. ఏలూరు బస్టాండ్, పెదవేగి, కలపర్రు టోల్‌గేట్ తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. సుమారు 500 మందిని అరెస్టు చేసి పెదవేగిలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. అక్కడున్నవారికి నీరు, ఆహారం ఇవ్వకుండా.. కాసింత ఉప్మా చేయించి 500 మందిలో ఓ 200 మందికి పెట్టారు. మధ్యాహ్నం 300 మందికే భోజనాలు పెట్టగా, 200 మంది ఆకలితో అలమటించారు. కోనసీమ జిల్లావ్యాప్తంగా 300 మందికిపైగా అంగన్వాడీలను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీసుస్టేషన్లకు తరలించారు.

అరెస్టులకు నిరసనగా ఆందోళనలు

విజయవాడ బయలుదేరిన వారిని అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ విజయనగరం కలెక్టరేట్ వద్ద సంకెళ్లు వేసుకుని మోకాళ్లపై నిలబడి అంగన్వాడీలు రాస్తారోకో చేశారు. కాగా, బొబ్బిలి నుంచి విజయవాడ వెళ్లిన 72 మందిని అరెస్టు చేసి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో కేవీ రెడ్డి ఫంక్షన్‌హాలుకు తరలించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు ఆదివారం రాత్రి నుంచే పోలీసులు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో మోహరించారు. నర్సాపురం, భీమవరం, ఆకివీడు, తాడేపల్లిగూడెంలో అరెస్టులు చేశారు. అరెస్టులను ఖండిస్తూ భీమవరంలో వామపక్ష నాయకులు ధర్నా చేశారు. కర్నూలు జిల్లాలోనూ అంగన్వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. నంద్యాల జిల్లా నుంచి విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీలు, యూనియన్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. మరికొన్నిచోట్ల గృహ నిర్బంధం చేశారు. అరెస్టులను నిరసిస్తూ.. సీపీఎం, సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో చేశారు. తిరుపతి జిల్లా నుంచి విజయవాడ బయలుదేరిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం రాత్రి కావలిలో అరెస్టు చేసి స్టేషన్లో నిర్బంధించారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని అంగన్వాడీలు నిరసన తెలిపారు. కాగా, విజయవాడలో అరెస్టు చేసిన 400 మందిని బస్సుల్లో తీసుకొచ్చి తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల, దేవరపల్లి ప్రాంతాల్లోని ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో నిర్బంధించారు. రాజమహేంద్రిలో కొంతమందిని నిర్బంధించారు. అరెస్టులను నిరసిస్తూ రాజమహేంద్రవరంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.

సమ్మె విరమణ

- నేటి నుంచి విధుల్లోకి హాజరవుతామని ప్రకటన

విజయవాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలను బెదిరించి, భయపెట్టి, పోలీసులను ప్రయోగించిన జగన్ సర్కారు... ఎట్టకేలకు వారిచేత సమ్మె విరమింపజేసింది. ఒకవైపు సోమవారం ఉదయం నుంచి జిల్లాల్లో 'ఉద్యోగాల నుంచి తొలగింపు' ఉత్తర్వులు జారీ చేయగా... మరోవైపు రాత్రి పొద్దుపోయాక విజయవాడలో మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కలిసి కార్మిక సంఘాలతో చర్చలు జరిపారు. మంత్రి బొత్స క్యాంప్ కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. తక్షణం జీతాల పెంపునకు ప్రభుత్వం అంగీకరించలేదు. ఎన్నికల తర్వాత... జూలై నుంచి పెంచుతామని హామీ ఇచ్చారు. ఉద్యోగ విరమణ సమయంలో వర్కర్లకు ఇచ్చే బెనిఫిట్‌ను రూ.50 వేల నుంచి రూ.1.20 లక్షలకు, హెల్పర్లకు ఇచ్చే రూ.20 వేల బెనిఫిట్‌ను రూ.60 వేలకు పెంచడానికి అంగీకరించారు. చనిపోయిన అంగన్వాడీలకు మట్టి ఖర్చులుగా రూ.20 వేలు ఇస్తామన్నారు. సమ్మె చేసిన కాలంలో వేతనాలు చెల్లింపు, అంగన్వాడీలపై నమోదు చేసిన కేసుల ఎత్తివేతకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఉద్యోగ విరమణ వయస్సును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచడంతోపాటు వీరికి అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయడానికి కూడా అంగీకరించారు. నాలుగైదు రకాలుగా ఉన్న మొబైల్ యాప్‌లను ఒకే యాప్‌గా చేయాలన్న డిమాండ్‌ను కూడా నెరవేరుస్తామన్నారు. జీతాలు మాత్రం... ఇప్పట్లో పెంచడం కుదరదని, జూలై నుంచి పెంచుతామని స్పష్టం చేశారు. జీతం ఎంత పెంచాలన్న అంశంపై అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులతో మరోసారి సమావేశం నిర్వహించి, ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే, ఆయాలను మినీ వర్కర్లుగా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఈ హామీలను లిఖితపూర్వకంగా ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో... 42 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు అంగన్వాడీలు ప్రకటించారు. మంగళవారం నుంచి విధుల్లో చేరుతామన్నారు.

అందరిని తరిమి.. టెంటు కూల్చి



విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం తెల్లవారుజామున 3గంటలకు దీక్షా శిబిరాన్ని కూల్చేసి అంగన్వాడీలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



అంగన్వాడీలపై పోలీసుల తీరుకు నిరసనగా విజయవాడ బీఎస్ఎన్ఎల్ సర్కిల్ వద్ద రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

జగన్ మొండితనం వల్లే

అంగన్వాడీల ఆందోళన జఠిలం

- వామపక్షాల దీక్షలో వక్తలు.. టీడీపీ, జనసేన సంఘీభావం

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ మొండి వైఖరితో అంగన్వాడీ కార్యకర్తల ఉద్యమాన్ని మరింత జఠిలం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్న లక్షల మంది అంగన్వాడీలను తొలగిస్తామని ప్రభుత్వం చెబుతోందని, ఇంత అహంకారం ఉన్న ముఖ్యమంత్రిని రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడలేదని ఆయన పేర్కొన్నారు. తనకు ఓట్లేసి గెలిపించిన ప్రజలపైనే ముఖ్యమంత్రి జగన్ యుద్ధం చేస్తున్నారని సీపీఎం మండిపడింది. 'జగనన్నకు చెబుదాం' అంటూ కోటి సంతకాలతో రాష్ట్ర నలుదిక్కుల నుంచి వేల సంఖ్యలో విజయవాడకు చేరుకున్న అంగన్వాడీలపై పోలీసు నిర్బంధాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు సోమవారం స్థానిక సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో నిరాహార దీక్ష చేపట్టారు. టీడీపీ, జనసేన పార్టీలు ఈ దీక్షలకు సంఘీభావం ప్రకటించాయి. కాగా.. అంగన్వాడీ మహిళలపై అర్ధరాత్రి మగ పోలీసులు దాష్టీకానికి పాల్పడటం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఖండించారు. గత 42 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు సోమవారం 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని చేపడితే పోలీసులు దాడి చేసి అక్రమంగా అరెస్టులు చేయడం వైసీపీ ప్రభుత్వ దుశ్చర్యలకు పరాకాష్ట అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంగన్వాడీలపై ప్రతీకార చర్యలు దారుణం: బాబు

జగన్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీల అమలుపై రోడ్డెక్కిన అంగన్వాడీలపై ప్రభుత్వం ప్రతీకార చర్యలకు దిగడం దారుణమని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం తన సహజ సిద్ధమైన వేధింపులు, కక్ష సాధింపు పద్ధతులను అంగన్వాడీలపైనా ప్రయోగించడం నియంతృత్వ పోకడలకు నిదర్శనమని సోమవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఉక్కుపాదం మోపడం జగన్‌రెడ్డి నిరంకుశ పాలనకు, పెత్తందారీ పోకడలకు పరాకాష్ట అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు.

ఆగ్రహజ్వాలలే సర్కారుకు చితిమంటలు: లోకేశ్

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు తాను వదిలిన బాణం తిరిగి తనవైపే దూసుకురావడం, మరో వైపు సొంత పార్టీ ఎమ్మెల్యేలు తిరుగుబాటుతో మతిభ్రమించిన పిచ్చిపాలకుడు అంగన్వాడీ చెల్లెమ్మలపై ప్రతాపం చూపిస్తున్నాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. 'అంగన్వాడీలను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేయడం నియంతృత్వ పోకడలకు అద్దంపడుతోంది. తాటాకు చప్పుళ్లకు లొంగని అంగన్వాడీ చెల్లెమ్మలు చలో విజయవాడకు పిలుపునివ్వడంతో తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు పుట్టాయి. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అంగన్వాడీల ఆగ్రహజ్వాలలే అరాచక ప్రభుత్వానికి చితిమంటలు కాబోతున్నాయి' అని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఖరి అప్రజాస్వామికం: పవన్

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నలభై రోజులకు పైగా ఆందోళనలు చేస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వ వైఖరి ప్రజాస్వామ్యయుతంగా లేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో విమర్శించారు. అంగన్వాడీ మహిళలపై పాలక పక్షానికి కొమ్ముకాస్తున్న సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు.

నేటి నుంచి సీపీఎస్ ఉద్యోగుల సమరం

విజయవాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ సాధన కోసం ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 11 వరకు చేపట్టనున్న కార్యాచరణ ప్రణాళికను ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్‌ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ సోమవారం విడుదల చేశారు. దీని ప్రకారం.. పాత పెన్షన్ కోసం ఫిబ్రవరి 4వ తేదీన విశాఖపట్నంలో దీక్ష చేపడతారు. 11న విజయవాడ నగరంలో ఐక్యత ఓటు నిర్వహిస్తారు. ఈనెల 24 నుంచి ఫిబ్రవరి 11 వరకు ప్రతిపక్ష నేతలకు వినతిపత్రాలను అందజేస్తారు. ప్రతిపక్ష నేతలందరికీ సామాజిక మాధ్యమాల ద్వారా వినతిపత్రాలు అందిస్తారు. అలాగే, 'పాత పెన్షన్ అమలు హామీతో నా చేదు అనుభవాలు' పేరుతో సెల్ఫీ వీడియోలను సోషల్ మీడియా వేదికగా పోస్టు చేయాలని నిర్ణయించారు.

పోలీసులపై అంగన్వాడీల తిరుగుబాటు

పోలీసుల్ని ఈడ్చేసి.. ఆందోళనలో కూర్చోబెట్టి..

మైలవరం, జనవరి 22: 'చలో విజయవాడ' కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడ బయల్దేరిన అంగన్వాడీలపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడంతో అంగన్వాడీలు ఎదురుతిరిగారు. ఇద్దరు మహిళా పోలీసులను లాక్కెళ్లి రాస్తారోకోలో కూర్చోబెట్టే ప్రయత్నం చేశారు. సంఘాల నాయకులను ఆదివారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ.. మైలవరం పోలీస్‌స్టేషన్ ముందు సోమవారం అంగన్వాడీలు ఆందోళనకు దిగారు. వారి ఆందోళన భగ్నం చేసి అంగన్వాడీలను వ్యాన్‌లో ఎక్కించేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో అంగన్వాడీలు పోలీసులు తిరగబడ్డారు. మహిళా పోలీసులను ఈడ్చుకెళ్లి రాస్తారోకోలో కూర్చోబెట్టే ప్రయత్నం చేశారు. అడ్డుకున్న ఎస్సైను, ఒక మహిళా కానిస్టేబుల్‌ను నెట్టిపడేశారు. ఈ ఉదంతంతో గంటపాటు ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. చివరకు ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యానుల్లో ఎక్కించి, జి.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ఎస్సై ఎస్.హరిప్రసాద్‌ను నెట్టిపడేస్తున్న అంగన్వాడీ



మహిళా పోలీసును రాస్తారోకోలో కూర్చోబెడుతున్న అంగన్వాడీలు

వారంలో డీఎస్సీ!

- 6వేలకు పైగా ఖాళీలతో ప్రకటన!!
- నాలుగున్నరేళ్లుగా పట్టించుకోకుండా.. ఎన్నికల ముందు జగన్ హడావుడి

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో.. నాలుగున్నరేళ్లుగా పట్టించుకోని ఉపాధ్యాయ ఖాళీల భర్తీపై జగన్ ప్రభుత్వం దృష్టిపెట్టింది. వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించింది. 6 నుంచి 10 వేల పోస్టులతో ఈ నోటిఫికేషన్ ఉండొచ్చని విశ్వసనీయంగా తెలిసింది. డీఎస్సీపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎన్ని ఖాళీలు ఉన్నాయి? ఎక్కడెక్కడ పోస్టులు అవసరమో అధికారులు వివరించారు. ఇప్పటికే ఖాళీలపై అనేకసార్లు రకరకాల లెక్కలు వేయగా, తాజా అంచనాలతో కనీసం 6వేల మందిని భర్తీ చేయొచ్చన్న అంచనాకు వచ్చారు. ఇందులో ఎస్జీటీ పోస్టులే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కొత్తగా ఏర్పాటుచేసిన ప్రీస్కూళ్లకు కూడా టీచర్లను కేటాయించే వీలుంది. పాఠశాల విద్యాశాఖలో 18,520 పోస్టులు ఖాళీగా ఉన్నాయని గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించింది. అయితే 8,366 మంది మాత్రమే అవసరమని పేర్కొంది. ఖాళీ ఉన్నప్పటికీ 10 వేల పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. కాగా.. ఎన్నికల కారణంగానే నోటిఫికేషన్ ఇవ్వబోతున్నారనే ప్రచారం జరుగుతోంది.

బెడిసికొట్టిన 'వ్యూహం'!

- ఆర్జీవీకి ఎదురుదెబ్బ.. సెన్సార్ సర్టిఫికెట్ రద్దు
- 3 వారాల్లో మళ్లీ నిర్ణయం తీసుకోవాలని టీ-హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమా నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, దర్శకుడు రాంగోపాల్ వర్మకు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీ జారీచేసిన సర్టిఫికెట్‌ను సోమవారం హైకోర్టు క్వాష్ (రద్దు) చేసింది. సినిమాలో కోర్టు ధిక్కరణకు పాల్పడేలా పలు అంశాలు ఉండటంతోపాటు వ్యక్తుల పరువుకు, హక్కులకు భంగం కలిగే అంశాలు ఉన్నాయని.. వాటిని పట్టించుకోకుండా రివైజింగ్ కమిటీ సర్టిఫికెట్ జారీచేసిందని హైకోర్టు పేర్కొంది. వ్యూహం సినిమా కోర్టు ధిక్కరణకు పాల్పడేవిధంగా, పరువు నష్టం కలిగించే విధంగా ఉందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై మొదట సెన్సార్‌బోర్డు సర్టిఫికెట్ నిరాకరించింది. ఆ తర్వాత ప్రత్యేకంగా ఏర్పాటైన రివైజింగ్ కమిటీ, ఎలాంటి మార్పులూ చేయకున్నా మళ్లీ అదే సినిమాకు సర్టిఫికెట్ జారీచేసింది. దీంతో సినిమాలో అభ్యంతరకర సన్నివేశాలున్నాయని, రివైజింగ్ కమిటీ జారీచేసిన సర్టిఫికెట్‌ను కొట్టేయాలని పేర్కొంటూ లోకేశ్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధర్ రావు వాదనలు వినిపిస్తూ.. టీడీపీ, చంద్రబాబు, రోశయ్య, సోనియాగాంధీ, పవన్‌కల్యాణ్ వంటి నాయకులను తప్పుడు కోణాల్లో చిత్రీకరించి పరువునష్టం కలిగేలా చట్టవిరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో జగన్‌ను అక్రమంగా ఇరికించారని అర్థం వచ్చేలా.. బాబు దోషి అని అర్థం వచ్చేలా సీన్లు ఉన్నాయన్నారు. నిర్మాత తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. ఒక్కసారి సర్టిఫికెట్ జారీచేశాక కోర్టులు జోక్యం చేసుకోలేదన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సినిమాకు సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీ జారీచేసిన సెన్సార్ సర్టిఫికెట్‌ను రద్దు చేసింది. సహజ న్యాయసూత్రాలు, సినిమాటోగ్రఫీ చట్టం - 1952, సినిమాటోగ్రఫీ సర్టిఫికేషన్ రూల్స్ - 1983కు అనుగుణంగా తాజాగా నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డు, రివైజింగ్ కమిటీకి ఆదేశాలు జారీచేసింది. తీర్పు కాపీ అందిన 3వారాల్లో నిర్ణయం తీసుకోవాలని.. సదరు నిర్ణయాన్ని సంబంధిత పక్షాలకు తెలియజేయాలని స్పష్టం చేసింది.

25లోగా

ఆ అధికారుల బదిలీ

- ఉన్నతాధికారులకు సీఎస్ ఆదేశాలు

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఒకే ప్రాంతంలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకునే ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారులు, సిబ్బందిని ఈ నెల 25వ తేదీలోగా బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వివిధ అంశాలపై సోమవారం అమరావతి సచివాలయంలో ఆయన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా సహా ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. 'కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా రానున్న ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా జిల్లాల్లో వచ్చే జూన్ నాటికి ఒకే ప్రాంతంలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకునే ఎన్నికల విధులతో సంబంధం ఉండే అధికారులు సిబ్బంది అందరినీ ఈ నెల 25లోగా తప్పనిసరిగా బదిలీ చేయాలి. పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన కనీస సౌకర్యాలు ముఖ్యంగా దివ్యాంగ ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేందుకు వీలుగా ర్యాంపులు వంటి సౌకర్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి. ఎన్నికల్లో డబ్బు, మద్యం ఇతర వస్తువుల అక్రమ రవాణా నియంత్రణతోపాటు పటిష్ఠ నిఘాకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ చెక్కుపోస్టుల ఏర్పాటును తక్షణం పూర్తి చేయాలి. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారులు.. కార్యాలయాల్లో ఖాళీల భర్తీకి త్వరిత గతిన చర్యలు తీసుకోవాలి' అని సీఈవో, సీసీఎల్ఏను సీఎస్ ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) పోలీసుశాఖల్లో మూడేళ్ల సర్వీసు పూర్తయ్యేవారిని గుర్తించి, మూడు రోజుల్లో వారిని కూడా బదిలీ చేయాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు మీనా సూచించారు.

ఎక్సైజ్‌లో 255 మందికి బదిలీలు!

- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా స్థానచలనం

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌లో బదిలీల ప్రక్రియ మొదలైంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈసీ ఆదేశాల ప్రకారం బదిలీలు చేపట్టేందుకు ఎక్సైజ్ స్పెషల్ సీఎస్ రజత్ సోమవారం మార్గదర్శకాలు జారీ చేశారు. కొత్త జిల్లాలు కాకుండా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా బదిలీలు చేయాలని అందులో స్పష్టం చేశారు. ఒకవేళ రెండు శాఖల మధ్య ఇటీవలే అటూ ఇటూ కేటాయింపులు జరిగినా ప్రస్తుతం ఎక్కడ ఉంటే అందులోనే బదిలీ ఉంటుందని తెలిపారు. ఏ అధికారికీ సొంత జిల్లాలో పోస్టింగ్ వేయకూడదని స్పష్టం చేశారు. 255 మంది బదిలీ అవుతారని అధికారులు అంచనా వేశారు. ఎస్ఐ నుంచి డిప్యూటీ కమిషనర్ స్థాయి వరకు ఈ బదిలీలు జరగనున్నాయి.

అంగన్వాడీలకు మద్దతుగా

రేపు రాష్ట్ర బంద్

- నిరవధిక దీక్షా శిబిరంపై పోలీసుల పాశవిక దాడి గర్హనీయం
- రాజకీయ పార్టీలు బంద్‌కు సంఘీభావం ప్రకటించాలి
- అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 42 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు సంఘీభావంగా ఈ నెల 24వ తేదీన రాష్ట్ర బంద్‌కు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఐఎఫ్టీయు రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్, టీఎన్టీయుసీ రాష్ట్ర అధ్యక్షులు రఘురామరాజు, ఐఎన్టీయుసీ రాష్ట్ర నాయకులు క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షా ఐదు వేల మంది అంగన్వాడీ మహిళా శ్రామికుల జీతభత్యాలు, పనిభారం తదితర సమస్యలపై సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్టీయు అనుబంధ అంగన్వాడీ సంఘాల ఆధ్వర్యంలో గత 42 రోజులుగా సమ్మె చేస్తున్నారని వారు తెలిపారు. వారి డిమాండ్లకు మద్దతుగా ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాలను జగన్‌కు సమర్పించడానికి విజయవాడ వస్తున్న అంగన్వాడీలపై పాశవికంగా పోలీసులతో దాడి చేయించారని పేర్కొన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి బదులు ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అత్యంత నిరంకుశమని స్పష్టం చేశారు. పైగా సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న శిబిరంపై పోలీసులు పాశవికంగా దాడులు చేశారని, దీక్షల్లో ఉన్న నాయకులను దూరప్రాంతాలకు తరలించి నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షలో ఉన్న వారి ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా... కరెంటు తీసివేసి ఆడవాళ్లను కూడా మగ పోలీసులే లాగిపారేసి అదుపులోకి తీసుకుని దీక్షా శిబిరం వద్ద అరగంటపాటు యుద్ధభూమిని తలపించారని ధ్వజమెత్తారు. దీక్షలకు మద్దతుగా పాల్గొన్న సుమారు 2 వేల మందిని అరెస్టు చేసి మచిలీపట్నం, నూజివీడు తదితర సుదూర ప్రాంతాలకు తరలించారన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజాసేవలోకి పదండి

'రానున్న వెయ్యి సంవత్సరాల దాకా గుర్తుండిపోయే ఘట్టం' అని అన్నారు ప్రధాని నరేంద్రమోదీ. అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం తరువాత మాట్లాడుతూ మోదీ మత, జాతీయ, సాంస్కృతిక ఉద్వేగాలను మేళవిస్తూ ప్రసంగించారు. రామాలయ ఆరంభం జాతీయ వేడుక అన్నారాయన. బానిసత్వపు సంకెళ్ల విచ్ఛేదన జరిగింది కూడా ఇప్పుడే అన్నారు. ఆయన ప్రస్తావించినట్టే, భారతదేశంలోను, ప్రపంచంలోని అనేక దేశాల్లోనూ సోమవారం నాటి కార్యక్రమం ఆనందోత్సాహాలను, గర్వభావనను నింపి ఉంటుంది. అయోధ్య నేపథ్య వివాదాలతో నిమిత్తం లేకుండా అనేక మంది సాధారణ హిందువులు బాలరామ ప్రాణప్రతిష్ఠను గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమంగా పరిగణిస్తూ వేడుక జరుపుకుంటున్నారు.

దేశంలో ఐక్యతను, జాతీయ భావనను రామాలయం పటిష్ఠం చేస్తుందన్న నరేంద్రమోదీ ఆకాంక్షను ఆహ్వానించవలసిందే. రామాలయ కార్యక్రమం ప్రశాంతంగా, సర్వసమ్మతితో జరుగుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయన, భారతీయ సమాజంలోని సమైక్యభావాన్ని నొక్కి చెప్పారు. వందలాది ఏళ్ల నుంచి ఉన్నదని చెబుతున్న వివాదం, కనీసం ముప్పాతికేళ్లుగా కొనసాగుతున్న వివాదం ఒక కొలిక్కి రావడం సంతోషించదగినదే అయినప్పటికీ, ఈ ప్రయాణం ఏమంత ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా లేకపోవడం చరిత్ర చెబుతున్న సత్యం. భారతీయ సమాజంలో పరస్పరత, సామరస్యం, సహిష్ణుత నిరంతరం కొనసాగాలని కోరుకునేవారికి గతంలోని అప్రియమైన ఘటనలు స్ఫురించి బాధిస్తాయి. ఆ దూరాన్ని, వేదనను తగ్గించడానికి అనంతరకాలంలో జరిగే ప్రయత్నాలే దేశ సామాజిక నిర్మితిని దృఢపరుస్తాయి.

భారతీయ సంస్కృతిలో, పౌరాణిక స్మృతిలో అవిభాజ్య పాత్ర అయిన శ్రీరాముడికి సంబంధించిన ఆలయ నిర్మాణ ప్రస్థానంలో రాజకీయాలు ముడిపడి ఉండడం విచారకరమే. కొన్ని సామాజిక, సాంస్కృతిక సంస్థలు, వాటితో కలసి ప్రయాణించే రాజకీయ సంస్థ, రామాలయ నిర్మాణ ఉద్యమంలో భాగస్వాములుగా ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా, వివాద భాగస్వాముల మధ్య సంప్రదింపులను కొనసాగించి, న్యాయస్థానాలకు వెలుపల ఒక అంగీకారాన్ని సాధించి ఉంటే అది ఉత్తమమైన పరిష్కారం అయి ఉండేది. అయోధ్య ఉద్యమంతో పాటు, భారతీయ జనతాపార్టీ బలపడుతూ పోవడం రాజకీయాల ప్రమేయాన్ని స్పష్టం చేసింది. ఒకనాడు రథయాత్రలు నిర్వహించినవారు, తరువాత, న్యాయవ్యాజ్యాలలో పాల్గొన్నవారు మునుపటి తరానికి చెందిన హిందూత్వ రాజకీయ నేతలు కాగా, చివరగా సుప్రీంకోర్టు తీర్పు ద్వారా సమస్య ముగింపునకు వచ్చింది. కానీ, ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రతిష్ఠ, కీర్తి అంతా ప్రస్తుత నరేంద్రమోదీకి సంక్రమించడం విశేషం. ఆలయ నిర్మాణం ఇంకా అసంపూర్తిగా ఉండగానే, ప్రాణ ప్రతిష్ఠను ఇప్పుడు సంకల్పించడం వెనుక రానున్న ఎన్నికల దృష్టి ఉన్నదేమోనన్న విమర్శ వింటున్నాము. రామాలయ ఉద్యమంలో పాల్గొన్న రాజకీయపార్టీకి ఇది ఎన్నికల ప్రయోజనాలను అందించే సందర్భం కావడం సహజమే. రాజకీయాలు ఉన్నాయని ప్రత్యర్థులు విమర్శించడం కానీ, లేవని బీజేపీ నిరాకరించడం కానీ అనవసరం.

సోమవారం నాడు అయోధ్యలోనూ, అనేక రాష్ట్రాలలోను జరిగిన కార్యక్రమాల తీరు చూస్తే, ఇవి ప్రభుత్వ కార్యక్రమాలేమో అనిపించేట్టుగా జరిగాయి. మత, పౌర జీవనాల మధ్య సరిహద్దు చెరిగిపోయినట్టు కనిపించింది. అనేకులు కోరుకుంటున్న 'హిందూ రాష్ట్రం' వాస్తవరూపం ధరించిందేమో అనిపించింది. భారతీయ ప్రజాజీవనంలో వేగంగా వస్తున్న ఈ మార్పులు ముందు ముందు ఎటువంటి ప్రభావాలను కలిగిస్తాయో చూడాలి.

విజయోత్సాహంతో పాటు వినయం కూడా ఉండాలని చెబుతూ, ఇక అభివృద్ధి మీద దృష్టి పెడదామని ప్రధాని పిలుపు ఇచ్చారు. సమర్థమైన, అద్భుతమైన, దివ్యమైన భారత్‌ను నిర్మించడానికి శపథం తీసుకోవాలని ఆయన కోరారు. రాముని తలపు కేవలం వ్యక్తి మనసులోనే కాదు, సామాజిక చేతనలో భాగం కావాలని అన్నారు. ఐక్యత, ఏకోన్ముఖ చింతన సంఘాన్ని బలశాలిని చేస్తాయనడంలో సందేహం అక్కరలేదు. ఆ సమష్టి తనం అందరి మంచికి ఉపయోగపడితే అంతకంటే కావలసినదేమున్నది? అయితే, భావనలు, ఉద్వేగాలను సంతృప్తిపరచడం సులభమే కానీ, భౌతికమయిన, వాస్తవమయిన ఆకాంక్షలను నెరవేర్చడం సులువు కాదు.

అధిక ధరలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, నల్లధనం వంటి అనేక సమస్యలు మోదీ అనేకమార్లు ప్రస్తావించినవే. వాటిమీద ఇక దృష్టి పెట్టాలి. పదిరోజులుగా దేశంలోని వివిధ దేవాలయాలలో రకరకాల పరిచర్యలు, పూజలు చేసి, తన నిష్ఠను ప్రదర్శించిన మోదీ, ప్రజాజీవితంలోని వాస్తవ సమస్యల మీద కూడా అదే కట్టుబాటును ప్రదర్శించడానికి ప్రయత్నించాలి. మాధవ

'శ్రీరాముడు మళ్లీ అయోధ్యకు వచ్చాడు'

అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దేశం నలుమూలలా కనపడుతున్న భక్తి శ్రద్ధలు, ఉత్సాహోత్సవాలు సామాన్యమైనవి కావు. సంపన్నుల కాలనీల నుంచి పూరిగుడిసెలున్నవాడల్లో కూడా ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పండుగగా జరుపుకున్నారు. దేశమంతటా కోట్లాది మంది ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని దేశ్యాప్తంగా కోట్లాది భారతీయులు తిలకించారు. రామభక్తులు ఇవాళ పేద ప్రజలకు అన్నదానాలు చేశారు. ప్రజల్లో నెలకొన్న ఈ ఉత్సాహం భారతీయ జనతా పార్టీ కల్పించింది కాదు. ప్రజలు స్వచ్ఛందంగా పూజలు నిర్వహించారు. ఊరేగింపులు జరిపారు. 500 ఏళ్ల క్రితం అయోధ్యలో శ్రీరాముడి మందిరాన్ని విధ్వంసం చేశారు. ఇప్పుడు ఆ మందిరాన్ని పునర్నిర్మించి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ చేసినందుకు ప్రజలు ఆనందాతిరేకంతో ఉన్నారు. 'శ్రీరాముడు మళ్లీ అయోధ్యకు వచ్చాడు' అన్న భావన అంతటా నెలకొంది.

భారతదేశ ప్రజల్లో ఉన్న దైవభక్తిని, ఆరాధనను, విశ్వాసాలను భారతీయ జనతా పార్టీ ఏనాడో గ్రహించినందువల్లే వాటిని కాపాడుకోవడం ద్వారానే భారతదేశ అస్తిత్వం నిలబడుతుందని భావించింది. దీనికి దీనదయాళ్ ఉపాధ్యాయ సాంస్కృతిక జాతీయ వాదం అని పేరు పెట్టారు. ఈ దేశంలో కోట్లాది మంది నిత్యం ఆలయాలను దర్శించడం, నదుల్లో మునకలు వేయడం, బ్రహ్మోత్సవాలు, జాతరలు జరుపుకోవడం ఎప్పటినుంచో ఉన్నాయి. కాశీలో పవిత్ర గంగాతీర్థం వద్ద చివరి సంవత్సరాలు గడపాలని ఎందరో వృద్ధులు ఆశిస్తారు. ప్రతి ఏడాదీ లక్షలాది మంది చార్‌ధామ్ యాత్రకు వెళతారు. తిరుమలను కోట్లాది మంది దర్శిస్తారు. మథురలో గోవర్ధన గిరి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. అంతే కాదు, రమణ మహర్షి, సాయిబాబా లాంటి సాధువులను ఆరాధిస్తారు. అనేక మఠాలకు వెళతారు. హిమాలయాల్లో కేదార్‌నాథ్ నుండి, రావణుడి చెరనుంచి సీతను కాపాడేందుకు లంకకు వెళ్లేముందు తమిళనాడులోని రామేశ్వరం వరకూ శ్రీరాముడి పాదముద్రలు ఈ దేశంలో అడుగడుగునా ఉన్నాయి. దేశం నలుమూలలా జ్యోతిర్లింగాలున్నాయి. భారత నాగరికత ఆవిర్భవించిన నాటి నుంచీ ప్రజల నమ్మకాలు, సంప్రదాయాలు, చారిత్రక కావ్యాలతో సన్నిహిత సంబంధం ఉన్న అనేక ఆలయాలున్నాయి. వాటికి వేలాది మంది ప్రజలు లక్షలాది ఏళ్లుగా, ప్రాంత, కుల వ్యత్యాసాలకు సంబంధం లేకుండా యాత్రలు చేస్తున్నారు. ఇది ఒక విశిష్టమైన జాతీయ ఐక్యతను ఏర్పర్చింది. దాని గురించి అర్థం చేసుకోనంతకాలం మన సుసంపన్నమైన, వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వ సంపదను ఏ విధంగా అర్థం చేసుకోగలం?



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

భారతదేశం కేవలం ఒక మట్టి నేలకాదు. మన దేశం అనాదిగా ఒక సాంస్కృతిక ఐక్యతను కాపాడుతున్న నేల అని డా. బిఆర్ అంబేడ్కర్ ఎప్పుడో అభివర్ణించారు. భారతదేశంలో ఉన్న సాంస్కృతిక ఐక్యత రాజకీయ, జాతిపర విభజనలను అధిగమించిందని ఆయన చెప్పారు. హిందూ సమాజంలోని అస్పృశ్యత వంటి రుగ్మతలకు నిరసనగా ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించారు కాని మరే మతాన్ని ఆయన చేపట్టలేదు. 'భారతదేశ సాంస్కృతిక నేలనుంచి నేను దూరం కాదలుచుకోలేదు' అని ఆయన చెప్పారు.

ముస్లిం పాలకులు ఈ దేశాన్ని పాలించినప్పుడు కేవలం పాలనపైనే దృష్టి కేంద్రీకరించి ఉంటే సరిపోయేది. కాని వారు ఈ దేశంలోని ప్రజల భక్తి విశ్వాసాలతో చెలగాటమాడారు. మందిరాలను ధ్వంసంచేశారు. విగ్రహాలను విరగ్గొట్టారు. అయినప్పటికీ దేశం సంస్కృతిని వారు నాశనం చేయలేకపోయారు. బ్రిటిష్ వారు కూడా సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వ సంపదే భారతదేశ వెన్నుముకగా గ్రహించారు. ఆ వెన్నుముక విరగొట్టేంతవరకూ భారతదేశాన్ని జయించలేమని మెకాలే లాంటి వారు భావించినందువల్లే స్వదేశీ సంస్కృతిని దెబ్బగొట్టాలని నిర్ణయించారు. తమ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు పూనుకున్నారు. ఏది జరిగినా అది తాత్కాలికమేనని ఇప్పుడు రుజువైంది. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంతో కొన్ని వేన వేల ఏళ్ల భారతీయ ఆత్మ జాగృతమైంది. ప్రాచీన కాలం నాటి భారతీయ మహర్షుల కఠోర తపస్సు విఫలం కాలేదని నిరూపితమైంది.



భారత దేశం అనాదిగా ఒక సాంస్కృతిక ఐక్యతను కాపాడుతున్న నేల అని డాక్టర్ అంబేడ్కర్ ఎప్పుడో అభివర్ణించారు. మన దేశంలో ఉన్న సాంస్కృతిక ఐక్యత రాజకీయ,జాతిపర విభజనలను అధిగమించిందని ఆయన చెప్పారు. హిందూసమాజంలోని అస్పృశ్యత వంటి రుగ్మతలకు నిరసనగా ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించారు కాని మరే మతాన్ని ఆయన చేపట్టలేదు. 'భారత దేశ సాంస్కృతిక నేలనుంచి నేను దూరం కాదలుచుకోలేదు' అని అంబేడ్కర్ చెప్పారు.

మన దేశం మరే దేశానికి ఛాయ కాదు. మన ప్రత్యేకత ఏమిటో రామమందిర నిర్మాణంతో మరోసారి వెల్లడైంది. రామాయణ, మహాభారతాలు భారతదేశ జాతీయ జీవితంలో సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను ప్రభావితం చేస్తున్నాయి. రాముడిని ఒక ఆదర్శవంతమైన రాజుగా, రామరాజ్యానికి మంచి పరిపాలనకు సంకేతంగా ప్రజలు అనాదిగా భావిస్తూ వచ్చారు. రామాయణ, మహాభారతాలు మతపరమైన ఆరాధనలో భాగంగా హిందువులు భావించవచ్చు కాని అవి కేవలం హిందువులకు చెందినవి కావు. మన సాంస్కృతిక వారసత్వ సంపదలుగా వాటిని అందరూ భావించాల్సిన అవసరం ఉన్నది. ఇవాళ భారతీయుడు ఏ మతానికి చెందినవాడైనా ఈ వారసత్వ సంపదలను గుర్తించినప్పుడే దేశం సమైక్యంగా నిలబడగలుగుతుంది. కాని మన కుహనా లౌకిక వాదులు మతాల మధ్య ఘర్షణను ప్రేరేపిస్తున్నారు. హిందూ అన్న పేరు వింటేనే వ్యతిరేకించే ఈ భావనను పెంచి పోషించడం వల్లే ఇవాళ కాంగ్రెస్, కమ్యూనిస్టులను ప్రజలు పూర్తిగా తిరస్కరించారు. సాంస్కృతిక జాతీయవాదం మన నేల పరిమళంలో ఉన్నట్లు ప్రజలు ఏనాడో గ్రహించారు. ఇవాళ ఈ జాతీయ ఆత్మ జాగృతం అయింది. ఇప్పుడు శ్రీరాముడి మందిర నిర్మాణంతో భారతదేశం ఒక సాంస్కృతిక శక్తిగా ప్రపంచంపై అపార ప్రభావం చూపగలుగుతుందనడంలో సందేహం లేదు.

భారతదేశ వాస్తవికత గమనించినందువల్లే బీజేపీ కుహనా లౌకికవాదాన్ని తిరస్కరించి సాంస్కృతిక జాతీయవాదాన్ని తన సిద్ధాంతంగా చేపట్టింది. 1989 జూన్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లోని పాలంపూర్‌లో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో రామజన్మభూమి కోసం ఉద్యమం చేపట్టాలని తీర్మానించింది. అదే సమయంలో భారతదేశం కేవలం ఒకే మత రాజ్యంగా మారాలని బీజేపీ కోరుకోలేదు. మతంతో సంబంధం లేకుండా ప్రజలందరికీ సమానత్వాన్ని కోరుకునే రాజ్యాంగాన్ని గౌరవిస్తుందని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. హిందూత్వకు అసలైన సంకేతం శ్రీరాముడి ఆలయం. మెజారిటీ, మైనారిటీ అన్న తేడాల్లేకుండా పరస్పరం గౌరవించుకోవడం వల్లనే భారతీయుడి భవిష్యత్తు స్థిరంగా ఉంటుందని బీజేపీ విశ్వసిస్తుంది. 'హిందూత్వ అంటే సాంస్కృతిక జాతీయవాదం. మతపరమైన జాతీయవాదం కాదు' అని రథయాత్ర ప్రారంభించిన అద్వాణీ అన్నారు. దాన్నే భారతీయత అని దీనదయాళ్ ఉపాధ్యాయ అభివర్ణించారు. ఒక ఫీనిక్స్ పక్షిలా బూడిద నుంచి ఆవిర్భవించిన సోమనాథ మందిరం ప్రపంచంలో ఏ శక్తీ ప్రజల విశ్వాసాన్ని విచ్ఛిన్నం చేయలేరని నిరూపించిందని నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇప్పుడు రామమందిరం కూడా పూర్వవైభవాన్ని సంతరించుకోవడంతో పాటు ప్రజల మనోభావాలను ఎవరూ ఎల్లకాలం అణగదొక్కలేరని నిరూపించింది.

నాగరికతలే సంఘర్షణలకు నిలయాలా?



యుద్ధాలు మనిషికి కొత్తకాదు. తెగల మధ్య జరిగాయి. రాజ్యాల మధ్య రగిలాయి. మతాల మధ్య చెలరేగాయి. సామ్రాజ్యాల మధ్య పెట్రేగాయి. యుద్ధం గురించి అంతో ఇంతో తెలియని మనిషే లేడు. నిరంతర యుద్ధస్థితి నుంచి క్రమేపీ శాంతియుత జీవనం వైపు నడవటమే మనిషి నాగరిక పయనంగా చెప్పుకోవచ్చు. అందరికీ ఎంతో కొంత తెలిసిన నిజమిది. అస్తిత్వ సంరక్షణ, విస్తరణ కాంక్ష, జాతి ఆధిక్య ధోరణి, గుడ్డి మతాభిమానం, శ్రమ దోపిడి, సంపదను కొల్లగొట్టటం.. లాంటి కారణాలే యుద్ధాల వెనుక ఉన్నాయి. ధర్మ పరిరక్షణ, జాతి భద్రత అంటూ ఎన్ని ఆదర్శాల ముసుగులు తొడిగినా అనేక సందర్భాల్లో ఆర్థిక కారణాలే యుద్ధాలను ప్రభావితం చేశాయి. మనందరికీ ఇప్పటివరకూ సుపరిచితమైన ఈ యుద్ధ కారణాలను తలతన్నే ఇంకో మహాకారణం ఉందా? అదే భవిష్యత్తు యుద్ధాలకు దారితీస్తుందా? దీనికి అవునంటూ 30 ఏళ్ల క్రితం చేసిన ఒక ప్రతిపాదన సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. 1993లో 'ఫారిన్ అఫేర్స్ మ్యాగజీన్'లో ప్రచురితమైన ఓ వ్యాసంలో చేసిన ఆ ప్రతిపాదన.. రాజకీయ, మేధో ప్రపంచాలను కుదిపివేసింది. దాని రచయిత శామ్యుల్ పి.హన్టింగ్‌టన్. ఆ వ్యాసానికి 'నాగరికతల మధ్య సంఘర్షణ' అని పేరు పెట్టారు. 28 పేజీల వ్యాసంలో వెలిబుచ్చిన భావాలపై ప్రపంచ వ్యాప్తంగా జరిగిన చర్చ అసాధారణమైంది. పత్రికలు, టీవీలు, విశ్వవిద్యాలయాలే కాదు.. చట్టసభల్లోనూ పౌర వేదికలపైనా వాదోపవాదాలు జరిగాయి. హన్టింగ్‌టన్ భావాలను ఖండిస్తూ వందలాది పుస్తకాలు వచ్చాయి. ఇప్పటికీ వస్తూనే ఉన్నాయి. పైపైన చూస్తే 'నాగరికతల సంఘర్షణ' భావంపై వాదోపవాదాల తీవ్రత ఇప్పుడు తగ్గినట్టే కనపడుతుంది. కానీ దాన్ని రకరకాల రూపంలో ఆచరించే, సమర్థించే వారి సంఖ్య మాత్రం పెరుగుతోంది.

ప్రతి భావానికీ నేపథ్యం ఉంటుంది. నాగరికతల సంఘర్షణా దీనికి మినహాయింపు కాదు. 1990ల నాటికి ప్రపంచ రాజకీయాలు మారిపోయాయి. సోషలిస్టు రాజ్యాలు కుప్పకూలాయి. చైనా ఆర్థిక విధానాలు మారిపోయాయి. ప్రచ్ఛన్నయుద్ధం ముగిసింది. స్వేచ్ఛా మార్కెట్ విధానాలే మానవాళికి గత్యంతరమన్న వాదన బలపడింది. ప్రపంచీకరణకు ప్రత్యామ్నాయం లేదన్న భావన దేశాలను ప్రభావితం చేసింది. సోషలిజం, క్యాపిటలిజం అడ్డుగోడలు కూలిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఆర్థిక కారణాలు, సైద్ధాంతిక విభేదాలు ఇక మీదట ప్రపంచ రాజకీయాలను ప్రగాఢంగా ప్రభావితం చేయలేవనీ, నాగరికతల మధ్య సంఘర్షణలే భవిష్యత్తు యుద్ధాలకు కారణాలవుతాయని హన్టింగ్‌టన్ ప్రతిపాదించారు. మరి ప్రపంచ రాజకీయాల్లో దేశాల పాత్ర ఏమిటి? అవి ప్రాధాన్యాన్ని కోల్పోతాయా? వాటి మధ్య వైషమ్యాలు ఉండవా? పరస్పరం కలహించుకోవా? ఆర్థిక ఆధిక్యత కోసం పెనుగులాడవా? అంటే అవన్నీ కూడా ఏదో ఒకస్థాయిలో ఉంటాయి. కానీ ఒక నాగరికతలో భాగమైన దేశాల మధ్య విభేదాలు విషమించి తీవ్ర యుద్ధాలకు దారితీయవు. అవి ఏదో ఒక స్థాయిలో పరిష్కారం అవుతాయి. భిన్న నాగరికతలకు చెందిన దేశాల మధ్య తలెత్తే సంఘర్షణలు ఇందుకు పూర్తి భిన్నం. అవి యుద్ధాలకు దారితీసే ప్రమాదం ఉంటుంది. సంఘర్షణలకు దారితీసే నాగరికతలు ప్రపంచంలో ఎన్ని ఉన్నాయని ప్రశ్నించుకుంటే అవి ప్రధానంగా ఎనిమిదికి మించి కనపడవు. అందులో మొదటిది పాశ్చాత్య నాగరికత. రెండోది కన్‌ఫ్యూషన్ (చైనా), మూడోది జపాన్, నాలుగోది ఇస్లామిక్, అయిదోది హిందూ, ఆరోది స్లావిక్–ఆర్థడాక్స్ (రష్యా–కొన్ని తూర్పు యూరోపు దేశాలు), ఏడోది లాటిన్ అమెరికా, చివరిది ఆఫ్రికా నాగరికత. ఆఫ్రికా నాగరికతలకు తన విశ్లేషణలో హన్టింగ్‌టన్ పెద్ద ప్రాధాన్యం ఇవ్వలేదు.

ప్రపంచ రాజకీయాలను నాగరికతల సంఘర్షణలు ప్రభావితం చేయనున్న విషయాన్ని చెప్పటమే తన ప్రతిపాదన లక్ష్యమని హన్టింగ్‌టన్ చెప్పినా అన్ని దేశాలూ క్రమేపీ పాశ్చాత్య నాగరికత వైపు వెళితేనే ఉద్రిక్తలు తగ్గుతాయన్న భావం ప్రధానంగా వ్యక్తం అవుతుంది. 'పాశ్చాత్య నాగరికత.. ఒక విశ్వనాగరికత. మనుష్యులందరికీ అది నప్పుతుంది' అని ప్రముఖ రచయిత వి.ఎస్. నైపాల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించటంలో ఉద్దేశం అదే. అందుకే హన్టింగ్‌టన్‌ను వ్యతిరేకించే వారూ ఎక్కువే ఉన్నారు.

ఈ నాగరికతల మధ్య తేడాలు మౌలికమైనవి. అవి సృష్టించిన, సృష్టిస్తోన్న భిన్న వైఖరులు ఏమిటి? ప్రతి నాగరికత మనుషుల మధ్య సంబంధాలనే నిర్దేశిస్తుంది. అలాగే వ్యవస్థలు–వ్యక్తుల మధ్య విధిగా ఉండాల్సిన సంబంధాలను శాసిస్తుంది. దైవం–మనిషి, వ్యక్తి–సమూహం, పౌరుడు–రాజ్యం, పిల్లలు–తల్లిదండ్రులు, భార్య–భర్త, హక్కులు–బాధ్యతలు, అధికారం–స్వేచ్ఛ, సమానత్వం–తారతమ్యం లాంటి విషయాల చుట్టూనే నాగరికతలన్నీ తిరుగుతాయి. మత సాహిత్యమంతా దైవం–మనిషి సంబంధాలను వివరించేదే. రాజకీయ సిద్ధాంతాలన్నీ పౌరుడు–రాజ్యం మధ్య సంబంధాలను విశ్లేషించేవే. అందుకే పైన చెప్పిన సంబంధాల మంచిచెడులను నిర్దేశించటమే నాగరికతల సారాంశం. కథలు, గాథలు, కావ్యాలను తరచిచూసినా చివరికిదే కనపడుతుంది. ప్రతి నాగరికతలోనూ సంబంధాలు భిన్నంగా ఉంటాయి. హిందూ నాగరికతలో వివాహం ధర్మబద్ధమైన ఘటన. దానికి విచ్ఛిన్నత లేదు. ఇస్లాంలో అది ఒక ఒడంబడిక. కులాలు హిందువులకు చాలా సహజమైనవి. ఇస్లాంలో ఏకేశ్వరోపాసన ప్రధానం. హిందువుల్లో బహు దేవతారాధన సహజం. ఇట్లా ఎన్ని తేడాలనైనా చెప్పుకోవచ్చు.



■ రాహుల్ కుమార్

భిన్న నాగరికతల మధ్య సంబంధాలు బాగా పెరుగుతున్నాయి. నాగరికతల తేడాలు మరింత స్పష్టంగా మన మనస్సులో నాటుకోటానికి ఇవి కారణం అవుతున్నాయి. నాగరికతల్లోని సారూప్యతలు, తేడాలు మనలో సానుభూతిని, భేదభావాన్ని బాగా ప్రభావితం చేస్తున్నాయి. వలస వచ్చే ఆఫ్రికా ప్రజలపై ఫ్రాన్స్‌లో వ్యతిరేకత ఉంది. అదే పోలెండు నుంచి వచ్చే క్యాథలిక్కుల పట్ల సానుకూలత వ్యక్తమవుతుంది. జపాన్ పెట్టుబడుల పట్ల అమెరికాలో విముఖత ఉంటుంది. కెనడా, యూరోపు పెట్టుబడుల విషయంలో అది కనపడదు. ప్రజల నాగరికతను బట్టి సుముఖత, విముఖతలు భిన్నంగా ఉంటాయనటానికి ఇట్లాంటివన్నీ నిదర్శనాలు. ఆధునిక ఆర్థిక విధానాలతో ఉపాధి కోసం ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వస్తోంది. మనిషి స్థానికతకు అర్థం లేకుండా పోతోంది. ప్రపంచీకరణతో జాతీయ రాజ్యాలు (నేషన్ స్టేట్స్) బలహీనం అవుతున్నాయి. 'నేను ఫలానా రాజ్యం–దేశానికి చెందిన వ్యక్తిని' అని చెప్పుకోవటం తగ్గిపోతోంది. మతపరంగా ఫలానా వ్యక్తినని చెప్పుకోవటం పెరుగుతోంది. మత దృష్టి పెరగటంతో ఛాందస ధోరణులు విజృంభిస్తున్నాయి. యువకులు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, సాంకేతిక నిపుణులు మతపరమైన గుర్తింపును, ఆధికత్యను ప్రదర్శించటంలో ముందుంటున్నారు. ప్రపంచమే లౌకికవాదానికి వ్యతిరేక దిశలో కదులుతోంది. పాశ్చాత్య ప్రపంచం అన్నిరకాలుగా ఉచ్ఛస్థితికి చేరుకుంటే సాంస్కృతికంగా సొంత మూలాల్లోకి వెళ్లాలన్న తాపత్రయం మిగతా దేశాల్లో పెరిగిపోతోంది. ఇస్లాం దేశాల్లోనే గాక భారత్, జపాన్, రష్యాల్లోనూ ఇది కనపడుతోంది. ఒకప్పుడు ఈ దేశాల్లో చదువరులు పాశ్చాత్య విలువలు, వైఖరుల వైపు మొగ్గుచూపే వారు. సాధారణ ప్రజలు స్థానిక సంస్కృతుల పరిధుల్లోనే ఉండి పోయేవారు. ఇప్పుడది మారిపోయింది. చదువరులు పాశ్చాత్య విలువల పట్ల విముఖతను ప్రదర్శిస్తుంటే.. కిందిస్థాయి ప్రజలు పాశ్చాత్య అలవాట్లు, అభిరుచుల వైపు మొగ్గు చూపుతున్నారు. రాజకీయ, ఆర్థిక విషయాల్లో మనుషుల వైఖరులు తొందరగా మారతాయి. సాంస్కృతిక మార్పులు వాటంత వేగంగా జరగవు. కమ్యూనిస్టులు సునాయాసంగా ప్రజాస్వామ్యవాదులుగా మారుతారు. ధనికులూ పేదలూ అటూఇటూ అవుతారు. కానీ రష్యన్లు ఎస్టోనియన్లుగా మారలేరు. సాంస్కృతిక అస్తిత్వాన్ని తేలికగా మార్చుకోలేం. మత, జాతి ప్రత్యేకతా భావాలు మనుషులను వేరుచేస్తాయి. ఒకపట్టాన వాటిని వదులుకోలేరు. సంస్కృతుల్లో సారూప్యత ఉన్న దేశాల మధ్య ఆర్థిక సహకారం ఎక్కువగా ఉంటుంది. యూరోపు దేశాల మధ్య అది ఎక్కువగా ఉండటానికి క్రైస్తవం, ఉమ్మడి సంస్కృతి ప్రధాన కారణం. జపాన్‌కు ఈ సౌలభ్యం అంతగా లేదు. చైనాకు కొంతమేరకు ఇది ఉంది. ప్రజలు ఎంతగా తమ అస్తిత్వాన్ని.. జాతి, మత పరంగా నిర్వచించుకుంటే అంతగా 'మనం–ఇతరులు' అనే ధోరణి పెరిగిపోతుంది. సోషలిస్టు ప్రభావం అంతరించాక తూర్పు యూరపు, రష్యాల్లో ఇదే జరుగుతోంది.

ఏడు నాగరికతల్లో (ఆఫ్రికా మినహా) ప్రబల శక్తిగా ఉన్న పాశ్చాత్య దేశాల కూటమి (అమెరికా, కెనడా, పశ్చిమ యూరపు దేశాలు) అన్నింటా (1993 నాటికి) ఆధిక్యతను ప్రదర్శిస్తోంది. అంతర్జాతీయ సంస్థలన్నీ ఈ కూటమి ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాయి. ప్రపంచ బాగు కోసమేనని చెబుతూ తమకు బాగా మేలుచేసే విధానాలను పాశ్చాత్య కూటమి ఇతర దేశాలపై రుద్దుతోంది. ఈ కూటమికి చైనా నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. కొన్ని ఇస్లాం దేశాలను కలుపుకొని చైనా ఈ దిశగా కదులుతోంది. భిన్న నాగరికతలకు చెందిన చైనా, ఇస్లాం దేశాలు ఎందుకు సహకరించుకుంటున్నాయి? పాశ్చాత్య ఆధిక్యతను ఎదుర్కోటానికే అది పరిమితమన్న భావనను హన్టింగ్‌టన్ వ్యక్తం చేశారు. నాగరికతల సంఘర్షణ చైనాలోనూ ముస్లింల అణచివేత రూపంలో కనపడుతోంది. రష్యాలో ముస్లింల అణచివేతను అలాగే అర్థం చేసుకోవాలి. బాబ్రీ విధ్వంసం తర్వాత భారత్‌లో తలెత్తుతున్న హిందూ ఆధిపత్య ధోరణులను నాగరికతల సంఘర్షణగానే హన్టింగ్‌టన్ పేర్కొన్నారు.

ప్రపంచ రాజకీయాలను నాగరికతల సంఘర్షణలు ప్రభావితం చేయనున్న విషయాన్ని చెప్పటమే తన ప్రతిపాదన లక్ష్యమని హన్టింగ్‌టన్ చెప్పినా అన్ని దేశాలూ క్రమేపీ పాశ్చాత్య నాగరికత వైపు వెళితేనే ఉద్రిక్తలు తగ్గుతాయన్న భావం ప్రధానంగా వ్యక్తం అవుతుంది. 'పాశ్చాత్య నాగరికత.. ఒక విశ్వనాగరికత. మనుష్యులందరికీ అది నప్పుతుంది' అని ప్రముఖ రచయిత వి.ఎస్. నైపాల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించటంలో ఉద్దేశం అదే. అందుకే హన్టింగ్‌టన్‌ను వ్యతిరేకించే వారూ ఎక్కువే ఉన్నారు. ఒకటి మాత్రం నిజం. నాగరికతలు, సంస్కృతుల విశిష్టతలను ఆధిక్యతా ధోరణిలో ఘనంగా చెప్పుకుంటున్న వారి వల్లే మానవహక్కులు నలిగిపోతున్నాయి. విశ్వజనీన విలువలు శిథిలమవుతున్నాయి. అసమ్మతి గళాలపై నిర్బంధాలు అమలవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

రాష్ట్ర భవిష్యత్తు: దిగులు, బెంగ తప్ప ఏమున్నది?

ఒక మాసానికి పైగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆ పార్టీకి చెందిన కొందరు మంత్రులు, శాసనసభ్యులతో ఆడుతున్న వికృత రాజకీయ క్రీడ రాజకీయ పరిశీలకులతో పాటు జన సామాన్యానికి సైతం వెగటు కలిగిస్తోంది. సాక్షాత్తూ రాష్ట్ర క్యాబినెట్‌లో ఉన్న ఒకరిద్దరికి ఈసారి టిక్కెట్టు లభించదని చెప్పేశారు. మరో ఇద్దరు, ముగ్గురు మంత్రులను వారు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలను కాదని వేరే నియోజకవర్గాలకు పొమ్మంటున్నారు. చాలా నియోజకవర్గాలలో సిట్టింగులను మార్చివేయడమో లేదా కొందరికి టిక్కెట్టు నిరాకరించడమో చేశారు. అలాగే పలు లోక్‌సభ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారిదీ అదే పరిస్థితి. అక్కడకు కొత్త ముఖాల్ని తెచ్చారు. దీనికి ప్రాతిపదిక ఏమిటంటే, ఆయా నియోజకవర్గాలలో సదరు మంత్రులకు ఎదురుగాలి వీస్తోందట. సిట్టింగ్ ఎమ్మెల్యేలంటే నియోజకవర్గాల ప్రజలకు మొహం మొత్తిందట. ఈ పచ్చి నిజాలన్నీ పార్టీ అంతర్గతంగా చేయించిన సర్వేల్లో తేలడంతో.. మరోమాట లేకుండా వైసీపీ అధిష్ఠానం తాము అనుకొన్నది చేసేస్తోంది. ఈ రాజకీయ క్రతువు లక్ష్యం రాష్ట్రంలోని 175 స్థానాలకు 175 పూర్తిగా గెలవడమేనట!

ఆశ్చర్యం ఏమిటంటే.. ఫోన్‌కాల్ అందుకొని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి పార్టీ పెద్దల్ని కలిసేవరకు సదరు ఎమ్మెల్యేకు తెలియదు తనను ఏ నియోజకవర్గానికి పంపుతారన్న సమాచారం. స్వయంగా ఓ మంత్రి తన నియోజకవర్గ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయినట్లు సర్వేలో తేలినపుడు, దానిని వాస్తవం అని అంగీకరించినపుడు.. ఆయన తన పదవిలో కొనసాగడానికి ఏమి నైతిక హక్కు ఉంటుంది? ఎన్నికలు జరిగే వరకు ట్రాన్స్‌ఫర్లు పొందిన మంత్రులు, ఎమ్మెల్యేలు.. ఇపుడు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు గుడ్‌బై చెప్పినట్లే. నూతనంగా నియమితులైన సమన్వయకర్తలే ఎన్నికల వరకు అక్కడ ఎమ్మెల్యేలుగా చెలామణీ అవుతారు. ఇది బోగస్ ప్రజాస్వామ్యం కాదా?

సాధారణంగా, ఐదేళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేకు అక్కడి పార్టీ కార్యకర్తలతో, ప్రజలతో అంతో ఇంతో అనుబంధం ఉంటుంది. మెజార్టీ ప్రజలకు అసంతృప్తి ఉంటే ఉండవచ్చుగానీ.. ఆ ఎమ్మెల్యేలకు పలకరించే స్థాయిలో కొన్ని వందల మంది అనుచరులైనా ఉంటారు. కానీ, గెలిచే అవకాశాలు లేవనే కారణంతో ఉన్నచోట టిక్కెట్టు నిరాకరించి ఆ ఎమ్మెల్యేను వేరేచోటకు పంపిస్తే.. అక్కడి ప్రజలు అతణ్ణి నెత్తిమీద పెట్టుకొంటారా? ఒక చోట తిరస్కరణకు గురైన వారికి మరొక చోట గౌరవాభిమానాలు దక్కుతాయా? ఇందులో లాజిక్కు ఏమిటో జగన్మోహన్ రెడ్డి మాత్రమే చెప్పాలి. ఆయన భావన ఏమంటే.. ఇది తన పార్టీ కనుక తన ఇష్టానుసారం ఎడాపెడా నిర్ణయాలు తీసుకోవచ్చు. అడగడానికి, ప్రశ్నించడానికి ఎవరికీ హక్కులేదు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ముఖ్యమని, రాజకీయ పార్టీకి సైతం కొన్ని విధివిధానాలు, రాజ్యాంగ సూత్రాలు పాటించవలసి ఉంటుందన్న స్పృహ దురదృష్టవశాత్తు ఆయనలో లేదు. అందుకే.. ఒక దశలో పార్టీకి తనే శాశ్వత అధ్యక్షుడిగా నియమించుకొనే దుస్సాహసానికి ప్రయత్నించి చివరకు భంగపడ్డారు.

ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంలో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు నెలల్లోనే బెస్ట్ సీఎం అనిపించుకొంటా, 30 ఏళ్లు ఈ రాష్ట్రానికి నేనే సీఎంగా ఉంటా.. అని చెప్పడం చాలామందికి గుర్తుండే ఉంటుంది. కానీ ఇప్పటివరకు ఉత్తమ ముఖ్యమంత్రి అని అన్పించుకొన్న ఉదంతం కాగడా పెట్టి వెతికినా ఒక్కటీ కన్పించదు. ఉత్తమ నాయకుడు పార్టీలోని అన్ని స్థాయిలలో నాయకత్వాన్ని ప్రోత్సహించగలగాలి. నిరంతరం ప్రజలను అంటిపెట్టుకొని ఉండాలి. కానీ, జగన్మోహన్ రెడ్డి తన పార్టీకి చెందిన చాలామంది ఎమ్మెల్యేలను గుర్తుపట్టలేరని పార్టీలో చెప్పుకొంటారు. ఇక పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకుల్ని ఆయనేమి గుర్తుపట్టగలరు?



జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రులు ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై కూడా మాట్లాడరు. అంగన్‌వాడీల సమ్మె, ప్రభుత్వోద్యోగుల డిమాండ్లు, ప్రతిపక్ష పార్టీ నేతలపై చేసే విమర్శలు.. ఇలా ప్రతి అంశంలో ప్రభుత్వ సలహాదారు మాత్రమే మీడియా ముందుకొస్తున్నారు. ఒకరిద్దరు మంత్రులైతే.. అసలు తాము నిర్వహిస్తున్న శాఖలేమిటో కూడా మర్చిపోయినట్లు వ్యవహరిస్తున్నారు. ఒకవైపు దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి కోసం పెట్టుబడుల ఆకర్షణలో ఉరుకులు పరుగులు పెడుతుంటే, ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రం ఈ విషయంలో చతికిలపడిపోయింది.

ప్రభుత్వంలో ప్రజల భాగస్వామ్యం అనేది లేనేలేదు. ఇప్పటివరకు మీడియా ద్వారా ప్రజలతో తన భావాలను, ఆలోచనల్ని జగన్మోహన్ రెడ్డి పంచుకొన్న సందర్భమే లేదు. ప్రజల తరఫున ప్రశ్నలు అడిగే మీడియాను ఎదుర్కోవడం ఆయనకు ఇష్టం లేదు. దారుణం ఏమంటే, ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై మంత్రులు కూడా మాట్లాడరు. పిడుక్కీ, బియ్యానికీ ఒకటే మంత్రం అన్న చందంగా.. అంగన్‌వాడీల సమ్మె, ప్రభుత్వోద్యోగుల డిమాండ్లు, ప్రతిపక్ష పార్టీ నేతలపై చేసే విమర్శలు.. ఇలా ప్రతి అంశంలో ప్రభుత్వ సలహాదారు మాత్రమే మీడియా ముందుకొస్తున్నారు. ఒకరిద్దరు మంత్రులైతే.. అసలు తాము నిర్వహిస్తున్న శాఖలేమిటో కూడా మర్చిపోయినట్లు వ్యవహరిస్తున్నారు. కీలకమైన నీటిపారుదల శాఖను నిర్వహించే మంత్రిగారైతే.. రోజూ ప్రధాన ప్రతిపక్షనేతపై విమర్శలు చేయడం మినహా.. నీటి ప్రాజెక్టుల పురోగతి, అంతర్రాష్ట్ర జల వివాదాలలో రాష్ట్రం హక్కులు పరిరక్షించడానికి తీసుకుంటున్న చర్యలు, తదితర అంశాలను పొరపాటుగా కూడా ప్రస్తావించరు. మరో కీలక రంగమైన ఆర్థికశాఖలో ఏం జరుగుతున్నదో ఎవరికీ అంతుబట్టదు. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా, వివిధ కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పులు మొత్తం ఎంత? వాటిని ఏయే రంగాలలో ఖర్చు చేశారు? బడ్జెట్‌లో జరిపిన కేటాయింపుల ప్రకారం నిధులు ఖర్చు అవుతున్నాయా, లేదా? అనే వివరాలను తొక్కిపెట్టి పారదర్శకతకు పాతర వేసేశారు. ఆ గణాంకాలను తెలుసుకోవడానికి సమాచార చట్టాన్ని ఆశ్రయించినా అందేది అరకొర సమాచారమే. కాగ్ బయటపెట్టే వరకు ఆర్థికరంగం అవకతవకలు తెలుసుకొనే అవకాశం ఎవరికీ లేదు. పైగా తెస్తున్న అప్పులపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయంటూ అప్పుడప్పుడు ఆర్థికశాఖలో పనిచేసే అవుట్ సోర్సింగ్ అధికారులతో ప్రెస్‌మీట్లు పెట్టిస్తున్నారే తప్ప, ఆర్థిక మంత్రి స్పందించరు.

ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఈ ఐదేళ్లల్లో ఎన్ని ఉద్యోగాల్ని కల్పించారో చెప్పరు. కేవలం గ్రామవాలంటీర్ల నియామకాల్నే నేటికీ తమ ఉద్యోగాల సృష్టిగా చాటుకొంటున్నారు. ఇక, రాష్ట్రంలో పరిశ్రమల రంగం అంటూ ఒకటి ఉన్నదా అనే అనుమానం అందరికీ కలగకమానదు. అంటే, పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కనీస ప్రయత్నాలు కూడా చేయకపోవడం, దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదికలో రాష్ట్రానికి గల అవకాశాలను చెప్పుకోవడానికి కూడా వెళ్లకపోవడాన్ని క్షంతవ్యం కాని నేరంగానే పరిగణించాలి. ఒకవైపు దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి కోసం పెట్టుబడుల ఆకర్షణలో ఉరుకులు పరుగులు పెడుతుంటే, ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రం ఈ విషయంలో చతికిలపడిపోయింది.

అదేవిధంగా, అయినదానికి కానిదానికి కేంద్ర ప్రభుత్వం ముందు సాగిలపడటమే తప్ప, రాష్ట్రానికి దక్కవలసిన నిధులు, ప్రాజెక్టులు, ముఖ్యంగా 'పునర్వ్యవస్థీకరణ బిల్లు–2014' ప్రకారం అందించవలసిన ఏ ఒక్క ప్రయోజనంపై కేంద్రాన్ని గట్టిగా నిలదీసిన సందర్భం లేదు. రాష్ట్రానికి రాజధాని లేనేలేదు. ఏ రంగంలో కూడా పెట్టుబడులు రావడం లేదు. పోలవరంతో సహా సాగునీటి ప్రాజెక్టులన్నీ నిద్రలోకి జారుకొన్నాయి. క్లుప్తంగా చెప్పాలంటే రాష్ట్రాన్ని జడత్వం ఆవరించింది. అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిస్తేజంగా, నిర్వికారంగా, శిలా సదృశంగా మారిపోయింది. ఒక్క అవినీతిలోనే కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అత్యంత చురుకుగా వ్యవహరిస్తోంది. ఈ పరిస్థితులను గమనించినపుడు ఎవరికైనా రాష్ట్ర భవిష్యత్తు పట్ల దిగులు, బెంగ కలగకమానవు.

ఈ నేపథ్యంలోనే మహాత్మాగాంధీ చెప్పిన మాటల్ని గుర్తుకు తెచ్చుకోవాలి. 'నిరాశగా అనిపించినపుడు నేను చరిత్రలోకి తొంగి చూస్తాను. నియంతలు కాలగర్భంలో కలిసిపోయిన ఉదంతాలు కనిపించి, నాలో ఆశ చిగురిస్తుంది. ఈ చీకటి శాశ్వతం కాదని తెలుస్తుంది'. ఈ ఆశతోనే రాష్ట్ర ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు.

● సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

స్థిరమైన రేపటి కోసం అంగన్‌వాడీల త్యాగం

మిత్రులారా!


నెల రోజులకు పైగా పగలు, రాత్రి తేడా లేకుండా ఉద్యమిస్తున్న అంగన్‌వాడీల పోరుకేక ప్రజానీకాన్ని ముఖ్యంగా మహిళా లోకాన్ని తట్టిలేపుతున్నది. అధికారులు, రాజకీయ పెత్తనాల మధ్య అన్ని యాప్‌ల కోసం 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న అంగన్‌వాడీల్ని ప్రతిఫలం ఆశించవద్దని పాలకులు అంటున్నారు. అట్టడుగు వర్గాల, కులాల పిల్లలు, మహిళల కోసం పనిచేసే మహిళా ఉద్యోగుల్ని చిన్నచూపు చూస్తున్నారు. వేతనాలు పెంచం అని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలంటే ఇవ్వం, కావాలంటే కోర్టు ధిక్కరణ కేసు వేసుకోమనటం కోర్టుల్ని గౌరవించకపోవటమే. రాష్ట్రంలో పెట్టుబడిదారులు తప్ప, వేరే ప్రజలున్నారని వారికీ పౌర హక్కులుంటాయని గుర్తించడానికి పాలకులు నిరాకరిస్తున్నారు. మద్దతిచ్చేందుకు వచ్చిన రాజకీయ నాయకులు కూడా ఉద్యోగాలు ఇస్తామంటున్నారు తప్ప, అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పటం లేదు.

పసిపిల్లల్ని సైతం లైంగిక వస్తువులుగా చూపటంలో పాలకులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. మద్యాన్ని, గంజాయి మత్తుని ఆదాయ వనరుగా మార్చుకుని యువత శరీరాలకి ఎక్కిస్తున్న ఫలితమే... పసిపిల్లలపై అత్యాచారాలు, హత్యలు. పసిగుడ్డుల్ని చిదిమేసే వారి నుంచి వలస వెళ్ళిన కుటుంబాల పిల్లల్ని, కూలిపనుల కెళ్లిన కుటుంబాల పిల్లల్ని కడుపులో పెట్టుకొని కాపాడుతున్నది అంగన్‌వాడీలే. గర్భిణీలు, బాలింతలు, పసిబిడ్డల్ని కంటికి రెప్పలా కాపాడుతూ వారి పోషణ, సంరక్షణ చేస్తూ, ఆరోగ్యవంతమైన సమాజం కోసం అహర్నిశలు కష్టపడుతూ, సామాజిక బాధ్యత నిర్వహిస్తున్న అంగన్‌వాడీల పట్ల ఇంతటి నిర్లక్ష్యమా? అంగన్‌వాడీల న్యాయమైన పోరాటాన్ని ప్రగతిశీల మహిళా సంఘం పూర్తిగా సమర్థిస్తున్నది. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడటం మానవ నైజం. అంగన్‌వాడీలకు పెరిగిన ప్రతి పైసా వారి పోరాటాల ఫలితమే. ఎస్మా బెదిరింపులకు లొంగకుండా ఉన్న హక్కుల్ని రక్షించుకొనేందుకు, లేని వాటిని సాధించుకొనేందుకు పోరాటమే అంగన్‌వాడీల ముందున్న మార్గం. దీనికి పీఓడబ్ల్యూ మద్దతుగా నిలబడుతుంది. అరెస్టులను సాగించి ప్రజా ఉద్యమాన్ని ఆపలేరు!

– ఎం.లక్ష్మి, ఆర్.గంగాభవాని







రామలింగేశ్వర నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో దీపాలతో 'జై శ్రీరామ్' నామం

జయ జానకీ నాయక!

ఎటుచూసినా రామ నామమే. ఎవరి నోట విన్నా 'జై శ్రీరామ్' నినాదమే. అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా భక్తులంతా సోమవారం శ్రీరాముని సేవలో పునీతులయ్యారు. పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా అన్నిచోట్లా శ్రీరాముని శోభాయాత్రలు నిర్వహించారు. ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిపించారు. కాలనీల్లోనూ, వీధుల్లోనూ జైశ్రీరామ్ జెండాలు ఆవిష్కరించారు. రాత్రి దీపారాధనలు చేశారు. దుర్గమ్మ ఆలయంలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. అన్నిచోట్లా అన్నదానాలు చేశారు.



ఇస్కాన్ టెంపుల్‌లో



ఒకటే గమనం.. ఒకటే గమ్యం.. ఆంక్షలను లెక్క చేయలేదు. నోటీసులను పట్టించుకోలేదు. తొలగిస్తామన్నా చలించలేదు. విరామం ఎరుగలేదు. విశ్రమించనూ లేదు. వేతన పెంపు కోసం 42 రోజులుగా అలుపూ సొలుపూ లేకుండా సాగుతున్న అంగన్వాడీల పోరాటం మరో దశకు చేరింది. సోమవారం చలో విజయవాడలో భాగంగా జిల్లాల నుంచి బెజవాడకు చేరుకుంటున్న అంగన్వాడీలను పోలీసులు ముందురోజు అర్ధరాత్రి నుంచే ఎక్కడికక్కడే అక్రమ అరెస్టులకు తెగబడ్డారు. అయినా జిల్లాలు దాటి నగరానికి వచ్చినవారిని బీఆర్టీఎస్ రోడ్డుకు చేరుకోనీయకుండా అరెస్టు చేసి బస్సుల్లో తరలించారు. అందరినీ ఒకచోటకు చేరనీయకుండా బస్సుల్లో.. ఆటోల్లో.. వెతికివెతికి దొరికినవారిని దొరికినట్టు అదుపులోకి తీసుకుని వివిధ ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రభుత్వంలో ఉద్యమాల అణచివేత ఎలా ఉంటుందో తమ పద్ధతిలో చూపారు.



ధర్నాచౌక్‌వద్ద బలవంతపు అరెస్టులు



వృద్ధురాలిని కూడా వదలకుండా..



ఆదివారం అర్ధరాత్రి దాటాక ధర్నాచౌక్ వద్దకు గుంపులుగా చేరిన అంగన్వాడీలు

నిర్బంధాలను తెంచుకుని..

ఆంక్షలను, అడ్డంకులను దాటుకుని వచ్చిన అంగన్వాడీలపై పోలీసుల కర్కశం



అరెస్టు చేసి బస్సులో తరలింపు



బీఆర్టీఎస్ రోడ్డులో అంగన్వాడీల నినాదాలు

- జిల్లాను అష్టదిగ్బంధం చేసిన పోలీసులు
- అర్ధరాత్రి నుంచే అరెస్టుల పర్వం
- ఈడ్చుకుంటూ లాక్కెళ్లి బస్సుల్లో పడేసిన పోలీసులు
- బస్సుల్లో వేర్వేరు ప్రాంతాలకు తరలింపు
- ఆందోళనకు మద్దతుగా రోడ్డెక్కిన ప్రజాసంఘాలు
- జిల్లా సరిహద్దులు దాటించినా తిరిగొచ్చి మహిళల ఆందోళన

విజయవాడ/సత్యనారాయణపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఇచ్చిన చలో విజయవాడ పిలుపు ఉద్రిక్తతలకు దారితీసింది. అంగన్వాడీలతోపాటు వారికి మద్దతుగా వచ్చిన ప్రజాసంఘాల నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. సత్యనారాయణపురంలోని బీఆర్టీఎస్ రోడ్డు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కనిపించింది. బీఆర్టీఎస్ రోడ్డులోకి ఎవరు నడుచుకుంటూ వచ్చినా పోలీసులు వాహనాల్లోకి ఎక్కించారు. రోడ్డు మొత్తం పోలీసుల వలయంలో ఉండిపోయింది. విజయవాడకు ఉన్న అన్ని ప్రవేశ ద్వారాల వద్ద బారికేడ్లతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అంగన్వాడీలు ఎక్కడ బైఠాయిస్తే ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను మళ్లించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బీఆర్టీఎస్ రోడ్డులో రాకపోకలు పూర్తిగా ఆపేయడంతో వాహనదారులు రైల్వే క్వార్టర్స్ పక్కన ఉన్న మార్గంలో రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

ఆంక్షలను దాటుకుని..

పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా బీఆర్టీఎస్ రోడ్డు మీద అడుగుపెట్టి తీరాలని అంగన్వాడీలు నిర్ణయించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి గాంధీనగరంలోని దీక్షా శిబిరాన్ని కూల్చేసిన తర్వాత ఆ ప్రదేశాన్ని పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. ధర్నా శిబిరాన్ని కూల్చేసిన తర్వాత కొంతమంది అంగన్వాడీలు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. కొందరు బీఆర్టీఎస్ రోడ్డులోని సీఐటీయూ భవనంలో తలదాచుకున్నారు. ఇంకొందరు వారి బంధులు, స్నేహితుల ఇళ్లలో ఉన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చినవారు ఆదివారం రాత్రికే ధర్నాచౌక్‌కు చేరుకున్నారు. వారిని అరెస్టు చేసి బస్సుల్లో వివిధ ప్రాంతాలకు తరలించారు. తెల్లవారుజామున వచ్చిన అంగన్వాడీలు బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్‌లో ఉండిపోయారు. ఉదయం నుంచి దఫదఫాలుగా సత్యనారాయణపురం చుట్టుపక్కల ప్రాంతాలకు

- మిగతా 6లో



సొమ్మసిల్లి..



సీఐటీయూ కార్యాలయం వద్ద



ధర్నాచౌక్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు



పోలీసులు బలవంతంగా లాక్కెళ్తూ..







అరెస్టులతో ఆపలేరంటూ బస్సుల్లో నుంచే పిడికిలెత్తి నినదిస్తూ..



16,74,995

డ్రాఫ్ట్ తర్వాత పెరిగిన ఓటర్లు 35,843 మంది

ఎన్టీఆర్ జిల్లా ఓటర్ల సంఖ్య ఇదీ..

మహిళా ఓటర్లు 8,57,361, పురుష ఓటర్లు 8,17,484, థర్డ్ జెండర్ ఓటర్లు 150

- మరింతగా పెరిగిన మహిళా ఓటర్లు
- అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం మైలవరం
- అత్యల్ప ఓటర్లున్న నియోజకవర్గం జగ్గయ్యపేట

విజయవాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరోమారు మహిళా ఓటర్లు తమ ఆధిక్యతను చాటారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా అనంతరం తుది ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్లు మరింతగా పెరిగారు. సోమవారం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం చూస్తే ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 16,74,995 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 8,17,484 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు అత్యధికంగా 8,57,361 మంది ఉన్నారు. పురుషుల కంటే దాదాపుగా 40 వేల మంది అత్యధికంగా ఉన్నారు. అక్టోబరు 22, 2023లో ప్రకటించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా కంటే కూడా తుది జాబితాలో మహిళా ఓటర్ల శక్తి మరింత పెరిగింది. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకారం చూస్తే తుది ఓటర్ల జాబితా నాటికి మొత్తంగా 35,843 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో మహిళా ఓటర్లు 20,375 మంది ఉన్నారు. పురుష ఓటర్లు 15,475 మంది ఉన్నారు.

నియోజకవర్గాల పెరిగిన మహిళా ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	పెరుగుదల
తిరువూరు	2779
విజయవాడ పశ్చిమ	1708
విజయవాడ సెంట్రల్	2041
విజయవాడ తూర్పు	4069
మైలవరం	4038
నందిగామ	2595
జగ్గయ్యపేట	3144
మొత్తం	**20,375**

తుది జాబితాలోకి పెరిగిన 35,843 మంది ఓటర్లు

తుది ఓటర్ల జాబితా - 2024 ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో మొత్తంగా 16,74,995 మంది ఓటర్లు ఉన్నారు. డ్రాఫ్ట్ జాబితాలో జిల్లా వ్యాప్తంగా 16,39,152 ఓటర్లు ఉన్నారు. తుది ఓటర్ల జాబితాకు వచ్చేసరికి 35,843 ఓటర్లు పెరిగారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో అత్యధికంగా మైలవరం నియోజకవర్గంలో 2,76,409 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో 2,02,407 మంది ఉన్నారు.

పురుష ఓటర్ల వివరాలు ఇలా

జిల్లా వ్యాప్తంగా తుది ఓటర్ల జాబితాలో కూడా పురుష ఓటర్లు పెరిగారు. జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా మైలవరం నియోజకవర్గంలో 3586 మంది ఓటర్లు పెరిగారు. విజయవాడ తూర్పులో 3571 మంది పెరిగారు. విజయవాడ సెంట్రల్‌లో అత్యల్పంగా కేవలం 146 మంది మాత్రమే పెరిగారు. తిరువూరులో 2086, విజయవాడ పశ్చిమలో 1680, నందిగామలో 2113, జగ్గయ్యపేటలో 2293 మంది పురుష ఓటర్లు పెరిగారు. జిల్లాలో థర్డ్ జెండర్ ఓటర్లు డ్రాఫ్ట్ జాబితా సమయంలో 157 ఉండగా.. తుది జాబితాలో 150 మంది మాత్రమే ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య

అసెంబ్లీ పేరు	డ్రాఫ్ట్ ఓటర్లు	తుది ఓటర్లు	పెరుగుదల
తిరువూరు	2,00,613	2,05,476	4863
విజయవాడ వెస్ట్	2,45,460	2,48,849	3389
విజయవాడ సెంట్రల్	2,71,576	2,73,754	2178
విజయవాడ తూర్పు	2,57,134	2,64,778	7644
మైలవరం	2,68785	2,76,409	7624
నందిగామ	1,98,616	2,03,322	4706
జగ్గయ్యపేట	1,96,968	2,02,407	5439
మొత్తం	**16,39,152**	**16,74,995**	**35843**

నాని కోవర్టులపై ఆరా!

బుద్దా వెంకన్న, చిన్నిలకు బాధ్యత అప్పగించిన టీడీపీ అధిష్ఠానం

- విజయవాడ పశ్చిమలో కమిటీల రద్దుకు సన్నాహాలు
- పశ్చిమ సమన్వయకర్తగా పలు నియామకాలు చేసిన నాని
- డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులుగా పార్టీకి సంబంధం లేనివారు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) విజయవాడ ఎంపీ కేశినేని నాని టీడీపీకి గుడ్‌బై చెప్పినా ఆయన అనుచరులు ఎవ్వరూ ఆయనతో కలిసి అడుగులు వేయలేదు. ఇది ఓ రకంగా చూస్తే టీడీపీ విజయవాడ పార్లమెంటు పరిధిలో ఎంత బలంగా ఉందో చెప్పే అంశంగా కనిపిస్తోంది. కానీ నాని తన కోవర్టులను కావాలనే టీడీపీలోనే ఉంచారన్న అనుమానాలు టీడీపీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో టీడీపీని దెబ్బకొట్టే వ్యూహంలో ఇదీ ఒక భాగమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో టీడీపీ తరఫున ఏజెంట్లుగా తన వారిని ఉంచే ప్రయత్నమా? లేదా టీడీపీ ఎన్నికల వ్యూహాలను తెలుసుకోవడానికా? అన్న అనుమానాలను టీడీపీ నాయకులు పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. కీలకమైన సమయంలో పార్టీని దెబ్బతీసే ఎత్తుగడలో భాగంగా నాని కోవర్టులు పనిచేయవచ్చని వారు పార్టీ పెద్దలకు చెప్పారు. దీంతో విజయవాడ పార్లమెంటు పరిధిలో ముఖ్యంగా విజయవాడ పశ్చిమలో నాని కోవర్టులు ఎవరనే సమాచారం సేకరించాలని పార్టీ అధిష్ఠానం బుద్దా వెంకన్న, కేశినేని చిన్నికి బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం.

- విజయవాడ పశ్చిమలో కీలకమైనా నేతలు బుద్దా వెంకన్న, నాగుల్ మీరా వంటి వారిని టార్గెట్ చేయాలన్న ఉద్దేశంతో టీడీపీలో ఉన్న సమయంలో కేశినేని నాని విజయవాడ పశ్చిమ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్నారు. సమన్వయకర్త హోదాలో పశ్చిమ నియోజకవర్గంలోని 22 డివిజన్లలో డివిజన్ కమిటీలను నియమించేందుకు ప్రయత్నించారు. డివిజన్ కమిటీల పనితీరును పర్యవేక్షించేందుకు నాలుగైదు డివిజన్లకు ఓ క్లస్టర్ ఇన్‌చార్జిని నియమించారు. అయితే ఈ కమిటీల్లో పార్టీకి సంబంధంలేని వారిని కూడా నియమించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నియామకాలపై బుద్దా వెంకన్న అభ్యంతరం తెలపడంతో కొన్ని డివిజన్లకు మాత్రమే నాని కమిటీలను నియమించుకోగలిగారు. ఈ డివిజన్ కమిటీల్లో అత్యధికులు నానికి అనుచరులుగా ముద్రపడ్డారు. తాజాగా ఈ కమిటీలను రద్దు చేయాలని పశ్చిమ టీడీపీ నాయకులు పార్టీ అధిష్ఠానానికి విన్నవించారు. త్వరలోనే డివిజన్ కమిటీలు, క్లస్టర్ ఇన్‌చార్జులను రద్దు చేసే అవకాశం ఉంది. మరోవైపు విజయవాడ పశ్చిమ టీడీపీలో సీనియర్ నాయకులు ఉన్నా వారి నడుమ సమన్వయం కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. జలీల్‌ఖాన్, ఎంఎస్ బేగ్ వంటి నాయకులు ఎవరికి వారే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితి టీడీపీ శ్రేణులను గందరగోళానికి గురిచేస్తోంది. అధిష్ఠానం ఆదేశాల మేరకు బుద్దా వెంకన్న సారథ్యంలో నాయకులందరినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయి.

విజయవాడ పార్లమెంటు పరిధిలోనూ ప్రక్షాళన

విజయవాడ పార్లమెంటు పరిధిలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేశినేని నాని స్థానిక ఇన్‌చార్జులను కాదని సొంత మనుషులను ప్రోత్సహించారు. దీంతో మైలవరం, తిరువూరు, నందిగామ నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్‌లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల సమయానికి వీటన్నింటినీ చక్కదిద్ది గాడిన పెట్టే బాధ్యతను కేశినేని చిన్నికి పార్టీ పెద్దలు అప్పగించారు. ఒకటి రెండు రోజుల్లో ప్రక్షాళన మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం.



ఉద్యమకారులపై.. ఉక్కుపాదం

అంగన్వాడీలు, కమ్యూనిస్టు నేతల ఆగ్రహం



అంగన్వాడీలను వ్యాన్‌లో ఎక్కిస్తున్న పోలీసులు

అంగన్వాడీల చలో విజయవాడ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. జీతాలు పెంచాలని, జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని 40 రోజులకుపైగా అంగన్వాడీలు సమ్మె బాట పట్టారు. సీఎం అహంకార ధోరణిని నిరసిస్తూ సోమవారం చలో విజయవాడ కార్యక్రమానికి తరలివస్తున్న అంగన్వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. మహిళలని కూడా చూడకుండా బలవంతంగా స్టేషన్లకు తరలించారు.



కృష్ణాజిల్లా పమిడిముక్కల స్టేషన్‌లో అంగన్వాడీల ఆందోళన

- మైలవరం స్టేషన్‌లో బాబూరావు నిరాహార దీక్ష
- అరెస్టులు ఖండిస్తూ స్టేషన్ ఎదుట రాస్తారోకో
- నందిగామలో ఆచంట సునీత, కూరపాటి ప్రవీణల అరెస్టు
- వందలాది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సీపీఎం నేతృత్వంలో అంగన్వాడీల ధర్నా
- తిరువూరులో సీఐటీయూ నేతల నిరసనలు

(ఆంధ్రజ్యోతి,విజయవాడ/నందిగామ/మైలవరం/తిరువూరు): అంగన్వాడీల చలో విజయవాడకు ఎన్టీఆర్‌జిల్లా పరిధిలోని గ్రామీణ మండలాల నుంచి తరలివస్తున్న అంగన్వాడీలు, నాయకులపైనా ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వారిపై నిర్బంధకాండ ప్రయోగించింది. మైలవరం పట్టణ పరిధిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చిగురుపాటి బాబూరావును పోలీసులు మైలవరం స్టేషన్‌కు తరలించారు. బాబూరావు ఫోన్‌ను బలవంతంగా లాక్కోవడంతో ఆయన అక్కడికక్కడే స్టేషన్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. బాబూరావుతో పాటు మహిళాసంఘం నేత రమాదేవిని కూడా స్టేషన్‌కు తరలించారు. బాబూరావును స్టేషన్‌కు తీసుకురావటంతో పెద్దఎత్తున అంగన్వాడీలు స్టేషన్‌కు చేరుకుని ఎన్‌హెచ్-30పై రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ స్తంభించించడంతో పోలీసులు అంగన్వాడీలను చెదరగొట్టారు. మహిళలు అని కూడా చూడకుండా బలవంతంగా ఈడ్చుకువెళ్లి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులపై అంగన్వాడీలు తిరగబడ్డారు. పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ మండల పరిధిలో పెద్ద ఎత్తున ఆందోళన సాగింది. ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దే రాజ్యలక్ష్మితో పాటు మరో 200 మందికి పైగా అంగన్వాడీలు విజయవాడ వచ్చే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంక్షన్ల వద్ద కాపు కాసిన పోలీసులు అంగన్వాడీలు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిరశిస్తూ సీపీఎం నేతృత్వంలో పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు నందిగామ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరువూరులో స్థానికంగా వామపక్ష నేతల ఆధ్వర్యంలో అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన నిర్వహించారు.

సీఎం ఇల్లు ముట్టడికి వెనుకాడేది లేదు

- ఆచంట సునీత

జగ్గయ్యపేట రూరల్ : అంగన్వాడీల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికీ వెనకాడేది లేదని రాష్ట్ర టీడీపీ అంగన్వాడీ అధ్యక్షురాలు, రాష్ట్ర తెలుగునాడు మహిళా సాధికార సంస్థ ఛైర్మన్ ఆచంట సునీత హెచ్చరించారు. సోమవారం చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న ఆమెను చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకుని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 1.05 లక్షల మంది 45 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా అణచివేతకు సిద్ధమవటమేనన్నారు. ఆమెతో పాటు కూరపాటి ప్రవీణ, గద్దె రాజ్యలక్ష్మీతో పాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా నేతలకు టీడీపీ విజయవాడ పార్లమెంటరీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఫోన్‌లో సంఘీభావం తెలిపి మద్దతు పలికారు.

మీడియాపై పోలీసుల దురుసు ప్రవర్తన

విజయవాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీల అరెస్టు క్రమంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల వ్యాఖ్యలపై అంగన్వాడీలు మండిపడుతున్నారు. ధర్నా శిబిరం వద్దకు అర్ధరాత్రి చేరుకున్న పోలీసులు ముందుగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. సమాచారం తెలియడంతో మీడియా అక్కడికి చేరుకుంది. ఫొటోలు తీయవద్దని డీసీపీ విశాల్‌గున్నీ వారిని వారించారు. ఒక ఫొటోగ్రాఫర్‌ను బస్సులోకి ఎక్కించి తర్వాత దించేశారు. ధర్నా శిబిరం తొలగిస్తున్న క్రమంలో ఫొటోగ్రాఫర్ ఫొటో తీస్తుండగా విశాల్‌గున్నీ ఎదుటే మరో పోలీసు కాలర్ పట్టుకుని పక్కకు లాగేశాడు. మొత్తం శిబిరాన్ని తొలగించి ఆ ప్రదేశాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత డీసీపీ చేసిన వ్యాఖ్యలు విమర్శలకు తావిస్తున్నాయి. "ఇది మన సక్సెస్.. దీనిని సెలబ్రేట్ చేసుకోవాలి.. మరో పది గంటలు కష్టపడండి" అని పోలీసు అధికారులు, సిబ్బందితో ఆయన వ్యాఖ్యానించారని అక్కడే ఉన్న అంగన్వాడీలు చెబుతున్నారు. డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్న తమను అన్యాయంగా అరెస్టు చేయడమే కాకుండా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

బెయిల్‌పై బాబూరావు విడుదల

ధర్నా శిబిరం వద్ద అరెస్టు చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ బాబూరావు సోమవారం రాత్రి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆయన్ను అరెస్టు చేసిన తర్వాత మైలవరం పీఎస్‌కు తరలించారు. ఆయనపై 120(బి), 143, 153, 290, 509 రెడ్‌విత్ 149, 7(1) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. బాబూరావును సోమవారం రాత్రి విజయవాడలోని మూడో చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరిచారు. పూచీకతు తీసుకున్న అనంతరం కోర్టు బెయిల్‌పై విడుదల చేసింది.

అంగన్వాడీలపై నిర్బంధం ఆపాలి

- వామపక్ష నేతల నిరాహారదీక్ష

గవర్నర్‌పేట : అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని, వారిని చర్చలకు ఆహ్వానించి సమస్య పరిష్కరించాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. 'జగనన్నకు చెబుతాం' కోటి సంతకాలతో విజయవాడ చేరుకున్న వేల మంది అంగన్వాడీలపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావుల నేతృత్వంలో వామపక్ష, టీడీపీ, జనసేన నేతలు, వివిధ కార్మిక సంఘాల నేతలు సోమవారం బందరు రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో నిరాహారదీక్ష చేపట్టారు. అవసరమైతే నిరవధిక నిరాహారదీక్ష చేస్తామని, కార్మిక సంఘాలు నిర్ణయిస్తే రాష్ట్ర బంద్‌కు సిద్ధమని నాయకులు హెచ్చరించారు. అంగన్వాడీలను వెంటనే విడుదల చేయాలని, చర్చలకు ఆహ్వానించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సీపీఐ రామకృష్ణ మాట్లాడుతూ, జగన్ మొండితనం వల్లే అంగన్వాడీలు ఆందోళన బాట పట్టారన్నారు. జగన్ అహంకార వైఖరితో సమస్యను జఠిలం చేశారని అన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరితే లక్షమందిని తొలగిస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీపీఐ నేత రామకృష్ణ

సీపీఎం నేత వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారిపై యుద్ధం చేస్తున్నారని అన్నారు. రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు దీక్షకు మద్దతు ప్రకటించారు. మహిళల పట్ల పోలీసులు అనుసరించిన వైఖరి సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ, అంగన్వాడీల డిమాండ్లు ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. దీక్షకు మద్దతుగా సీపీఐఎంల్ న్యూ డెమోక్రసీ నాయకులు హరికృష్ణ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కె.ప్రసన్న, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు ప్రసంగించారు. దీక్షకు టీడీపీ, జనసేన మద్దతు ప్రకటించింది. దీక్షా శిబిరాన్ని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి, జనసేన నాయకులు బొలిశెట్టి వంశీకృష్ణ సందర్శించి మద్దతు తెలిపారు.

అరెస్టులు అప్రజాస్వామికం

- టీడీపీ, జనసేన నేతల నిరసన

మచిలీపట్నం టౌన్ : కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి అంగన్వాడీలను అరెస్టు చేసి బందరు మండలం తపసిపూడి పోలీసు శిక్షణా కేంద్రంలో అక్రమంగా నిర్బంధించనందుకు నిరసనగా సోమవారం టీడీపీ జనసేన, సీపీఐ, సీపీఎం నాయకులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విజయవాడ ఉద్యమానికి వెళ్లకుండా అంగన్వాడీ కార్యకర్తల సంఘం



తపసిపూడి శిక్షణాశాల వద్ద టీడీపీ నేతల నిరసన ప్రదర్శన

నాయకులతో పాటు వేలాది కార్యకర్తలను అరెస్టు చేసి తపసిపూడిలో నిర్బంధించారు. వారికి సరైన భోజన సదుపాయం కూడా లేకుండా ఇబ్బందులకు గురిచేయడాన్ని టీడీపీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్, కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు, సీపీఐ నాయకులు లింగం ఫిలిప్, జనసేన నియోజక వర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ, సీపీఎం నేతలు బి.సుబ్రహ్మణ్యం తదితరులు నిరసన తెలిపారు. అంగన్వాడీల అరెస్టును నేతలు ఖండించారు.

సీఎం జగన్‌కు బుద్ధి ప్రసాదించాలి

- అంబేడ్కర్ విగ్రహానికి అంగన్వాడీల వినతి

తోట్లవల్లూరు : హక్కుల కోసం పోరాడుతుంటే సీఎం జగన్ నియంతగా వ్యవహరిస్తూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికే విలువ లేకుండా చేస్తున్నారని అంగన్వాడీ కార్యకర్తలు మండిపడ్డారు. తోట్లవల్లూరులో సోమవారం ఉదయం చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అంగన్వాడీలను గృహనిర్బంధం చేయడంతోపాటు ఆటోలు, బైక్‌లపై పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో స్టేషన్‌లోనే సీఎంకు వ్యతిరేకంగా పెద్దఎత్తున అంగన్వాడీలు నినాదాలు చేశారు.



సాయంత్రం 3.30 గంటలకు అందరూ ఇళ్లకు వెళ్లిపోవాలని ఎస్ఐ విశ్వనాథ్ సూచించగా అందుకు వారు నిరాకరించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. రాజ్యాంగ విలువలు కాపాడేలా జగన్‌కు బుద్ధిని ప్రసాదించాలని అంబేడ్కర్‌కు చేతులెత్తి వేడుకున్నారు.

నిర్బంధాలను తెంచుకుని..

(5వ పేజీ తరువాయి)

చేరుకున్నారు. కొంతమంది రామవరప్పాడు, మధురానగర్ రైల్వేస్టేషన్లలో దిగి బీఆర్టీఎస్ రోడ్డుకు చేరుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా గ్రూపులుగా విడిపోయారు. ఒక్కో బ్యాచ్ ఒక్కో ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించింది. ధర్నాచౌక్, పటమటలోని బందరు రోడ్డు, చుట్టుగుంట సర్కిల్, రామవరప్పాడు రింగ్, లోబ్రిడ్జి ప్రాంతాల్లో బైఠాయించి నిరసన తెలిపారు.

- చలో విజయవాలో భాగంగా బెజవాడకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేసి ఆర్టీసీ బస్సుల్లో జిల్లాల సరిహద్దుల అవతల వదిలేశారు.
- కృష్ణాజిల్లాలో అరెస్టు చేసిన వారిని మచిలీపట్నంలోని పోలీసు శిక్షణ కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి వారిని బస్సుల్లో ఏలూరు, భీమవరం ప్రాంతాల్లో వదిలేశారు.
- కంకిపాడులో కూలి పనులకు వెళ్తున్న మహిళలను అరెస్టు చేశారు. తాము కూలీలమని చెప్పినా పోలీసులు వినలేదు. బస్సులోకి ఎక్కించి కొంతదూరం తీసుకెళ్లిన తర్వాత వారు కూలీలని నిర్ధారించుకుని వదిలేశారు.
- డీటీసీలో ఉన్న అంగన్వాడీల్లో కొంతమందికి అనారోగ్యం ఉందని, బయటకు పంపాలని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు.

● అరెస్టు చేసుకోండి..

బీఆర్టీఎస్ రోడ్డులోకి వచ్చిన అంగన్వాడీలను పోలీసులు ఉదయం నుంచి అరెస్టు చేస్తున్నారు. ఈ మార్గంలో బందోబస్తును డీసీపీలు విశాల్‌గున్నీ, వేజెండ్ల అజిత, కె.చక్రవర్తి, మోకా సత్తిబాబు పర్యవేక్షిస్తున్నారు. ముగ్గురు అంగన్వాడీ కార్యకర్తలు ఉపేంద్ర చౌక్ నుంచి సీఐటీయూ భవనం వైపునకు నడుచుకుంటూ వచ్చారు. వారిని అరెస్టు చేసి బస్సు ఎక్కించాలని అధికారులు కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. వారితో ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతుండగా డీసీపీ విశాల్‌గున్నీ కారులో వెళ్తూ అక్కడ ఆగారు. విషయం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు తమ వద్ద నుంచి సెల్‌ఫోన్లు తీసుకున్నారని, వాటిని ఇవ్వాలని వారు చెప్పారు. ఫోన్ నంబర్లు రాసి ఇస్తే ట్రాక్ చేస్తామని విశాల్‌గున్నీ వారికి చెప్పారు. ఇంతలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు బస్సు ఎక్కాలని ఒత్తిడి చేశారు. దీనిపై ఓ అంగన్వాడీ తీవ్రంగా స్పందించింది. 'మమ్మల్ని అరెస్టు చేస్తే చేసుకోండి. ముందు మా సెల్‌ఫోన్లు ఇవ్వండి' అని ఘాటుగా సమాధానం ఇచ్చింది.

● తొలగింపు కత్తి

ఉదయం నుంచి పోలీసులు అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లను అరెస్టు చేయగా, సాయంత్రం నుంచి ఐసీడీఎస్ అధికారులు తొలగింపు ఉత్తర్వులు సిద్ధం చేశారు. కృష్ణాజిల్లాలో 1686 మంది అంగన్వాడీలు, 1537 మంది హెల్పర్లను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్‌లోగా 109 మంది అంగన్వాడీలు, 86 మంది హెల్పర్లు విధుల్లో చేరారు. ఎన్టీఆర్ జిల్లాలో 1425 మంది వర్కర్లు, 1475 మంది హెల్పర్లు ఉన్నారు. వారిలో సోమవారం సాయంత్రానికి 150 మంది వర్కర్లు, 146 మంది హెల్పర్లు విధుల్లో చేరారు. 1329 మంది హెల్పర్లు, 1275 మంది వర్కర్లను తొలగిస్తూ అధికారులు నోటీసులు ఇచ్చారు.

● లైట్లు తీసేసి బస్సుల్లో ఎక్కించారు

- మంజుల, సంఘం అధ్యక్షురాలు

శిబిరంలో శాంతియుతంగా దీక్షచేస్తున్న మమ్మల్ని అర్ధరాత్రి మూడు గంటలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యుత్ నిలుపుదల చేసి ఈడ్చుకుంటూ తీసుకువెళ్లి బస్సుల్లో వేశారు. ఎక్కడకు తరలిస్తున్నారో చెప్పకుండా వాహనాల్లో తిప్పారు. చివరకు మచిలీపట్నంలోని డీటీసీకి తీసువచ్చారు. తాగునీరు, అల్పాహారం, భోజనం పెట్టకుండా, మహిళల ఇబ్బందులను పట్టించుకోకుండా నిర్బంధించారు. బటన్‌నొక్కి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నానని చెబుతున్న సీఎం జగన్‌కు ఎన్నికల్లో బటన్‌నొక్కి బుద్ధిచెప్తాం.

జరిగింది ఇలా..

- అర్ధరాత్రి 2.30 గంటలకు ధర్నాచౌక్‌కు భారీగా చేరుకున్న పోలీసు బలగాలు
- 3.00 గంటలకు అంగన్వాడీల దీక్షా శిబిరంలో విద్యుత్ నిలిపివేత.
- పోలీసుల రాకతో నడిరోడ్డుపై పడుకుని నిరసన
- 3.00 గంటల నుంచి అంగన్వాడీల అరెస్టు, వాహనాల్లో తరలింపు
- 4.00 గంటలకు దీక్షా శిబిరం కూల్చివేత
- ఉదయం 6.00 గంటలకు బీఆర్టీఎస్ రోడ్డుకు చేరుకున్న పోలీసులు
- 7.00 గంటల నుంచి బీఆర్టీఎస్ రోడ్డు మీదకు వచ్చిన అంగన్వాడీలు, ఎక్కడికక్కడ అరెస్టులు
- 10.00 గంటలకు పెరిగిన అంగన్వాడీల రాక



గొల్లపూడిలో జయహో బీసీ సభలో మాట్లాడుతున్న ఉమా

బీసీలకు చేసిందేమిటో జగన్ చెప్పాలి : దేవినేని ఉమా

గొల్లపూడి, జనవరి 22 : అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు చేసిన ఒక్క మంచి పని ఏదైనా ఉంటే చెప్పాలని సీఎం జగన్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. సోమవారం గొల్లపూడిలో జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడుతూ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ జగన్ కొత్త రాగం ఎత్తుకున్నాడని, వాస్తవానికి ఆయన వారికి చేసింది శూన్యమన్నారు. ప్రజలు మౌనం వహిస్తే దుర్మార్గులు రాజ్యమేలతారన్నారు. ఏపీ అభివృద్ధి చెందాలంటే తిరిగి చంద్రబాబు సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో కేశినేని శివనాథ్ (చిన్ని), నాగుల్ మీరా, వీరంకి గురుమూర్తి, వల్లూరు మధు, కన్నా వెంకటేశ్వరరావు, వాతపల్లి వెంకటేశ్వరరావు, నడకుదిటి నాగేశ్వరరావు, శేఖర్‌బాబు, సాధనాల వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఉక్కుపాదం సిగ్గుచేటు : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్ : జీతాల పెంపుదల కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం సిగ్గుచేటని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ అన్నారు. సోమవారం బందరులో ఆయన మాట్లాడుతూ, జీతాలు పెంచమంటే జైళ్లకు పంపడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు.అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తున్నా సీఎం జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం టీడీపీ పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపితేనే రాష్ట్రాభివృద్ధి : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తే కానీ రాష్ట్రం అభివృద్ధికి నోచుకోదని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల పాలనా కాలంలో ఆదాయ వనరులు పెరగలేదని, ఉద్యోగాలు కల్పించలేదన్నారు. నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేశారన్నారు. ఆర్టీసీ, విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా నలిగిపోతున్నారన్నారు. భూరక్షణ చట్టం అమలులోకి తీసుకురావడంతో ప్రజలు గందరగోళంలో ఉన్నారన్నారు.

బీసీల సాధికారిత టీడీపీకే సాధ్యం : వర్లకుమార్ రాజా

పామర్రు : రాష్ట్రంలో బీసీలకు సమాన న్యాయం, సాధికారిత కలిగించిన ఘనత ఒక్క టీడీపీకే దక్కుతుందని పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్లకుమార్‌రాజా అన్నారు. స్థానిక బాపూజీ పేట గౌడరామాలయం వద్ద సోమవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కుమార్‌రాజా మాట్లాడుతూ, బీసీల అభివృద్ధి, సంక్షేమం టీడపీకే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపాలన్నారు. తొలుత పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. రాష్ట్ర బీసీ విభాగపు కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులను పరిరక్షిద్దాం.. : దిల్లీరావు

కృష్ణలంక : బాలికల హక్కులను పరిరక్షించి బంగారు భవిష్యత్తును అందించడంతో పాటు లైంగిక వేధింపులను నివారించడం ప్రతి ఒక్కరి కర్తవ్య, బాధ్యత అని కలెక్టర్ దిల్లీరావు అన్నారు. ఈనెల 24న నిర్వహించనున్న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న హక్కులు, చట్టాలను సమర్థవంతంగా అమలుచేసినప్పుడే వారికి బంగారు భవిష్యత్తును అందించగలుగుతామన్నారు. బాలికలపై వేధింపులు, దోపిడీ, హింస వంటి సంఘటనలను గుర్తిస్తే చైల్డ్‌లైన్ 1098, పోలీస్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, వంటి ఫ్రీ నెంబర్‌లకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వైభవంగా రాములోరి కళ్యాణోత్సవాలు

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- పులకించిన పుర వీధులు



బందరు కోనేరు సెంటర్‌లో స్వామివారి కల్యాణోత్సవం, హాజరైన భక్తులు

మచిలీపట్నం టౌన్, జనవరి 22 : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ శ్రీరామ మందిరాలు, దేవాలయాల్లో అంగరంగ వైభవంగా రాములోరికి అర్చనలు నిర్వహించారు. కోనేరుసెంటర్‌లో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో చిట్టి కుమారి భక్త బృందంచే కీర్తనలు గానం చేశారు. విదుషిమణి పావని, మాధవి తదితరులు భగవద్గీత పారాయణ చేశారు. సాయి మల్లయ్య భజన సమాజం ఆధ్వర్యంలో మరకాని మంగపతిరావు, తుకారాం, జంగాల వేణు, శర్మ, వెంకటేశ్వరరావులు భద్రాద్రి రామదాసు కీర్తనలు గానం చేశారు. వివిధ దేవాలయాల నుంచి కాషాయ జెండాలతో వేలాది భక్తులు కోనేరుసెంటర్‌కు ఊరేగింపుగా తరలివచ్చారు. కోనేరుసెంటర్‌లో సీతారామ కళ్యాణం వైభవంగా జరిగింది. భక్తులకు శ్రీరామచంద్రుని క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు పంతం వెంకట గజేంద్ర తదితరులు పాల్గొన్నారు. కళాకారులు నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. ఊరంతా కాషాయ రంగు నిండిపోగా రామాలయాల్లో కళ్యాణోత్సవాలు జరిపారు. అన్నప్రసాద వినియోగం జరిగింది. పందిళ్లలో పానకం పంపిణీ చేశారు.

దుర్గగుడిలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం

వన్‌టౌన్ : అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ సందర్భంగా దేశవ్యాప్తంగా రామాలయాలలో అభిజిత్ లగ్న సమయాన విశేష పూజాదికాలు జరిగాయి. ఈ క్రమంలో విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శాస్త్రోక్తంగా శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీత, లక్ష్మణ, హనుమత్సమేత శ్రీరామచంద్రుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజాదికాలను సమర్పించారు. ముఖ్య అర్చకులు ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, పంచదార, నెయ్యి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం హారతులు సమర్పించి అర్చనా మూర్తులకు వివిధ ఉపచారాలు నిర్వహించారు. ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా శ్రీరామ నామ భజన, కీర్తనలను భక్తులు ఆలపించారు.





సీత, లక్ష్మణ సమేత శ్రీరామచంద్రుల ఉత్సవమూర్తులు, పాల్గొన్న భక్తులు

ప్రతి అర్జీకి తక్షణ పరిష్కారం చూపాలి

- స్పందనలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దిల్లీరావు, జేసీ

కృష్ణలంక, జనవరి 22 : స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై వుందని, సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో 106 అర్జీలను స్వీకరించడం జరిగిందని, అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకొంటున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలకు సంబంధించి అర్జీలకు ఆయా శాఖల అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డ్వామా పీడీ జె.సునీత, హౌసింగ్ పీడీ ఎం.రజనికుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.విద్యాసాగర్ తదితర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

మచిలీపట్నం (ఆంధ్రజ్యోతి) : స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణాజిల్లా జేసీ గీతాంజలి శర్మ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరంచారు. పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అధికారులు ప్రతి సోమవారం 10.30 గంటలకు రంచనుగా స్పందన కార్యక్రమానికి హాజరుకావాలని ఆమె సూచించారు. పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తాం..

మిచౌంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న ధాన్యాన్ని రైతులనుంచి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని జేసీ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం సోమవారం జరిగింది. కుప్పలపై ఉన్న ధాన్యం నూర్పిడి చేసే విధంగా రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. రంగుమారిన, తడిచిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ సూచనలను పాటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ధాన్యం బిల్లులను త్వరితగతిన విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు. జిల్లావ్యవసాయసలహా మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, పౌసరఫరాలసంస్థ జిల్లా మేనేజరు డి.రాజు, కవిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కనాటిన అధికారులు

కలెక్టరేట్ సుందరీకరణలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో వాణి మొక్కలు నాటారు. కలెక్టరేట్‌లో సత్యమేవ జయతే, ప్రభుత్వ చిహ్నం ఏర్పాటుచేసే ప్రాంతం వద్ద జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా కలెక్టరేట్ సుందరీకరణ పనులను పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.





బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

మేధోసంపత్తి హక్కులను పరిరక్షించుకోవాలి

వన్‌టౌన్, జనవరి 22: మేధోసంపత్తి హక్కులను పరిరక్షించుకోవాలని పుదుచ్చేరి లోని కారైకల్‌కు చెందిన డాక్టొరల్ అభ్యర్థి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మాజీ రీసెర్చి అసోసియేట్, ఆంధ్రా యూనివర్సిటీ డైరెక్టర్ నెట్టిమి సత్యసాయి శ్రీనివాస్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం జరిగిన మేధోసంపత్తిపై అవగాహన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. కళాశాల సెక్రటరీ పరుచూరి లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పతంజలి శాస్త్రి , ఈసీఈ విభాగాధిపతి ఏవీ కిరణ్మయి, కో- ఆర్డినేటర్ డాక్టర్ డి. కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కామకోటినగర్‌లో రాముల వారి ఊరేగింపు



బెజవాడ బార్ అసోసియేషన్‌లో



సత్యనారాయణపురం పురోహిత సంఘం ఆధ్వర్యంలో



శోభాయాత్రలో పాల్గొన్న బొండా ఉమా దంపతులు

భక్తిప్రపత్తులతో రామనామ సంకీర్తన

ఆలయాల్లో పూజాదికాలు, శోభాయాత్ర, ప్రసాదం పంపిణీ, అన్నదానం

వన్‌టౌన్, జనవరి 22: అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడి ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం వన్‌టౌన్‌లోని ఆలయాలలో పూజాదికాలు జరిగాయి. కామకోటినగర్‌లో వైదిక బృందం ఆధ్వర్యంలో రామనామ సంకీర్తన కార్యక్రమం జరిగింది. సీతారామచంద్రులు విగ్రహాలతో నగర సంకీర్తన నిర్వహించారు. పార్థసారధి వీధిలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి శంకరమఠం వీధి, జొన్నవిత్తుల వారి వీధి, హేమాద్రి వారి వీధుల మీదుగా ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది.

● కోమల విలాస్ సెంటర్‌లో శ్రీ రాముడి భక్తుడు కొరగంజి భాస్కరరావు ఆధ్వర్యంలో రామపూజ కార్యక్రమం జరిగింది. విప్పనూనెతో ఆఖండ దీపారాధన చేశారు. భక్తులకు లడ్డూలు, మైసూర్ పాకం, అరటిపండ్లు, జామకాయలు, సొంపాపిడి, వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

● కొత్తపేట శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం అధ్యక్షుడు రాంపిళ్ల గౌరీశంకర్ ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్ స్వామిజీ ఆశీస్సులతో రాముల వారి ఉత్సవ విగ్రహాలకు పూజాదికాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ సతీసమేతంగా పాల్గొన్నారు. సీనియర్ నాయకులు కిలారు దిలీప్, జనసేన నాయకుడు పోతిన మహేశ్, అడ్డూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెజవాడ 'బార్'లో ..

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు సీతారాముల చిత్రపటాన్ని పెట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ ఫ్లోర్‌లీడర్, న్యాయవాది నెల్లిబండ్ల బాలస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. న్యాయవాది మోటేపల్లి సత్యనారాయణ, న్యాయవాదులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, మహిళా సెక్రటరీ పి.జయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీరామ నగర సంకీర్తన

సత్యనారాయణపురం: సత్యనారాయణపురం పురోహిత సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీరామ నగర సంకీర్తన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీ మూర్తి పాల్గొన్నారు.

త్రిశక్తిపీఠంలో ఆకుపూజ

కృష్ణలంక: త్రిశక్తిపీఠంలో వీరాంజనేయ స్వామి వారికి అభిషేకం నిర్వహించి అనంతరం దశ సహస్ర నామాలతో (10వేల తమలపాకులతో) ఆకుపూజ చేశారు. సాయి సంకీర్తన భజన సమాజం నిర్వాహకులు ఎ.శ్రీనివాసరాజు భక్తి బృందంచే హనుమాన్ చాలీసాను మండలం (41) సార్లు పారాయణ చేసి శ్రీరామ నామాలతో సంకీర్తన నిర్వహించారు. రంగవల్లులతో శ్రీరామచంద్ర మూర్తిని చిత్రించి దీపోత్సవం నిర్వహించారు. భక్తులందరికీ పానకం, వడపప్పు, చలివిడి ప్రసాదంగా ఆలయ నిర్వాహకులు అందచేశారు. వేదపండితులు మండాది భానుమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి.

టీడీపీ ఆధ్వర్యంలో శోభాయాత్ర

అజిత్‌సింగ్‌నగర్, సత్యనారాయణపురం : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం శోభాయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో బొండా ఉమామహేశ్వరరావు ఆయన సతీమణి బొండా సుజాతలు స్వామి వారి రథానికి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐనాక్స్ థియేటర్ వద్ద ప్రారంభమైన శోభాయాత్ర సత్యనారాయణపురం, శివాజీకేఫ్ సెంటర్, బాబురావు మేడ సెంటర్ మీదుగా ముత్యాలంపాడులోని శ్రీ కోదండ రాముల వారి ఆలయం వద్ద ముగిసింది. బొండా ఉమా దంపతులు ఆలయంలో పూజలు చేశారు.

గవర్నర్‌పేట: లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా-నాగమానసాదేవి మందిరంలో బాబా భక్తులు రామ భజన-కీర్తనల కార్యక్రమం నిర్వహించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్లు అమర్చారు. శంఖనాదం, ఘంటానాదం చేసి హారతి, భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. సూర్యాస్తమయం తరువాత దీపాలు వెలిగించారు.

డైమండ్ వాకర్స్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

పాతరాజరాజేశ్వరి పేట: అయోధ్యలో శ్రీ బాల రాముడు విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం పురస్కరించుకుని డైమండ్ లోటస్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కేదారేశ్వరపేట, పెజ్జోనిపేట, పూర్ణానందంపేట, గాంధీనగర్, బీఆర్టీఎస్ తదితర ప్రాంతాల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు పల్లేటి శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

● స్థానిక పాతరాజరాజేశ్వరిపేటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఎల్ఈడీ స్క్రీన్‌లో వీక్షించారు. టీడీపీ సీనియర్ నాయకులు ధనేకుల వెంకట సుబ్బారావు అన్న దానం చేపట్టారు. నాయకులు ధనేకుల హరికృష్ణ, డి.మూర్తి, ఎం.మోహన్‌రావు పాల్గొన్నారు.

భవానీపురం: కబేళా ప్రాంతంలో రామరాజ్య నగర్‌కు చెందిన వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అరసపల్లి మాధవరావు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామనామ సప్తాహం, 2వేల మందికి అన్నదానం నిర్వహిం చారు. చెరువు సెంటర్, ఊర్మిళానగర్ కోదండ రామాలయాల వద్ద ప్రత్యేకపూజలు చేశారు. పానకం, వడపప్పు ప్రసాదాల పంపిణీతో పాటు అన్నదానాలు చేశారు. కొట్టేటి కోటయ్య వీధిలోని రామాలయం కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేటర్ షేక్ రెహమ్‌తున్నీసా చేతుల మీదుగా అన్న సంతర్పణ జరిగింది.

పాయకాపురం: హిందూ సమాజం సంఘం ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లో శోభాయాత్ర నిర్వహించి ప్రసాదాల పంపిణీ చేశారు.. సంఘం సభ్యులు శిఖాకొల్లి జటాధర్, దండూరి దుర్గాప్రసాద్, నాగరాజు, ఓట్ల మోహన్, అంజి పాల్గొన్నారు.

రామలింగేశ్వరనగర్: రామలింగేశ్వరనగర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. భక్తులు రామనామ స్మరణతో రామాయణాన్ని పఠించారు. మందిర అధ్యక్షుడు చక్రధారి దాస్ మాట్లాడుతూ అయోధ్యలో జరిగే మందిర కార్యక్రమం మరుపురాని ఘట్టమన్నారు. సాయంత్రం భక్తులు దీపాలతో రామ నామాన్ని, రామ బాణాన్ని వెలిగించారు.

కోదండ రామాలయంలో...

భారతీనగర్: గురునానక్ కాలనీ కోదండ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం శ్రీరామ కీర్తనలు పారాయణం చేశారు.

● కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనేయ దేవాలయంలో శ్రీరామ భక్త కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాముని ఉత్సవ విగ్రహాలకు పూజలు, సంకీర్తన కార్యక్రమాలు చేశారు. డి.వెంకటనాంచారయ్య, ఎం.సదాశివ రావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ధర్నాచౌక్: గాంధీనగర్‌లోని ఐనాక్స్ సెంటర్‌లో సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. టీడీపీ నేత నవనీతం సాంబశివరావు, కొలుసు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



రంగవల్లులతో చిత్రీకరించిన శ్రీరాముడి ప్రతిమ



డైమండ్ వాకర్స్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



ఇస్కాన్ మందిర ప్రాంగణంలో



గురునానక్ కాలనీ రామ మందిరంలో

త్వరితగతిన స్పందన అర్జీల పరిష్కారం: మేయర్



అర్జీలను పరిశీలిస్తున్న మేయర్

చిట్టినగర్, జనవరి 22: స్పందనలో వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్‌తోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా మేయర్, కమిషనర్‌లకు అందజేశారు. మొత్తం 22 అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ కె.వి. సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. పి.రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకరరావు, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ వెంకట లక్ష్మి, ఏడీహెచ్ శ్రీనివాస్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీడియో ఎడిటింగ్‌పై లయోలలో అవగాహన

భారతీనగర్: ఆంధ్రా లయోల కళాశాలలో విజువల్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్‌లో వీడియో ఎడిటింగ్ అంశంపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెడ్ ఆఫ్ వాల్స్ అండ్ ట్రెండ్స్ అధినేత అట్లూరి వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అట్లూరి వంశీకృష్ణ విద్యార్థులకు వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలను వివరించారు. రెవరెండ్ ఫాదర్ జి.రాయప్ప, హెచ్‌వోడీ డాక్టర్ జి.కార్తీక, ఎన్.శ్రీధర్, పి.లలిత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

60 మంది టీడీపీలో చేరిక

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 22 : పాయకాపురం ప్రాంతానికి చెందిన 60 మంది ముస్లిం మైనార్టీలు సోమవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేసింది టీడీపీ అని వివరించారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ముస్లిం మైనార్టీలకు సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఘంటా కృష్ణమోహన్, లబ్బా వైకుంఠం, పైడి శ్రీను పాల్గొన్నారు.

న్యూ రాజరాజేశ్వరిపేటలో బాబు ష్యూరిటీ

అజిత్‌సింగ్‌నగర్,జనవరి 22: స్థానిక 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలో సోమవారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు.

అయ్యదేవర జీవితం స్ఫూర్తిదాయకం

గవర్నర్‌పేట, జనవరి 22: బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమర యోధుడు అయ్యదేవర కాళేశ్వరరావు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అయ్యదేవర జయంతిని పురస్కరించుకుని సోమవారం ఇందిరాగాంధీ స్టేడియం సమీపంలోని ఆయన విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం జరిగింది. అయ్యదేవర విగ్రహం వద్ద విష్ణు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. విజయవాడ పురపాలక సంఘం చైర్మన్‌గా నగరానికి చేసిన సేవల్ని గుర్తు చేశారు. వివిధ సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగం పొందిన పాఠకురాలికి సత్కారం



సత్యనారాయణపురం, జనవరి 22 : స్థానిక గ్రంథాలయంలో రిఫరెన్స్ బుక్స్‌ను అభ్యసించి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించిన గ్రంథాలయ పాఠకురాలు బి. సోనియాను చిత్తరంజన్ గ్రేడ్-2 గ్రంథాలయ అధికారి పి. సంపత్‌కుమార్ సోమవారం ఆయన శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రంథాలయ అధికారి, పాఠకులు పాల్గొన్నారు.

నేడే విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, జనవరి 22: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం చుట్టుగుంట ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు చుట్టుగుంట సిగ్నల్ ఏరియా, పాత పోలీసు స్టేషన్ రోడ్డు, మాసల వీరన్న వీధి, మారుతీనగర్ కొండవైపు, కాకతీయ కాలేజి రోడ్డు, మసీదు వీధి, జమీందారు వీధి, మాచవరం కొండ ప్రాంతం, సుంకర వారి వీధి, లలితమ్మ వీధి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. **రామలింగేశ్వర నగర్:** న్యూబ్రిడ్జి సెక్షన్, రామలింగేశ్వరనగర్ విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ రామలింగేశ్వర నగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వి.సుధాకర్ తెలిపారు. రామలింగేశ్వరనగర్ లోని రఘురోడ్, అయ్యప్ప రోడ్, వీఎం రంగా రోడ్డు, ఆళ్ల చల్లారావు రోడ్డు, ఎర్రపోతుల వారి వీధి, సాయిరాం కట్‌పీసెస్ రోడ్, నీలవేణీ రోడ్, కృష్ణవేణి రోడ్డు, ధారా సుధాకర్ శాస్త్రి వీధి, గాయత్రిరోడ్, సాయి స్ట్రీట్, భవానీ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

కాచి చల్లార్చిన నీటినే తాగండి

వన్‌టౌన్, జనవరి 22: కాచి చల్లార్చిన నీటినే తాగాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), డివిజన్‌లోని ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులిచింత ప్రాజెక్టు నుంచి కృష్ణానదికి నీరు వస్తుందని ఈ నీటినే శుద్ధి చేసి నగర ప్రజల వినియోగానికి సరఫరా చేస్తున్నారని చెప్పారు. అయితే కృష్ణానదికి వచ్చే నీటిలో అల్గే అధికంగా ఉండడం వలన నీటి శుద్ధి కార్యక్రమం ఆలస్యమవు తుందని దీంతో పాటు తక్కువ నీటిని సరఫరా చేస్తున్నారని చెప్పారు. సాధ్య మైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచిస్తున్నట్లు తెలిపారు.


హెడ్ వాటర్ వర్క్స్ పరిశీలన

విద్యాధరపురంలోని హెడ్ వాటర్ వర్క్స్‌లోని నీటి వడపోత ట్యాంకులను 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీరావులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ బూసిరెడ్డితో కలిసి వాటర్ వర్క్స్‌లో జరుగుతున్న వడపోత కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. కాచి చల్లార్చిన నీటిని వినియోగించడంతో పాటు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం

కృష్ణలంక, జనవరి 22 : కృష్ణలంక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులిద్దరికి ఫీజుల నిమిత్తం రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కృష్ణలంక పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థలోని వాకింగ్ ట్రాక్ వద్ద కోట యేసు కుమారి, లోహిత్‌సాయి అను స్కూల్ విద్యార్థులకు సంఘ సభ్యులు పై మొత్తాన్ని అందచేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోరం లక్ష్మయ్య, సభ్యులు అందుగల రాజ్‌కుమార్, సయ్యపరెడ్డి రాజా, నిమ్మల దుర్గారావు, కేశనం భావన్నారాయణ, కల్పన ప్రింట్స్ వాసు, కృష్ణ పాల్గొన్నారు.

సహజ బొగ్గు గనుల నిర్వహణ-ఉత్పాదనపై కార్యక్రమం



మాట్లాడుతున్న మల్లిఖార్జున ప్రసాద్

మొగల్రాజపురం, జనవరి 22: నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిద్వారా ప్రపంచంలో ముందంజలో ఉన్నామని కోల్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పోలవరపు మల్లిఖార్జున ప్రసాద్ అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల వెబినార్ హాలులో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో సహజ బొగ్గు గనుల నిర్వహణ, ఉత్పాదన శక్తి అనే అంశంపై సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ రాజేష్ జంపాలతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాబోయే 200సంవత్సరాలకు సరిపడా బొగ్గువనరులు భారత్ వద్ద ఉన్నాయన్నారు. డీన్ రాజేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో చీరాలకు చెందిన మల్లిఖార్జున ప్రసాద్ జార్ఖండ్‌లో కోల్ ఇండియాలో సీఎండీగా బాధ్యతలు నిర్వహిస్తుండటం విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఆర్. సాంబిరెడ్డి తదితరులు మల్లిఖార్జున ప్రసాద్‌ను సత్కరించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీ అంత చెత్త ప్రభుత్వం మరేదీ లేదు


● జనసేన పశ్చిమ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్



సమస్యలు తెలుసుకుంటున్న పోతిన మహేశ్

పాతరాజరాజేశ్వరి పేట, జనవరి 22 : వైసీపీ అంత చెత్త ప్రభుత్వం మరేదీ లేదని, ఈ ప్రభుత్వం ప్రజలకి అనుకూలంగా లేని ప్రభుత్వం అని ప్రజలందరూ బాహాటంగా చెబుతున్నారని జనసేన పశ్చిమ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్ విమర్శించారు. ఇంటింటికి రాబోయే మన జనసేన టీడీపీ ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 55వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సోమి గోవింద్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్‌లోని కంసాలిపేట ప్రాంతంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పోతిన ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన టీడీపీ ప్రభుత్వం వస్తుందని, రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతుందని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని, మహిళలకు రక్షణ ఏర్పడుతుందని అన్నారు. నాయకులు పల్లెంటి ఆది, సోమి మహేష్, డాక్టర్ శ్రీనివాసరావు, సలామ్, వడ్డాది రామకృష్ణ, సంఘం రెడ్డిరాజు, శ్రీరామ్, శ్రీను, రమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



మౌలానా అజాద్ ఉర్దూ స్కూల్‌లో విద్యార్థినికి ట్యాబ్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అప్పాజీ రావు

వన్‌టౌన్, జనవరి 22 : మౌలానా అజాద్ ఉర్దూ స్కూల్‌లో సోమవారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవ్ అప్పాజీరావు, ప్రధానో పాధ్యాయుడు శివనాగ లింగేశ్వర రావు, స్థానిక నాయకులు సోల్జర్, రెహమాన్, మోను, ఇమామ్, వాహిద్ పాల్గొన్నారు.

● విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సోమవారం 8వ తరగతి విద్యార్థులకు కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య మాట్లాడుతూ ట్యాబ్‌లతో విద్యార్థులు కొత్త పద్ధతిలో విద్యను నేర్చుకోవాలని చెప్పారు. తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు హారిక మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను తమకు విద్యాబోధన చేసే వస్తువులుగా పరిగణించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయుడు సీహెచ్ వీఎస్‌వి ప్రసాద్, డీవీ మురళీప్రసాద్, వి.రాజ్యలక్ష్మి, ఆర్‌బి ఉదయ్‌కిరణ్, స్థానిక నాయకుడు ఏలూరు వెంకన్న పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: స్థానిక ఏకేటీపీ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీ మూర్తి సోమవారం బైజూస్ ట్యాబ్‌లు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాల్గో విడత ఆసరా రూ. 32.12 కోట్లు జమ

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 22 : నాల్గవ విడత ఆసరా ద్వారా సెంట్రల్‌లో 3,518 డ్వాక్రా గ్రూపుల సభ్యులకు రూ. 32.12 కోట్లు జమ చేసినట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. సోమవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కొండంత అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

ఫిబ్రవరి మూడోవారంలో ఎన్నికల షెడ్యూలు!?

- ముమ్మరమవుతున్న కసరత్తు
- ఓటర్ల తుది జాబితా విడుదల
- నెలాఖరులోపు బదిలీల ప్రక్రియ పూర్తి

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వచ్చే నెల మూడోవారంలో వెలువడే అవకాశముందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. గత ఎన్నికల షెడ్యూలు 2019 మార్చి 10వ తేదీన వెలువడింది. ఈసారి అంతకంటే కొన్ని రోజుల ముందే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశముంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. సోమవారం తుది ఓటర్ల జాబితా కూడా విడుదలైంది. ఇక... జిల్లా, రాష్ట్ర స్థాయిలో మూడేళ్లకంటే ఎక్కువకాలం ఒకేచోట పని చేస్తున్న అధికారులను బదిలీ చేయడానికి సంబంధించి గడువు కూడా విధించారు. జిల్లాల్లో ఈనెల 25వ తేదీలోపే అలాంటి అధికారులను బదిలీ చేయనున్నారు. ఇక... మూడేళ్లు దాటిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా స్థాయి కీలక అధికారులను ఈనెలాఖరుకు బదిలీ చేస్తారు. రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ ఆఫీసర్ల జాబితా తయారీ ప్రక్రియ మంగళవారం మొదలవుతోంది. ఈ జాబితాను సిద్ధం చేసి... కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఇక... ఇంకు నుంచి ఈవీఎంల దాకా పోలింగ్ ప్రక్రియకు 17 రకాల వస్తువులు అవసరమవుతాయి. వాటి సేకరణకు కూడా రంగం సిద్ధమవుతోంది. ఇలా అధికారుల వైపు నుంచి ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు కనీసం 3 వారాల సమయం అవసరం. బీజేపీకి సంబంధించి... అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠతో ఒక కీలక ఘట్టం ముగిసింది. పార్లమెంటు సమావేశాలు ఫిబ్రవరి 9వ తేదీతో ముగుస్తాయి. 1వ తేదీన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగే ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరో 3 రాష్ట్రాలూ 'బడ్జెట్' ప్రక్రియను దాదాపు ఇదే సమయంలో ముగించనున్నాయి. అటు అధికారులు, ఇటు ప్రభుత్వ స్థాయిలో ఏర్పాట్లన్నీ పూర్తి చేసిన తర్వాత... ఫిబ్రవరి మూడో వారంలో ఎన్నికల షెడ్యూలును వెలువరించే అవకాశముంది. గతంలో దేశవ్యాప్తంగా 7 విడతల్లో పోలింగ్ జరిగింది. సహజంగా... అక్షరక్రమం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో తొలివిడతలోనే పోలింగ్ జరుగుతుంది.

తాడేపల్లి చేరిన ఎచ్చెర్ల పంచాయతీ

- ఇంతకాలం ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కు టికెట్ ఇవ్వొద్దని స్థానికంగా ఊరేగింపులు
- ఇప్పుడు ఏకంగా సలహాదారు సజ్జల ఘెరావ్

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వైసీపీ వర్గపోరు తాడేపల్లిని తాకింది. సిటింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కు మరో చాన్స్ ఇవ్వొద్దని అసమ్మతి నేతలు అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎచ్చెర్ల నుంచి ఆయనకు టికెట్ ఇవ్వొద్దని కోరేందుకు ఎచ్చెర్లకు చెందిన పలువురు వైసీపీ నేతలు సీఎం క్యాంపు కార్యాలయం వద్దకు సోమవారంనాడు చేరుకున్నారు. సీఎంవో వద్ద ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కారు రావడాన్ని గమనించి.. దానికి అడ్డుపడ్డారు. ఆయన్ను కాసేపు ఘెరావ్ చేశారు. కిరణ్‌కు టికెట్ ఇస్తే ఓడిస్తామని సజ్జలను హెచ్చరించారు.

మహిళలే నిర్ణేతలు

- రాష్ట్రంలో వారి ఓట్లే అత్యధికం
- ఓటర్ల నమోదులో టాప్ కర్నూలు
- అత్యల్పంగా అల్లూరి జిల్లాలో నమోదు
- నామినేషన్ వరకు ఓటు నమోదుకు చాన్స్
- సీఈవో ముఖేష్‌కుమార్ మీనా వెల్లడి

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ఓటర్లే ప్రభుత్వాన్ని నిర్ణయించనున్నారు. వారి మద్దతు ఏ రాజకీయ పార్టీకి ఉంటుందో ఆ పార్టీనే రాష్ట్రంలో అధికారం చేపట్టనుంది. అంతేకాదు, పార్లమెంట్ స్థానాల్లోనూ అధిక స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన 'ప్రత్యేక సమగ్ర సవరణ-2024' ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేష్ కుమార్ మీనా సోమవారం విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం 4,08,07,256 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళా ఓటర్లు 2,07,29,452 మంది కాగా, పురుషుల ఓట్లు 2,00,74,322, ట్రాన్స్ జెండర్ల ఓట్లు 3,482 ఉన్నాయి.

24 జిల్లాల్లో మగువలదే పైచేయి

రాష్ట్రంలోని 24 జిల్లాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 9,92,397 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3,83,640 మంది ఓటర్లు ఉన్నారు.

- రాష్ట్రంలోని 2 జిల్లాల్లో మాత్రమే పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో పురుష ఓటర్లు మహిళా ఓటర్ల కంటే అధికంగా ఉన్నారు.
- 18, 19 ఏళ్ల యువ ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో 2,88,155 ఓటర్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 8,13,544కు పెరిగింది.
- ముసాయిదా ఓటర్ల జాబితాలో రాష్ట్రంలో జనాభా నిష్పత్తి ప్రకారం 729 మంది, లింగనిష్పత్తి ప్రకారం1031 మంది ఓటర్లు ఉన్నారు.
- తుది ఓటర్ల జాబితాలో ప్రతి వెయ్యి మంది పురుషులకు 1,036 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ప్రతి వెయ్యి మంది జనాభాకు(ఈపీ రేషియే ప్రకారం) 722 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో 729గా ఉన్న ఈపీ రేషియో తుది జాబితాలో స్వల్పంగా తగ్గింది.

తొలగింపు లెక్క

- ముసాయిదా జాబితా నుంచి 16,52,422 ఓట్లు తొలగించారు.
- వీరిలో మృతుల ఓట్లు 5,84,810
- వలస ఓట్లు 8,47,421
- రిపీటెడ్ ఓట్లు 2,20,191

ట్రాన్స్‌జెండర్ ఓటర్లు కర్నూలులో అత్యధికం

ట్రాన్స్‌జెండర్ ఓటర్లు రాష్ట్ర వ్యాప్తంగా 3482 మంది ఉండగా.. అత్యధికంగా కర్నూలు జిల్లాలో 312 మంది ఉన్నారు. కోనసీమ జిల్లాల్లో అత్యల్పంగా 17 మంది ఉన్నారు.

గతం కన్నా తగ్గిన సర్వీస్ ఓటర్లు

రాష్ట్రంలో సర్వీసు ఓటర్లు 67,434 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్ల నమోదులో శ్రీకాకుళం మొదటి స్థానంలో ఉంది. ఈ జిల్లాలో 16,100 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా 283 మంది అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్నారు.

ముసాయిదాతో పోల్చితే..

- 2024 ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి 16,52,422 మంది ఓటర్లను తొలగించారు. వీరిలో మృతి చెందిన ఓటర్ల సంఖ్య 5,84,810, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఓటర్లు 8,47,421, పునరావృతమైన ఓటర్ల సంఖ్య 2,20,191గా ఉంది. అంటే ముసాయిదా ఓటర్ల జాబితాలో కన్నా తుది ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య 5,85530కు పెరిగింది.
- ముసాయిదా ఓటర్ల జాబితాలో పురుషులు 1,98,31,791 ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య 2,00,74,322కి చేరింది.
- మహిళా ఓటర్లు 2,03,85,851 ఉండగా ఇప్పుడు 2,07,29,452కి చేరింది.
- ముసాయిదా జాబితాలో ట్రాన్స్ జెండర్ల ఓట్లు 3,808 ఉండగా, ఇప్పుడు 3,482కి చేరింది.
- తుది జాబితాలో ట్రాన్స్‌జెండర్ల ఓట్ల సంఖ్య తగ్గింది. అదేవిధంగా సర్వీసు ఓటర్ల సంఖ్య కూడా తగ్గింది. తుది జాబితాలో వీరి ఓట్లు 67,434గా ఉన్నాయి.
- ముసాయిదా ఓటర్ల జాబితాలో 6,975 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉండగా వారి సంఖ్య 7603కి చేరింది.
- ముసాయిదా జాబితా విడుదలయ్యాక కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 22,38,952
- 18-19 సంవత్సరాల మధ్య ఉన్న ఓటర్ల సంఖ్య 8,13,544
- యువ ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది.
- దివ్యాంగ ఓటర్ల సంఖ్య 4,87,594
- ఈపీ రేషియో ముసాయిదా ఓటర్ల జాబితా కన్నా 7 శాతం తగ్గింది.
- రాష్ట్ర వ్యాప్తంగా 46,165 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు.

కర్నూలు టాప్

- తుది ఓటర్ల జాబితా ప్రకారం.. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 20,16,396 మంది ఓటర్లున్నారు.
- 19,96,637 మంది ఓటర్లతో అనంతపురం ద్వితీయ స్థానంలో ఉంది.
- అత్యధిక ఓటర్ల జాబితాలో 19,46,224 మందితో విశాఖపట్నం జిల్లా మూడో స్థానంలో నిలిచింది.
- అత్యల్ప స్థాయిలో ఓటర్లు ఉన్న జిల్లాగా చివరి స్థానంలో.. అల్లూరి సీతారామరాజు జిల్లా నిలిచింది. ఈ జిల్లాలో 7,61,538 మంది ఓటర్లు ఉన్నారు.

రాష్ట్రంలో పెరిగిన ఓటర్లు

2019 సాధారణ ఎన్నికల నాటికి రాష్ట్రంలో 3,94,05,967 మంది ఉండగా, 2020 ఫైనల్ ఎస్ఎస్ఆర్‌లో ఆ సంఖ్య 4,00,02,782 కోట్లకు చేరింది. ఆ తర్వాత 2021 ఎన్నికల సంఘం ప్రకటించిన తుది జాబితాలో 4,05,08,222 కోట్లకు చేరింది. 2022 ఫైనల్ ఎస్ఎస్ఆర్‌లో 4,07,36279 కోట్లకు చేరింది. 2023 తుది ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య 3,9984868 కోట్లకు చేరింది. 2024 ముసాయిదా ఓటర్ల జాబితాలో 4,02,21,450కి ఓటర్ల సంఖ్య చేరింది. తాజాగా ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా-2024లో ఆ సంఖ్య 4,08,07256గా ఉంది.

జిల్లా పేరు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్ల
శ్రీకాకుళం	9,37,988	9,37,883	139	18,76,010
విజయనగరం	7,65,620	7,80,818	83	15,46,521
పార్వతీపురం మన్యం	3,80,827	3,96,869	68	7,77,764
అల్లూరి సీతారామరాజు	3,66,640	3,94,861	37	7,61,538
విశాఖపట్నం	9,63,538	9,82,574	112	19,46,224
అనకాపల్లి	6,23,840	6,53,634	38	12,77,512
కాకినాడ	7,88,868	8,10,810	179	15,99,857
బీఆర్అంబేద్కర్ కోనసీమ	7,50,857	7,60,427	17	15,11,301
తూర్పు గోదావరి	7,85,802	8,20,568	105	16,06,475
పశ్చిమ గోదావరి	7,17,777	7,44,338	74	14,62,189
ఏలూరు	7,94,549	8,30,415	129	16,25,093
కృష్ణా	7,37,936	7,80,825	65	15,18,826
ఎన్టీఆర్	8,17,837	8,57,394	150	16,75,381
గుంటూరు	8,56,985	9,13,929	191	17,71,105
బాపట్ల	6,27,171	6,53,152	73	12,80,396
పల్నాడు	8,38,451	8,75,480	196	17,14,127
ప్రకాశం	9,03,504	9,02,919	98	18,06,521
నెల్లూరు	9,35,195	9,73,089	214	19,08,498
కర్నూలు	9,96,446	10,19,638	312	20,16,396
నంద్యాల	6,76,176	6,98,459	262	13,74,897
అనంతపురం	9,90,229	10,06,163	245	19,96,637
శ్రీ సత్యసాయి	6,95,767	6,97,162	63	13,92,992
వైఎస్సార్ కడప	7,93,421	8,25,242	224	16,18,887
అన్నమయ్య	6,90,591	7,13,366	136	14,04,093
చిత్తూరు	7,69,193	7,88,814	84	15,58,091
తిరుపతి	8,69,114	9,10,623	188	17,79,925
మొత్తం ఓటర్లు	2,00,74,322	2,07,29,452	3,482	4,08,07,256

నకిలీ ఫాం-7లపై 70 కేసులు

- ఎమ్మెల్యే ద్వారంపూడి ఇలాకాలో అత్యధికంగా 23 ఎఫ్ఐఆర్‌లు
- వైసీపీ నేత ఆమంచి ఇన్‌చార్జిగా ఉన్న పర్చూరులో 16 కేసులు నమోదు
- నకిలీల వెనుక ఎవరున్నా వదలం: సీఈవో

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ ఫాం-7 దరఖాస్తులపై 70 కేసులు నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలను బట్టి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ సిటీ నియోజకవర్గంలో అత్యధికంగా 23 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. బాపట్ల జిల్లాలోని పర్చూరు నియోజకవర్గం(వైసీపీ నేత ఆమంచి కృష్ణమోహన్ ఇన్‌చార్జి)లో 16 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఇక, నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు, కొవ్వూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో 8 ఎఫ్ఐఆర్‌లు, నంద్యాల జిల్లాలోని బనగానపల్లి నియోజకవర్గంలో 1, అనంతపురం జిల్లా అనంతపురం అర్బన్, రాప్తాడులో 4, అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట నియోజకవర్గంలో 3, అన్నమయ్య జిల్లా రాజంపేటలో 2, శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో 2, తిరుపతి జిల్లాలో చంద్రగిరిలో 10, గుంటూరు వెస్ట్ నియోజకవర్గంలో 1 కేసు నమోదయ్యాయి. ఇప్పటికే కొన్ని కేసుల్లో చార్జిషీట్లు ఫైల్ చేశారని, ఇంకొన్నింటిపై చేయాల్సి ఉందన్నారు. వీటి వెనుక ఎవరున్నారో కూడా లోతైన విచారణ చేసి చర్యలు చేపడతామని తెలిపారు. ఎపిక్ కార్డుల వ్యవహారంలో ఇప్పటికే ఒక ఐఏఎస్ అధికారి సహా ముగ్గురిని సస్పెండ్ చేశామన్నారు. కాగా, మంగళవారం నుంచి కాలేజీలు, యూనివర్సిటీల్లో కొత్త ఓటర్ల నమోదు కోసం ప్రత్నిస్తామన్నారు. ఏపీలో జీరో, జంక్ ఓటర్లు ఉన్నారని వాటిని 98 శాతం మేర సరి చేశామన్నారు. కొన్ని అంశాల్లో సాంకేతిక కారణాల వల్ల పూర్తిస్థాయిలో సవరణ చేయలేదని తెలిపారు. 10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న 1.51 లక్షల ఇళ్లను తనిఖీ చేసినట్టు చెప్పారు. ఇంకా 2 శాతం మేర సరిదిద్దాల్సి ఉందన్నారు. 14 లక్షల ఓటర్ల గురించి రాజకీయ పార్టీలు ఫిర్యాదులు ఇచ్చాయని 5.6 లక్షల ఓటర్లు అర్హులు కారని తేల్చి తొలగించామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఫిర్యాదులు అభ్యంతరాలపై ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. తుది జాబితాను అన్ని పంచాయతీకార్యాలయాల్లోను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. తుది ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. గత ఏడాది అక్టోబరు 27న విడుదలైన ముసాయిదా జాబితాపై విమర్శలు వెల్లువెత్తాయి. జీరో డోర్ నెంబర్లతో ఓట్లు, డూప్లికేటు ఓట్లపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని తుది ఓటర్ల జాబితాల్లో మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నామని మీనా వివరించారు.

జిల్లాల్లో పరిస్థితి ఇదీ

- దేశంలోనే సర్వీస్ ఓటర్లు ఎక్కువగా ఉండే టాప్-20 జిల్లాల్లో శ్రీకాకుళం జిల్లాకు గుర్తింపు లభించింది. ఈ జిల్లాలోని మొత్తం ఎనిమిది నియోజకవర్గాల్లో 16,100 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు.
- నెల్లూరు జిల్లాలో మొత్తం 19,08,498 మంది ఓటర్లు ఉండగా పురుషుల కన్నా మహిళా ఓటర్లు 37,999 మంది అధికంగా ఉన్నారు.
- తిరుపతి జిల్లాలోనూ పురుషుల కంటే 42,324 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.
- బాపట్ల జిల్లాలో ముసాయిదా జాబితాతో పోలిస్తే తుది జాబితాలో 1,316 ఓట్లు తగ్గాయి. ముఖ్యంగా పర్చూరులోనే ఈ తేడా కనిపించడంతో విపక్షం టీడీపీ అనుమానాలను వ్యక్తం చేస్తోంది.
- గుంటూరులోని అన్ని నియోజకవర్గాల్లో మహిళ ఓటర్లదే పైచేయిగా ఉండడం విశేషం.
- అనకాపల్లి జిల్లాలోని 6 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 12,73,591 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 33,457 మంది అధికంగా ఉన్నారు.

నెల్లూరులో తగ్గిన ఓటర్లు

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ముసాయిదా ఓటర్ల జాబితాలో కన్నా సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో 25 జిల్లాల్లో ఓటర్ల సంఖ్య పెరిగింది. నెల్లూరు జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా కన్నా స్వల్పంగా ఓటర్ల సంఖ్య తగ్గింది.

'తప్పుడు' అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఎన్నికల సంఘానికి వర్ల రామయ్య విజ్ఞప్తి

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఓటర్ల నమోదులో తప్పుడు విధానాలు అవలంబించిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం అమరావతి సచివాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల తుది జాబితాపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్న, తప్పుడు విధానాలు అవలంబిస్తున్న ఎన్నికల అధికారులపై వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. డూప్లికేట్ ఓట్లకు అవకాశం లేకుండా, స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న చోట, లేదా ఎక్కడ నివసిస్తున్నారో అక్కడే వారికి ఓటు ఉండాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. నకిలీ ఓట్లుగా టీడీపీ అభ్యంతరం తెలిపిన 10లక్షల ఓట్లలో 80% నిజమైన ఓట్లుగా అధికారులు గుర్తించారని, అందువల్ల ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో బూత్‌లు పెంచాలని సీపీఎం ప్రతినిధులు కోరగా, బూత్‌లు దూరంగా ఉన్నచోట ఓటర్లకు రవాణా సౌకర్యం కల్పిస్తామని సీఈవో చెప్పారు.

గుడికి వెళ్లడానికీ అనుమతి కావాలా?

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆగ్రహం.. విశాఖలో ధర్నా



విశాఖపట్నంలో గాంధీ విగ్రహం వద్ద నిరసనకు దిగిన షర్మిల, రఘువీరారెడ్డి, కేవీపీ రామచంద్రరావు, జేడీ శీలం, కొప్పుల రాజు, తదితరులు

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గుడికి వెళ్లడానికి కూడా దేశంలో అనుమతి కావాలా అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ, వీహెచ్‌పీ వాళ్లు తప్ప మరొకరు గుళ్లకు వెళ్లే అవకాశం లేదా అని నిలదీశారు. దేశంలో బీజేపీ నేతృత్వంలో అడుగడుగునా నిరంకుశ పాలన సాగుతోందన్నారు. దానికి రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ యాత్ర'పై జరిగిన దాడే నిదర్శనమని చెప్పారు. అసోంలో రాహుల్ యాత్రపై బీజేపీ దాడిని ఖండిస్తూ సోమవారం సాయంత్రం ఆమె ఇక్కడి జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాహుల్ పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుండడంతో తట్టుకోలేక బీజేపీ దాడులకు పాల్పడుతోందన్నారు. అసోంలో బీజేపీ అధికారంలో ఉందని, శాంతియుతంగా సాగిస్తున్న యాత్రపై దాడులకు పాల్పడడాన్ని ప్రజాస్వామ్యం అంటారా? అని ప్రశ్నించారు. నీచమైన పాలన సాగిస్తుంటే అది ప్రజాస్వామ్యం ఎలా అవుతుందన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతోందని, బీజేపీ దురాగతాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రాహుల్‌కు అసోం సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. షర్మిల సహా పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్, నాయకులు పళ్లంరాజు, కొప్పుల రాజు, రఘువీరారెడ్డి, కేవీపీ, గిడుగు రుద్రరాజు, రాకేశ్‌రెడ్డి తదితరులు గాంధీ విగ్రహం వద్ద కూర్చుని నిరసన తెలిపారు.

షర్మిల జిల్లాల టూర్ ఖరారు

- నేడు ఇచ్ఛాపురంలో మొదలు.. 31న ఇడుపులపాయలో ముగింపు
- రేపటి నుంచి అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తనదైన ముద్ర వేసుకుని, కాంగ్రెస్ పార్టీలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న వైఎస్ రాజశేఖరరెడ్డికి నిజమైన వారసురాలిగా జనంలోకి బలంగా చొచ్చుకు వెళ్లాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు, పీసీసీ అధ్యక్షురాలిగా తనదైన ముద్ర వేసేందుకు ఆమె తన తొమ్మిది రోజుల రాష్ట్రవ్యాప్త పర్యటనను మంగళవారం నుంచి మొదలు పెడుతున్నారు. మంగళవారం నుంచి రెండు రోజులపాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో, 25 నుంచి రెండు రోజులపాటు ఉభయగోదావరి, ఎన్టీఆర్ జిల్లా, 27నుంచి కృష్ణా నుంచి నెల్లూరు వరకూ ఆమె పర్యటిస్తారు. 29న తిరుపతిలో మొదలు పెట్టి మూడు రోజులపాటు రాయలసీమలో పర్యటించే షర్మిల 31న ఇడుపులపాయతో తన తొలి పర్యటనను ముగిస్తారు. ఈ పర్యటనల్లో భాగంగా ఆయా జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ నేతలతో ఆమె సమావేశమై సమీక్షలు నిర్వహిస్తారు. బుధవారం నుంచి అభ్యర్థుల నుంచి దరఖాస్తులనూ స్వీకరిస్తారు. జిల్లాల పర్యటనలు పూర్తి చేసుకొని వచ్చే నెల నుంచి జనంలోకి వెళ్లాలని పీసీసీ అధ్యక్షురాలు నిర్ణయించారు.

జైలులో క్షీణించిన శ్రీనివాస్ ఆరోగ్యం!

- ఆస్పత్రిలో చేర్పించిన అధికారులు

ఎం.వి.పి.కాలనీ (విశాఖపట్నం), జనవరి 22: కోడికత్తి కేసులో ఐదేళ్లుగా రిమాండ్ ఖైదీగా మగ్గుతూ.. విశాఖ జైలులో నిరసన దీక్ష చేపట్టిన జనపల్లి శ్రీనివాస్ ఆరోగ్యం క్షీణించినట్టు తెలిసింది. తనను బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 18న జైలులో దీక్ష చేపట్టిన శ్రీను దాన్ని కొనసాగిస్తున్నాడు. అయితే విజయవాడలో తల్లి, సోదరుడు దీక్ష విరమించిన నేపథ్యంలో.. శ్రీనివాస్ కూడా తన దీక్షను విరమించినట్టు జైలు అధికారులు సోమవారం ప్రకటించారు. శ్రీను తరఫు న్యాయవాది మాత్రం ఆయన దీక్ష కొనసాగిస్తున్నట్టు తనకు చెప్పాడని పేర్కొన్నారు. ఒకపక్క శ్రీనివాస్ ఆరోగ్యంగానే ఉన్నాడని జైలు అధికారులు చెబుతుండగా.. ఏమాత్రం బాగోలేదని, తోటి ఖైదీల సాయంతో నడవాల్సి వస్తోందని విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక (విదసం) సభ్యులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాస్ ఈనెల 18న దీక్షకు ఉపక్రమించాడు. కారాగారంలో ఇచ్చిన ఆహారాన్ని తీసుకోవడం మానేశాడు. ఈ క్రమంలో బాగా నీరసించడంతో రెండు రోజులు ఆస్పత్రిలో ఉంచి.. ఆ తర్వాత బ్యారక్‌కు పంపించారు. ఆదివారం బాగా నీరసించి వాంతులు చేసుకోవడంతో తిరిగి కారాగారంలోని ఆస్పత్రికి తరలించారు. సోమవారం విదసం సభ్యులు ఒక న్యాయవాదిని తీసుకుని లీగల్ ఇంటర్వ్యూ కోసం కారాగారానికి వెళ్లారు. ఆ సమయంలో శ్రీనివాస్‌ను ఇద్దరు ఖైదీలు చెరోపక్క పట్టుకుని తీసుకువచ్చారని, ఆయన తీవ్ర అనారోగ్యంతో ఉన్నాడని, అలాగే దీక్ష కొనసాగిస్తున్నానని చెప్పాడని ఆ న్యాయవాది విదసం కన్వీనర్ డాక్టర్ వెంకటరావుకు చెప్పారు. దీంతో జైలులో శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తాము భావిస్తున్నామని వెంకటరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా, శ్రీనివాస్ ఆరోగ్యం బాగానే ఉందని, కొద్దిపాటి నీరసం వల్లే ఆస్పత్రిలో ఉంచామని కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి కిశోర్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం శ్రీను ఎలాంటి దీక్ష చేయడం లేదని చెప్పారు.

నేడు కోడికత్తి శ్రీను బెయిల్ పిటిషన్ విచారణ

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కోడికత్తితో దాడి కేసులో బెయిల్ మంజూరు చేయాలంటూ నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరపాలని ఆయన తరఫు న్యాయవాదులు సోమవారం హైకోర్టును అభ్యర్థించారు. అందుకు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం అంగీకరించింది. వ్యాజ్యం పై మంగళవారం విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

ప్రభుత్వ జీవో సుప్రీం తీర్పునకు విరుద్ధం

- 'కేసుల ఉపసంహరణ'ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పేరును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా మార్చిన సందర్భంగా చెలరేగిన అల్లర్లకు సంబంధించి పోలీసులు వందలాది మంది నిందితులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలంటూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ప్రభుత్వ ఉత్తర్వులు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉన్నాయంటూ కోనసీమ జిల్లా సాధన సమితి కన్వీనర్ జంగా బాబూరావు ఈ పిల్ దాఖలు చేశారు. రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. జిల్లాకు అంబేడ్కర్ పేరును తొలగించాలని డిమండ్ చేస్తూ వేలాదిమంది రోడ్ల మీదకు వచ్చి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై దాడులు చేశారు. ఈ ఘటనలో పోలీసులు వందల మందిపై కేసులు పెట్టి అరెస్ట్ చేశారు. 307 వంటి కీలక సెక్షన్ల కింద కూడా కేసు నమోదు చేశారు. ఈ కేసుల ఉపసంహరణకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనాపరమైన నిర్ణయం తీసుకొని జీవో జారీచేసింది. అమలాపురం పట్టణ, తాలూకా పోలీస్ స్టేషన్లలో నమోదైన మొత్తం 6 ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆదేశించాలంటూ డీజీపీకి స్పష్టం చేసింది. అయితే అందుకు కారణాలు జీవోలో పేర్కొనలేదు. ప్రభుత్వ ఉత్తర్వులు సీఆర్పీసీ సెక్షన్ 321, బల్వంత్ సింగ్ కేసుతో పాటు పలు కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వ జీవోను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వండి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

సినీజగమంతా రామమయం



ప్రస్తుతం ఎలివేషన్స్ ట్రెండ్ నడుస్తోంది. డైలాగులతో, కెమెరా ట్రిక్కులతో హీరోను ఓ సూపర్ నాచురల్ పవర్‌లా చూపించడం నేటి దర్శకులకు పరిపాటైపోయింది. అసలు ఈ ఎలివేషన్ అనే దానికి విత్తనం ఎక్కడ పడిందో ముందు తెలుసుకుందాం. హీరో కేరక్టర్‌ని ఆకాశమంత ఎత్తులో చూపించే ప్రక్రియ రామాయణకావ్యం నుంచి మొదలైంది. దానికి నాంది పలికింది వాల్మీకి. 'రామాయణం'లో 'మారీచ ఉవాచ' చదివిన వాళ్లకు ఎలివేషన్ అంటే ఏంటో అర్థమవుతుంది. ఓ విధంగా రాముడికి వాల్మీకి ఇచ్చినంత ఎలివేషన్ ఆ తర్వాత ఏ కథల్లోనూ కావ్యాల్లోనూ, ఏ సినిమాల్లోనూ ఇప్పటికీ ఎవరూ ఇవ్వలేకపోయారన్నది వాస్తవం. అందుకే ఇప్పటికీ హీరో అనే పదానికి నిర్వచనం అంటే శ్రీరాముడే.


పూర్తి కథనం ఈ-పేపర్‌లో...

మాట విలువ చెప్పే బాలరాజు



'బిగ్ బాస్' సోహైల్ హీరోగా శ్రీ కోనేటి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'బూట్ కట్ బలారాజు' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఎం.డి. పాషా ఈ సినిమాకు నిర్మాత. ఈ చిత్రం ట్రైలర్‌ను ఆదివారం జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు.ఈ వేడుకలో సోహైల్ మాట్లాడుతూ 'నేను 'బిగ్‌బాస్' నుంచి బయటకు రాగానే నాతో సినిమా చేస్తానని పాషా భాయ్ చెప్పారు. ఈ సినిమా కోసం బాగా కష్టపడ్డాం. భీమ్స్ అన్న ఈ సినిమాకు మంచి పాటలు ఇచ్చారు. టీమ్ అందరికీ ధన్యవాదాలు' అని చెప్పారు. హీరో శివాజీ మాట్లాడుతూ 'సోహైల్‌లో మంచి తపన ఉంది. పరిశ్రమలో తప్పకుండా నిలబడతాడు. ఎదుగుతున్న నటుడిని అందరూ ప్రోత్సహించాలి' అన్నారు. దర్శకుడు శ్రీ కోనేటి మాట్లాడుతూ 'మంచి వినోదాత్మక చిత్రం ఇది. మాటకి ఉన్న విలువ, గౌరవం గురించి ఈ చిత్రంలో చెబుతున్నాం' అన్నారు. 'కంటెంట్ ఉన్న ప్రతి సినిమా హిట్ అవుతుంది. రెండున్నర ఏళ్లుగా ఈ సినిమా కోసం హార్డ్ వర్క్ చేశాం. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది. అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. 'బిగ్‌బాస్' ఏడు సీజన్ల స్టార్స్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులంతా పాల్గొన్న ఈ వేడుక గ్రాండ్‌గా జరిగింది.

నవ్య | చిత్రజ్యోతి



జై హనుమాన్ ప్రారంభం

'హను-మాన్' వేడి ఇంకా చల్లారకముందే ఆ సినిమాకు సీక్వెల్‌ని ప్రకటించేశారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ఈ సినిమాకు 'జై హనుమాన్' అని నామకరణం చేశారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్‌ను అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠామహోత్సవం సందర్భంగా సోమవారం మొదలుపెట్టారు. హైదరాబాద్‌లోని హనుమాన్ ఆలయంలో యాగంలో పాల్గొని, స్క్రిప్ట్‌ని హనుమంతుని పాదాలదగ్గర ఉంచి ప్రీప్రొడక్షన్ వర్క్‌ని లాంఛనంగా ప్రారంభించారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేయనున్న ఈ సినిమాకి సంబంధించిన నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది.

రామం రాఘవం



నటుడు ధన్‌రాజ్ దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రానికి 'రామం రాఘవం'. అనే పేరును ఖరారు చేశారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం మేకర్స్ టైటిల్‌తోపాటు ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి పృథ్వీ పోలవరపు నిర్మాత. ఇందులో తండ్రీకొడుకులుగా సుముద్రఖని, ధన్‌రాజ్ కనిపిస్తారని, ఇప్పటివరకూ చూడని కొత్త కథాంశంతో ఈ సినిమా రూపొదుతోందని నిర్మాత తెలిపారు. 'విమానం'ఫేం శివప్రసాద్ యానాల కథ అందిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గాప్రసాద్. తెలుగు, తమిళభాషల్లో ఒకేసారి ఈ చిత్రం విడుదల కానుంది.

చెల్లి ఎంగేజ్‌మెంట్.. అక్క డాన్స్



హీరోయిన్ సాయి పల్లవి చెల్లెలు పూజా కన్నన్ వివాహం ఆమె చిరకాల మిత్రుడు, ప్రియుడు వినీత్‌తో జరగనుంది. వీరి నిశ్చితార్థ వేడుక మిత్రులు, కుటుంబ సభ్యుల మధ్య జరిగింది. వినీత్‌తో రిలేషన్‌లో ఉన్న సంగతిని పూజ సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన వారం రోజులకే ఈ వేడుక జరగడం గమనార్హం.. పూజ కూడా నటే. ఓ తమిళ చిత్రంతో ఆమె నటిగా అరంగేట్రం చేశారు. నిశ్చితార్థ వేడుకలో కాబోయే వధూవరులతో కలిసి సాయి పల్లవి డాన్స్ చేసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ప్రేమలో.. ఎమోషన్స్



చందు కోడూరి నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రేమలో', చరిష్మా శ్రీకర్ హీరోయిన్. ఈ నెల 26న విడుదల కానుంది. రాజేశ్ కోడూరి నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను నటుడు శివాజీ రాజా సోమవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు పడిన కష్టానికి మంచి పేరు వస్తుంది. ఇలాంటి చిత్రాలను తప్పకుండా ఆదరించాలి' అని కోరారు. హీరో, దర్శకుడు చందు మాట్లాడుతూ 'తెలుగులో ఇప్పటి వరకూ ఎవరూ ట్రై చేయని కథ తీసుకున్నాను. సహజంగా ఉండేలా తీర్చిదిద్దాను. ఇది ప్రేమకథే. అయినా మంచి ఎమోషన్స్ ఉన్నాయి. కథలో బలం ఉంది కనుక ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. మా అన్నయ్య నిర్మాతగా మారి ఈ సినిమా కోసం బాగా ఖర్చు పెట్టారు. ఓ మేనేజర్‌గా ఎంతో కష్టపడ్డారు. టీమ్‌లో అందరి సహకారంతో సినిమా పూర్తి చేశాం. ఈ చిత్రం హిట్ అయితే మరిన్ని సినిమాలు తీస్తాను. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం రోజునే మా సినిమా ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. జై శ్రీరామ్' అన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XbcbM4V లో చదవండి.

నవ్య డాక్టర్

హెయిర్ హెల్త్



వెంట్రుకలు రాలడం అనే సమస్య ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఎదుర్కొనేదే! అయితే ఆ సమస్యను గృహ చిట్కాలతో సరిదిద్దే ప్రయత్నం చేస్తూ ఉంటాం. కానీ వెంట్రులు రాలడానికి అంతర్గత కారణాలను వెతికి వాటిని చక్కదిద్దే ప్రయత్నం చేయడం అవసరం.

జుట్టు రాలుతోందా?



వెంట్రుకలు రాలితే గుండెల్లో గుబులు మొదలవుతుంది. నిజమే మరి! అందంలో తలకట్టు పాత్ర ప్రధానం కాబట్టి ఆ మాత్రం కంగారు సహజమే! అయితే నిజానికి వెంట్రుకలు, వాటి తత్వాలు, వాటి మీద ప్రభావం చూపించే అంశాల మీద అవగాహన ఉంటే సమస్యను సమర్థవంతంగా సరిదిద్దుకోవచ్చు.

పోషకాహారలోపం ప్రధానం

వెంట్రుకల సమస్యలకు ప్రధాన కారణం పోషకాహారలోపం. ప్రతి మహిళలోనూ ఈ లోపం ఎంతో కొంత ఉంటూ ఉంటుంది. కుటుంబానికంతటికీ తినిపించి, తాము తినడం నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు మహిళలు. దీనికి తోడు ప్రతినెలా నెలసరి ద్వారా జరిగే రక్త నష్టం భర్తీ కాదు. ఫలితంగా వాటి ప్రభావం వెంట్రుకల మీద తప్పనిసరిగా పడుతుంది. వెంట్రుకలు పలుచబడడం, ఊడిపోవడం, నిర్జీవంగా తయారవడం లాంటి సమస్యలన్నీ కనిపిస్తాయి.

వెంట్రులు ఊడుతుంటే?

వెంట్రుకలు ఊడటానికి పోషకాహారలోపం ఒక్కటే కారణమైతే, దాన్ని సరిదిద్దితే సమస్య తొలగిపోతుంది. అలా జరగలేదంటే, అందుకు వేరే కారణాలు అయి ఉండొచ్చు. అవేంటంటే...

వంశపారంపర్య బట్టతల: బట్టతల పురుషులతోపాటు కొందరు స్త్రీలకూ వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది. ఇలాంటి వారికి 18 ఏళ్ల వయసు నుంచీ వెంట్రుకలు ఊడడం మొదలై 35 ఏళ్ల లోపు తల ముందు భాగంలో బట్టతల వచ్చేస్తుంది.

- **థైరాయిడ్:** హైపో, హైపర్... రెండు థైరాయిడ్ సమస్యల్లోనూ వెంట్రుకలు రాలడం జరుగుతుంది.
- **పిసిఓడి:** పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ రుగ్మతకు లోనయినప్పుడు హార్మోన్లలో జరిగే అసమతౌల్యం వల్ల వెంట్రుకలు రాలతాయి.
- **గర్భం:** ప్రసవం తర్వాత శరీరంలో పెరిగి తరిగే హార్మోన్లు, తల్లిగా కొత్త బాధ్యతతో ఒత్తిడికి లోనవడం, నిద్ర తగ్గడం వల్ల ఈ దశలో వెంట్రుకలు ఊడొచ్చు.
- **హెయిర్ ఎక్స్‌టెన్షన్స్:** బరువైన విగ్గులు, సవరాలు వాడటం వల్ల వెంట్రుకల మీద ఒత్తిడి పడి ఊడిపోతాయి.
- **హెయిర్ ట్రీట్మెంట్లు:** తరచుగా డైయింగ్, స్ట్రయిటెనింగ్ మొదలైన బ్యూటీ ట్రీట్మెంట్లను వాడుతూ ఉన్నా జుట్టు రాలిపోవచ్చు.
- **తలలో పుండ్లు:** తలలో చుండ్రు పెరిగిపోయి పుండ్లు ఏర్పడినా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల వల్ల వెంట్రుకలు రాలిపోవచ్చు.
- **అలోపేసియా:** పేను కొరుకుడు వల్ల కూడా వెంట్రుకలు రాలిపోతాయి.
- **హెయిర్ స్టయిల్స్:** వెంట్రుకలను బిగుతుగా వెనక్కి లాగి కట్టే 'పోనీ టెయిల్' హెయిర్ స్టయిల్, వెంట్రుకలను బిగుతుగా పట్టి ఉంచే క్లిప్పుల వల్ల వెంట్రుకలు ఊడతాయి.

వంశపారంపర్యంగా సంక్రమించిన బట్టతల మినహా, మిగతా సమస్యలన్నిటినీ కాలంతోపాటు, సమర్థమైన చికిత్సలతో సరిదిద్దితే వెంట్రుకలు ఊడడం తగ్గి, తిరిగి చక్కగా పెరుగుతాయి.

ఎన్ని వెంట్రుకలు?

రోజుకి 50 నుంచి 100 వెంట్రుకలు రాలడం సర్వసాధారణం. అలా రాలుతూ పోతే ఇక తల మీద వెంట్రుకలే మిగలవని భయపడవలసిన అవసరం లేదు. రాలే వెంట్రుకలు రాలుతూ ఉంటే కొత్త వెంట్రుకలు పుడుతూ, పెరుగుతూ ఉంటాయి. అయితే ప్రతి రోజూ రాలే వెంట్రుకల్ని లెక్కపెట్టుకుండా ఉండలేం కాబట్టి, వెంట్రుకలు అవసరానికి మించి రాలుతున్నాయో, లేదో తెలియాలంటే ఓ విషయాన్ని గమనించాలి. ఎప్పుడూ ఒకే పరిమాణంలో రాలుతున్న వెంట్రుకలు హఠాత్తుగా కుచ్చులుగా రాలడం మొదలుపెడితే, అప్పుడు సమస్యగా గుర్తించాలి. మన చర్మం, గోళ్ల కులాగే వెంట్రుకలు కూడా పాతవి ఊడి కొత్తవి పుడుతూ ఉంటాయి. అలా పుట్టి పెరిగే క్రమం మూడు దశల్లో సాగుతుంది. అవే... అనాజెన్, కెటాజెన్, టీలోజెన్.

- **అనాజెన్:** ఇది వెంట్రుకలు పెరిగే దశ. తల మీద ఈ దశలో ఉన్న కొన్ని వెంట్రుకలు 3 నుంచి 5 ఏళ్లపాటు పెరుగుతూనే ఉంటాయి. సుమారుగా నెలకు ఒక సెంటీమీటరు వరకూ వెంట్రుకలు పెరగొచ్చు. కొందరికి ఈ వేగం ఇంకొంత ఎక్కువగా ఉంటుంది. ఎటువంటి శిరోజాల సమస్యలు, అనారోగ్యాలు, పోషకాహారలోపాలు లేకపోతే వెంట్రుకలు పూర్తి స్థాయిలో పెరుగుతాయి.
- **కెటాజెన్:** ఇది ఇంటర్మీడియట్ స్టేజ్. ఈ దశలో పూర్తి స్థాయి వరకూ పెరిగిన కొన్ని వెంట్రుకలు ఇక పెరగకుండా ఆగిపోతాయి. ఈ దశ కొన్ని వారాల వరకూ కొనసాగుతుంది.
- **టీలోజెన్:** ఇది విశ్రాంతి దశ. రెండు నుంచి మూడు నెలల వరకూ ఉండే ఈ దశ చివర్లో వెంట్రుకలు ఊడిపోతాయి. తిరిగి వాటి స్థానంలో కొత్త వెంట్రుకలు పెరగడానికి అనాజెన్ దశకు వెంట్రుకలు చేరుకోవాలి. ఇలా ఈ మూడు దశలూ ఒకదాని తర్వాత ఒకటిగా తిరుగుతూనే ఉంటాయి.

తల మీదున్న వెంట్రుకల్లో 90% అనాజెన్ దశలో ఉంటే, మిగతా 10% టీలోజెన్ దశలో ఉంటాయి. అయితే వంశపారంపర్యంగా బట్టతల సంక్రమించినవారిలో టీలోజెన్ దశకు చేరుకున్న కొన్ని వెంట్రుకలు తిరిగి కెటాజెన్ దశకు చేరుకోకపోవచ్చు. అలాగే పెరిగే వయసు కారణంగా కూడా ఇలా జరగవచ్చు. ఇలాంటప్పుడు తల పలచబడుతుంది. ఒకవేళ ఈ రెండు కారణాలు మినహా తల పలుచబడిందంటే, తల మీద నిర్దిష్ట ప్రదేశంలో 50% వెంట్రుకలు ఊడిపోయాయని అర్థం. అంత శాతం ఊడిపోయినప్పుడు మాత్రమే వెంట్రుకలు ఊడిపోతున్నట్టు గ్రహింపుకొస్తుంది.

అపోహలు - వాస్తవాలు



- **నూనెతో వెంట్రుకలు పెరుగుతాయి!**
  ఇది అపోహ. నూనె వాడకపోయినా వెంట్రుకలు పెరుగుతాయి. వెంట్రుకల పెరుగుదల జన్యుపరంగా సంక్రమించిన లక్షణం మీద ఆధారపడి ఉంటుంది. వెంట్రుకలు పొడిబారినా, మెత్తగా తయారవ్వాలన్నా తలస్నానానికి అరగంట ముందు వెంట్రుకలకు నూనె పట్టించి మసాజ్ చేసి తలస్నానం చేయాలి. ఇందుకోసం తలనూనెను వాడొచ్చు.
- **హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు రాలుతుంది!**
  ఇది కూడా అపోహే! జుట్టు రాలడానికి హెల్మెట్ ధరించడం కారణం కాదు. హెల్మెట్ పెట్టుకోవడం వల్ల తలలో చమట పట్టి, చుండ్రు ఎక్కువై, దాని వల్ల పుండ్లు పడి వెంట్రుకలు రాలే అవకాశం ఉంటుంది. అంతేగానీ తలను శుభ్రంగా ఉంచుకున్నంతకాలం హెల్మెట్ పెట్టుకున్నా వెంట్రుకలు రాలవు.
- **చిట్కాలు పాటిస్తే వెంట్రుకలు పెరుగుతాయి!**
  ఎన్ని చిట్కాలు పాటించినా అవి వెంట్రుకలను మెత్తగా మారుస్తాయే తప్ప పెరగడానికి ఏ విధంగానూ ఉపయోగపడవు.

ఇవి కూడదు

వెంట్రుకలు ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. అవేంటంటే...

- క్లోరిన్ కలిపిన స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లేముందు మంచినీళ్లతో తలస్నానం చేసి క్యాప్ పెట్టుకోవాలి. ఈత కొట్టిన తర్వాత చివర్లో మళ్లీ మంచి నీళ్లతో తలస్నానం చేయాలి.
- ఎండలోకి వెళ్లే ప్రతిసారీ సన్‌స్క్రీన్ హెయిర్ స్ప్రే వాడాలి.
- తలకు వేడి లేదా చల్లని గాలి పదే పదే తగలకుండా చూసకోవాలి.
- ఎండలో వెళ్లేటప్పుడు తలకు స్కార్ఫ్ కట్టుకోవాలి, లేదా క్యాప్ పెట్టుకోవాలి.
- హెయిర్ డ్రయ్యర్, స్ట్రయిటెనర్, హెయిర్ స్ప్రేలు తరచుగా వాడకూడదు.
- హార్ష్ షాంపూలు వాడకూడదు.

చివర్లు చిట్లడం

పోషకాహారలోపం, కాలుష్యం, ఎండ, గాలులు... వీటి వల్ల వెంట్రుకల చివర్లు చిట్లుతాయి. ఇలాంటప్పుడు కత్తెరతో చివర్లను కత్తిరించి, లోపాన్ని సరి చేసుకోవాలి.

బాల నెరుపు

టీనేజర్లలో తెల్ల వెంట్రులకు ఈ మధ్య కాలంలో సర్వసాధారణమైపోయాయి. ఇందుకు కారణం... వంశపారంపర్యం, వాతావరణ మార్పులు, కాలుష్యం, ఆహారం ద్వారా శరీరంలోకి చేరే రసాయనాలు. వెంట్రుకలలో మెలనిన్ ఉత్పత్తి తగ్గితే వెంట్రుకలు తెల్లబడతాయి. అలోపేసియా తర్వాత పెరిగే వెంట్రుకలు కూడా మొదట తెల్లగా పెరిగి తర్వాత నల్లగా మారతాయి. విటిలిగో (బొల్లి) ఉన్న వాళ్లలో కూడా తల మీద బొల్లి ఉన్న ప్రదేశంలో వెంట్రుకలు తెల్లగా మారిపోతాయి.

వెంట్రులు ఆరోగ్యంగా!

శరీరంలో ఎలాంటి చెడు జరిగినా ఆ ప్రభావం వెంట్రుకల్లో ప్రతిబింబిస్తుంది. శరీరానికి సరిపడా పోషకాలు అందకపోయినా ఆ ప్రభావం వెంట్రుకల మీద పడుతుంది. ఆహారం ద్వారా చేరే పోషకాలను శరీరం ప్రధాన అంతర్గత అవయవాల కోసం కేటాయిస్తుంది. వాటిలో ఖర్చయిపోగా మిగిలినవి మాత్రమే వెంట్రుకలు, గోళ్లకు వెళ్తాయి. ఒకవేళ సరిపడా పోషకాలు తీసుకోకపోతే వెంట్రుకల మీద ఆ ప్రభావం పడి, రాలిపోతూ ఉంటాయి. కాబట్టి వెంట్రుకలు ఆరోగ్యంగా ఉండాలంటే, పోషకాహారంతో పాటు, విటమిన్ ఇ, డి, సి, బి - కాంప్లెక్స్ సక్రమంగా, సరిపడా అందేలా చూసుకోవాలి. ఇందుకోసం తాజా ఆకుకూరలు, కూరగాయలు, మాంసకృత్తులు సరిపడా అందించాలి. అలాగే వెంట్రుకలను శుభ్రంగా ఉంచుకోవాలి. వాతావరణ మార్పుల ప్రభావానికి లోనవకుండా, కాలుష్యం బారిన పడకుండా చూసుకోవాలి.

పుష్కలంగా ప్రొటీన్

శాకాహారంతో సరిపడా ప్రొటీన్‌ను పొందే వీలుండదు అనుకుంటే పొరపాటు. పదార్థాల పట్ల అవగాహన పెంచుకుంటే, శాకాహారంతో కూడా ప్రొటీన్ పుష్కలంగా పొందవచ్చు.

సోయా: చవకగా, సులువుగా మార్కెట్లో దొరికే శాకాహార ప్రొటీన్ ఇది. 100 గ్రాముల సోయాలో 52 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. కాబట్టి ప్రొటీన్ పొందాలనుకుంటే, తరచూ సోయా వంటకాలు వండుకుంటూ ఉండాలి.

గుమ్మడి విత్తనాలు: వీటిలో ప్రొటీన్‌తో పాటు అన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. అలాగే పీచు, యాంటీఆక్సిడెంట్లు కూడా గుమ్మడి విత్తనాల్లో ఎక్కువే!

ఓట్స్: విటమిన్లు, ప్రొటీన్లను కలిగి ఉండే ఓట్స్‌లో మాంసకృత్తులు ఎక్కువ.

హెల్త్ వెల్త్



ఎన్నో రకాల బ్రాండ్లలో దొరుకుతున్న ఓట్స్‌ను బ్రేక్‌ఫాస్ట్‌గా తినడం అలవాటు చేసుకోవాలి. వంద గ్రాముల ఓట్స్‌లో 18 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.

మినుములు: మినుముల్లో, నల్లబియ్యంలో ప్రొటీన్లు ఎక్కువ. నల్లబియ్యంలో అదనంగా పిండిపదార్థాలు, పీచు కూడా ఉంటాయి. వంద గ్రాముల మినుముల్లో 19 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. కాబట్టి మినప సున్నుండలు లాంటివి తింటూ ఉండాలి.

వేరుసెనగలు: వీటిలో ప్రొటీన్లు, కొవ్వులు, పీచు ఉంటాయి. విటమిన్ ఇతో పాటు, మెగ్నీషియం, ఫోలేట్, రాగి లాంటి పోషకాలు కూడా ఉంటాయి. వంద గ్రాముల వేరుసెనగల్లో పాతిక గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. కాబట్టి వీటిని కూరలు, వేపుళ్లు, పచ్చళ్లలో విరివిగా వాడుకుంటూ ఉండాలి.

కేన్సర్



ఈ లక్షణాలే సూచనలు


కేన్సర్ వ్యాధి బయల్పడడానికంటే ముందు కొన్ని సాధారణ నలతలు తరచూ వేధిస్తూ ఉంటాయి. అవేంటంటే...

- **చర్మ సమస్యలు:** ఆహారం, సౌందర్య సాధనాలతో సంబంధం లేకుండా చర్మ సమస్యలు మొదలవుతాయి. హఠాత్తుగా మొదలయ్యే ఈ చర్మ సమస్యలు చర్మపు అలర్జీలను కూడా పోలి ఉండవు. ఈ సమస్యతో పాటు రొమ్ముల్లో గడ్డలు ఉన్న అనుమానం వస్తే, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.
- **దగ్గు:** దగ్గు విడవకుండా వేధిస్తూ, ఆకలి మందగించినా, నిస్సత్తువ ఆవరిస్తున్నా వైద్యులను సంప్రతించాలి. దగ్గు, ఆకలి, బరువూ తగ్గడం కేన్సర్ ప్రధాన లక్షణాలు.
- **దురదలు:** దురద పెరుగుతున్న కేన్సర్ కణితికి సూచన కావచ్చు. ఇది స్కిన్ ఎలర్జీ ప్రధాన లక్షణమైనా, దురద తీవ్రంగా ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు. బైల్ డక్ట్, చర్మ కేన్సర్లు, కాలేయానికి పాకే కేన్సర్లు, రక్త కేన్సర్లలో దురద ప్రధాన లక్షణంగా ఉంటుంది.
- **విసర్జన:** మలంలో మ్యూకస్, రక్తం, చీము కనిపిస్తే, పెద్ద పేగు కేన్సర్‌గా అనుమానించాలి.
- **మూత్రం:** రక్తంతో కూడిన మూత్రం, అధిక రక్తపోటు, కటి ప్రదేశంలో నొప్పి, అలసటలు మూత్రపిండ కేన్సర్ లక్షణాలు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/wvzNr2uలో చదవండి.

ఫుడ్ ఫ్యాక్ట్

మొలకలు ఇలా కూడా తినొచ్చు



మొలకలు కచ్చితంగా పోషక భాండాగారాలే! అయితే వాటిని పచ్చిగానే తినాలా? ఎలా తినడం ఆరోగ్యకరం?

మొలకలతో ఫుడ్ పాయిజనింగ్ జరిగే ఆస్కారాలు ఎక్కువ. తేమతో కూడిన వాతావరణంలో మొలకెత్తుతాయి. కాబట్టి వీటిలో సాల్మనెల్లా, ఇ కొలై సూక్ష్మజీవులు వృద్ధి చెందే అవకాశాలుంటాయి. అలాగే పచ్చి మొలకలను జీర్ణం చేసుకోగలిగే సామర్థ్యం అందరికీ ఉండదు. వీటిని మన శరీరం సంపూర్ణంగా శోషించుకోలేదు. మరీ ముఖ్యంగా బలహీనమైన జీర్ణశక్తి, పేగులు కలిగిన వాళ్లలో కడుపు ఉబ్బరం, కడుపు నొప్పి, డయేరియా లాంటి సమస్యలు కూడా తలెత్తుతాయి. ఈ ఇబ్బందులేవీ లేకుండా ఉండాలంటే మొలకలను ఆవిరి మీద ఉడికించి, లేదా ఉడకబెట్టి తినాలి. ఉడికించడం వల్ల వీటిలోని విటమిన్ సిని నష్టపోతాం. అయినప్పటికీ మిగతా పోషకాలన్నీ అంది, మొలకలు పూర్తిగా జీర్ణం కావడం కోసం వాటిని ఉడికించిన తర్వాత తినడమే మేలు. గర్భిణులు, పిల్లలు, పెద్దలు పచ్చి మొకలను తినకపోవడమే శ్రేయస్కరం. వీళ్ల శరీరాలు పచ్చి మొలకల కారక ఫుడ్ పాయిజనింగ్ తాలూకు ప్రభావాలను తట్టుకోలేవు.

హార్ట్ కేర్

పిల్లల గుండె పదిలంగా...

పుట్టుకతో గుండె జబ్బులను వెంటబెట్టుకు వచ్చి, వాటికి చికిత్స తీసుకున్న పిల్లలను గాజు బొమ్మల్లా కాపాడుకోవాలి. వైద్యులు సూచించిన సలహాలు, సూచనలు, జాగ్రత్తలు పాటిస్తే, ఈ కోవకు చెందిన పిల్లలు సాధారణ పిల్లల్లా ఆరోగ్యంగా ఎదగగలుగుతారని అంటున్నారు హృద్రోగ వైద్యులు డాక్టర్ ఆశిష్.



"గతంలో చిన్న పిల్లల గుండె వైద్యానికి సంబంధించిన చికిత్సలు ఎక్కువగా అందుబాటులో ఉండేవి కావు. దీనితో మరణాల సంఖ్య ఎక్కువగా ఉండేది. చాలా సందర్భాలలో అప్పుడే పుట్టిన పసిపాపలు మరణించటానికి వెనకున్న కారణాలు తెలిసేవి కూడా కాదు. కొన్ని సందర్భాలలో పిల్లలు పెద్ద అయిన తర్వాత హృదయ సంబంధ సమస్యలు బయటపడేవి. ఈ మధ్యకాలంలో హృదయ సంబంధ వైద్య పరీక్షలలోను, విధానాలలోను అనేక మార్పులు వచ్చాయి. అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. అందువల్ల పెద్ద సమస్యలతో పాటుగా చిన్న వాటికి కూడా పరిష్కారాలు లభిస్తున్నాయి. దీని వల్ల పిల్లలు పెద్ద అయిన తర్వాత వారికి ఆరోగ్య సమస్యలు లేకుండా ఉంటున్నాయి. సాధారణంగా పిల్లల్లోని హృదయ సంబంధమైన రోగాలను సులభమైనవిగాను.. క్లిష్టమైనవిగాను వర్గీకరిస్తారు. ఆ వయస్సులోనే శస్త్ర చికిత్సతో సరిచేయగలవాటిని సులభమైన సమస్యలుగా వర్గీకరిస్తారు. ఉదాహరణకు కొందరు పిల్లలో ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరమవుతుంది. ఆ సమయంలోనే ఈ శస్త్ర చికిత్స చేయటం వల్ల సమస్య పూర్తిగా పరిష్కారమవుతుంది. నాలుగైదేళ్ల పాటు జాగ్రత్తగా ఉంటే పెద్ద అయిన తర్వాత హృద్రోగ సమస్యలు వచ్చే అవకాశాలు తక్కువ ఉంటాయి. ఇక క్లిష్టమైన సమస్యలు ఒకే శస్త్ర చికిత్సతో నయమవ్వవు. ఆ రోగి పరిస్థితి ఆధారంగా నాలుగైదు సార్లు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుంది.

ఎదురయ్యే సమస్యలివే!

పిల్లల శస్త్రచికిత్సలలో వారి తల్లితండ్రుల పాత్ర చాలా కీలకమైనది. సాధారణంగా వారికి శస్త్రచికిత్సకు సంబంధించిన ఎక్కువ అవగాహన ఉండదు. దీనితో వారు చిన్న విషయాలకు ఎక్కువగా ఆందోళన చెందుతారు. లేదా పెద్ద విషయాలకు సంబంధించిన సంకేతాలను కూడా పట్టించుకోరు. అందువల్ల తల్లితండ్రులకు అవగాహన కల్పించటం చాలా ముఖ్యమైన విషయం. కొన్ని సార్లు చికిత్స అయిన తర్వాత రకరకాల అనుమానాలు వస్తూ ఉంటాయి. ఉదాహరణకు పిల్లలకు వ్యాక్సినేషన్ వేయించాల్సి ఉంటుంది. శస్త్రచికిత్స జరిగిన వెంటనే వ్యాక్సినేషన్ వేయిస్తే కొన్ని ప్రతికూల ఫలితాలు ఏర్పడే అవకాశముంటుంది. అదే విధంగా పిల్లలు తినే ఆహారంలో ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవాలి. మందులను వాడే విషయంలో కూడా ఎటువంటి అశ్రద్ధ చేయకూడదు. పిల్లలు తమ శరీరంలో వచ్చిన మార్పులను గమనించి చెప్పలేకపోవచ్చు. అందువల్ల తల్లితండ్రులే వారిలో మార్పులను గమనించాల్సి ఉంటుంది. ఏవైనా మార్పులు వస్తే వాటిని వైద్యుడి దృష్టికి తీసుకువచ్చి చికిత్స చేయించాల్సి ఉంటుంది. లేకపోతే కొన్ని సార్లు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది.

ఇవి కూడా గమనించాలి..

మన శరీరం చాలా సంక్లిష్టమైన వ్యవస్థలతో కూడి ఉంటుంది. ఏదైనా ఒక అవయవానికి చికిత్స చేస్తే- దాని ప్రభావం ఇతర అవయవాలపై కూడా పడుతుంది. ఉదాహరణకు హృద్రోగ సంబంధిత వ్యాధుల్లో శస్త్రచికిత్స తర్వాత ఊపిరితిత్తులకు తక్కువ రక్తప్రసరణ జరుగుతుంది. దీని వల్ల ఊపిరితిత్తుల్లో కొన్ని మార్పులు వస్తాయి. అందువల్ల శస్త్రచికిత్స తర్వాత ఊపిరికి సంబంధించిన సమస్యలు ఎదురవుతున్నాయేమో గమనించాలి. కొన్ని సార్లు కాలేయానికి సంబంధించిన సమస్యలు కూడా ఏర్పడే అవకాశముంటుంది. అయితే చాలా సార్లు కాలేయంలో- మందులు వాడటం వల్ల జరిగే కొన్ని మార్పుల వల్ల తాత్కాలికంగా ఈ సమస్యలు ఏర్పడతాయి. ఇవి మళ్లీ సమసిపోతాయి కాబట్టి వీటి కోసం ఎక్కువ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మందులు ఇలా...

గుండె సర్జరీలు, క్యాథెటర్ ఇంటర్వెన్షన్, గుండె సంబంధిత పరికరాలను అమర్చుకున్న పిల్లలకు వైద్యులు సూచించినంత కాలం రక్తాన్ని పలుచన చేసే బ్లడ్ థిన్నర్లను వాడుకోవలసి ఉంటుంది. సర్జరీకి ముందూ, తర్వాతా బీటా బ్లాకర్స్, ఎసిఇ ఇన్హిబిటర్లను వాడుకోవాలి. వీటితో దుష్ప్రభావాలు ఎక్కువ కాబట్టి వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి. పిల్లల వయసు, బరువుల ఆధారంగా మోతాదులను సరిచేసుకుంటూ ఉండాలి.



డాక్టర్ ఆశిష్ సాప్రే,
సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్,
మెడికవర్ హాస్పిటల్స్, హైదరాబాద్.

అవేర్‌నెస్

ఆ మందులు పరిమితంగానే...

మలబద్ధకం వేధిస్తే, చటుక్కున లాక్సేటివ్స్ వాడేస్తున్నారా? అయితే వాటిని వాడకనే ముందు, వాటితో ఒరిగే దుష్ప్రభావాల గురించి తెలుసుకోండి.

ఎక్కువ సమయాల పాటు కదలకుండా ఉండే జీవనశైలి, అస్తవ్యస్త ఆహారపుటలవాట్లు, తరచూ ఆహార శైలులు మారిపోతూ ఉండడం వల్ల ఎంతో మందిని మలబద్ధకం వేధిస్తూ ఉంటుంది. వారానికి మూడు కంటే తక్కువసార్లు మలవిసర్జన జరిగే వాళ్లలో డీహైడ్రేషన్, మొలలు, మలద్వార రక్తస్రావం, గుండె అస్తవ్యస్తంగా కొట్టుకోవడం లాంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ సమస్యలను సరిదిద్దుకోవడం కోసం జీవనశైలి మార్పులు చేసుకోవాలి. బదులుగా లాక్సేటివ్‌ను వాడుకుంటూపోతే, ఎన్నో దుష్ప్రభావాలకు గురికావలసి వస్తుందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. అవేంటంటే...



డిపెండెన్సీ: పేగుల కదలికల కోసం శరీరం లాక్సేటివ్స్ మీద ఆధారపడే పరిస్థితి నెలకొనవచ్చు. అతిగా వాడితే, మలాన్ని కదిలించడానికి అవసరమైన సహజసిద్ధ సామర్థ్యాన్ని పేగులు కోల్పోతాయి.

డయేరియా: శరీరంలోని నీటిని పేగుల్లోకి శోషణ చెందేలా చేసి, నీళ్ల సహాయంతో మలాన్ని విసర్జించేలా చేసే లాక్సేటివ్స్‌ను అతిగా వాడితే, డయేరియా తప్పదు. దాంతో ఎలక్ట్రొలైట్లలో హెచ్చుతగ్గులు చోటుచేసుకుని, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

మెలనోసిస్ కొలై: పెద్ద పేగుల్లోని లోపలి పొర నల్లగా మారే పరిస్థితే మెలనోసిస్ కొలై. కాబట్టి మలబద్ధకాన్ని వదిలించుకోవడం కోసం లాక్సేటివ్స్ వాడుకోకుండా వైద్యుల సలహా తీసుకోవాలి.

పోషక లోపం: పొట్ట విసర్జకాలను పేగుల్లోకి పంపించే తొందర్లో పోషకాలను శోషించుకునే సమయం లేకుండా పోతుంది. దాంతో పోషక లోపం ఏర్పడవచ్చు. లాక్సేటివ్స్‌తో ఐరన్ లోపం ప్రధానంగా తలెత్తుతూ ఉంటుంది.

సహజసిద్ధ పద్ధతుల ద్వారా...

సహజసిద్ధంగా మలవిసర్జన జరగాలంటే ఈ పదార్థాలు పాటించాలి.

- పొట్టు తీయని ధాన్యాలు
- ఓట్స్ బ్రౌన్ రైస్
- పీచు ఎక్కువగా ఉండే అరటి, జామ
- ఆకుకూరలు
- చిక్కుళ్లు, బీరకాయలు
- బాదం, షియా, ఫ్లాక్స్ విత్తనాలు
- రోజుకు 8 నుంచి 10 గ్లాసుల నీళ్ల



నవ శకానికి శ్రీకారం!



రాముడొచ్చేశాడు.. ఇక టెంట్లో ఉండక్కర్లేదు

కర్తవ్య నిర్వహణే ఘనభారతానికి పునాది

అయోధ్యలో ప్రధాని మోదీ ఉద్ఘాటన

అయోధ్య, జనవరి 22: అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపన.. నవశకానికి శ్రీకారం చుట్టిందని ప్రధాని మోదీ అన్నారు. పురోగావి ౨, ప్రగతిశీల భారతానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. సోమవారమిక్కడ అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ అనంతరం ఆయన సాధు సంతులు, రాజకీయ నేతలు, పారిశ్రామి ౨కవేత్తలు, కవులు, కళాకారులు, సినీనటులు, సాహితీవేత్తల సమావేశంలో మాట్లాడారు. 2024 జనవరి 22.. కేలెండర్‌లో ఒకానొక తేదీ మాత్రమే కాదని కొత్త శకానికి ఆరంభంగా పేర్కొన్నారు. రామాలయ ప్రాణప్రతిష్ఠ కేవలం విజయ సందర్భమే కాదు.. వినమ్రతకూ సంకేతమన్నారు. ఇక ఆలయ నిర్మాణ అంశాన్ని మనం అధిగమించాలని సూచించారు. ఈ పవిత్ర క్షణం నుంచి వచ్చే వెయ్యేళ్లకు పటిష్ఠ, భవ్య, ఆధ్యాత్మిక భారతానికి పునాది వేయాలని పిలుపిచ్చారు. 'తరాల ఎదురుతెన్నుల అనంతరం ఇవాళ మన రాముడు వచ్చేశాడు.. ఇక టెంట్లలో ఉండడు.. అద్భుత ఆలయంలో నివసిస్తాడు. ఆలయ నిర్మాణం ప్రజల్లో కొత్త జవసత్వాలు నింపింది. గర్భగుడిలో ప్రాణప్రతిష్ఠ సమయంలో నాలో కలిగిన దివ్య ప్రకంపనలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. వెయ్యేళ్ల తర్వాత కూడా ప్రజలు ఈ తేదీని, ఈ క్షణాలను గుర్తుంచుకుంటారు. శ్రీరాముడి ఆశీర్వాదం వల్లే మనమీ అద్భుత ఘట్టాన్ని చూడగలుగుతున్నాం. దీర్ఘకాలంగా మనమీ నిర్మాణం పూర్తిచేయలేకపోయాం. మన తపస్సులో లోపాలకు శ్రీరాముడికి క్షమాపణలు చెబుతున్నాను. ఆయన కచ్చితంగా మన్నిస్తాడని ఆశిస్తున్నాను. ప్రాణప్రతిష్ఠ వేడుకతో యావత్ ప్రపంచాన్ని సంధానించాం. అయోధ్యలో జరిగినటువంటి ఉత్సవాలు ఇతర దేశాల్లో కూడా జరిగాయి. శ్రీరాముడు భారతీయుల విశ్వాసం. ఈ దేశానికి ఆధారం.. భారత్‌లో నియమ నిబంధనలను ఏర్పాటు చేసిందే ఆయన.. భారతీయ వివేచన, గర్వం.. ఘనత ఆయనే. ఆయన విశ్వవ్యాపకుడు.. ఆయన ప్రాణప్రతిష్ఠ చేస్తున్నామంటే.. దాని ప్రభావం కొన్నేళ్లు కాదు... వందలు, వేల సంవత్సరాలు ఉంటుంది. యుగసంధి రూపకర్తలుగా మన తరం ఎంపిక కావడం సంతోషదాయకమైన యాదృచ్ఛిక సంఘటన. వెయ్యేళ్ల తర్వాత కూడా జాతి నిర్మాణంలో మన కృషిని అప్పటి తరం గుర్తుంచుకుంటుంది' అని తెలిపారు. అంతకుముందు ఆయన అయోధ్యలోని కుబేర్ టీలాలో శివుడికి పూజలు చేశారు. జటాయువు విగ్రహాన్ని ఆవిష్కరించారు.

గుడి కడితే దేశం తగులబడుతుందన్నారు

రామాలయాన్ని గనుక నిర్మిస్తే దేశం తగులబడి పోతుందని కొందరు అప్పట్లో అనేవారు.. అయితే అలాంటి మంటలేవీ పుట్టకపోగా.. మరింత ఉత్తేజాన్ని ఇవ్వడం మనం చూస్తున్నాం. అలాంటివారు భారతీయ ఆధ్యాత్మికత పవిత్రతను అర్థం చేసుకోలేరు. మీ ఆలోచనను మార్చుకోవాలని వారిని కోరుతున్నాను. రామ్‌లల్లా ఆలయ నిర్మాణం.. శాంతి, సహనం, పరస్పర సామరస్యం, సుహృద్భావాలకు చిహ్నం. రాముడు అగ్ని కాదు.. ఇంధనం.. ఆయన వివాదం కాదు.. పరిష్కారం.. రాముడు మనవాడు మాత్రమే కాదు. అందరికీ చెందినవాడు. ఆయన శాశ్వతుడు... అందుకే వెయ్యేళ్ల భారత ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేయడానికి ఇదే సరైన సమయమని చెబుతున్నాను.

గుహుడు, జటాయువే స్ఫూర్తి

న్యూఢిల్లీ, జనవరి 22: "రామాయణంలోని అనేక పాత్రలు మనకు ఎన్నో నేర్పిస్తాయి. వాటి నుంచి స్ఫూర్తి పొంది.. దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జటాయు పక్షి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం వాల్మీకి రామాయణంలోని పలు పాత్రలను ఉదహరిస్తూ ప్రధాని ప్రసంగించారు. మాతృభూమి కోసం దేశ ప్రజలు ఏవిధంగా కృషి చేయాలో ఆయన వివరించారు. ప్రధానంగా రామాయణంలోని శబరి, గుహుడు, ఉడుత, జటాయు పాత్రలను ఆయన ప్రస్తావించారు. మోదీ ఏమన్నారంటే..



> ప్రతి క్షణాన్నీ జాతి నిర్మాణానికి అంకితం చేయాలి
> — మోదీ

శబరి

రామాయణం ప్రకారం.. శబరి గిరిజన యువరాణి. ఆధ్యాత్మిక మార్గం పట్టింది. గురువు కోసం అన్వేషిస్తూ మతంగ మహర్షి ఆశ్రమానికి చేరుకుంది. ఏళ్లు గడిచాయి. మతంగ మహర్షి వృద్ధులైపోయారు. రాముడు ఆశ్రమానికి వస్తాడని చెప్పి ఆయన పరమపదించారు. ఆ తర్వాత అనేక సంవత్సరాలకు రాముడు శబరి ఆశ్రమానికి సీతా లక్ష్మణ సమేతంగా చేరుకున్నాడు. శ్రీరాముని దర్శించుకున్న శబరి పులకించిపోయింది. శబరి భక్తికి ముగ్ధుడైన శ్రీరాముడు ఆమెను ఆశీర్వదించాడు.



స్ఫూర్తి ఇదీ..

శబరి జీవితాన్ని గమనిస్తే ఎనలేని విశ్వాసం జనిస్తుంది. ఎప్పటికైనా రాముడు వస్తాడనే నమ్మకమే ఆమెను సుదీర్ఘకాలం వేచి చూసేలా చేసింది. ఇలాంటి ఎనలేని విశ్వాసమే ప్రతి భారతీయుడిలోనూ పెంపొందాలి. అది సమర్థవంతమైన, దృఢమైన భారత దేశాన్ని నిర్మించేందుకు పునాది వేసేలా చేస్తుంది.

ఉడుత



లంకకు వారధి నిర్మించే క్రమంలో వానర సైన్యం బండరాళ్లతో సముద్రంపై సేతువు నిర్మిస్తోంది. హనుమాన్ సహా ఇతర వానర సైన్యం బండరాళ్లను నీటిపై విసురుతున్నారు. ఇదే సమయంలో ఓ ఉడుత చిన్న చిన్న గులకరాళ్లను తన నోట కరుచుకుని తీసుకువెళ్లి ఆ నీటిలో విసురుతోంది. అయితే, ఉడుత చేస్తున్న పని తనకు అడ్డుగా ఉందంటూ హనుమంతుడు ఆక్షేపిస్తాడు. దీనికి ఉడుత సమాధానమిస్తూ.. వారధి నిర్మాణంలో తన వంతు సాయం చేస్తున్నానని బదులిస్తుంది. ఈ సమాధానం విని వానర సైన్యం పగలబడి నవ్వుతుంది. ఈ సందర్భంలో శ్రీరాముడు జోక్యం చేసుకుని.. "మీరంతా పెద్ద పెద్దరాళ్లు వేస్తున్నారు. దీంతో వాటి మధ్య ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఉడుత చేస్తున్న సాయంతో ఆ ఖాళీలు భర్తీ అవుతున్నాయి. చిన్నవారిని, బలహీనులని ఆక్షేపిస్తూ వారి విజ్ఞానాన్ని, కృషిని అవహేళన చేయకండి" అని చెబుతాడు. అనంతరం, ఉడుతను చేతిలోకి తీసుకుని కృతజ్ఞతగా వీపు నిమురుతాడు. ఉడుత వీపు భాగంలో ఏర్పడిన చారలు రాముడు నిమిరినందునే ఏర్పడినట్టు రామాయణం చెబుతోంది.

స్ఫూర్తి ఏంటంటే

నేను సాధారణ వ్యక్తిని, ఏమీ చేయలేనేమో అనే నిరాశాభావాన్ని విడనాడండి. ఈ దేశం కోసం ఎలాంటి సంకోచాలు లేకుండా మీ వంతు కర్తవ్యంగా చిన్నదైనా, పెద్దదైనా ఏదో ఒకటి ప్రతి ఒక్కరూ చేయండి. అది ఈ దేశాన్ని సమున్నతంగా నిలబెట్టడం ఖాయం. ఈ దేశంలో నిరాశకు తావులేదు.



గుహుడు


గంగా నది ఒడ్డున ఉన్న గిరిజన సామ్రాజ్యం 'నిషద్'కు గుహుడు రాజు. అయోధ్యను వీడిన సీతారామ లక్ష్మణులు నిషద్‌కు చేరుకుని, గంగా నదిని దాటేందుకు ప్రయత్నిస్తారు. ఈ సమయంలో గుహుడు రామునితో స్నేహం చేసి వారిని గంగానదిని దాటిస్తాడు. అప్పుడు ప్రారంభమైన ఈ స్నేహం కడదాకా కొనసాగింది. రాముని తమ్ముడు భరతుడు.. అన్నను వెతుక్కుంటూ నిషద్‌కు వచ్చినప్పుడు.. గుహుడు ఆయనను అనుమానిస్తాడు. రామునికి ప్రమాదం తలపెట్టేందుకే భరతుడు వచ్చాడని భావిస్తాడు. దీంతో భరతుడిని ఎలాగైనా అడ్డుకుంటానని గుహుడు శపథం చేస్తాడు. కానీ, తన అన్నను తిరిగి అయోధ్యకు తీసుకువెళ్లేందుకే భరతుడు వచ్చాడని తెలుసుకున్నాక అదే భరతుడికి సాదర స్వాగతం పలుకుతాడు. 14 ఏళ్ల వనవాసం పూర్తయి.. తిరిగి అయోధ్యకు చేరుకున్నాక కూడా రాముడు గుహుడిని మరిచిపోలేదు.

ఇదీ స్ఫూర్తి

భారతీయుల స్నేహం ఎలా ఉండాలో చెప్పేందుకు రాముడు-గుహుడి ఉదంతమే నిదర్శనం. సమున్నత భారత దేశం సాకారానికి ప్రతీ భారతీయుడూ ఈ స్నేహాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి.

జటాయు

సీతాదేవిని రావణుడు అపహరించుకుని వెళ్తున్న సమయంలో జటాయు పక్షి ఎంతో సాహసోపేతంగా రావణుడిపై పోరాటం చేస్తుంది. తీవ్రస్థాయిలో జరిగిన యుద్ధంలో జటాయు నేలకూలిపోతుంది. అనంతరం, రాముడు సీతమ్మను వెతుకుతూ ఆ దారిలో వచ్చాక రావణుడు అపహరించిన విషయాన్ని ఆయనకు చెప్పి, రాముని చేతుల్లోనే తుదిశ్వాస విడుస్తుంది. నిజానికి రావణుడు చాలా శక్తిమంతుడు. అలాంటి రావణుడిని తాను జయించలేనని తెలుసు. అయినప్పటికీ.. జటాయు రావణుడిని ఎదిరించి, అంకిత భావంతో తుది వరకు పోరాడుతుంది.



స్ఫూర్తి

జటాయు చూపిన కర్తవ్య భావాన్ని ప్రతి ఒక్కరూ పుణికి పుచ్చుకోవడం ద్వారా సమున్నతమైన భారత దేశ పునాదికి నాంది పలుకుదాం. మన జీవితంలోని ప్రతి క్షణాన్నీ జాతి నిర్మాణానికి అంకితం చేస్తామని మనమంతా ప్రతిజ్ఞ చేద్దాం.



మోదీ ఉపవాస దీక్ష విరమణ

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ క్రతువు పూర్తయిన తర్వాత ప్రధాని మోదీ తన 11 రోజుల ఉపవాస దీక్షను ముగించారు. పూజలో ఉపయోగించిన పాలతో చేసిన పానీయం 'చరణామృతం'ను రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు గోవింద్ దేవ్ గిరి మహరాజ్.. మోదీకి ఇచ్చారు. ఈ క్రతువులో దేశ ప్రజల తరఫున పాల్గొనడం భగవంతుడు ఇచ్చిన అవకాశమని పేర్కొన్న మోదీ.. ఈ నెల 12న మహారాష్ట్రలోని పంచవటిలో ఉపవాస దీక్ష ప్రారంభించారు. ఈ 11 రోజులు రాముడి జీవితంతో సంబంధం ఉన్న ఆలయాలను సందర్శించారు.

కార్మికులపై మోదీ పూల జల్లు

అయోధ్య రామ మందిర నిర్మాణంలో పాల్గొన్న కార్మికులపై ప్రధాని మోదీ పూల జల్లు కురిపించారు. ఆలయంలో క్రతువు పూర్తయిన తర్వాత మోదీ.. కార్మికుల వద్దకు వెళ్లి అభివాదం చేశారు. అక్కడి గంపలో నుంచి పూలు తీసి కార్మికులపై చల్లారు.

అతిథులకు కానుకలివీ..

అయోధ్యపై పుస్తకం, లోహపు ప్రమిద, తులసిమాల, శ్రీరాముడి పేరు ఉన్న ఉత్తరీయం... ఇవీ అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి హాజరైన అతిథులకు అందించిన కానుకలు! 'అయోధ్య ధామ్- శ్రీరాముడి నిలయం' పేరిట ప్రచురించిన ఈ పుస్తకం కవర్‌పై రామ్ లల్లా పాత విగ్రహాన్ని కూడా ముద్రించారు. ఇంకా నాలుగు లడ్డూలు ఉన్న పెట్టె, జీడిపప్పు, ఎండుద్రాక్ష, రేవడీ స్వీటు, చిప్స్ కూడా అందజేశారు.



సముద్ర గర్భంలో శ్రీరాముడు!

విశాఖపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని విశాఖపట్నంలో లివిన్ ఎడ్వంచర్స్ సంస్థ వినూత్న కార్యక్రమం చేపట్టింది. నేవీలో సబ్ మెరైనర్‌గా పనిచేసి రిటైరై స్కూబా డైవింగ్‌లో శిక్షణ ఇస్తున్న బి.బలరామునాయుడు తన మిత్రులతో కలిసి ప్రత్యేకంగా రూపొందించిన శ్రీరాముడి చిత్రపటాన్ని రుషికొండ సాగర గర్భంలో 22 అడుగుల లోతున సోమవారం ప్రతిష్ఠించారు. భారతీయుల కల నెరవేరిన సంతోషంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

అయోధ్యలో ఇక కర్ఫ్యూలుండవు

- తుపాకీ కాల్పుల మోతలు వినిపించవు
- అంతటా దీపోత్సవం... రామోత్సవమే: యోగి ఆదిత్యనాథ్

అయోధ్య, జనవరి 22: ఆయోధ్య ఇక రామ నామ స్మరణతో మార్మోగుతుందని.. దీపోత్సవ వెలుగులతో విరాజిల్లుతుందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ వ్యాఖ్యానించారు. 'ఇక ఆయోధ్య వీధుల్లో కాల్పుల మోతలు ఉండవు. ఈ ప్రాంతంలో కర్ఫ్యూలు ఉండవు. అయోధ్యలో దీపోత్సవం, రామోత్సవం మాత్రమే ఉంటాయి. వీధులన్నీ నిత్యం జై శ్రీరాం సంకీర్తనతో మారుమోగుతాయి' అని యోగి అన్నారు. అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం యోగి ప్రసంగించారు. సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉండగా ములాయంసింగ్ యాదవ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అయోధ్య కోసం పోరాడుతున్న 17 మంది కరసేవకులు పోలీసు కాల్పుల్లో మృతి చెందారు. ఆ ఉదంతాన్ని యోగి పరోక్షంగా ప్రస్తావించినట్లు భావిస్తున్నారు. రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనతో రామరాజ్యం సాకారమవుతుందని ఆయన అన్నారు. 1990 నాటి కాల్పుల ఉదంతాన్ని గుర్తుకు తెచ్చేలా యోగీ చేసిన ప్రసంగం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ములాయం కుమారుడు అఖిలేశ్ యాదవ్ సమాజ్‌వాదీ పార్టీ అధినేతగా ఉన్నారు. ఆయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు అఖిలేశ్‌ను ఆహ్వానించినా ఆయన ఈ కార్యక్రమానికి హాజరుకాబోనని ప్రకటించారు. తాను తర్వాత రాముడిని దర్శించుకుంటానని అఖిలేశ్ తెలిపారు.


చంద్రబాబు, జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు


పవన్ కల్యాణ్


పీటీ ఉష, చిరంజీవి, రామ్‌చరణ్


ముఖేశ్ అంబానీ దంపతులు

తారలు దిగి వచ్చిన వేళ..!

అయోధ్యలో క్రికెటర్లు, పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖుల సందడి


సచిన్, రజనీకాంత్


అయోధ్య, జనవరి 22: అల అయోధ్య పురిలో.. రాములోరి ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో.. బాలీవుడ్, టాలీవుడ్ తారలు సందడి చేశారు. ఈ కార్యక్రమానికి 8 వేల మందికి ఆహ్వానాలు అందగా.. వారిలో సుమారు అయిదొందల మందికి పైగా సినీ ప్రముఖులే..! వీరితోపాటు.. వర్ధమాన, మాజీ క్రీడాకారులు, వ్యాపార దిగ్గజాలు అయోధ్య ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలుగు సినీరంగం నుంచి చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ, కుమారుడు రామ్‌చరణ్‌తేజ్ ప్రత్యేక విమానంలో అయోధ్యకు చేరుకున్నారు. పవన్ కల్యాణ్, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, మోహన్‌బాబు, సుమన్, రజినీకాంత్, బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్, జాకీ ష్రాఫ్, ఆయన కుమారుడు టైగర్‌ష్రాఫ్, కంగనా రనౌత్, మాధురీ దీక్షిత్, విక్కీ కౌశల్-కత్రినా కైఫ్ దంపతులు, ఆయుష్మాన్ ఖురానా, వివేక్ ఒబెరాయ్, రణబీర్ కపూర్, అలియా భట్, అనుపమ్‌ఖేర్, అక్షయ్‌కుమార్, హేమమాలిని-ధర్మేంద్ర దంపతులు, సన్నీదేవోల్, దర్శక నిర్మాతలు సంజయ్‌లీలా భన్సాలీ, రిషబ్‌శెట్టి, అజయ్ దేవ్‌గణ్, రాజ్‌కుమార్ హిరానీ, మహావీర్ జైన్, రోహిత్ శెట్టి, ఆదిపురుష్ చిత్ర నిర్మాత ఓంరౌత్, సుభాష్ గాయ్, గాయకులు శ్రేయా ఘోషల్, అనురాధ పౌడ్వాల్, శంకర్ మహదేవన్, హరిహరన్, సోనూనిగమ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక వ్యాపార దిగ్గజాలు కూడా బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించి పులకించిపోయారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ, ఆయన సతీమని ఈషా, కుమారుడు అనంత్ అంబానీ, రిలయన్స్ టెలికాం అధినేత అనిల్ అంబానీ, గౌతం అదానీ, ఈస్‌మైట్రిప్ సహ-వ్యవస్థాపకుడు, సీఈవో నిశాంత్ పిట్టి, ఓయోరూమ్స్ వ్యవస్థాపక సీఈవో రితేశ్ అగర్వాల్, మాజీ క్రికెటర్లు సచిన్ తెందూల్కర్ దంపతులు, అనిల్ కూంబ్లే దంపతులు, టీవిండియా మహిళా జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ రాములవారి ప్రాణప్రతిష్ఠ ఘట్టాన్ని తిలకించారు. మధ్యాహ్నం అభిజిత్ ముహూర్తానికి ప్రాణప్రతిష్ఠ జరగ్గానే.. కంగనా రనౌత్ బిగ్గరగా 'జై శ్రీరామ్' నినాదాలు చేస్తూ ఆకట్టుకున్నారు. 1987లో వీక్షకులను ఆకట్టుకున్న దూరదర్శన్ సీరియల్ రామాయణ్‌లో రాముడి పాత్రను పోషించిన అరుణ్ గోవిల్‌తో అమితాబ్ బచ్చన్ ముచ్చటించడం, రజినీకాంత్‌తో అనుపమ్‌ఖేర్ సెల్ఫీలు, విమానాశ్రయంలో బాలీవుడ్ దిగ్గజాల వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



మిథాలీ, సైనా నెహ్వాల్

ఏరీ ఆ ప్రముఖులు!


అయోధ్యలో ఉమాభారతి, సాధ్వి రితంభర

అయోధ్య, జనవరి 22: విత్తు నాటినవారికే ఫలాలు లభించకపోవచ్చు! అయోధ్య రామమందిర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన అనేక మంది ప్రముఖులు.. సోమవారం అంగరంగ వైభోగంగా జరిగిన ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో కనిపించకపోవడమే ఇందుకు ఉదాహరణ. నాడు ఉద్యమాన్ని ముందుండి నడిపించినవారిలో కొందరు ఇప్పుడు జీవించిలేరు. ఉన్న కొద్ది మందిలో కొందరు వయోభారంతో రాలేకపోతే.. కొందరిని 'మీకు వయసైపోయింది, ఆరోగ్యం బాగోలేదు కాబట్టి రావొద్దు' అంటూ ముఖమ్మీదే చెప్పేశారు! అలాంటివారిలో ముఖ్యులు.. రామజన్మభూమి ఉద్యమం అనగానే గుర్తొచ్చే ఎల్‌కే ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషీ. వీరిలో ఆడ్వాణీ వయసు 96 సంవత్సరాలు కాగా.. మురళీ మనోహర్ జోషీ వయసు 90 ఏళ్లు! వీరిద్దరూ ఈ కార్యక్రమానికి రావడం తప్పనిసరి అని పేర్కొంటూనే.. వారి వయసు, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా రావొద్దని విజ్ఞప్తి చేసినట్టు రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సెక్రటరీ చంపత్‌రాయ్ నెలరోజుల క్రితమే ప్రకటించారు. తాను రావొద్దని చెప్పినప్పటికీ.. వస్తానంటూ జోషీ మొండికేశారని, కానీ ఆయనకు మోకాళ్ల సర్జరీ అయినందున, చలికాలం చలిని తట్టుకోలేరు కాబట్టి రావొద్దంటూ పదేపదే విజ్ఞప్తి చేశానని చంపత్‌రాయ్ అప్పట్లో వెల్లడించారు. ఈ విషయం బయటకు రాగానే దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కావడంతో వీహెచ్‌పీ, ఆరెస్సెస్ వెళ్లి ఇద్దరినీ ఆహ్వానించిన సంగతి తెలిసిందే. కానీ, సోమవారం వీరిద్దరూ ప్రాణ ప్రతిష్ఠకు రానే లేదు. అలాగే.. ఈ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినవారిలో ప్రమోద్ మహాజన్, అశోక్ సింఘాల్, కల్యాణ్‌సింగ్ చనిపోయారు. సోమవారం జరిగిన ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన నాటి ఉద్యమ ప్రముఖుల్లో.. ఉమాభారతి, సాధ్వి రితంభర, వినయ్‌కటియార్ వంటి అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు.





ప్రాణప్రతిష్ఠకు ముస్లింలు

- హాజరైన ఏఐఐవో చీఫ్ ఇమామ్ ఉమర్ ఇల్యాసీ.. అన్సారీ కూడా


అయోధ్యలో ఉమర్ ఇల్యాసీ

అయోధ్య, జనవరి 22: ఆలిండియా ఇమామ్ ఆర్గనైజేషన్ (ఏఐఐవో) అధ్యక్షుడు డాక్టర్ ఇమామ్ ఉమర్ అహ్మద్ ఇల్యాసీ సోమవారం అయోధ్యకు వచ్చారు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందుకున్న వేలాది మంది ప్రముఖుల్లో ఆయనా ఒకరు. ఆహ్వానాన్ని అందుకోవడంతోనే సరిపెట్టుకోకుండా.. కార్యక్రమానికి హాజరై హిందూముస్లింల మధ్య సుహృద్భావాన్ని చాటే ప్రయత్నం చేశారాయన. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఇల్యాసీ.. 'ఇది మారుతున్న భారతదేశ నవీన ముఖచిత్రం. మతాలన్నింటిలోకీ అతి పెద్దది మానవత్వం. మాకు దేశమే అన్నింటికన్నా ముందు" అని వ్యాఖ్యానించారు. అలాగే.. బాబ్రీమసీదు కేసులో ముస్లింల తరఫున వాదనలు వినిపించిన ఇక్బాల్ అన్సారీ కూడా ఈ వేడుకకు వచ్చారు. వీరిద్దరితోపాటు.. కొంత మంది ముస్లిం కరసేవకులు, ఆరెస్సెస్ మైనారిటీ విభాగమైన ముస్లిం రాష్ట్రీయ మంచ్ కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కత్రీనా కైఫ్, ఆలియా భట్ వంటి ప్రముఖులూ సోమవారం నాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక, ఈ వేడుకలకు రాకున్నా.. కశ్మీరీ ముస్లింలు బాల రాముడికి కానుకగా అత్యంత ఖరీదైన, కల్తీ లేని స్వచ్ఛమైన 2 కిలోల కుంకుమపువ్వును కానుకగా పంపించడం విశేషం.




రామయ్యా.. వచ్చాడయ్యా!

(మొదటిపేజీ తరువాయి)

స్వామి వారికి పట్టు వస్త్రాలు, వెండి ఛత్రం సమర్పించారు. సరిగ్గా 12 గంటల 29 నిమిషాల 8 సెకన్ల నుంచి 12 గంటల 30 నిమిషాల 32 సెకన్ల వరకూ అంటే 84 సెకన్లపాటు రామయ్య ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. పండితులు మూల మంత్రాలను పఠిస్తుండగా.. తొలుత, విగ్రహం కళ్లకు అచ్ఛాదనగా కట్టిన వస్త్రాన్ని మోదీ తొలగించారు. అనంతరం, బంగారంతో చేసిన చిన్న కడ్డీతో బాల రాముడి కళ్లకు కాటుక దిద్దారు. తర్వాత ఆయనకు అద్దాన్ని చూపించారు. చివరిగా, తొలి మహా హారతిని మోదీ ఇచ్చారు. తామర పువ్వును రాముడి పాదాల వద్ద ఉంచి, సాష్టాంగ నమస్కారం చేశారు. దీనితో ప్రాణ ప్రతిష్ఠ క్రతువు పూర్తయింది. ఆ వెంటనే, ఎడమ చేతిలో విల్లు, కుడి చేతిలో బాణం ధరించిన ఐదు సంవత్సరాల అయోధ్య రాముడు చిరు మందహాసం, ప్రసన్న వదనంతో భక్తులకు దర్శనమిచ్చాడు. పసుపు రంగు పంచె, రాళ్లు పొదిగిన స్వర్ణాభరణాలు, ఎరుపు, పసుపు, వంకాయ రంగు పువ్వులతో కూడిన దండలు ధరించిన రామయ్య నయనానందకరంగా కనిపించాడు. దాంతో, జైశ్రీరాం నినాదాలు అయోధ్యలో మార్మోగాయి. కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీతోపాటు ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ మాత్రమే గర్భ గుడిలో ఆసీనులయ్యారు. తొలుత వారు రాముడిని దర్శించుకున్న తర్వాత అతిథులనూ అనుమతించారు. మంగళవారం నుంచి భక్తులు రాముడిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. దాదాపు ఐదారు అంగుళాల ఎత్తు మాత్రమే ఉన్న రామ్‌లల్లా విగ్రహాలనూ అక్కడే ఉంచారు. కార్యక్రమానికి 11 వేల మందికిపైగా అతిథులకు ఆహ్వానాలు పంపగా.. ఎనిమిది వేల మందికిపైగా ఆధ్యాత్మికవేత్తలు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, సినీ నటులు, క్రీడాకారులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. అయోధ్య మహోత్సవాన్ని బీజేపీ రాజకీయం చేసిందని ఆరోపిస్తూ ప్రతిపక్షంతోపాటు వివిధ పార్టీల నేతలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అనంతరం, అక్కడికి కొద్ది దూరంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు మోదీ సహా ఇతర నేతలు చేరుకున్నారు. అక్కడ అతిథులను ఉద్దేశించి ప్రసంగించారు. 'మన రాముడు తిరిగొచ్చాడు' అని మోదీ అనడంతోనే జైశ్రీరాం నినాదాలు మార్మోగాయి. ఆ తర్వాత కుబేర్ తిల ప్రాంతంలోని శివ లింగానికి మోదీ అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో జటాయు విగ్రహాన్ని ఆవిష్కరించారు. రామ మందిర నిర్మాణంలో పాల్పంచుకున్న కార్మికులను సత్కరిస్తూ గులాబీ రేకులను వారిపై చల్లారు. చివరిగా, 11 రోజులపాటు తాను కొనసాగించిన అనుష్ఠానాన్ని ముగించి.. ఆలయ ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి అందించిన 'చర్నామృత్' ప్రసాదాన్ని స్వీకరించారు.

మంగళ ధ్వనులతో మంత్రముగ్ధం

ప్రాణ ప్రతిష్ఠకు ముందు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందిన 50 రకాల సంప్రదాయ వాయిద్యాలతో రామచంద్ర ప్రభువుకు 'మంగళ ధ్వనులు' వినిపించారు. అనంతరం స్వరార్చన చేశారు. ఢిల్లీకి చెందిన సంగీత నాటక అకాడమీ సహకారంతో అయోధ్యకు చెందిన ప్రముఖ కవి యతీంద్ర మిశ్రా దీనిని నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఢోలక్, ఫ్లూట్, పంఖవాజ్; ఆంధ్రప్రదేశ్ నుంచి ఘటం; కర్ణాటక నుంచి వీణ; తమిళనాడు నుంచి నాగస్వరం, మృదంగం, తవిల్; పంజాబ్ నుంచి అగ్గోజా; మహారాష్ట్ర నుంచి సుందరి; ఒడిసా నుంచి మర్దల; మధ్యప్రదేశ్ నుంచి సంతూర్; ఛత్తీస్‌గఢ్ నుంచి తంబుర; ఢిల్లీ నుంచి షెహనాయ్; జార్ఖండ్ నుంచి సితార్ తదితర వాయిద్యాలతో మంగళ ధ్వనులు మోగించారు. సోను నిగమ్, అనురాధా పౌఢ్వాల్, శంకర్ మహదేవన్ తదితరులు స్వరార్చన చేశారు. అలాగే, అయోధ్య వీధులన్నీ 'రాముడొచ్చాడు', 'అవధ్‌కు రాముడొచ్చాడు' తదితర పాటలతో మార్మోగాయి.





మోదీకి ఆలయ నమూనాను బహూకరిస్తున్న యోగి

వజ్రాలు పొదిగిన ఆభరణాలు

బాలరాముడికి అలంకరించిన ఆభరణాలు మిరుమిట్లు గొలిపాయి. వజ్రాలు, కెంపులు, మరకతాలు పొదిగిన 14 రకాల ఆభరణాలను లఖ్‌నవూకు చెందిన హర్షహైమల్ శ్యామ్‌లాల్ జువెలర్స్ తయారు చేసింది. ఇవి యంత్రాలతో కాకుండా చేతితో చేసినవే కావడం విశేషం. వీటిలో తిలకం, ధనుస్సు, బాణం, కిరీటం, ఐదు పేటల విజయహారాలు, వడ్డాణం, చేతి పట్టీలు, కడియాలు, కాలిమువ్వలు, ముద్రిక ఉన్నాయి.

అమోఘ 'తాళం'.. భక్తి 'సంద్రం'



యూపీలోని అలీగఢ్ నుంచి 400 కిలోల భారీ తాళం అయోధ్యకు చేరింది. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ తాళాన్ని అలీగఢ్‌కు చెందిన సత్యప్రకాశ్ శర్మ, రామ్‌లల్లాకు కానుకగా ఇచ్చారు. సత్యప్రకాశ్, ఆయన భార్య రుక్మిణి దేవి, కుమారుడు మహేశ్ చంద్ ఈ భారీ తాళాన్ని తయారు చేశారు. అలాగే హైదరాబాద్ నుంచి 1265 కిలోల భారీ లడ్డూ కూడా అయోధ్యకు చేరింది. దీన్ని నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలోని శ్రీరామ్ కేటరర్స్ తయారు చేసింది. అయోధ్య రామయ్యకు తిరుపతి వెంకన్న నోరుతీపి చేశాడు. తిరుమల నుంచి లక్ష లడ్డూలు అయోధ్యకు చేరాయి. వీటిని అక్కడి భక్తులకు అందజేస్తారు. అయోధ్యలో కొండంత దేవుడు కొలువుతీరిన సందర్భంగా సముద్రుడి హృదయమూ భక్తితో ఉప్పొంగింది.

రామ సుందరం



రామభక్తులంతా ఎప్పుడెప్పుడా అని ఆత్రంగా ఎదురుచూసిన బాల రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్విఘ్నంగా, విజయవంతంగా జరిగిపోయింది! ఎడమచేత బంగారు విల్లు, కుడిచేత బాణం పట్టుకుని.. జీవం ఉట్టిపడే కమల దళాల వంటి కన్నులతో.. ముద్దులు మూటగట్టేలా ఉన్న ఆ చిన్నారి రామున్ని చూడ్డానికి భక్తులకు రెండు కళ్లూ సరిపోలేదంటే అతిశయోక్తి కాదు! ఈ ఘట్టం చరిత్రాత్మకమైతే.. బాల రాముడి విగ్రహం ఎంతో అపురూపం. 4.25 అడుగుల ఆ విగ్రహం బరువు 150 నుంచి 200 కిలోల దాకా ఉంటుందని అంచనా. విగ్రహ నిర్మాణానికి వాడిన శిల.. శిల్పనిర్మాణానికి అత్యంత అనువైన కృష్ణశిల. కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా జయపుర హోబ్లీలోని గుజ్జెగౌడనపురలో వ్యవసాయ భూమి నుంచి ఈ శిలను వెలికితీశారు. రామదాసు అనే వ్యక్తి పొలంలో కొంత భాగం పైకి పొడుచుకు వచ్చినట్టుగా ఉండడంతో ఈ రాతిని తొలగించి, భూమిని చదును చేసేందుకు ఆయన ప్రయత్నించారు. తీరా మట్టి తొలగించడం మొదలుపెడితే.. బ్రహ్మాండమైన కృష్ణ శిల బయటపడింది. ఆ నోటా ఈ నోటా పడి ఈ విషయం అయోధ్య ట్రస్టుకు చేరింది. అలా ఈ శిలను విగ్రహ నిర్మాణానికి ఉపయోగించారు.

సర్వాభరణ భూషితుడై..

స్వామి ప్రతిమకు అలంకరించిన కిరీటాన్ని లఖ్‌నవూకు చెందిన హర్‌సహాయ్‌మల్ శ్యామ్ లాల్ జ్యువెలర్స్ వారు తయారు చేశారు. 1.7 కిలోల బంగారంతో చేసిన ఆ కిరీటంలో 75 క్యారెట్ల వజ్రాలను, 135 క్యారెట్ల పచ్చలను, 262 క్యారెట్ల కెంపులను వాడారు. ఆ వజ్రాలు, పచ్చలు, కెంపులన్నీ ఇంటర్నేషనల్ జెమలాజికల్ ఇన్‌స్టిట్యూట్ ధ్రువీకరించినవి. స్వచ్ఛమైనవి. జాగ్రత్తగా గమనిస్తే.. కిరీటం మధ్యలో సూర్యుడి బొమ్మ కనిపిస్తుంది. రాముడు రవికుల తిలకుడని చెప్పడానికి అలా సూర్యుడిని పొందుపరచారు. ఇక.. రాముడికి పెట్టిన తిలకం కూడా బంగారందే. 16 గ్రాముల బంగారాన్ని, 3 క్యారెట్ల వజ్రాన్ని ఈ తిలకం తయారీలో వినియోగించారు. 3 క్యారెట్ల వజ్రం చుట్టూ.. 10 క్యారెట్ల చిన్న చిన్న వజ్రాలను, బర్మా కెంపులను పొందుపరచారు. ఇక బాలరాముడి కుడిచేతి బొటనవేలికి పెట్టిన ఉంగరం బరువు 65 గ్రాములు. మధ్యలో పొదిగిన పెద్ద పచ్చ.. జాంబియన్ ఎమరాల్డ్. ఎడమచేతికి పెట్టిన కెంపుల ఉంగరం బరువు 26 గ్రాములు. అందమైన కంఠసీమకు అలంకరించిన నెక్లెస్ బరువు దాదాపు అరకిలో. స్వామి ఛాతీకి అలంకరించిన పంచ్‌లడా బరువు 660 గ్రాములు. ఇంకా.. రెండు కిలోల బరువుండే విజయమాల.. ముప్పావు కిలో బరువుండే కడియం (70 క్యారట్ల వజ్రాలు, 850 క్యారట్ల కెంపులు, పచ్చలు).. 400 గ్రాముల బరువుండే వడ్డాణం.. 850 గ్రాముల బరువైన హస్తాభరణాలు (100 క్యారట్ల వజ్రాలు, 320 క్యారట్ల కెంపులు, పచ్చలతో తయారుచేసినవి).. 400 గ్రాముల బరువుండే పాద మంజీరాలు స్వామికి అలంకరించారు.

-సెంట్రల్ డెస్క్


5 అయోధ్యకు ఏటా కోట్ల మంది!

రామయ్య దర్శనానికి భారీగా భక్తులు..

స్వర్ణ దేవాలయం, తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయాలను మించి యాత్రికులు..!

భారత పర్యాటక రంగానికి భారీ ఊతం.. అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ జెఫరీస్ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 22: అయోధ్యలో రామ మందిర నిర్మాణం భారతీయుల చిరకాల స్వప్నం. అది ఎట్టకేలకు సాకారమైంది. భవ్యమైన రామాలయం నిర్మితమైంది. అందులో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కూడా వైభవోపేతంగా జరిగింది. విశిష్టమైన ఈ రామాలయం ఆధ్యాత్మికంగానే కాదు.. ఆర్థికంగానూ తీవ్ర ప్రభావం చూపనుంది! అయోధ్య రామాలయం భారత్‌లో సరికొత్త ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మారనుందని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ జెఫరీస్ పేర్కొంది. బాలరాముడిని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న రామభక్తులు అయోధ్యకు తరలి రానున్నారు. నిత్యం 1-1.5 లక్షల మంది భక్తులు ఈ చారిత్రక నగరాన్ని సందర్శించే అవకాశం ఉందని జెఫరీస్ గ్రూప్ అంచనా వేసింది. అయోధ్య ఆలయంతో దేశ పర్యాటక ముఖ చిత్రమే మారిపోనుందని అభిప్రాయపడింది. ఏటా 5 కోట్ల మంది యాత్రికులు అయోధ్యను సందర్శించే అవకాశం ఉందని జెఫరీస్ నివేదిక అంచనా వేసింది. ఇది అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం, తిరుపతిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లే భక్తుల సంఖ్య కంటే ఎక్కువ కావడం గమనార్హం. ప్రస్తుతం అమృత్‌సర్ స్వర్ణ దేవాలయాన్ని ఏటా 3-3.5 కోట్ల మంది, తిరుపతి ఆలయాన్ని 2.5-3 కోట్ల మంది భక్తులు సందర్శిస్తున్నారు. భారత పర్యాటక రంగంలో ఇప్పటికీ మతపరమైన పర్యాటకమే అతిపెద్దదని జెఫరీస్ పేర్కొంది. రూ.85 వేల కోట్లతో అయోధ్య నగరం రూపురేఖలు మార్చేస్తున్నారని తెలిపింది. నగరంలో కొత్త ఎయిర్‌పోర్టు, నవీకరించిన రైల్వేస్టేషన్, మెరుగుపర్చిన రోడ్డు రవాణా వ్యవస్థతోపాటు హోటళ్లు, ఇతర ఆర్థిక కార్యకలాపాలు భారీగా పెరగనున్నట్లు తెలిపింది. మౌలిక సదుపాయాల వృద్ధితో పర్యాటకం మరింత పుంజుకోనుందని వివరించింది. "అయోధ్యలో ఆలయ ప్రారంభోత్సవం తర్వాత యాత్రికుల పెరుగుదలతోపాటు ఆర్థికంగానూ అనేక రంగాలు లాభపడతాయి. ముఖ్యంగా హోటళ్లు, విమానయానం, ఆతిథ్యం, ప్రయాణ అనుబంధ, సిమెంటు రంగాలు ప్రయోజనం పొందనున్నాయి. దేశ పర్యాటక రంగానికి సరికొత్త నమూనాగా మారనుంది. ఈ చారిత్రక నగరం ఇకపై అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా అవతరించనుంది" అని జెఫరీస్ వెల్లడించింది.



నేటి నుంచి అందరికీ రామ్‌లల్లా దర్శనం

దర్శన, హారతి వేళలు వెల్లడించిన ట్రస్ట్

అయోధ్య, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా సోమవారం మధ్యాహ్నం దివ్యమైన ముహూర్తంలో అభిజిత్ లగ్నంలో ప్రాణప్రతిష్ఠ ఉత్సవం కన్నుల పండుగలా జరిగింది. అయితే భద్రతా కారణాల రీత్యా సామాన్య పౌరులను సోమవారం శ్రీరాముడిని దర్శనానికి అనుమతించలేదు. మంగళవారం నుంచి రామ్‌లల్లా దర్శనభాగ్యం అందరికీ కల్పిస్తామని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ వెల్లడించింది. అయోధ్యలో బాలరాముడి దర్శనం, హారతి వేళల వివరాలను తమ వెబ్‌సైట్‌లో వెల్లడించింది. ఆ వివరాలు ఇలా..

దర్శన వేళలు : ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు.
జాగరణ హారతి: ఉదయం 6.30 గంటలకు
సంధ్యా హారతి : రాత్రి 7.30 గంటలకు.

పాస్‌లు పొందడం ఎలా..?

హారతి లేదా దర్శనంలో పాల్గొనడానికి ప్రజలు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో పాస్‌లు పొందవచ్చు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలనుకుంటే అయోధ్య రామమందిర అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, నచ్చిన స్లాట్‌ను ఎంచుకోవచ్చు. కాగా, ప్రస్తుతానికైతే ఆన్‌లైన్ బుకింగ్స్ నిలిపివేశారు. శ్రీరాముడి దర్శనం చేసుకుని, హారతి తీసుకోవాలనుకునే భక్తులు తప్పనిసరిగా ఆధార్ కార్డు వంటి గుర్తింపు కార్డులు చూపించాల్సి ఉంటుంది.

ఈ భూమ్మీద అత్యంత అదృష్టవంతుడిని నేనే

బాలరాముడి విగ్రహ రూపశిల్పి అరుణ్ యోగిరాజ్



అయోధ్య, జనవరి 22: ఈ భూమ్మీద తనకంటే అదృష్టవంతుడు మరొకరు ఉండరని బాల రాముడి విగ్రహ రూపశిల్పి అరుణ్ యోగిరాజ్ ఆనందం వ్యక్తం చేశారు. కర్ణాటకలోని మైసూరుకు చెందిన శిల్పి యోగిరాజ్ తయారు చేసిన విగ్రహం అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠాపనకు ఎంపికైంది. విగ్రహంలో రామ్‌లల్లా కమలంపై నిలబడిన ఐదేళ్ల చిన్నారిగా దర్శనమిచ్చాడు. విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా యోగిరాజ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఇప్పుడు ఈ భూమ్మీద అత్యంత అదృష్టవంతుడిని నేనే. ఆ శ్రీరాముడి ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయి. ఇదంతా తలచుకుంటుంటే కొన్నిసార్లు కలల ప్రపంచంలో ఉన్నానేమో అనిపిస్తుంది" అంటూ అమితానందం వ్యక్తం చేశారు.



ప్రత్యక్ష ప్రసారం వీక్షించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా, నడ్డా

న్యూఢిల్లీ, జనవరి 22 : కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర బీజేపీ అగ్రనేతలు అయోధ్య రామాలయంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని దేశ రాజధాని నగరంలో సోమవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. నగరంలోని ఆలయాల్లో ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జేపీ నడ్డా, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా, ఆ పార్టీ నాయకులు నగరంలోని ఝుండేవాలన్ ఆలయంలో, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి తదితర నేతలు లక్ష్మీ నారాయణ్ ఆలయం, బిర్లా మందిరాల్లో పూజలు చేశారు. కాగా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్‌లో 140 దేవాలయాల్లో అయోధ్య వేడుకను ప్రత్యక్ష ప్రసారం చేయగా వేలాది మంది వీక్షించారని ప్రకాశ్ జావడేకర్ పేర్కొన్నారు. అయోధ్య ఆహ్వానాన్ని రాహుల్ తిరస్కరించారని, కానీ.. ఆయన నియోజకవర్గ ప్రజలు మాత్రం ఈ వేడుక ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు ఆలయాలకు పోటెత్తారని ఆయన చెప్పారు.



అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠ సమయంలోనే కర్నూలు జిల్లా మంత్రాలయంలో 59 అడుగుల ఏకశిల శ్రీరాముడి విగ్రహాన్ని మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు సోమవారం ఆవిష్కరించారు. భారీగా తరలివచ్చిన భక్తుల నడుమ పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- మంత్రాలయం



అంతా రామమయం

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు.. వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

న్యూఢిల్లీ, జనవరి 22: అయోధ్యలోని రామమందిరంలో నిర్వహించిన బాలరాముడి ప్రాణప్రతిష్ఠతో యూపీతోపాటు దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉదయం నుంచే భక్తులు ఆలయాల్లో సందడి చేశారు. దైవ దర్శనం చేసుకుని, దీపాలు వెలిగించారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పలు రాష్ట్రాల్లో స్వామివారి ర్యాలీలు, భక్తుల పూజలు, భజనలు, కీర్తనలతో శ్రీరామనామం మారుమోగింది. ప్రతి రాష్ట్రంలోనూ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని స్ర్కీన్‌లు ఏర్పాటు చేసి, ప్రత్యక్ష ప్రసారం చేశారు. పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించారు. మరికొన్ని చోట్ల విద్యాసంస్థలకు సెలవు ఇచ్చి, ప్రభుత్వ కార్యాలయాలకు మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు. కొన్ని రాష్ట్రాల్లో డ్రై డేగా పాటించారు. ఝార్ఖండ్‌లోని 51 వేల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంషెడ్‌పూర్ జిల్లా గోల్మూరీలోని శ్రీలక్ష్మీనారాయణ్ ఆలయంలో వివేక్ మిశ్రా అనే ఆర్టిస్ట్ 18,500 చదరపు అడుగుల శ్రీరాముని రంగోలీని రూపొందించగా.. కేంద్రమంత్రి అర్జున్ ముండా ప్రారంభించారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్ జిల్లా భారత్-పాక్ సరిహద్దులోని తనోత్ మాతా ఆలయంలో బీఎస్ఎఫ్ జవాన్లు రామాయణ పఠనం చేశారు. కశ్మీరులో సాధారణ పరిస్థితి నెలకొనాలని కోరుతూ అనంత్‌నాగ్‌లోని సూర్యదేవాలయంలో భక్తులు 'హవనం' నిర్వహించారు. చోటీ అయోధ్యగా పేరొందిన నివారి జిల్లా ఓర్చాలోని రామాలయంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ పూజలు నిర్వహించారు. దేశరాజధాని ఢిల్లీలో ప్రభుత్వ ఆధ్వర్యంలో శోభాయాత్రా, సుందరకాండ హారతి, రాంలీలా తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గుజరాత్, బిహార్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, అసోం, అరుణాచల్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా, త్రిపుర, సిక్కిం తదితర రాష్ట్రాల్లో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అయోధ్యలో చంద్రబాబు, పవన్, చిరంజీవి

న్యూఢిల్లీ, అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో సోమవారం శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠకు మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు హాజరు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మెగాస్టార్ చిరంజీవి, టీడీపీ మిత్రపక్షమైన జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. చంద్రబాబుకు కేటాయించిన 8వ నంబర్ బ్లాకులోనే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, చిరంజీవి, తదితరులు ఉన్నారు. చంద్రబాబు ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ పక్కనే కూర్చుని కొద్ది సేపు ముచ్చటించారు. ప్రాణ ప్రతిష్ఠ తర్వాత ప్రధాని మోదీ వీవీఐపీలను, సాధువులను పలకరిస్తూ సాగారు. ఈ సందర్భంగా చంద్రబాబు, చిరంజీవి, పవన్ కల్యాణ్‌లను కూడా పలకరించారు. అనంతరం చంద్రబాబు, జస్టిస్ రమణ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. మాజీ చీఫ్ జస్టిస్ దంపతులతో ఫొటో కూడా దిగారు. తిరుపతి వైసీసీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి టీటీడీ ఛైర్మన్ హోదాలో హాజరయ్యారు. 'అయోధ్య రామ మందిరం కేవలం దేవాలయం కాదు. అది మన దేశ ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక మైలు రాయి' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి హాజరైన చంద్రబాబు మందిరం వద్ద దిగిన ఫొటోను ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, అయోధ్య ఆలయ నిర్మాణం కోసం భరత జాతి కొన్ని శతాబ్దాల పాటు వేచి చూసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. 'నేటి ప్రాణప్రతిష్ఠ సమయం ఓ ఉద్వేగ క్షణం. నిజంగా ఇది భారతీయులందరికీ భావోద్వేగ సమయం. ఈ చరిత్రాత్మక క్రతువులో పాలు పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నా' అని పవన్ అన్నారు.

జపాన్‌లోనూ 'జై శ్రీరామ్'

గుంటూరు సిటీ, జనవరి 22: అయోధ్య రామునికి జపాన్ కూడా నీరాజనం పట్టింది. బాలరామునికి ప్రాణప్రతిష్ఠ సమయంలో టోక్యో సమీపంలోని ఓజీమా నగరం రామ నామస్మరణతో మారుమోగింది. తెలుగు ప్రజలు ఒక్కచోట చేరి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



హైకోర్టులో శ్రీరాముని చిత్రం పటం వద్ద పూజలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

అయోధ్య రామునికి హైకోర్టులో ప్రత్యేక పూజలు

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో హైకోర్టులో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రాముడి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీలుగా న్యాయవాదుల సంఘం హాలులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కోర్టు ఆవరణలో మహిళా న్యాయవాదులు పూలతో చేసిన అలంకరణ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకీరామిరెడ్డి, ఉపాధ్యక్షుడు పీఎస్‌పీ సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో జీవీపీఆర్ ఛైర్మన్ వీరారెడ్డి



అయోధ్యలో జరిగిన బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మన్ వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, వారి తనయుడు, సంస్థ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి, కోడలు ప్రియాంకరెడ్డి పాల్గొన్నారు. శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ఆహ్వానం మేరకు కుటుంబ సమేతంగా వారు ఈ మహత్తర ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ తరఫున అయోధ్య రామాలయ నిర్మాణం కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రకు రూ.1.29 కోట్లు విరాళంగా అందజేశారు. ధార్మిక కార్యక్రమాలకు సంస్థ తరఫున విరాళాలు అందజేస్తుంటామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు.



ప్రపంచవ్యాప్తంగా సంబరాలు

» న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్‌స్క్వేర్ వద్ద లడ్డూల పంపిణీ

వాషింగ్టన్/పోర్ట్ ఆఫ్ స్పెయిన్: అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ వేళ ప్రపంచవ్యాప్తంగా ఉన్న రామభక్తులు వేడుకలు జరుపుకొన్నారు. పూజలు, ఇతర మతపరమైన కార్యక్రమాలు, కారు ర్యాలీలు నిర్వహించారు. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్ స్క్వేర్ వద్ద సోమవారం స్ర్కీన్‌పై రామ మందిర దృశ్యాలను ప్రదర్శించారు. భజనలు, భక్తిగీతాల ఆలాపన, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. లడ్డూలు పంపిణీ చేశారు. వాషింగ్టన్ డీసీ శివారు వర్జీనియాలోని ఫెయిర్ ఫాక్స్ కౌంటీలోని ఎస్‌వీ లోటస్ టెంపుల్‌లో ఆదివారం నాస్‌డాక్ స్ర్కీన్‌పై రామమందిరం ఫొటోలను ప్రదర్శించారు. ఈ వేడుకల్లో సిక్కులు, ముస్లింలు, పాకిస్థానీఅమెరికన్లు సహా 2,500 మంది వరకు పాల్గొన్నారు. లాస్ ఏంజెలిస్‌లో సుమారు 250 కార్లతో ర్యాలీనిర్వహించారు. మార్చి 25 నుంచి రామమందిర యాత్ర పేరిట అమెరికా, కెనడా దేశాల్లో వెయ్యి ఆలయాల సందర్శన చేపట్టనున్నట్టు వీహెచ్‌పీఏ(వరల్డ్ హిందూ కౌన్సిల్ ఆఫ్ అమెరికా), వీహెచ్‌పీసీ(విశ్వ హిందూ పరిషత్ ఆఫ్ కెనడా) ప్రకటించాయి. వాహనంలో సీతా రామ, లక్ష్మణ, హనుమ విగ్రహాలనుఈ యాత్రలో ఊరేగించడంతోపాటు అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలు, ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయనున్నట్టు తెలిపాయి. అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా కరీబియన్ దీవుల్లోని ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశంలోనూ వేడుకలు నిర్వహించారు. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఇప్పటికే మారీషస్ ప్రభుత్వం పూజల నిమిత్తం హిందువులకు రెండు గంటల అనుమతి మంజూరు చేసింది. పసిఫిక్ దీవుల్లోని ఫిజి దేశంలో ఈనెల 18 నుంచి 22 వరకు అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు.అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ వేళ మెక్సికో దేశంలో తొలి రామాలయాన్ని క్యూరేటరో నగరంలో సోమవారం ప్రారంభించారు. మెక్సికో దేశ తొలి హనుమాన్ గుడిని కూడా ఇదే నగరంలో ప్రారంభించారు. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ వేళ తాను భారతదేశంలో అడుగుపెట్టడం సంతోషంగా ఉందని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు డెనిస్ ఫ్రాన్సిస్ సంతోషం వ్యక్తం చేశారు.

శ్రీరాముడు మతానికి అతీతుడు..

మన విశ్వాసాలు ఏవైనా.. గౌరవం, విలువలతో జీవించడానికి అంకితమైన మహోన్నత వ్యక్తి శ్రీరాముడు.. ఆయన మతానికి అతీతుడు.. ఆయన బాణాలు చెడు, అన్యాయాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. 'రామరాజ్యం' అనే ఆదర్శ పాలన భావనే నేడు సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్ష. ఇప్పుడు 'రామ్' అనే పదం ప్రపంచానికి చెందింది..

- ఆనంద్ మహీంద్ర (ప్రముఖ వ్యాపారవేత్త)

అయోధ్య మందిరం మతసామరస్యానికి ప్రతీక

అయోధ్య రామమందిరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. పవిత్రమైన ఈరోజున తెరుచుకుంటున్న మందిర తలుపులు జ్ఞానోదయం, శాంతికి ప్రవేశ ద్వారంగా ఉండాలి. తద్వారా భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సామరస్యం ఈ సమాజాన్ని కాలతీత బంధంతో ఏకం చేయాలని కాంక్షిద్దాం..

- గౌతమ్ అదానీ (ప్రముఖ వ్యాపారవేత్త)

ఐక్యత, ఆధ్యాత్మికతకు ప్రతీక..

చరిత్ర ప్రతిధ్వనులు, విశ్వాసం, పవిత్రత మధ్య అయోధ్య రామాలయాన్ని గొప్పగా ప్రారంభించడం ఐక్యత, ఆధ్యాత్మికతకు చిహ్నాన్ని తెలియజేస్తుంది. ఇటువంటి చరిత్రకు సాక్షిగా నిలిచినందుకు ఎంతో గర్వంగా ఉంది. - మహేశ్ బాబు (సినీ నటుడు)

రామలక్ష్మణుల్లా వారు ఆలయాన్ని నిర్మించారు.. ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు అభినందనలు.. వారిద్దరూ రామలక్ష్మణుల మాదిరిగా కష్టపడి రామాలయాన్ని నిర్మించారు. ఆ భగవంతుడే వారికి సహకరించారు.

- సుమన్ (సినీ నటుడు)

ఈ అనుభూతి వర్ణించలేనిది..

అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ వేడుకను చూసి నా కళ్లలో ఆనంద బాష్పాలు వచ్చాయి. చాలా సంతోషంగా ఉన్నా.. ఈ అనుభూతి మరువలేనిది.. వర్ణించలేనిది.

- హరిహరన్ (సినీ గాయకుడు)

ఆంజనేయస్వామి ఆహ్వానించినట్లుగా ఉంది..

నా ఇష్ట దైవం ఆంజనేయ స్వామి స్వయంగా ఈ వేడుకకు ఆహ్వానించినంత సంతోషంగా ఉంది. ఇది అరుదైన అవకాశం. ఈ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. శ్రీరాముడి దివ్య ఆశీర్వచనాలు దొరకడం ఆనందంగా ఉంది.

- చిరంజీవి (సినీ నటుడు)

500 ఏళ్ల కళ సాకారమైంది..

ఇదో అద్భుత ఘట్టం. 500 ఏళ్ల తర్వాత మళ్లీ అదే స్థానంలో రామ మందిరం రూపుదిద్దుకోవడం శుభ పరిణామం. సహజంగానే ఇది దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక వేడుకలకు కారణభూతమవుతుంది. ఆలయానికి అనుకూలంగా తీర్పు వచ్చిన ఐదేళ్ల తర్వాత దేశమంతా అట్టహాసంగా వేడుకలు జరగడం మంచి విషయం.

- శ్రీ శ్రీ రవిశంకర్ (ఆధ్యాత్మిక వేత్త)

ఆధునిక భారత ముఖ చిత్రం..

ఇది ఆధునిక భారత ముఖ చిత్రం. మానవత్వమే మనకు అతి పెద్ద మతం. దేశాన్ని ప్రేమించడమే మనందరి ప్రథమ కర్తవ్యం. మా(ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్) ఆగమనం దేశవాప్తంగా ఉన్న 3 లక్షల మసీదుల్లోని 5 లక్షల మంది ఇమామ్‌ల రాకకు ప్రతీక.

- ఉమర్ అహ్మద్ ఇలియాస్ (ఏఐఐఓ చీఫ్ ఇమామ్)

చిరకాల కోరిక నెరవేరింది

అయోధ్యలో రామమందిర నిర్మాణం దేశంలోని హిందువుల చిరకాల కోరిక. నేడు అది నెరవేరింది. ఇందు కోసం 500 ఏళ్లు వేచి చూశాం. బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సంతోషకరం. దేశవ్యాప్తంగా ప్రతీ ఊరు శ్రీరామనామ స్మరణతో మారుమోగిపోతోంది. మళ్లీ రామరాజ్యం రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా శ్రీరాముడి నామాన్ని జపిస్తున్నారు.

- వెంకయ్యనాయుడు (మాజీ ఉప రాష్ట్రపతి)

కలహాలను వీడి.. కలిసి ఉండాలి

కలహాల వల్లే రాముడు అయోధ్యను వీడి వెళ్లాడు. 500 ఏళ్ల తర్వాత నేడు తిరిగి అయోధ్యకు వచ్చాడు. దీంతో దేశంలో రామ రాజ్యం ఆవిష్కృతమైంది. ఇకపై మనమంతా కలహాలను వీడి కలిసి ఉండాలి. అయోధ్యలో రాముడి రాకతో భారత్‌కు పూర్వ వైభవం వచ్చింది.

- మోహన్ భాగవత్ (ఆర్ఎస్ఎస్ చీఫ్)

మేం గాంధీజీ చెప్పిన శ్రీరాముడిని పూజిస్తాం

జాతిపిత మహాత్మా గాంధీజీ చెప్పిన శ్రీరామచంద్రుడిని కాంగ్రెస్ నేతలంతా భక్తితో పూజిస్తారు. రామ మందిరం అంశాన్ని రాజకీయం చేయరాదు. శ్రీరామ చంద్రుడు అందరి దేవుడని, శ్రీరాముడిపై తమకు మాత్రమే పేటెంట్ హక్కులు ఉన్నట్లుగా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారు. దేశంలోని హిందువులంతా శ్రీరామచంద్రుడిని పూజిస్తారరు. రాజకీయాలు, ఆధ్యాత్మికత వేర్వేరు.

- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

రాహుల్ జోడోయాత్రకు బ్రేకులు

- అసోంలో బతద్రవ సత్ర ఆలయ దర్శనానికి రాహుల్‌కు అనుమతి నిరాకరణ
- పార్టీ శ్రేణులతో కలసి రాహుల్ ధర్నా

న్యూఢిల్లీ, జనవరి 22: భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా అసోంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆటంకాలు ఎదురయ్యాయి. సోమవారం ఉదయం బతద్రవ సత్ర ఆలయ సందర్శనకు వెళ్తున్న రాహుల్‌ను అధికారులు అడ్డుకున్నారు. ఆ తర్వాత కొన్ని గంటలకే మోరిగావ్ జిల్లాలో రాహుల్ పాదయాత్రను, వీధి సమావేశాన్ని నిలిపివేయాలని ఆ జిల్లా యంత్రాంగం సూచించింది. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు దుండగులు ప్రయత్నించే అవకాశమున్నందున అనుమతి నిరాకరిస్తున్నట్టు పేర్కొంది. 'ఒకే రోజు రెండు ప్రధాన కార్యక్రమాలు.. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ, భారత్ జోడో న్యాయ్ యాత్ర జరుగుతున్నాయి. దీన్ని అదనుగా తీసుకుని సంఘ విద్రోహశక్తులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశముందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. శాంతి భద్రతలను కాపాడటంతో పాటు జెడ్ ప్లస్ సెక్యూరిటీలో ఉన్న రాహుల్‌ను దృష్టిలో ఉంచుకుని.. బిహుతోలి వద్ద కాంగ్రెస్ సమావేశాన్ని నిర్వహించవద్దని కోరుతున్నాం. అలాగే మోరిగావ్ పట్టణంలో శ్రీమంత శంకర్‌దేవ చౌక్ నుంచి పాదయాత్రను నిలిపివేయాలని అభ్యర్థిస్తున్నాం' అని కాంగ్రెస్ పార్టీకి మోరిగావ్ జిల్లా కమిషనర్ లేఖ రాశారు. అంతకుముందు బతద్రవ సత్ర ఆలయానికి వెళ్లకుండా తనను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులతో కలసి రాహుల్ ధర్నా చేశారు. ప్రధాని మోదీ, అసోం సర్కారుపై మండిపడ్డారు. 'నేను ఆలయ దర్శనానికి వెళ్తున్నాను. సమస్యలు సృష్టించడానికి రాలేదు. నేనేం నేరం చేశానని అడ్డుకున్నారు? ఆలయాన్ని ఎవరెవరు సందర్శించాలన్నది మోదీ నిర్ణయిస్తున్నారు' అని మండిపడ్డారు. కాగా సోమవారం అయోధ్యలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఉన్న నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటలకు వరకు ఆలయ సందర్శనకు రాహుల్‌ను అనుమతించబోమని మేనేజింగ్ కమిటీ ఆదివారం ప్రకటించింది. ఆ తర్వాత దర్శించుకోవచ్చునని సూచించింది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కూడా రాహుల్‌కు ఇదే విషయం సూచించారు.



అసోంలోని బతద్రవ ఆలయంలోకి వెళ్లనీయకపోవడంతో అక్కడే బైఠాయించిన రాహుల్‌గాంధీ

మణిపూర్ చేరుకున్న కేంద్ర బృందం

మణిపూర్‌లో మళ్లీ హింసాత్మక ఘటనల నేపథ్యంలో పరిస్థితి అంచనాకు కేంద్ర హోం శాఖ సలహాదారు, నాగా శాంతి చర్చల దూత ఎ.కె.మిశ్ర, ఢిల్లీలోని ఎస్ఐబీ జాయింట్ డైరెక్టర్ మన్‌దీప్ సింగ్ టులి, ఇంఫాల్‌లోని ఎస్ఐబీ జాయింట్ డైరెక్టర్ రాజేష్ కుంబ్లేలతో కూడిన కేంద్ర బృందం ఇంఫాల్ చేరుకుంది. ఈ బృందం తొలుత మెయిటీ సోషియో కల్చరల్ ఆర్గనైజేషన్ అయిన ఆరంబాయ్ టాంగోల్‌తో సమావేశమయింది. మిగిలిన జాతుల ప్రతినిధులతోనూ భేటీ కానుంది.



సర్వమత ర్యాలీలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

అయోధ్య వేళ.. ప్రతిపక్ష నేతలు ఎవరెక్కడ?

- భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ గాంధీ
- కోల్‌కతాలో సర్వ మత ర్యాలీలో మమతా బెనర్జీ
- ప్రాణప్రతిష్ఠకు పవార్, అఖిలేశ్‌యాదవ్ దూరం
- ఢిల్లీలో సుందరాకాండ పారాయణంలో ఆప్ శ్రేణులు
- నాసిక్ కాలారామ్ ఆలయంలో ఉద్ధవ్ పూజలు

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రధాని మోదీ సహా పలువురు రాజకీయ, వ్యాపార, సినీ, క్రీడా ప్రముఖులు హాజరైన అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవ వేళ కీలక ప్రతిపక్ష నేతలు ఎక్కడున్నారు..? అత్యంత వైభవోపేతంగా సాగిన ఆలయ వేడుకకు గైర్హాజరైన వీరు ఏం చేశారు? ఈ కార్యక్రమాన్ని బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు చెందినదిగా అభివర్ణించిన వీరంతా ఏం చేశారు? అనేది పరిశీలిస్తే.. భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఉన్న కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ అసోంలోని బతద్రవ సత్ర ఆలయాన్ని సందర్శించే ప్రయత్నం చేశారు. దీనికి ఆలయ యంత్రాంగం అంగీకరించలేదు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోల్‌కతా కాళీ ఘాట్ ఆలయంలో పూజల అనంతరం సర్వమత ర్యాలీని ప్రారంభించి పాల్గొన్నారు. రామ మందిర ప్రారంభాన్ని బీజేపీ ఎన్నికల గిమ్మిక్కుగా అభివర్ణించారు. తమ పార్టీ నుంచి అయోధ్యకు ఎవరినీ పంపలేదని తెలిపారు. ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ అయోధ్యకు వెళ్లలేదు. కుటుంబంతో కలిసి తర్వాత సందర్శిస్తానని చెప్పారు. మందిర ప్రారంభానికి ఆహ్వానం అందిన సమాజ్‌వాదీ పార్టీ అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ సోమవారం సోషలిస్ట్ నేత జ్ఞానేశ్వర్ మిశ్రాకు నివాళి అర్పించే కార్యక్రమంలో పాల్గొన్నారు. కొద్ది రోజుల తర్వాత కుటుంబంతో కలిసి వెళ్తానని చెప్పారు. కాగా, ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో అధికార ఆప్ శ్రేణులు శోభాయాత్రలు, హారతులు, సుందరాకాండ పారాయణంలో పాల్గొన్నాయి. ఆప్ అధినేత, సీఎం కేజ్రీవాల్ ఆదివారం రామ్‌లీలా ఉత్సవంలో పాల్గొన్నారు. సోమవారంతో ఇవి ముగిశాయి. తనకు అధికారిక ఆహ్వానం లేదని.. కుటుంబంతో కలిసి త్వరలో అయోధ్య వెళ్తానని కేజ్రీ ఇప్పటికే తెలిపారు. మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాక్రే నాసిక్‌లోని కాలారామ్ ఆలయంలో పూజలు చేశారు. గోదావరి ఒడ్డున మహా హారతిలో పాల్గొన్నారు.

జ్ఞానవాపీ, షాహీ ఈద్గానూ హిందువులకు అప్పగించాలి

» సమస్యకు అదే పరిష్కారం.. ముస్లిం పురావస్తు నిపుణుడు మొహమ్మద్

» బాబ్రీ మసీదు వద్ద తవ్వకాలు జరిపి మందిరం ఉనికిని చెప్పింది ఆయనే

న్యూఢిల్లీ, జనవరి 22: అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ జరిగిన నేపథ్యంలో సీనియర్ పురావస్తు శాస్త్రవేత్త కె.కె.మొహమ్మద్ ఆసక్తికర సూచన చేశారు. వివాదాస్పద జ్ఞానవాపీ మసీదు (కాశీ), షాహీ ఈద్గా మసీదు (మథుర)లను హిందువులకు అప్పగించాలని కోరారు. భారత పురావస్తు సర్వే విభాగం(ఏఎస్ఐ) రీజనల్ డైరెకర్‌గా పదవీ విరమణ చేసిన ఆయన బాబ్రీ మసీదు వద్ద తవ్వకాల్లో కీలక పాత్ర పోషించారు. మందిరం ఉండేదనడానికి అక్కడ చాలా ఆధారాలు లభించాయని, మందిరాన్ని కూలగొట్టి మసీదును నిర్మించారన్న వాదనను సమర్థించారు. అయోధ్య, మథుర, వారణాసి క్షేత్రాలు హిందువులకు పరమ పవిత్రమైనవని, అక్కడి మసీదులపై ముస్లింలకు ఎలాంటి సెంటిమెంట్లు లేవని తెలిపారు. అన్ని మతాల పెద్దలు కూర్చొని వీటిని హిందువులకు అప్పగించే విషయమై చర్చలు జరపాలని కోరారు. బాబ్రీ మసీదు వద్ద జరిగిన తవ్వకాల్లో మొహమ్మద్‌కు ప్రముఖ పాత్ర ఉంది. 1976లోనే ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ బి.బి.లాల్ ఆధ్వర్యంలో జరిగిన తవ్వకాల్లో ఆయన పాలుపంచుకున్నారు.

కోటి ఇళ్లపై సౌర ఫలకాలు

» 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన' పథకం ప్రారంభం

» అయోధ్య నుంచి ఢిల్లీ వచ్చిన వెంటనే మోదీ ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 22: అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నుంచి ఢిల్లీకి తిరిగి వచ్చిన వెంటనే ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. దేశంలోని కోటి ఇళ్ల పైకప్పులపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసేందుకు "ప్రధానమంత్రి సూర్యోదయ యోజన" పేరిట కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ఎక్స్‌లో వెల్లడించారు. ఇది పేదలు, మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గించడంతో పాటు, విద్యుత్ ఉత్పత్తిలో దేశాన్ని స్వావలంబన దిశగా నిలబెట్టేందుకు తోడ్పడుతుందని చెప్పారు. ఈ పథకానికి సూర్యవంశానికి చెందిన రాముడే స్ఫూర్తి అని ప్రకటించారు. రాముడు ఒక శక్తి అని, ఆయన ప్రతి ప్రశ్నకు జవాబు అని, ఆయన ప్రతి ఒక్కరి దేవుడని పేర్కొన్నారు. సూర్యవంశానికి చెందిన రాముడి నుంచి ఆయన్ను పూజించే భక్తులకు శక్తి లభిస్తుందని పేర్కొన్నారు. కాగా, మోదీ అయోధ్య నుంచి వచ్చిన తర్వాత ఢిల్లీలోని తన ఇంటిని దీపాలతో అలంకరించి వేడుక చేసుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

27 నుంచి ప్లాట్లకు మూడో విడత ఈ-లాటరీ

కృష్ణలంక: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూములిచ్చిన రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 3 వరకు మూడో విడత ఈ-లాటరీని గ్రామాలవారీగా నగరంలోని సీఆర్‌డీఏ ప్రధా న కార్యాలయంలో కాంపిటెంట్ అథారిటీస్ నిర్వహిస్తారని కమిషనర్ వివేక్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు మాస్టర్ ప్లాన్‌కు లోబడి ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇప్పటికే సంబంధిత భూ యజమానులకు సమాచారం ఇచ్చామని ప్రభుత్వ ఆదేశాలతో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ-లాటరీ జరుగుతుందన్నారు.

నెల్లూరు జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి పదవికి మీసాల రాజీనామా

వన్‌టౌన్: నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఏఐసీసీ నియమించిన మీసాల రాజేశ్వరరావు ఆ బాధ్యతల నుంచి రాజీనామా చేశారు. తాను విజయవాడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి కోరుతున్నానని ఈ నేపథ్యంలో ఏఐసీసీ నిబంధనల ప్రకారం నెల్లూరు జిల్లాకు కేటాయించిన పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఉన్న రాజేశ్వరరావు ఒక ప్రకటన చేస్తూ తన రాజీనామాను పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు పంపించారు.

బహుజన పార్టీల సమాఖ్య చైర్మన్‌గా జైభీమ్ నాగేశ్వరరావు ఎన్నిక

ధర్నాచౌక్: బహుజన పార్టీల సమాఖ్య చైర్మన్‌గా జై భీమ్ నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో పలు పార్టీలు, ప్రజా సంఘాల నేతల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వచ్చేనెలలో అమరావతిలో జేపీసీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సమావేశం నిర్వహిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో జేపీసీ తరుపున అభ్యర్థులను పోటీకి దింపి బహుజనుల సత్తా చాటుతామన్నారు. ఇండియన్ లేబర్ పార్టీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మద్దు అంకయ్య, గుర్రం రామారావు, రిపబ్లిక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి పిట్టా వరప్రసాద్, జైభీమ్ పార్టీ అధ్యక్షుడు పీటర్ డేనియేలు, ఆదపాక సూరిబాబు, చర్చిల్, విజయరాజు, మాదాసి ఫకీరప్ప, సత్యనారాయణ, రాజు, కుమార్, దళిత యువజన చైతన్య పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తమనం భూషణం, పలు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఊసరవల్లిగా రంగులు మారుస్తున్న షర్మిల

● డాక్టర్ జాన్ బెన్నిలింగం

ధర్నాచౌక్: మొరుసుపల్లి షర్మిల శాస్త్రీ ఊసరవల్లిలా రంగులు మారుస్తున్నారని, ఆమె, ఆమె భర్త అనిల్‌కుమార్ వేసే వేషాలు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జాన్ బెన్నిలింగం తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు, పాస్టర్ నత్తా బాలస్వామి, దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు, పాస్టర్ ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

పదవులే ఊడిపోయాకే బీసీలు గుర్తొచ్చారా!: కేశన

విద్యాధరపురం: అధికార, ప్రతిపక్ష పార్టీ నేతల్లో కొందరికీ పదవులు ఊడిపోయాక బీసీలు గుర్తొచ్చారా అని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు విమర్శించారు. సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు అన్యాయం జరిగిందని పదవులు ఊడిన నేతలు చెప్పడం పచ్చి అవకాశవాదమని విమర్శించారు. ఎన్నికలలో గెలవడం కోసం సీటు కొనుక్కోవడానికి కోట్లు గుమ్మరించే బీసీ నేతలు, బీసీల ఉద్యమాభివృద్ధికి రూపాయి ఖర్చు చేయరన్నారు. చట్టసభల్లో బీసీల న్యాయమైన డిమాండ్ల గురించి ఏనాడు గట్టిగా చర్చించిన సందర్భం లేదన్నారు. బీసీలకు అన్యాయం చేస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. దాసరి కేశవరావు, మేకా వెంకటేశ్వరరావు, దాన గౌడ్, రామ్ ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా అక్కినేని వర్ధంతి

గవర్నర్‌పేట: నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 10వ వర్ధంతిని పురస్కరించుకుని ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు సర్దార్ ఎన్. సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఎంజీ రోడ్డులోని నిర్మల హృదయ భవన్‌లో పేదలకు పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. నగరంలోని గాంధీనగర్, గవర్నర్‌పేట ప్రాంతాల్లో ఏఎన్‌ఆర్‌కు నివాళులర్పించారు. అక్కినేని అభిమానులు టి.శేఖర్, కృష్ణ, ప్రభాకర్, సత్యం, బాషా, చిన్ని, అమర్, గణేష్, రమ్మిరెడ్డి, ప్రదీప్, రామిరెడ్డి పాల్గొన్నారు.

వెస్ట్‌లో వేస్ట్ వెలంపల్లి!

● సెంట్రల్‌లో గెలిస్తే యావదాస్తి రాసిస్తా: బొండా ● ముందు నువ్వు సీటు తెచ్చుకో: వెలంపల్లి ● సెంట్రల్‌లో ఇద్దరి మధ్య మాటల యుద్ధం

పాయకాపురం, జనవరి 22: సెంట్రల్‌లో అప్పుడే ఎన్నికల వేడి రాజుకుంది. వైసీపీ సెంట్రల్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ 64వ డివిజన్‌లో ఆదివారం పర్యటించి మాజీ ఎమ్మెల్యే బొండా ఉమాపై విమర్శలు చేశారు. రానున్న ఎన్నికల్లో బొండా ఉమాపై 25వేల మెజార్టీతో గెలుస్తానంటూ మీడియా ఎదుట గొప్పలు చెప్పుకోగా స్పందించిన బొండా ఉమా దానికి దీటుగా తనదైన శైలిలో బదులిచ్చారు. వెలంపల్లి శ్రీనివాస్ సెంట్రల్‌లో 25వేల ఓట్ల మెజారిటీతో గెలిస్తే తన యావదాస్తిని రాసిచ్చి, రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని సవాల్ విసిరారు. వెస్ట్ నియోజకవర్గంలో వేస్ట్ గాడైన వెలంపల్లి ఇక్కడ సెంట్రల్‌లో ఎలా పనికి వచ్చేవాడవుతాడని ఎద్దేవా చేశారు. సెంట్రల్‌లో కచ్చితంగా గెలిచేది తానేనని, దమ్ముంటే వెలంపల్లి తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. సోమవారం డివిజన్‌లో పర్యటించిన వెలంపల్లి శ్రీనివాస్ విలేకర్లతో బొండా ఉమా సవాల్‌పై మాట్లాడారు. బొండా ఉమా కబ్జాచేసిన అక్రమాస్తులేవి తనకు వద్దని, ముందు ఆయన్ను టీడీపీ సెంట్రల్ సీటు తెచ్చుకోవాలని బదులిచ్చారు. వీరిద్దరి మధ్య జరిగిన మాటల యుద్ధం సెంట్రల్‌లో ఎన్నికల హీట్‌ను పెంచినట్లైంది.



8055 నెంబరును బాస్‌గా ఫ్యాన్సీ నెంబరు ప్లేట్‌తో సెంట్రల్‌లో షికార్లు కొడుతున్న వెలంపల్లి కారు

'బాస్' పేరుతో వెలంపల్లి షి'కార్లు'..!

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హోదాలో ఉన్న వెలంపల్లి శ్రీనివాస్ మోటారు రవాణా శాఖ నిబంధనలకు తూట్లు పొడుస్తూ సెంట్రల్‌లో యథేచ్ఛగా షికార్లు కొడుతున్నారు. తన 8055 గల కారు నెంబర్‌ను బాస్‌గా నెంబర్ ప్లేట్‌ను మార్చేసి నిబంధనలను అతిక్రమించారు. సామాన్య ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతేనే వేలకు వేలు జరిమానాలు విధించి, వాహనాలు సీజ్ చేసే పోలీసు బాస్‌లు సాక్ష్యాత్తు ఓ ప్రజాప్రతినిధే ఇలా నిబంధనలు పాటించకుండా తిరుగుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. సహజంగా ఇర్ రెగ్యులర్ నెంబరు ప్లేట్ గల వాహనానికి మోటారు వాహన చట్టం ఎటువంటి చర్యలు తీసుకుపోగా ఎస్కార్ట్ ఇచ్చి ముందుండి రాజమర్యాదలతో తీసుకువెళ్లడం కొసమెరుపు. వీటిని చూసిన ప్రజలంతా చట్టాలు, నిబంధనలు సామాన్యులకేనా ప్రజాప్రతినిధులకు వర్తించవా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.



వెలంపల్లి వెంట వన్‌టౌన్ రౌడీషీటర్ బంకా శివ (సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

సెంట్రల్‌లో వెలంపల్లి వెంట రౌడీషీటర్

● వన్‌టౌన్‌కు చెందిన కొందరు అనుచరులతో ప్రచారం

వన్‌టౌన్, జనవరి 22: సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదివారం సెంట్రల్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన వెంట వన్‌టౌన్‌కు చెందిన రౌడీ షీటర్, అతడి అనుచరులు వన్‌టౌన్ వైసీపీ నేతలు పాల్గొన్నారు. వారి వెంట రౌడీ షీటర్, అతడి అనుచరులు ఉండడంపై సెంట్రల్‌లో సొంత పార్టీ నేతలు చర్చించుకున్నారు. ఓటర్లు కూడా వెలంపల్లి వెంట రౌడీషీటర్ బంక శివ ఉండి కరపత్రాలను పంచడంపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా 64వ డివిజన్ కండ్రికలో వెలంపల్లి పర్యటించారు. అక్కడ ఓ మహిళ వెలంపల్లిని ఉద్దేశించి అక్కడ బంగారం దోచేసి ఇక్కడకు వచ్చావా అంటూ వ్యాఖ్యానించింది. దీంతో వెలంపల్లి వినీ విననట్టు ముందుకు సాగిపోయారు. అతడి వెంట ఉన్న ముఖ్య అనుచరుడు ఆ మహిళ వద్దకు వెళ్లి అసభ్యకరంగా దూషించి కొట్టడానికి ప్రయత్నించాడు. వివాదం పెద్దది కావస్తుండడంతో స్థానికులు వారించారు.

జిల్లా ఓటర్ల తుది జాబితా విడుదల

కృష్ణలంక, జనవరి 22: జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు సోమవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్ఆర్-2024 కింద సోమవారం ప్రచురించిన తుది ఓటర్ల జాబితా అందజేశారు. 2023 అక్టోబరు 27న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం ఓటర్లు 1639152 కాగా సోమవారం తుది జాబితా ప్రకారం 1674995 పెరిగినట్టు చెప్పారు. 35843 మంది ఓటర్లు పెరిగినట్టు తెలిపారు. తుది జాబితాలను డిజిగ్నేటెడ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రాజకీయ పార్టీల నుంచి 130852 ఫిర్యాదులు అందాయని, వీటి పరిశీలనలో 7748 డెత్ కేసులు, 10145 శాశ్వత షిఫ్టెడ్ కేసులు, 11311 డబుల్ ఎంట్రీలను గుర్తించడం జరిగిందని, వాటిని నిబంధనల మేరకు తొలగించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సీహెచ్.దుర్గాప్రసాద్, కె.పరమేశ్వరరావు (ఆప్), ఎం.వినోద్‌కుమార్ (బీఎస్పీ), పీవీ శ్రీహరి (బీజేపీ), డీవీ కృష్ణ (సీపీఎం), పి.యేసుదాసు (ఐఎన్‌సీ), వై.రామయ్య (టీడీపీ), వై.ఆంజనేయరెడ్డి (వైఎస్సార్ సీపీ) పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఎన్నికల ఓటర్ల బండిల్స్‌ను అందిస్తున్న రెవెన్యూ అధికారులు

దేశంలో రామరాజ్యం నెలకొనాలి

వన్‌టౌన్, జనవరి 22: దేశంలో రామరాజ్యం నెలకొనాలని, రాముడి ఆశీస్సులతో ప్రజలంతా ధార్మిక మార్గంలో నడవాలని దేవదాయశాఖ కమిషనర్ రాము సత్యనారాయణ కోరారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహప్రతిష్ట మహోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని దేవదాయశాఖ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులతో కలిసి ఆయన రాములవారికి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అయోధ్యలో శతాబ్దాలకు ముందే రామాలయాన్ని లేకుండా చేశారని, ఆక్రమణలు చోటు చేసుకోవడంతో రాములవారికి స్థానం లేని పరిస్థితి నెలకొందన్నారు. అడ్డంకులన్నీ అధిగమించి తాజాగా 70 ఎకరాల సువిశాల స్థలంలో అతి పెద్ద రామాలయాన్ని నిర్మించడం, బాలరాముడిని ప్రతిష్ఠించడం వంటి చారిత్రక సంఘటనలో మనం జీవించడం అదృష్టమన్నారు. అదనపు కమిషనర్ చంద్రకుమార్, చీఫ్ ఇంజనీర్ జీవీఆర్ శేఖర్, సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ అజాద్, డి.భ్రమరాంబ, డిప్యూటీ కమిషనర్ రత్నరాజు పాల్గొన్నారు. టెక్నికల్ అధికారి భవిరి రవి అనుసంధానకర్తగా వ్యవహరించారు. హిందూ ధార్మిక ధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ బొమ్మదేవర సుబ్బారావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

● దేవదాయశాఖ కార్యాలయంలో రాముడికి ప్రత్యేక అర్చనలు



దేవదాయశాఖ కార్యాలయంలో రాములవారికి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కమిషనర్ ఉద్యోగులు, అధికారులు, కబేళా సెంటర్‌లో ఎల్ఈడీ స్ర్కీన్‌పై ప్రాణ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ.. కబేళాలో పూజలు

భవానీపురం: అయోధ్యలో శ్రీరామ జన్మమందిర్‌లో బాలరాముడు (రామ్ లల్లా) విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా కబేళా ప్రాంతంలో రామరాజ్యనగర్‌కు చెందిన వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అరసపల్లి మాధవరావు పర్యవేక్షణలో సోమవారం ఉదయం నుంచి ఒంటిగంట వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు సాయి సమక్షంలో భక్తులు పెద్ద ఎత్తున రామనామ సంకీర్తనలు ఆలపించారు. ఎల్ఈడీ స్ర్కీన్‌పై ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులు తిలకించి పులకించిపోయారు. అనంతరం 2వేల మందికి అన్నదానం చేశారు. చెరువు సెంటర్, ఊర్మిళానగర్ కోదండరామాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పానకం, వడపప్పుతో పాటు అన్నదానాలు చేశారు. కొట్టేటి కోటయ్య వీధిలోని రామాలయం కమిటీ ఆధ్వర్యంలో దాసరి శేఖర్, పేడాడ చంద్రశేఖర్ పోలిపల్లి చిన్నా, బడుగు చిన్నా ఆధ్వరంలో కార్పొరేటర్ షేక్ రెహమ్‌తున్నీసా చేతుల మీదుగా అన్న సంతర్పణ జరిగింది.

అంతా రామమయం... సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం అయోధ్య రామాలయ విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని అంతా రామమయం పేరిట సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నిడుమోలు రమా సత్యనారాయణ, అంబటి మధుమోహనకృష్ణ అతిథులుగా బలరామకృష్ణమూర్తి, ఉమా బలరామ్, విష్ణుప్రియ, భాగ్యశ్రీ, రత్నకుమారి, ప్రసూనరామన్, కామేశ్వరి, సుధారాణి, డేవిడ్‌రాజు, సత్యవర్ధన్, ఆదిరాల జయప్రభు, రసూల్‌బాబు, చంద్రశేఖర్, పి.శ్రీనివాసరావు మధురగానం చేశారు. నీలం దుర్గారావు గాయకులు పాల్గొన్నారు. వ్యాఖ్యాత కామేశ్వరి, నిర్వహణ పరుచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.



అంతా రామమయంలో పాల్గొన్న విజయలక్ష్మి, నిడుమోలు



రంగబాబును పరామర్శిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

టీడీపీ నేత రంగబాబుకు నేతల పరామర్శ

గన్నవరం, జనవరి 22: టీడీపీ నేత కాసర్నేని రంగబాబును పలువురు నేతలు పరామర్శించారు. గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడిన రంగబాబు చిన అవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యదర్శి కొనకళ్ల నారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావుతో పాటు పలువురు నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భౌతిక దాడులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. రాజకీయాలు సంప్రదాయబద్ధంగా ఉండాలే కానీ ఫ్యాక్షన్ సంస్కృతి రాకూడదన్నారు. గన్నవరంలో ఎంతోమంది మహనీయులు ఎమ్మెల్యేలుగా చేశారని ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదన్నారు. ఓడిపోతామన్న భయంతోనే దాడులకు తెగబడుతున్నారని, ఇలాంటివి సరికాదని హితవు పలికారు.



గ్రంథావిష్కరణ చేస్తున్న గోళ్ల నారాయణరావు

గౌతమలహరి పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, జనవరి 22: కవి ప్రతి రచన సామాజిక సేవ వైపు సాగిస్తే సమాజం ఉన్నతి వైపు పురోగమిస్తుందని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అన్నారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శ్రీ రామలింగేశ్వర కల్చరల్ అసోసియేషన్ ఆధ్యాత్మిక సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉయ్యూరు సాంబిరెడ్డి అధ్యక్షతన పింగళి వెంకట కృష్ణారావు రచించిన గౌతమ లహరి సాహిత్య వ్యాసాల గ్రంథావిష్కరణ జరిగింది. సాహిత్య కళా పోషకుడు గోళ్ల నారాయణరావు గ్రంథావిష్కరణ చేశారు. ప్రాచీన సాహిత్యంపై గ్రంథంలో 6 వ్యాసాలు సమీక్ష చేశానన్నారు. పింగళి వెంకట కృష్ణారావు షష్టిపూర్తి కాలంలో అనేక సాహిత్య రచనలు అందించారన్నారు. కవి సామాజిక దృష్టితో రచనలు చేసి అటు ప్రభుత్వాలను ఇటు ప్రజలను మేల్కొలపాలన్నారు. సాహిత్యవేత్త గుమ్మా సాంబశివరావు పుస్తక సమీక్షలోని అనేక అంశాలను వివరించారు. జ్యోతిష్యరత్న ఆత్మూరి మల్లికార్జున శర్మ, విద్యారత్న స్వామి పరమానంద (డాక్టర్ క్రోవి పార్థసారథి), పంచాంగకర్త కప్పగంతు సుబ్బారామ సోమయాజి, నిత్య సాహిత్యవ్రతుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పీవీఎస్ రామారావు, ఇంకా ఇతర కవులకు, మేధావులకు వీరందరికీ చిరు సత్కారం చేశారు. డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ సభా నిర్వహించారు.

అంగన్వాడీల అక్రమ అరెస్టు సిగ్గుచేటు: గన్నె

విద్యాధరపురం, జనవరి 22: అంగన్వాడీల అక్రమ అరెస్టు సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె నారాయణ ప్రసాద్ (అన్న) సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. దద్దమ్మ జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. 40రోజులుగా తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక పోలీసులు అమానుషంగా వ్యవహరించి మహిళలను ఈడ్చి అరెస్టు చేయడం దారుణమన్నారు. ఇదొక సిగ్గుమాలిన చర్యని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి నైకోతనానికి నిదర్శనమన్నారు. మహిళలపై ఇంత కఠినంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. అరెస్ట్ అయిన మహిళలే రేపు జగన్ పతనానికి నాంది అవుతారన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల సాధనకు వారి పోరాట స్ఫూర్తికి తన సంఘీభావాన్ని తెలిపారు.

జగన్‌రెడ్డి మోసపు పాలన త్వరలో అంతం: లుక్కా

జగన్‌రెడ్డి మోసపు పాలన త్వరలో అంతం కానుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల ముందు అబద్ధ ప్రచారాలు, మోసపు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి వాటిని విస్మరించాడన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి వారు చేస్తున్న న్యాయపోరాటాన్ని ఉక్కుపాదంతో అణచివేయడం దుర్మార్గపు చర్యన్నారు.

టైర్లకు మంట.. పొగతో స్థానికుల తంటా!

భారతీనగర్: ఆనందంగా జీవించాల్సిన కుటుంబాలు అనారోగ్యానికి చేరువలో జీవనం గడుపుతున్నారు. ఆటోనగర్ ఏపీఐఐసీ కాలనీకి మధ్యలో గమేళా బజారు ప్రాంతం ఉంది. ఇక్కడ నివసించే ప్రజలు గమేళాలను తయారుచేసి జీవనం సాగిస్తారు. వీరిలో కొందరు నగరంలో అక్కడక్కడ దొరికిన పాత కేబుల్ తీగలను సేకరిస్తారు. రాత్రి సమయంలో వాటిని రోడ్డు పక్కన గుట్టలుగా వేసి తరుచుగా మంటపెడుతున్నారు. దీని నుంచి విపరీతమైన పొగ వస్తోంది. సమీపంలోని ఏపీఐఐసీ కాలనీ, జమాక్ అపార్టుమెంట్ వాసులు, సాయిశ్రీకరా అపార్టు మెంట్‌లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని గంటల పాటు మండుతుండటంతో గాలి మొత్తం కాలుష్యమై ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

అపార్టుమెంట్లలో పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఉండడంతో స్థానికులు భయపడుతున్నారు. రోడ్డుపై మంటలు వేయవద్దని ఎన్నిసార్లు చెప్పినా వినడంలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గమేళాబజార్ రోడ్డులో మంటల నుంచి వెలువడుతున్న పొగ

కబేళాలో పచ్చదనం

భవానీపురం, జనవరి 22: నగరానికి అధునాతనమైన కబేళా ఏర్పాటు కలగా మిగిలిపోగా, తాజాగా ఈ ప్రాంతంలో పచ్చదనం పెంపొందించేలా కబేళా పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ పర్యవేక్షణలో వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ రవిచంద్ ముందుచూపుతో ఇంజనీరింగ్ అధికారుల చర్యలతో కబేళా ఎదురుగా ఫ్లవర్ బ్లాక్స్‌ను ఏర్పాటు చేయించడంతో పాటు మధ్యలో అందమైన మొక్కలు నాటించి గ్రీనరీ ఏర్పాటుతో చేయడంతో కబేళా కొత్త అందం సంతరించుకుంది. చాలాకాలం నుంచి కబేళా పరిసరాలంటే దుర్గంధపూరితంగా ఉండేవి. రోజూ వందల్లో వధించే పశువుల వ్యర్థాలతోను ఇక్కడ పరిసరాల్లోకి రావాలంటే ముక్కు పుటాలు అదిరేవి. అవి కాస్తా కొత్త పనులతో కళను సంతరించుకున్నాయి.



కబేళా ప్రాంతంలో మొక్కలు నాటి, కంచె ఏర్పాటు



రామవరప్పాడు రింగ్ సెంటర్ వద్ద చెట్టు కింద నిలబడిన ప్రయాణికులు

చెట్టు కొమ్మలే బస్టాండ్

● ఎండలో ప్రయాణికుల ఇక్కట్లు

ప్రధాన సెంటర్‌లో బస్టాండ్స్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు నిదానంగా పెరుగుతూ ప్రజలను భయానికి గురిచేస్తున్నాయి. రమేష్ ఆసుపత్రి నుంచి రామవరప్పాడు సెంటర్ వరకు ఏలూరు జాతీయ రహదారి వెంబడి ప్రధాన సెంటర్లయిన రమేష్ ఆసుపత్రి జంక్షన్‌తోపాటు మహానాడు జంక్షన్ సమీపంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద, రామవరప్పాడు సెంటర్ వద్ద బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు భానుడి వేడికి తట్టుకోలేక సమీపంలోని చెట్ల కింద నిలబడుతున్నారు. సమయానికి బస్సు రాక చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- భారతీనగర్

విశాఖ నుంచి థాయ్, మలేసియాలకు విమాన సర్వీసులు

▸ బ్యాంకాక్‌కు ప్రారంభ ఆఫర్ 7,999

విశాఖపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి థాయ్‌ల్యాండ్, మలేసియాలకు అంతర్జాతీయ విమాన సర్వీసులు నడిపేందుకు ఎయిర్ ఏసియా సంస్థ ముందుకువచ్చింది. కరోనాకు ముందు మలిండో విమాన సంస్థ మలేసియాకు సర్వీసులు నడిపింది. ఆ తరువాత నిలిపివేసింది. ఇప్పుడు ఎయిర్ ఏసియా సంస్థ ఏప్రిల్ నెలాఖరు నుంచి మలేసియాకు విమానాలు నడుపుతామని తెలిపింది. దీనికి ఇంకా షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. థాయ్‌ల్యాండ్ (బ్యాంకాక్)కు మాత్రం ఏప్రిల్ 9 నుంచి అంతర్జాతీయ సర్వీసులు మొదలవుతాయని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షులు విజయమోహన్ తెలిపారు. వారానికి మూడు రోజులు (మంగళ, గురు, శనివారం) ఈ విమాన సర్వీసు అందుబాటులో ఉంటుంది. ఇది బ్యాంకాక్‌లో రాత్రి 10.05 గంటలకు బయలుదేరి రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నం వస్తుంది. ఇక్కడి నుంచి అర్ధరాత్రి 11.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.15 గంటలకు బ్యాంకాక్ చేరుతుంది. ప్రారంభ ఆఫర్ కింద ఒక వైపు టికెట్‌ను రూ.7,999కే ఇస్తున్నారని, ఈ నెల 30 నుంచి బుక్ చేసుకొని, అక్టోబరు నెలాఖరు వరకు ఎప్పుడైనా ప్రయాణించవచ్చునని విజయ్‌మోహన్ తెలిపారు.

నేడు హైకోర్టు వద్ద రక్తదాన శిబిరం

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్‌తో కలిసి టీడీపీ లీగల్ సెల్ మంగళవారం రాష్ట్ర హైకోర్టు వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే రక్తదాన శిబిరంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

డీలర్ల ద్వారానే సరుకుల పంపిణీకి డిమాండ్

▸ రేపు విజయవాడలో రేషన్ డీలర్ల సమావేశం

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారానే కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, తెలంగాణలో ఇస్తున్న మాదిరిగానే రాష్ట్రంలోని రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వడంతోపాటు వారికి కమీషన్ పెంచాలని రాష్ట్ర డీలర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకునేందుకు ఈనెల 24న ఉదయం 10.30 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో డీలర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వంతోపాటు వివిధ రాజకీయ పార్టీలకు వినతిపత్రాలు అందజేస్తామని ఆయన వివరించారు.

29న పీపీఏ సమావేశం

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సమావేశం జరగనున్నది. పోలవరం ప్రాజెక్టు పనులపై రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాన్ని చేసుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర జల వనరుల శాఖకు పీపీఏ ముసాయిదా ఒప్పంద ప్రతిని పంపింది. దానికి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని మార్పులు సూచించింది. వాటిని కేంద్ర జలశక్తి ఆమోదించలేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా కేంద్రమే భరిస్తున్నందున షరతులు విధించే హక్కు తమకే ఉంటుందని కేంద్ర జలశక్తి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రం రూపొందించిన ముసాయిదా ఒప్పంద ప్రతిని రాష్ట్ర జల వనరుల శాఖ ఆమోదించాల్సిందేనని కేంద్రం చెబుతోంది. వాస్తవానికి ఈ సమావేశం ఈ నెల 16 జరగాల్సి ఉంది. సంక్రాంతి సందర్భంగా ఈ భేటీ వాయిదా పడింది. తాజాగా మంగళవారం ఈ సమావేశం జరగాల్సి ఉన్నా పీపీఏ దానిని మళ్లీ 29కి వాయిదా వేసింది.

విద్యుత్ చార్జీలపై 29 నుంచి ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న విద్యుత్ చార్జీలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఈ నెల 29 నుంచి వర్చువల్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయనుందని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ సోమవారం తెలిపారు. ఏపీఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ వి.నాగార్జునరెడ్డి నేతృత్వంలో నాలుగు రోజులు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ఈఆర్సీ సభ్యులు ఠాకూర్‌సింగ్, పీవీఆర్ రెడ్డి పాల్గొంటారు. విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వరుసగా నాలుగు రోజులు ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అభిప్రాయాలు తెలుసుకుంటారు. విద్యుత్ సంస్థలు సమర్పించిన వార్షిక ఆదాయం అవసరాల అంచనాలపై అభిప్రాయాలు స్వీకరిస్తారు. విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులతోపాటు ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులు పాల్గొంటారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునేవారు ఆయా జిల్లాల్లోని సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం లేదా డివిజన్ కార్యాలయానికి వెళ్లి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సీఎండీ పృథ్వీతేజ్ సూచించారు. ప్రజలంతా వీక్షించేలా ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేస్తామన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి: ఎస్టీయూ

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖలోని ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీచేసేందుకు మెగా డీఎస్సీ ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం కోరింది. ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న సోమవారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. 20వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలన్నారు.

అంగన్‌వాడీలపై ప్రభుత్వ వైఖరి దారుణం: ఉపాధ్యాయ సంఘాలు

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్లపై సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి దారుణం అని ఉపాధ్యాయ సంఘాలు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిరసన తెలుపుతున్న వారి అరెస్టులు, తొలగింపు చర్యలను సంఘాల నేతలు ఖండించారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం నిరంకుశత్వమే అవుతుందని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న, ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి, నోబుల్ టీచర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూకల అప్పారావు, నడిపినేని వెంకట్రావు పేర్కొన్నారు.

వారికి ఎన్నికల విధుల్లో మినహాయింపునివ్వండి: ఏపీటీఎఫ్

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల విధుల్లో 55ఏళ్లు నిండిన మహిళా టీచర్లు, 58ఏళ్లు నిండిన పురుష టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి సోమవారం సచివాలయంలో సీఈవో ఎంకే మీనాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సిబ్బందికి ఇబ్బంది లేకుండా ఎక్కువ కౌంటర్‌లు ఏర్పాటుచేయాలన్నారు.

ఐక్యంగా ఉంటే రామరాజ్య స్థాపన

▸ మోదీ తపస్సును అందరూ కొనసాగించాలి: మోహన్ భాగవత్

అయోధ్య, జనవరి 22: దేశంలోని ప్రజలంతా వివాదాలకు దూరంగా ఐక్యంగా ఉంటే రామ రాజ్య స్థాపన జరుగుతుందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. 'ప్రధాని మోదీ ఒంటరిగా తపస్సు చేశారు. ఇప్పుడు మనమంతా ఆ తపస్సును కొనసాగించాలి' అని భాగవత్ వ్యాఖ్యానించారు. 500 ఏళ్ల తర్వాత రాముడు తన ఇంటికి చేరుకున్నారని, ఈ రోజు నిర్వహించిన కార్యక్రమం కొత్త భారత్‌ను ప్రపంచం ముందు ఆవిష్కరించిందని ఆయన అన్నారు. బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత భాగవత్ ప్రసంగించారు. 'అయోధ్యలో నెలకొన్న విభేదాల వల్లనే రామ్ లల్లా ఇక్కడ నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు మనమంతా కొట్టుకోవడం మానేసి ఒకరికొకరంగా కలిసి ఉంటే మళ్లీ రామ రాజ్య స్థాపన జరుగుతుంది. ప్రజలంతా తాము సంపాదించిన దానిలో తమకు అవసరమైనంత ఉంచుకుని మిగిలింది సహాయ కార్యక్రమాలకు వినియోగించాలని భాగవత్ పిలుపునిచ్చారు. అత్యాశకు లోనుకాకుండా క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని ప్రజలంతా అవలంబించాలని ఆయన సూచించారు. దేశ పౌరులంతా పరస్పర సహకార ధోరణితో పనిచేస్తే ప్రపంచానికి భారత్ లీడర్ అవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ అన్నారు.

అర్హులకు అందని ఆసరా..!

▸ ఏటా 25 శాతం సొమ్ము దుర్వినియోగం
▸ అర్హులకు ఎగ్గొట్టి అనర్హులకు పంపిణీ
▸ వీవోఏలు, డ్వాక్రా గ్రూపు లీడర్లు కుమ్మక్కు
▸ గ్రూపు నుంచి వెళ్లిన వారి సొమ్ము స్వాహా
▸ కొన్ని చోట్ల కొత్తగా చేరిన వారికి పందేరం
▸ స్థానిక వైసీపీ నేతల జోక్యంతో చేతివాటం
▸ మూడు విడతల్లో 5 వేల కోట్లు అనర్హులకు
▸ రాష్ట్రంలో 30శాతం మంది ఆసరాకు దూరం
▸ గ్రామాల్లో డ్వాక్రా గ్రూపుల్లో కొత్త గొడవలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఉత్తుత్తి నొక్కుడు నొక్కుతూ.. ఆర్భాటంగా చెప్పుకుంటున్న జగన్ సర్కారు తీసుకొచ్చిన వైఎస్ఆర్ ఆసరా పథకం అభాసుపాలవుతోంది. వైసీపీ సర్కారు తెచ్చిన అన్ని పథకాల్లాగే ఇది కూడా లోపభూయిష్టంగా తయారైంది. డ్వాక్రా గ్రూపులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పథకం గ్రామాల్లో గ్రూపు సభ్యుల మధ్య చిచ్చు పెడుతోంది. ప్రతిఏటా 25 శాతం ఆసరా నిధులను అర్హులకు అందకుండా ఇతరులు కాజేస్తున్నారు. స్థానిక వైసీపీ నేతల జోక్యంతో వీవోఏలు, గ్రూపు లీడర్లు పంచేసుకుంటున్నారు. గత మూడేళ్లలో ఇలా సుమారు రూ.5 వేల కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయి.

డ్వాక్రా గ్రూపులు 2019 ఏప్రిల్‌కు ముందు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ ఆసరా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా ప్రతి ఏటా రూ.6 వేల కోట్లకుపైగా నిధులను డ్వాక్రా గ్రూపుల ఖాతాల్లో జమ చేస్తోంది. అయితే రాష్ట్రంలోని సుమారు 8 లక్షల డ్వాక్రా గ్రూపుల్లో గత నాలుగేళ్లలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రతి గ్రూపులోనూ సుమారు 25 శాతం మంది వైదొలిగిపోయారు. కొన్నిచోట్ల సభ్యులు, లీడర్ల మధ్య తగాదాలతో చాలా మంది వెళ్లిపోయారు. కొంత మంది 60 ఏళ్లు పూర్తి కావడంతో తప్పుకోవాల్సి వచ్చింది. ఇలా వివిధ కారణాలతో గ్రూపు నుంచి వైదొలిగిన వారి స్థానంలో సెర్ప్ అధికారులు కొత్తవారిని చేర్చారు. దీంతో పాత, కొత్త సభ్యులతో డ్వాక్రా గ్రూపులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం ఆసరా పథకాన్ని 2019 ఏప్రిల్ కంటే ముందు రుణం పొందిన సభ్యులకు మాత్రమే వర్తింపజేయాలి. కానీ, డ్వాక్రా గ్రూపుల నుంచి విడిపోయి వెళ్లిపోయిన సభ్యులకు ఈ ఆసరా సొమ్ము అందడం లేదు. కొన్నిచోట్ల పాతవారి స్థానంలో చేరిన కొత్త సభ్యులు ఆసరా సొమ్ము తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల గ్రూపు సభ్యులకు కాకుండా వీవోఏలు, గ్రూపు లీడర్లు వాటిని పంచేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా ఏటా ఆసరా సొమ్ము విడుదల చేసినప్పుడల్లా సుమారు రూ.1500 కోట్లకుపైగా నిధులు అసలైన లబ్ధిదారులకు అందడం లేదు.

వైసీపీ నేతల జోక్యంతో దుర్వినియోగం..

ఏ పథకమైనా అసలైన లబ్ధిదారులకు అందితేనే విజయవంతమైనట్టు. అయితే.. జగన్ తెచ్చిన అన్ని పథకాల్లాగానే ఆసరా పథకం కూడా లోపభూయిష్టంగా మారింది. 2019 ఏప్రిల్ నాటికి బ్యాంకుల్లో రుణాలు పొంది తిరిగి చెల్లించిన వారికి ఈ ఆసరా ప్రయోజనం అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఆ మేరకు నిబంధనలు రూపొందించింది. 2019కు ముందు బ్యాంకుల నుంచి రుణాలు పొంది ఆ తర్వాత ఆయా గ్రూపుల నుంచి బయటకు వెళ్లిపోయిన వారికీ ఆసరా అందించాలని తీర్మానాలు చేశారు. ఆయా తీర్మానాలు బ్యాంకుల్లో కూడా ఇచ్చారు. అంటే అప్పట్లో రుణాలు పొందిన సభ్యులకే ఆసరా నిధులు అందాలి. డ్వాక్రా సంఘాల్లో వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాల్లో కొత్త సభ్యులను చేరుస్తూ సెర్ప్ సిబ్బంది, స్థానిక వైసీపీ నేతలు పావులు కదిపారు. ఈ క్రమంలో పాత గ్రూపు సభ్యుల స్థానంలో తమ అనుయాయులను చేర్చారు. పాత గ్రూపు సభ్యులకు ఇవ్వాల్సిన ఆసరా ప్రయోజనాన్ని కొత్త సభ్యులకు అందించాలని పైరవీలు చేస్తున్నారు. బ్యాంకులకు మాత్రం పాత సభ్యులకే ఆసరా అందిస్తున్నట్లు తీర్మానాలు ఇచ్చి, ఆ నిధులను కొత్త సభ్యులకు పంపిణీ చేస్తున్నారు. అయితే కొన్నిచోట్ల కొత్త సభ్యులకు కూడా ఈ ప్రయోజనాలు అందకుండా వీవోఏలు, గ్రూపు లీడర్లు పంచుకుంటున్నారు.

సుమారు రూ.5 వేల కోట్లు అనర్హుల పాలు

రాష్ట్ర ప్రభుత్వం మూడు దఫాలుగా ఆసరా నిధులు విడుదల చేసింది. సీఎం జగన్ ఒక్కో విడతలో రూ.6 వేల కోట్లకుపైగా నిధులను బటన్ నొక్కి డ్వాక్రా సంఘాల ఖాతాల్లో జమచేస్తున్నారు. ఇలా మూడు దఫాల్లో సుమారు రూ.18 వేల కోట్లకు గాను సుమారు రూ.5 వేల కోట్లు అర్హులకు అందలేదు. గ్రూపుల్లో ఉన్న పాత, కొత్త సభ్యులు ఈ సొమ్ము పంచుకుంటున్నారు. గ్రూపు నుంచి విడిపోయిన పాత సభ్యులు మాత్రం బ్యాంకుల వద్దకు వెళ్లి సిబ్బందితో గొడవ పెట్టుకుంటున్నారు. గ్రూపు ఖాతాల్లో జమచేశామని, వెళ్లి మీ లీడర్లను అడగాలని బ్యాంకర్లు చెప్తున్నారు. దీంతో వాళ్లు వచ్చి లీడర్లను నిలదీస్తున్నారు. దీంతో ప్రతి గ్రామంలోనూ ఆసరా నిధులు కొత్త గొడవలకు కారణమవుతున్నాయి. కొన్నిచోట్ల బ్యాంకర్లు ఆయా గ్రూపులకు సంబంధించి అర్హులైన పాత సభ్యులకే ఆసరా ప్రయోజనం ఇస్తామని తెగేసి చెప్తున్నారు. అయితే వీవోఏలు, ఏపీఎంలు బ్యాంకర్లపై ఒత్తిడి తెచ్చి తాము చేసిన తీర్మానం ప్రకారం డబ్బులు విడుదల చేయాలని పట్టుబడుతున్నారు. పైగా సెర్ప్ ఉద్యోగులు సైతం డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న సభ్యులకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి, వైదొలిగిన సభ్యుల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో సుమారు 25 నుంచి 30 శాతం మంది డ్వాక్రా సభ్యులు ఆసరాకు దూరమయ్యారు.

చంద్రబాబు భరోసాతో.. గిరిజన యువతలో చిగురిస్తున్న ఆశలు!

▸ గిరిజన ప్రాంతాల్లో నూరుశాతం ఉద్యోగాలు గిరిజనులకేనన్న బాబు
▸ జీవో 3 పునరుద్ధరణకు అరకు సభలో హామీ

(రంపచోడవరం): జగన్ ప్రభుత్వ తీరుతో నైరాశ్యంలో ఉన్న గిరిజన యువతకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పర్యటన ఉద్యోగ భరోసాను కల్పించి కొత్త ఆశలను చిగురింపజేసింది. శనివారం అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకులో నిర్వహించిన 'రా కదలి రా' కార్యక్రమంలో జీవో నంబరు 3 పునరుద్ధరణకు చంద్రబాబు హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని ఉద్యోగాలూ గిరిజనులకే దక్కేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం దివంగత ఎన్టీరామారావు సారథ్యంలో 1986లోనే నడుం బిగించింది. అన్ని ఉపాధ్యాయ పోస్టులూ గిరిజనులతోనే భర్తీ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ పలు కేసులు నడిచాయి. తెలుగుదేశం ప్రభుత్వం కూడా అంతే దీటుగా గిరిజనులకు అండగా నిలిచి సుప్రీం కోర్టు వరకూ పోరాడింది. రాజ్యాంగపరంగా గిరిజనులకు అండగా ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని 2000 సంవత్సరంలో అన్ని ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులకే దక్కే విధంగా జీవో నెం.3ను తీసుకొచ్చి, 1986 నుంచి వర్తించేలా గిరిజన యువతకు రక్షణ కల్పించింది. ఇదే పరంపరను క్రమేణా అన్ని పోస్టులకు వర్తింపచేస్తూ వచ్చారు. అనేక నియామకాలు ఆ జీవో పరిధిలోనే చేపడుతూ గిరిజన ప్రాంతాల్లో ఉండే గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను పెంచుతూ వచ్చారు. ఆ జీవోపై కూడా పలు కేసులు దాఖలయ్యాయి. మూడు దశాబ్దాల కాలంగా గిరిజన యువత ఉద్యోగాలకు భరోసాగా నిలిచిన ఆ జీవోపై చేబ్రోలు లీలా ప్రసాదరావు కేసులో ప్రభుత్వ వైఫల్య వాదనల కారణంగా చివరకు 2020 ఏప్రిల్‌లో ఆ జీవో సుప్రీంకోర్టులో వీగిపోయింది. ఆ తీర్పుతో గిరిజన యువతకు గిరిజన ప్రాంతాల్లో నూరు శాతం ఉద్యోగ భరోసా ప్రశ్నార్థకమైంది. జనాభా ప్రాతిపదికన కేవలం 6నుంచి 7శాతం మాత్రమే గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు గిరిజనులకు దక్కే దుస్థితి కలిగింది. గిరిజనులకు అండగా నిలవాల్సిన వైసీపీ ప్రభుత్వం ఆ జీవోను పునరుద్ధరించే దిశగా సరైన చర్యలు తీసుకోలేకపోయింది. ఈ పరిస్థితుల్లో విద్యావంతులైన గిరిజన యువత ప్రభుత్వ నియామకాలు పొందలేని స్థితిలో మైదాన ప్రాంతాలకు వలసపోతూ చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి భరోసా లేక గిరిజన యువత దిక్కుతోచని స్థితిలో కుంగిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో శనివారం అరకులోయకు వచ్చిన చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించి తమ ప్రభుత్వం గిరిజన యువతకు నూరుశాతం ఉద్యోగ భరోసా కల్పిస్తూ ఇచ్చిన జీవోను జగన్ ప్రభుత్వం కాపాడలేకపోయిందని, తద్వారా గిరిజన యువత భవిష్యత్‌ను దెబ్బతీసిందని ఆక్షేపించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే జీవో 3 పునరుద్ధరణకు అవసరమైన చట్టపరమైన చర్యలన్నిటినీ తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో గిరిజన యువతలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కాగా, జీవో 3 పునరుద్ధరణ హామీ ద్వారా గిరిజన యువతకు తమ పార్టీ భరోసా కల్పిస్తోందని, భవిష్యత్‌కు గ్యారంటీ విధానంలోనే గిరిజన యువతకు చంద్రబాబు అండగా నిలుస్తున్నారని టీడీపీ సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేశ్, వంతల రాజేశ్వరి తెలిపారు.

మైకు ముందు నేతలు... ఖాళీ అయిన కుర్చీలు

▸ చీరాలలో తుస్సుమనిపించిన సామాజిక సాధికార యాత్ర


మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడేటప్పుడు వెనుక ఖాళీగా ఉన్న కుర్చీలు


చీరాల, జనవరి 22: వైసీపీ సామాజిక సాధికారత బస్ యాత్ర మొదట్లో ఫర్వాలేదనిపించినా, సగం నుంచి వెలవెలబోయింది. సోమవారం బాపట్ల జిల్లా చీరాల గడియారం స్తంభం సెంటర్‌లో జరిగిన సభకు పార్టీ శ్రేణుల, అభిమానులు తరలివచ్చారు. అయితే సభ ముగియక ముందే ముప్పాతిక మంది తిరుగుముఖం పట్టారు. సాయంత్రం ఆరున్నర గంటలకు చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేశ్ ఆధ్యక్షతన సభ ప్రారంభమైంది. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, ఎంపీ నందిగం సురేశ్‌లతో కలిసి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి నివాళులర్పించారు. నేతలంతా తమ ప్రసంగాల్లో చంద్రబాబుపైన, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ తదితర మీడియా సంస్థలపైనా విమర్శలు చేసేందుకే అత్యంత ప్రాధాన్యమిచ్చారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించేందుకు పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో సభకు హాజరైన వారిలో ముప్పాతిక మంది దశలవారీగా తిరుగు ముఖం పట్టారు. అందులో అధికశాతం మంది సమీపంలో ఏర్పాటు చేసిన భోజనశాలకు క్యూ కట్టారు.

కృష్ణా, గుంటూరుల్లో అమలాపురం తరహా విధ్వంసం..!

▸ భారీ కుట్రకు తెరతీసిన వైసీపీ నేతలు
▸ వారికి సహకరించిన పొన్నూరు రూరల్ పోలీసులు
▸ చర్యలు తీసుకోండి... లేకుంటే న్యాయపోరాటం
▸ 'స్పందన'లో ఎస్పీకి ధూళిపాళ్ల ఫిర్యాదు


గుంటూరు ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీకి ఫిర్యాదు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, టీడీపీ నేతలు

గుంటూరు, జనవరి 22: అమలాపురంలో కులాల మధ్య విధ్వంసం సృష్టించిన విధంగానే కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కూడా అల్లర్లు, విధ్వంసాలకు వైసీపీ భారీ కుట్రకు తెరతీసిందని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆరోపించారు. తన ఫొటో పెట్టి అంబేడ్కర్‌పై తప్పుడు వ్యాఖ్యలతో తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ చేసి విధ్వంసానికి కుట్ర చేశారని ఆరోపించారు. ఈ కుట్ర వెనుక మంత్రి సీదిరి అప్పలరాజు, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైసీపీ సోషల్ మీడియా డిజిటల్ క్రియేటర్, నందిగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ప్రభాస్ వెంకట్ సుంకర తోపాటు పలువురు వైసీపీ నాయకులు ఉన్నారని, దీనిపై తక్షణం కేసు నమోదు చేసి నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ధూళిపాళ్ల విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ల మాట్లాడుతూ.. "ఈ నెల 19న నేను నా నియోజకవర్గ పరిధిలోని చేబ్రోలులో టీడీపీ, జనసేన కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశాను. ఆ సమావేశంలో నేను 'టీడీపీ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చివేస్తా' అని ప్రకటించినట్టుగా నా ఫొటోతో తప్పుడు ప్రకటన సృష్టించారు. దానిని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేశారు. ఆ పోస్టును సృష్టించిన వారిని, సోషల్ మీడియాలో వైరల్ చేసిన వారిని పరిశీలిస్తే దీని వెనక భారీ కుట్ర ఉన్నట్లు స్పష్టమైంది. టీడీపీ, జనసేన పొత్తుతో అధికారం కోల్పోతున్నామనే భయంతో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అమలాపురం తరహాలో కుల చిచ్చు రేపి అల్లర్లు, విధ్వంసాలు సృష్టించాలని వైసీపీ నాయకులు కుట్ర పన్నారు. పోస్టును పలనాడు న్యూస్ వాట్సాప్ గ్రూపులో టీం గోపిరెడ్డి పేరుతో ఎమ్మెల్యే పీఏ షేర్ చేశారు. మంత్రి సీదిరి పీఏ వెంకట రమణ రొక్కానన తన ఫేస్ బుక్ పేజీలో 'అంబేడ్కర్ విగ్రహాన్ని 90 రోజులలో కూల్చివేస్తానన్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను ఏ చెప్పుతో కొట్టాలి?' అంటూ పోస్ట్ పెట్టాడు. అలాగే మరికొందరు ముక్కలుగా నరుకుతామని, ఇంకొందరు కాకులు, గద్దలకు వేస్తామంటూ తీవ్రస్థాయిలో హెచ్చరికలతో పోస్టులు పెట్టారు. కేవలం కృష్ణా, గుంటూరు జిల్లాల్లో విధ్వంసం సృష్టించాలనే కుట్రతో అందరూ ప్రేమించే బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా అధికార పార్టీ నేతలు వ్యవహరించారు. ఈ కుట్రపై సమగ్ర వివరాలు, సాక్ష్యాధారాలతో సహా ఈ నెల 20న పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఈ తరహా పోస్టింగ్స్ పెట్టి, కుట్ర కోసం అంబేడ్కర్ ప్రతిష్ఠను దిగజార్చిన అధికార పార్టీ నేతలు, అందుకు సహకరించిన వ్యక్తులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి నిష్పక్షపాతంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. నేను తప్పు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే. ఈ కుట్రలో సూత్రధారులు, పాత్రధారులతో పాటు కేసు నమోదు చేయకుండా తాత్సారం చేసిన పొన్నూరు రూరల్ పోలీసులపై తక్షణం చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో పోలీసులతో సహా ఇందుకు బాధ్యులైన వారందరిపై నేను న్యాయ పోరాటం చేస్తా" అని నరేంద్ర తెలిపారు. డీఎస్పీని కలిసిన వారిలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లెద్దు సుశీలరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు దాసరి రమణ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


కృష్ణా నదిలో పడవలతో లోకేశ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతూ ఏర్పాటు చేసిన భారీ కటౌట్. దీనిని తాడికొండకు చెందిన టీడీపీ నాయకుడు పులి చిన్నా ఏర్పాటు చేశారు

లోకేశ్‌తో పీకే భేటీ

▸ ఎన్నికల వ్యూహాలపై చర్చ

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్(పీకే) సోమవారం హైదరాబాద్‌లో టీడీపీ యువ నేత లోకేశ్‌ను కలిశారు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరిగినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. టీడీపీ తరఫున ఎన్నికల వ్యూహం అమలుకు పీకే కొంత కాలం క్రితం రంగప్రవేశం చేశారు. క్షేత్రస్థాయిలో రాబిన్ శర్మ బృందాలు పని చేస్తుండగా, పై స్థాయిలో ఎన్నికల వ్యూహానికి పదును పెట్టే బాధ్యతను పీకే తీసుకున్నారు. వచ్చే వంద రోజుల పాటు పార్టీ పరంగా చేపట్టాల్సిన పనులు, నిర్వహించాల్సిన కర్తవ్యాలపై వారి మధ్య చర్చ జరిగింది. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, టీడీపీ-జనసేన కూటమి బలోపేతానికి అనుసరించాల్సిన మార్గాలపై పీకే కొన్ని సలహాలు, సూచనలు అందజేశారు. సామాజిక వర్గాలపరంగా వైసీపీ బలంగా ఉన్న ముస్లిం మైనారిటీ వర్గాలను ఆకట్టుకోవడానికి ఏం చేయాలో కూడా మంతనాలు జరిపారు. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న సర్వే నివేదికలపై కూడా చర్చించారు. క్షేత్రస్థాయిలో టీడీపీ ప్రభంజనం కనిపిస్తోందని, అది మరింత పుంజుకునేలా చర్యలు చేపట్టాలని పీకే సూచించినట్లు సమాచారం.


మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో కంటతడి పెడుతున్న గౌతమి

పథకాలడిగితే.. 'పడుకుంటావా' అంటున్నారు!

▸ అండగా ఉంటామన్న ఎమ్మెల్యే కూడా పట్టించుకోలేదు
▸ భానుకోటలో వితంతువు గౌతమి కన్నీటి కష్టం
▸ మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో ఆవేదన

ధర్మవరం రూరల్, జనవరి 22: 'భర్త చనిపోయి పిల్లలతో పుట్టెడు కష్టంలో ఉన్న తనను వైసీపీ నాయకులు లైంగికంగా వేధిస్తున్నారు. ప్రభుత్వ పథకాలకోసం వెళితే నాతో పడుకుంటావా.. అని అడుగుతున్నారు' అని మాజీ మంత్రి పరిటాల సునీత వద్ద ఓ మహిళ కంటతడి పెట్టారు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోటలో సోమవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో గౌతమి అనే వితంతువు గోడు వెళ్లబోసుకున్నారు. బోయ సామాజికవర్గానికి చెందిన బాధితురాలు.. వైసీపీ సానుభూతిపరులు కావడం గమనార్హం. గ్రామస్థులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరైన ఆమె.. పరిటాల సునీత ఎదుట తన కష్టాన్ని చెప్పుకున్నారు. తన భర్త కుంపటి కుళ్లాయప్ప కొవిడ్ సమయంలో జ్వరంతో బాధపడుతుంటే.. చికిత్స చేయిస్తామని వైసీపీవారు హామీ ఇచ్చి, ఆ తరువాత పట్టించుకోలేదని తెలిపారు. చిన్నవయసులోనే భర్తను కోల్పోయి, ఇద్దరు పిల్లలతో పుట్టెడు దుఃఖంలో ఉన్నానన్నారు. 'ఆయన చనిపోయాక రూ.2లక్షలు.. రూ.5లక్షలు ఇప్పిస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి నాకు అండగా ఉంటామని చెప్పారు. ఏ కష్టం వచ్చినా చెప్పాలన్నారు. వారి మాటలు నమ్మిన నాకు మూడేళ్లుగా నరకం చూపిస్తున్నారు. ఇప్పటివరకు పింఛన్ తప్ప ఏమీ రాలేదు. ఇంటి బిల్లులు పడలేదు. ప్రభుత్వ పథకాల కోసం వెళితే కాగితాలు తీసుకుని రమ్మన్నారు. రూ.5 వేలు ఖర్చు చేసి కాగితాలు తీసుకెళ్లారు. కానీ అవి చెల్లవని ఉద్దేశపూర్వకంగా తిప్పుతున్నారు. కొందరు వ్యక్తులు నాతో వస్తావా, పండుకుంటావా? అని అసభ్యకరంగా మాట్లాడుతున్నారు' అని గౌతమి అందరిముందూ కన్నీటిపర్యంతమయ్యారు. తనపై బంధువులు దాడిచేస్తున్నా ఎవరూ రక్షణ కల్పించలేదని, కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళితే ఎస్ఐ రాలేదు, ఇంకొక్కరు రాలేదని ఉద్దేశపూర్వకంగా రాత్రి 10 గంటల వరకు కూర్చోబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తనకు న్యాయం చేయలేదని, నేటికీ తనపై దాడులు కొనసాగుతున్నాయని వాపోయింది. 'ఏ కష్టం వచ్చినా మేమున్నామని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి చెప్పారు. కానీ ఇప్పటివరకు మా గురించి పట్టించుకున్న పాపన పోలేదు. పరిటాల సునీతమ్మ గారే నన్ను, నా పిల్లలను కాపాడాలి' అని బాధితురాలు వేడుకున్నారు. ఆమె మాటలు విన్న పరిటాల సునీత తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఆమెను దగ్గరకు తీసుకుని అధైర్యపడవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

గ్రామ వలంటీర్ చేతివాటం

▸ ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తికి నేటికీ పెన్షన్ సొమ్ము!

రాజవొమ్మంగి, జనవరి 22: అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం లబ్బర్తి గ్రామంలో ఓ వలంటీర్ ఏడాదిగా చేతివాటం ప్రదర్శిస్తున్నాడు. గ్రామానికి చెందిన శెలంశెట్టి సూర్యకాంతం గత ఏడాది ఫిబ్రవరి చివరిలో చనిపోగా, ఆమె ఇప్పటికీ ప్రతినెలా పెన్షన్ తీసుకుంటున్నట్లు వలంటీర్ రమణబాబు అధికారులకు చూపి, తన ఫింగర్ ప్రింట్‌తో ఆ సొమ్ము జేబులో వేసుకుంటున్నాడు. గ్రామంలో ఈ విషయం చర్చనీయాంశం కావడంతో అధికారులకు విషయం తెలిసింది. దీంతో జనవరి నెల పింఛన్ సొమ్ము వలంటీర్‌కు ఇవ్వలేదు. ఎంపీడీవో విజయరంగారావు మాట్లాడుతూ లబ్బర్తి గ్రామానికి వెళ్లి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

మల్లన్న సన్నిధిలో పురందేశ్వరి

శ్రీశైలం, జనవరి 22: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి సోమవారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకుచేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో పురందేశ్వరికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆమె శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 23 జనవరి 2024
cinema@andhrajyothy.com





ప్రస్తుతం ఎలివేషన్స్ ట్రెండ్ నడుస్తోంది. డైలాగులతో, కెమెరా ట్రిక్కులతో హీరోను ఓ సూపర్ నాచురల్ పవర్‌లా చూపించడం నేటి దర్శకులకు పరిపాటైపోయింది. అసలు ఈ ఎలివేషన్ అనే దానికి విత్తనం ఎక్కడ పడిందో ముందు తెలుసుకుందాం. హీరో కేరక్టర్‌ని ఆకాశమంత ఎత్తులో చూపించే ప్రక్రియ రామాయణకావ్యం నుంచి మొదలైంది. దానికి నాంది పలికింది వాల్మీకి. 'రామాయణం'లో 'మారీచ ఉవాచ' చదివిన వాళ్లకు ఎలివేషన్ అంటే ఏంటో అర్థమవుతుంది. ఓ విధంగా రాముడికి వాల్మీకి ఇచ్చినంత ఎలివేషన్ ఆ తర్వాత ఏ కథల్లోనూ కావ్యాల్లోనూ, ఏ సినిమాల్లోనూ ఇప్పటికీ ఎవరూ ఇవ్వలేకపోయారన్నది వాస్తవం. అందుకే ఇప్పటికీ హీరో అనే పదానికి నిర్వచనం అంటే శ్రీరాముడే.





సినీజగమంతా రామమయం







రాముడు మానవుడిగా పుట్టిన వైకుంఠనారాయణుడు అనేది కోట్లాదిమంది నమ్మకం. అసలు మనిషిగా పుట్టిన రాముడు దేవుడెలా అయ్యాడు? అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే రామాయణం చదవాలి. నూనూగు మీసాల ప్రాయంలోనే బ్రహ్మరాక్షసి తాటకిని చంపడం.. వీరాధివీరులకే సాధ్యంకాని శివధనుస్సును విరిచేయడం.. పరశురాముని గర్వాన్ని అణిచేయడం.. 40వేలమంది కరదూషణాదులను ఒక్కడే ఒకే యుద్ధంలో చంపేయడం.. రావణుడి పదితలల్నీ తెంచి ఆవతల పారేయడం.. అన్నింటినీ మించి ధర్మనిరతి, మాటపై నిలబడే తత్వం. ఇవన్నీ మనుషులకు సాధ్యంకాదు. కాబట్టే రాముడు దేవుడు. ఓ విధంగా వెండితెరపై తయారయ్యే సూపర్‌హీరో పాత్రలన్నింటికీ ప్రేరణ రాముడే. హీరో లక్షణాలంటే ఏవోకావు.. రాముడి గుణగణాలే.. మరి అలాంటి రామయ్య సంపూర్ణమూర్తిని వెండితెరపై ఆవిష్కరించిన నటదిగ్గజాలెవరో ఇప్పుడు చూద్దాం.

● వెండితెరపై రాముడిగా ఎందరు నటించినా అగ్ర తాంబూలం మాత్రం నటరత్న ఎన్టీరామారావుదే. ఎన్టీయార్ రాముడిగా కనిపించిన తొలి సినిమా 'చరణదాసి'(1956). ఇందులో ఓ పాటలో రాముడిగా కనిపించారాయన. ఆ తర్వాత 'వినాయకచవితి'(1957)లో ఓ సన్నివేశంలో రాముడిగా మెరిశారు. ఇక ఎన్టీయార్ పూర్తిస్థాయిలో రాముడిగా నటించిన తొలి సినిమా 'సంపూర్ణరామాయణం'(తమిళం). 1958లో విడుదలైన ఈ తమిళ సినిమా ఘనవిజయాన్ని అందుకుంది. ఇందులో భరతుడిగా శివాజీగణేశన్ నటించడం విశేషం.

ఇక 'లవకుశ'(1953).. తెలుగు సినీచరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ సినిమా 'లవకుశ'. జనం తండోపతండాలుగా బళ్లుకట్టుకొని మరీ వెళ్లి ఈ సినిమా చూశారు. ఆడుతున్న థియేటర్లన్నీ రామాలయాలైపోయాయి. వాణిజ్యపరంగా తెలుగుసినిమా స్థాయిని పెంచిన సినిమా 'లవకుశ'. 'కోటి' అనే అంకెను సినీ పరిశ్రమకు పరిచయం చేసిన సినిమా ఇది.

ఆ తర్వాత శ్రీకృష్ణసత్య, శ్రీరామాంజనేయయుద్ధం, శ్రీరామపట్టాభిషేకం, శ్రీకృష్ణాంజనేయయుద్ధం చిత్రాల్లో రాముడిగా నటించి తెలుగు ప్రజల గుండెల్లో కోదండరాముడిగా చెరగని ముద్రవేశారు తారకరాముడు.

● ఈ సందర్భంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. హీరోగా ఆయన నటించిన తొలి సినిమా 'సీతారామజననం'. ఇందులో అక్కినేని కల్యాణరాముడిగా నటించారు. అంటే హీరోగా ఆయన కెరీర్ మొదలైంది రాముడి పాత్రతోనే అనమాట.

● ఎన్టీయార్ తర్వాత రామచంద్రుడి పాత్రలో మెప్పించిన మరో నటుడు హరనాథ్. ఎన్టీయార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'సీతారామకల్యాణం' చిత్రంలో తొలిసారి రాముడిగా నటించారు హరనాథ్. కల్యాణరాముడిగా ఆయన రూపం తెలుగుప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆ తర్వాత శ్రీరామకథ, భక్తశబరి చిత్రాల్లో రాముడిగా అలరించారాయన.

● కాంతారావు విషయానికొస్తే.. ఆయన అందరికీ లక్ష్మణుడిగానే గుర్తుంటారు. 'లవకుశ'లో లక్ష్మణస్వామిగా కాంతారావు చూపించిన అభినవపాటవం అలాంటిది. ఆయనే ఆ తర్వాత వీరాంజనేయ, మైరావణ , పాదుకాపట్టాభిషేకం చిత్రాల్లో రాముడిగా కూడా భళా అనిపించారు.

● శోభన్‌బాబుని రాముడిగా వెండితెరపై ఆవిష్కరించిన తొలి సినిమా 'భక్త పోతన'. ఆ తర్వాత రాముడిగా కనిపించిన చిత్రం దర్శకుడు బాపు 'సంపూర్ణరామాయణం'. రామజననం నుంచి రావణ సంహారం వరకూ జనరంజకంగా ఈ సినిమాను ఆవిష్కరించారు బాపు-రమణ. ఇందులో రాముడిగా శోభన్‌బాబు నటన అద్భుతం. ఎన్టీయార్ వెండితెరపై సూపర్‌స్టార్‌గా వెలుగుతున్న రోజుల్లోనే రాముడిగా నటించి ఆయనతోనే శభాష్ అనిపించుకున్నారు శోభన్‌బాబు. 'లవకుశ'లో ఆయన శత్రుఘ్నుడిగా నటించిన విషయం తెలిసిందే.

● ఆ తర్వాతి తరంలో రాముడిగా మెప్పించిన హీరోల్లో నందమూరి బాలకృష్ణ కూడా ఒకరు. ఆయన తొలిసారి 'మంగమ్మగారి మనవడు' సినిమాలో రాముడిగా మెరిశారు. ఆ తర్వాత జంధ్యాల 'సీతారామకల్యాణం' సినిమాలోని ఓ సన్నివేశంలో రాముడిగా కనిపించారు. ఇక బాపుగారి చివరి సినిమా 'శ్రీరామరాజ్యం'లో పూర్తిస్థాయిలో రాముడిగా నటించి తండ్రిని తలపించారు బాలకృష్ణ.

● పూర్తిస్థాయి రాముడిగా నటించిన మరో హీరో జూనియర్ ఎన్టీయార్. గుణశేఖర్ దర్శకత్వంలో ఎంఎస్‌రెడ్డి నిర్మించిన 'రామాయణం'లో ఆయన రాముడిగా నటించారు. 1996లో విడుదలైన ఈ సినిమా నాటికి తారక్ వయసు 13ఏళ్లు. పిల్లలే ప్రధానపాత్రధారులుగా వాల్మీకి రామాయణాన్ని సినిమాగా తీయాలన్న ఎంఎస్ రెడ్డి సాహసోపేతమైన ఆలోచనకు తెరరూపం 'రామయణం'. గుణశేఖర్ దర్శకత్వం వహించారు. బాలుడైన తారక్ రాముడిగా ఆ సినిమాలో అద్భుతం అనిపించారు. ఆ వయసులోనే 'తాతకు తగ్గ మనవడు' అంటూ పలువురి కితాబులందుకున్నారు . ఆ ఏడాది జాతీయ పురస్కారాలు అందుకున్న సినిమాల్లో ఈ సినిమా కూడా ఒకటి.



● 'అన్నమయ్య' సినిమాలో వెంకటేశ్వరస్వామిగా అద్భుతంగా నటించిన హీరో సుమన్.. 'శ్రీరామదాసు' చిత్రంలో రాముడిగా నటించారు. ఆ తర్వాత 'సత్యనారాయణస్వామి' అనే సినిమాలో కూడా రామచంద్రమూర్తిగా తళుక్కున మెరిశారు. ఏదేమైనా అటు ఏడుకొండలవాడిగా, ఇటు రామచంద్రమూర్తిగా సుమన్ అభినయాన్ని.. ఆహార్యాలను జనం మెచ్చారు. ఇక 'దేవుళ్లు' సినిమాలో హీరో శ్రీకాంత్ కూడా రాముడిగా కనిపించారు.

ఈ విధంగా జనంమెచ్చిన కథానాయకులందరూ.. జగం మెచ్చిన కథానాయకుడైన రామచంద్రమూర్తి పాత్రను పోషించి.. శభాష్ అనిపించుకున్నారు.

అయోధ్యలో బాలరామయ్య కొలువు తీరగా, కోట్లాదిమంది భారతీయుల కల నెరవేరిన ఈ శుభవేళ.. వెండితెర రాముళ్లను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..



చెల్లి ఎంగేజ్‌మెంట్.. సాయిపల్లవి డాన్స్



హీరోయిన్ సాయిపల్లవి చెల్లెలు పూజా కన్నన్ వివాహం ఆమె చిరకాల మిత్రుడు, ప్రియుడు వినీత్‌తో జరగనుంది. వీరి నిశ్చితార్థ వేడుక మిత్రులు, కుటుంబ సభ్యుల మధ్య జరిగింది. వినీత్‌తో రిలేషన్‌లో ఉన్న సంగతిని పూజ సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన వారం రోజులకే ఈ వేడుక జరగడం గమనార్హం.. పూజ కూడా నటే. ఓ తమిళ చిత్రంతో ఆమె నటిగా అరంగేట్రం చేశారు. నిశ్చితార్థ వేడుకలో కాబోయే వధూవరులతో కలసి సాయి పల్లవి డాన్స్ చేసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

మాట విలువ చెప్పే బాలరాజు



'బిగ్‌బాస్' సోహైల్ హీరోగా శ్రీ కోనేటి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'బూట్ కట్ బలారాజు' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఎం.డి. పాషా ఈ సినిమాకు నిర్మాత. ఈ చిత్రం ట్రైలర్‌ను ఆదివారం జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు.ఈ వేడుకలో సోహైల్ మాట్లాడుతూ 'నేను 'బిగ్‌బాస్' నుంచి బయటకు రాగానే నాతో సినిమా చేస్తానని పాషా భాయ్ చెప్పారు. ఈ సినిమా కోసం బాగా కష్టపడ్డాం. భీమ్స్ అన్న ఈ సినిమాకు మంచి పాటలు ఇచ్చారు. టీమ్ అందరికీ ధన్యవాదాలు' అని చెప్పారు. హీరో శివాజీ మాట్లాడుతూ 'సోహైల్‌లో మంచి తపన ఉంది. పరిశ్రమలో తప్పకుండా నిలబడతాడు. ఎదుగుతున్న నటుడిని అందరూ ప్రోత్సహించాలి' అన్నారు. దర్శకుడు శ్రీ కోనేటి మాట్లాడుతూ 'మంచి వినోదాత్మక చిత్రం ఇది. మాటకి ఉన్న విలువ, గౌరవం గురించి ఈ చిత్రంలో చెబుతున్నాం' అన్నారు. 'కంటెంట్ ఉన్న ప్రతి సినిమా హిట్ అవుతుంది. రెండున్నర ఏళ్లుగా ఈ సినిమా కోసం హార్డ్ వర్క్ చేశాం. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది. అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. 'బిగ్‌బాస్' ఏడు సీజన్ల స్టార్స్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులంతా పాల్గొన్న ఈ వేడుక గ్రాండ్‌గా జరిగింది.

జై హనుమాన్ ప్రారంభం



'హను-మాన్' వేడి ఇంకా చల్లారక ముందే ఆ సినిమాకు సీక్వెల్‌ని ప్రకటించేశారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ఈ సినిమాకు 'జై హనుమాన్' అని నామకరణం చేశారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్‌ను అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్టామహోత్సవం సందర్భంగా సోమవారం మొదలుపెట్టారు. హైదరాబాద్‌లోని హనుమాన్ ఆలయంలో యాగంలో పాల్గొని, స్క్రిప్ట్‌ని హనుమంతుని పాదాలదగ్గర ఉంచి ప్రీప్రొడక్షన్ వర్క్‌ని లాంఛనంగా ప్రారంభించారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేయనున్న ఈ సినిమాకి సంబంధించిన నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రేమలో.. ఎమోషన్స్



చందు కోడూరి హీరోగా, చరిష్మా శ్రీకర్ హీరోయిన్‌గా రూపొందిన 'ప్రేమలో' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. చందు కోడూరి దర్శకత్వంలో రాజేశ్ కోడూరి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను నటుడు శివాజీ రాజా సోమవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రంలో మూడు రోజుల పాత్ర చేయడానికి అంగీకరించాను. అయితే దర్శకుడు చందు ప్యాషన్ చూసి నేను మూడు రోజులు ఉంటే ఖర్చు ఎక్కువ అవుతుందని ఒకటిన్నర రోజుల్లోనే కంప్లీట్ చేయమన్నాను. అతను పడిన కష్టానికి మంచి పేరు వస్తుంది. ఇలాంటి చిత్రాలను తప్పకుండా ఆదరించాలి' అని కోరారు.

హీరో, దర్శకుడు చందు మాట్లాడుతూ 'తెలుగులో ఇప్పటివరకూ ఎవరూ ట్రై చేయని కథ తీసుకున్నాను. సహజంగా ఉండేలా తీర్చిదిద్దాను. ఇది ప్రేమకథే. అయినా మంచి ఎమోషన్స్ ఉన్నాయి. కథలో బలం ఉంది కనుక ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. మా అన్నయ్య నిర్మాతగా మారి ఈ సినిమా కోసం బాగా ఖర్చు పెట్టారు. ఓ మేనేజర్‌గా ఎంతో కష్టపడ్డారు. టీమ్‌లో అందరి సహకారంతో సినిమా పూర్తి చేశాం. ఈ చిత్రం హిట్ అయితే మరిన్ని సినిమాలు తీస్తాను. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం రోజునే మా సినిమా ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. జై శ్రీరామ్' అన్నారు.

'ప్రేమలో' చిత్రం విజయం సాధించాలని సంగీత దర్శకుడు సందీప్, పాటల రచయిత సత్య, నటుడు భోగిరెడ్డి శ్రీనివాస్ తదితరులు కోరారు.

తండ్రీకొడుకుల రామం రాఘవం



నటుడు ధన్‌రాజ్ దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రానికి 'రామం రాఘవం'. అనే పేరును ఖరారు చేశారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం మేకర్స్ టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి పృథ్వీ పోలవరపు నిర్మాత. ఇందులో తండ్రీకొడుకులుగా సముద్రఖని, ధన్‌రాజ్ కనిపిస్తారని, ఇప్పటివరకూ చూడని కొత్త కథాంశంతో ఈ సినిమా రూపొందుతోందని నిర్మాత తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఈ చిత్రంలో మోక్ష, హరీశ్ ఉత్తమన్, సత్య పృథ్వి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఇతర పాత్రధారులు. 'విమానం'ఫేం శివప్రసాద్ యానాల కథను అందిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గాప్రసాద్. తెలుగు, తమిళభాషల్లో ఒకేసారి ఈ చిత్రం విడుదల కానుంది.

మస్తు షేడ్స్ ఉన్నాయ్‌రా..



కమెడియన్ అభినవ్ గోమఠం హీరోగా మారాడు. ఆయన హీరోగా 'మస్త్ షేడ్స్ ఉన్నాయ్‌రా' అనే పేరుతో సినిమా రానుంది. 'ఈ నగరానికి ఏమైంది' సినిమాలో అభినవ్ చెప్పిన పాపులర్ డైలాగ్ ఇది. అదే హీరోగా అతని తొలి సినిమా టైటిల్ కావడం విశేషం. వైశాలీ రాజ్ హీరోయిన్. తిరుపతిరావు ఇండ్ల దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్.వి నిర్మాతలు. ఈ సినిమా టైటిల్ లోగోను దర్శకుడు తరుణ్‌భాస్కర్ ఆవిష్కరించారు. నటుడిగా అభినవ్ గోమఠంలోని కొత్తకోణాన్ని ఇందులో చూస్తారని, అన్ని ఉద్వేగాలూ ఈ సినిమాలో ఉంటాయని, వచ్చేనెల ద్వితీయార్థంలో సినిమాను విడుదల చేస్తామని దర్శకుడు తెలిపారు. తరుణ్‌భాస్కర్, అలీ రేజా తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ స్వయంభూ, కథ, అన్వర్ సాధిక్, మాటలు: రాధామోహన్ గుంటి, సంగీతం: సంజీవ్ టి.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● మంగళవారం 23 జనవరి 2024

diksuchi@andhrajyothy.com

యోగా సైన్స్‌లో ఫౌండేషన్ కోర్సు

భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా(ఎండీఎన్ఐవై)- 'ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగా సైన్స్ ఫర్ వెల్‌నెస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఒక నెల. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ప్రతి బ్యాచ్‌కు రెండు గంటల శిక్షణ ఉంటుంది. ఒక్కో బ్యాచ్‌లో 30 సీట్లు ఉన్నాయి. వయసు కనీసం పదిహేనేళ్లు నిండినవారందరూ అర్హులే. అభ్యర్థులందరూ మెడికల్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.



ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.2,500
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.250
- **సర్టిఫికేషన్ ఫీజు:** రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 29
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** అభ్యర్థి ఫొటో, వ్యాలిడ్ ఐడీ కార్డ్
- **తరగతులు ప్రారంభం:** ఫిబ్రవరి 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.yogamdniy.nic.in

నిట్ వరంగల్‌లో ఇంటిగ్రేటెడ్ ఎఫ్‌డీపీ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్- 'లూపింగ్ టెక్నాలజీస్ ఫర్ సస్టయినబుల్ పవర్ అండ్ హైడ్రోజన్ ప్రొడక్షన్' అంశానికి సంబంధించి ఇంటిగ్రేటెడ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. దీనిని కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ అకడమిక్ అండ్ రీసెర్చ్ కొలాబరేషన్(స్పార్క్) స్పాన్సర్ చేస్తోంది.

స్వీడన్‌లోని చామర్స్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ(సీయూటీ), యూఎస్ఏలోని ఎన్‌సీ స్టేట్ యూనివర్సిటీ సహకారం అందిస్తున్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి ఒక వారం. దీనిని హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహిస్తారు. వివిధ అకడమిక్ సంస్థలకు చెందిన ఫ్యాకల్టీలు; సీసీయూ టెక్నాలజీపై ఆసక్తి ఉన్న పీజీ అభ్యర్థులు, రీసెర్చ్ సైంటిస్ట్‌లు, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్; థర్మల్ పవర్ ప్లాంట్స్‌కు చెందిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో మొత్తం 60 మందికి అవకాశం కల్పిస్తారు.

ప్రోగ్రామ్‌లోని అంశాలు

ఈ ప్రోగ్రామ్‌లో ప్రిన్సిపల్స్ అండ్ థర్మోడైనమిక్స్ యాస్పెక్ట్ ఆఫ్ సీఎల్‌సీ, ప్రాపర్టీస్ అండ్ ప్రిపరేషన్ ఆఫ్ ఆక్సిజన్ క్యారియర్స్, కెమికల్ లూపింగ్ గ్యాసిఫికేషన్, కెమికల్ లూపింగ్ హైడ్రోజన్ అండ్ కెమికల్ ప్రొడక్షన్, డిజైన్ అండ్ ఆపరేషన్ ఆఫ్ సీఎల్‌సీ యూనిట్స్, సీఎల్‌సీ ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ సిమ్యులేషన్స్ అంశాలకు సంబంధించి 15 గంటలసేపు లెక్చర్స్, 3 ట్యుటోరియల్ సెషన్స్ ఉంటాయి. నిట్ వరంగల్, సీయూటీ(స్వీడన్), ఎన్‌సీఎస్‌యూ (యూఎస్ఏ)లకు చెందిన ప్రొఫెసర్లు సెషన్స్ నిర్వహిస్తారు. అభ్యర్థులు నిర్దేశించిన ప్రకారం అసైన్‌మెంట్స్ పూర్తిచేయాలి. ప్రోగ్రామ్ చివరలో గ్రేడెడ్ ఎగ్జామ్ ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఈ - సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** ఫ్యాకల్టీ మెంబర్లకు రూ.590, రీసెర్చ్ స్కాలర్స్/పీజీ/పీహెచ్‌డీ అభ్యర్థులకు రూ.354; ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్‌కు రూ.1180. ● **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 5
- **వెబ్‌సైట్:** nitw.ac.in

ఐఐఎం రోహ్‌తక్‌లో డాక్టోరల్ ప్రోగ్రామ్

రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (డీపీఎం)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఇది నాలుగేళ్ల వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు

ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్.



అర్హత

ఏదేని స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీతో పాటు సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్/ ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నాలుగేళ్ల డిగ్రీ లేదా ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు 2024 జూన్ 1 నాటికి ఏడాది అనుభవం ఉన్నవారు; అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ, పీజీ స్థాయుల్లో కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 డిసెంబరు 31 నాటికి పీజీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్/జీఆర్ఈ/జీమ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. లేదంటే నిర్దేశించిన ప్రకారం కామర్స్, కంప్యూటర్ అండ్ అప్లికేషన్స్ ఎకనామిక్స్, లేబర్ వెల్ఫేర్ అండ్ పర్సనల్ రిలేషన్స్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, మేథమెటికల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో యూజీసీ నెట్ అర్హత పొంది ఉండాలి. ఐఐఎం సంస్థల నుంచి పీజీడీఎం/ఎంబీఏ పూర్తిచేసినవారికి పై స్కోర్‌లు అవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

ఫెలోషిప్

మొదటి రెండేళ్లు నెలకు రూ.34,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000ల ఫెలోషిప్ ఇస్తారు. నిబంధనల ప్రకారం రెండో ఏడాది నెలకు రూ.10,000; మూడో ఏడాది నుంచి నెలకు రూ.15,000ల మెరిట్ ఫెలోషిప్ ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద రూ.2,50,000 చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.2928
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 29
- అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్: మార్చి 15న
- ఇంటర్వ్యూలు: ఏప్రిల్ 15, 16
- ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: ఏప్రిల్ 25న
- అభ్యర్థుల రిపోర్టింగ్, జాయినింగ్ తేదీ: జూన్ 6
- వెబ్‌సైట్: iimrohtak.ac.in

చదవడమే కాదు చేతిరాతా ముఖ్యమే



అసలే పరీక్షల సమయం. విద్యార్థులు పరీక్షలకు ఎంతో సమయాన్ని కేటాయించి కష్టపడి బాగా చదువుతారు. కాని కొందరి రాతను చూస్తే వంకరటింకరగా, పదాల మధ్య ఎక్కువ గ్యాప్‌లు ఇస్తూ రాస్తుంటారు. ఇలా చేయడం వల్ల ఎగ్జామినర్‌ను ఆకట్టుకోలేరు. నిజానికి మంచి దస్తూరికి కనీసం అయిదు నుంచి పదిశాతం మార్కులు అదనంగా పొందే వీలుంది.

ప్రధాన దోషాలు

చిన్న చిన్న దోషాలే... విలువలైన మార్కులకు కోత పెడతాయి. సాధారణంగా విద్యార్థులు పరీక్షల్లో నాలుగు రకాల తప్పులను చేస్తుంటారు.

1) ప్రశ్నకు తగ్గట్టు సమాధానం రాయకపోవడం
2) వ్యాకరణ దోషాలు 3) అక్షర దోషాలు
4) చేతిరాత గజిబిజిగా ఉండటం

ముఖ్యంగా...

1) సమాధానాలు రాసేటప్పుడు విరామ చిహ్నాలు మరిచిపోతారు
2) పదాల, అక్షరాల మధ్య ఖాళీ స్థలాన్ని వదలడం
3) అక్షరాలను, సంఖ్యలను అస్పష్టంగా రాయడం
4) కాగితంపై పెన్ను ఒత్తిపెట్టి రాస్తే, సమాధానాన్ని నిదానంగా పూర్తిచేస్తారు, ఒత్తిడి స్పష్టంగా తెలుస్తుంది.
5) కొట్టివేతలు... విద్యార్థులు పరీక్షకు సరిగా సిద్ధం కాలేదని చెబుతాయి.
6) ఎ4 సైజు కాగితంలో 20 నుంచి 25 వరసలు రాస్తుంటారు.
7) పెన్నును ఇష్టం వచ్చినట్టు పట్టుకోవడంతో జవాబు పత్రం గజిబిజిగా తయారవుతుంది. లైన్లు వంకరటింకరగా ఉంటాయి.
8) నలుపు, నీలం, ఎరుపు జెల్ పెన్నులను ఉపయోగించకూడదు.
9) సమాధానాలు రాసేటప్పుడు సంక్షిప్త సందేశాలు పంపేటప్పుడు ఉపయోగించే షార్ట్ కట్ భాషను వాడకూడదు.
10) బిట్ పేపర్‌లో చిన్న ఆంగ్ల అక్షరాలను వాడకూడదు.
11) అంకెలు రాసేటప్పుడు స్పష్టత లేక పోతే

మూల్యాంకనం చేసేవారు అర్థం చేసుకోలేక మార్కులు వేయకపోవచ్చు.

ఈవిధంగా నేర్చుకొని, పాటించాలి

1) తెలుగు, హిందీ, ఆంగ్ల అక్షరాలు రాసేటప్పుడు అక్షరాలు నిటారుగా, గుండ్రంగా ఉండాలి.
2) ఆంగ్లంలో కలిపి రాత రాసేవారు 90 డిగ్రీల కోణంలో, విడివిడిగా రాసేవారు 60 డిగ్రీల కోణంలో వంచి రాయాలి.
3) కొట్టివేతలు, దిద్దివేతలు లేకుండా ఉంటే మంచిది. ఒకవేళ తప్పుగా రాసినప్పుడు ఇష్టం వచ్చినట్లు దిద్దకుండా ఆ పదంపై పెన్సిల్‌తో ఒక గీత గీసి దాని పక్కనే తిరిగి రాయడం ఉత్తమం.
4. ఎ4 సైజు కాగితంలో 15 నుంచి 18 లైనులే రాయాలి
5) మూడువేళ్లతో పెన్ను పట్టుకోవాలి.
6) రోజూ ఉదయం 10 నుంచి 15 నిమిషాలసేపు యోగ, ధ్యానం చేయాలి. అప్పుడే మనం రాసే అక్షరాలపై దృష్టి కేంద్రీకరించగలం.
7) కాగితంపై పెన్ను ఒత్తి పెట్టి రాయకుండా, సున్నితంగా రాయాలి.
8) ఆంగ్లంలో కలిపి రాత రాసేవారు ముందుగా ఇంక్ పెన్ లేదా జెల్ పెన్‌తో సాధన చేసి, బాల్‌పెన్‌తో వేగంగా రాయడం అలవాటు చేసుకోవాలి.
9) అక్షరాల మధ్య కాకుండా పదాల మధ్యే నిర్ణీత ఖాళీ ఇవ్వాలి. ముఖ్యంగా విరామ చిహ్నాలను పాటించాలి
10) రోజూ అపసవ్య దిశలో సున్నాలను గీస్తూ ఉంటే అక్షరాలను గుండ్రంగా రాసేందుకు అవకాశం ఉంటుంది.
11) పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు రోజూ ఎక్కువగా నీళ్లు తాగుతూ శాఖాహార భోజనం తీసుకోవాలి
12) ఎట్టి పరిస్థితుల్లోనూ షార్ట్‌కట్ భాష ఉపయోగించకూడదు. ఒకవేళ రాస్తే పేపర్ దిద్దే వారికి మీపై ఒక దురభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉంది.
13) డ్రాయింగ్‌ను సాధన చేస్తే దస్తూరి మెరుగుపడుతుంది
14) కంటికి, కాగితానికి మధ్యలో దూరం 20 నుంచి 25 సెంటీమీటర్ల మధ్య ఉండాలి.
15) కాగితం పైభాగంలో రాసే మొదటి వరుసను శ్రద్ధ పెట్టి జాగ్రత్తగా రాయాలి. అప్పుడు కింది వరుసలు చక్కగా వస్తాయి.
16) సైన్స్(సామాన్య, భౌతికశాస్త్రంలో) బొమ్మలు గీస్తే ఆ బొమ్మల్లోని భాగాలు గుర్తించడంలో ఒక క్రమపద్ధతిని పాటించాలి
17) గణితానికి సంబంధించిన అంకెలు సక్రమంగా, స్పష్టంగా రాయాలి.
18) గణితంలో పరిచయానికి మాత్రమే కలిపి రాత ఉపయోగించాలి
19) తెలుగు, హిందీ, మేథ్స్, ఆంగ్లం, సైన్స్, సోషల్ సమాధాన పత్రంలో మొదటి పేజీ నుంచి చివరి పేజీ వరకు ఒకే పెన్నుతో, ఒకే దస్తూరిలో రాయాలి.
20) జవాబు రాసే తీరు పరీక్ష పేపర్ మూల్యాంకనం చేసేవారికి ఇబ్బందిపెట్టే విధంగా ఉండకూడదు. సమాధానాలు అన్నీ మూల్యాంకనం చేసే ఉపాధ్యాయునికి తెలుసన్న సంగతి గుర్తుంచుకోవాలి.

కాలిగ్రఫీ: ఈ హ్యాండ్ రైటింగ్‌లో అక్షరాలు ఎక్కువగా మెలకువలు ఆధారంగా ఉంటాయి. ఈ రైటింగ్ ఎక్కువగా గ్రీటింగ్ కార్డ్స్, ఇన్విటేషన్ కార్డ్స్‌లో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ హ్యాండ్ రైటింగ్‌ను పరీక్షల్లో ఉపయోగించకూడదు.

స్ప్రిట్: విడివిడిగా రాసే అక్షరాలను స్ప్రిట్ హ్యాండ్ రైటింగ్‌గా పిలుస్తారు. ఇది చాలా సాంప్రదాయక చేతిరాత. ఈ హ్యాండ్ రైటింగ్ ఎదుటివారికి స్పష్టంగా అర్థమవుతాయి. ఎక్కువగా ఒకటో తరగతి నుంచి మూడో తరగతి విద్యార్థులు దీనిని ఉపయోగిస్తారు. ఈ హ్యాండ్ రైటింగ్‌ను పరీక్షల్లో ఉపయోగించవచ్చు.

కాలిగ్రఫీ కర్సివ్: అక్షరాలను కలిపి రాయడమే ఈ చేతిరాత ప్రత్యేకత. ఇది ఒక యూనిఫాంలో ఉంటుంది. ఇది యూనివర్సల్ హ్యాండ్ రైటింగ్ ప్రపంచంలో ఈ చేతిరాతకి చాలా ప్రాముఖ్యం ఉంది. ప్రపంచంలో ఏ ఇద్దరు వ్యక్తుల రైటింగ్‌లు ఒకేలా ఉండనిదే కాలిగ్రఫీ కర్సివ్ హ్యాండ్ రైటింగ్ అసలైన ప్రత్యేకత. దీనిని పరీక్షల్లో ఉపయోగించవచ్చు.

లూసిడా:

ఈ హ్యాండ్ రైటింగ్ కూడా మెలకువల ఆధారంగానే ఉంటుంది. నిదానంగా రాస్తే ఇది చాలా బాగుంటుంది. వేగంగా రాసే సమయంలో ఈ రైటింగ్‌లో అక్షరాల్లో సఖ్యత ఉండదు. ఫాంట్, క్లారిటీ తగ్గుతుంది.

1) చదువులో ముందున్న, వెనుకబడి ఉన్న విద్యార్థులను చదువుపై ఆసక్తి పెరగడానికి చేతిరాత ఒక మెడిసిన్‌లా ఉపయోగపడుతుంది.
2. విద్యార్థుల చేతిరాత రకరకాలుగా ఉంటుంది. వీరిలో కొందరు చిన్న చిన్న అక్షరాలకు అలవాటు పడి ఉంటారు. మరికొందరు పెద్ద పెద్ద అక్షరాలు రాస్తుంటారు. ఇంకొందరు అక్షరాలను కలిపేస్తూ అష్టవంకర్లుగా రాస్తుంటారు. ఇది సరైన పద్ధతి కాదు.

కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు విపరీతంగా వాడుతున్న ఈ తరంలో చేతిరాతను మర్చిపోకుండా, దాని ప్రాముఖ్యాన్ని గుర్తించడమే జనవరి 23 జాతీయ చేతిరాత దినోత్సవ ముఖ్యోద్దేశం.

> **జవాబు రాసే తీరు పరీక్ష పేపర్ మూల్యాంకనం చేసేవారికి ఇబ్బందిపెట్టే విధంగా ఉండకూడదు. సమాధానాలు అన్నీ మూల్యాంకనం చేసే ఉపాధ్యాయునికి తెలుసన్న సంగతి గుర్తుంచుకోవాలి.**

పి.భువనచంద్ర,
జాతీయస్థాయి చేతిరాత నిపుణులు

జాబ్ కార్నర్

'ఐవోసీఎల్ పైప్‌లైన్స్'లో అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, పైప్‌లైన్స్ డివిజన్ పరిధిలోని అయిదు రీజియన్లలో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పైప్‌లైన్ రీజియన్లు: వెస్ట్రన్, నార్తర్న్, ఈస్ట్రన్, సదరన్, సౌత్ ఈస్టర్న్.

పోస్టు: అప్రెంటిస్ **ఖాళీలు:** 473

ట్రేడులు: మెకానికల్, ఎలక్ట్రికల్, టీ అండ్ ఐ, హ్యూమన్ రిసోర్స్, అకౌంట్స్/ఫైనాన్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్.

అర్హత: 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత

వయోపరిమితి: 2024 జనవరి 12 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, వైద్య పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు. **ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** ఫిబ్రవరి 1

రాత పరీక్ష తేదీ: ఫిబ్రవరి 18

వెబ్‌సైట్: https://iocl.com/

వీఎస్ఎస్‌సీలో రీసెర్చ్ ఫెలో

తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ), స్పేస్ ఫిజిక్స్ ల్యాబొరేటరీ... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ రీసెర్చ్ ఫెలో. **ఖాళీలు: 5**

అర్హతలు: ఎమ్మెస్సీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/స్పేస్ ఫిజిక్స్/అట్మాస్ఫియరిక్ సైన్స్/మెటీరియాలజీ/ప్లానెటరీ సైన్సెస్), ఎంఎస్/ఎంఈ, ఎంటెక్(ఫిజిక్స్/అట్మాస్ఫియరిక్ సైన్స్/ప్లానెటరీ సైన్స్/ఎర్త్ అండ్ స్పేస్ సైన్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ఇంజనీరింగ్ ఫిజిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్/గేట్/జెస్ట్‌లో అర్హత సాధించి ఉండాలి.

వయోపరిమితి: జనవరి 30 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక ప్రక్రియ: అప్లికేషన్ షార్ట్-లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి తుది ఎంపిక చేపడతారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 30

వెబ్‌సైట్: https://www.vssc.gov.in/

ఎన్‌హెచ్ఏఐలో డిప్యూటీ మేనేజర్లు

న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ)...డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** డిప్యూటీ మేనేజర్(టెక్నికల్)

ఖాళీలు: 60

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ / ఇన్‌స్టిట్యూట్ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

పే స్కేల్: రూ.15,600 - రూ.39,100


ఎంపిక ప్రక్రియ: యూపీఎస్సీ 2023లో నిర్వహించిన ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: https://nhai.gov.in/



లిటిల్



తాత ఆలోచన.. రాజుగారికి సంతోషం!

అనగనగా ఉత్తరదేశంలోని ఓ రాజ్యం. ఆ రాజ్యంలోని రాజు పేరు పల్లవుడు. రాజుగారికి సకల కళల్లో ప్రావీణ్యముంది. మంచి పాటగాడు. రాజుగారు ఎంతో ఆశావహులు. ఆయన యుద్ధంలో అరివీర భయంకరుడు. ఇతరులకు సాయం చేయటంలో అతనికి అతనే సాటి. అలాంటి రాజ్యంలో ప్రజలకెన్నో సంక్షేమ పథకాలు ఇచ్చాడు. తన వల్లే వీరంతా సంతోషంగా ఉంటారని అనుకున్నాడు.


ఒకరోజు రాజుగారు గుర్రంమీద ముసుగు కప్పేసుకుని మరీ బయలుదేరాడు. రాజ్యంలో జనాల ఆలోచలను విందామని వెళ్లాడు. సంక్షేమపథకాలు బాగా ఉన్నాయి. అయితే ఇంకా మాకు ధనం, ధాన్యం.. ఇలా ఏవేవో కావాలని అడుగుతున్నారు. ప్రతి ఒక్కరు విచారంతోనో, బాధతోనో ఉన్నారు. ఇది చూసి నా రాజ్యంలో సంతోషంగా ఎవరూ లేరా? అని బాధపడ్డాడు. ఇన్నాళ్లు సుభిక్షపాలన అందిస్తూ ఉన్నాను అని అనుకున్న తన ఆలోచనలో నిజం లేదని తెలిసింది. ఇలా రైతు, దళారి, కూలీ.. అందరినీ



కలిసినా ఫలితం ఒక్కటే. చాలామందిలో ఏదో నిరాశ ఉంది. ఇలాంటప్పుడు నేను రాజును ఎలా అవుతాననే బాధలో ఉన్నాడు పల్లవుడు.

పగటిపూట ఒక రోజు తన పరివారంతో వెళుతూంటే ఓ ముసలివాడు చెట్లు నాటుతూ కనిపించాడు. రాజుగారి రాకను పట్టించుకోలేదు. దీంతో రాజుగారు ఆయన్ని కలవాలని వెళ్లారు. అతని ముఖం తేజంగా ఉంది. వృద్ధాప్యం ఛాయలున్నా అతని ఆశావాదం రాజును ఆశ్చర్యపరిచింది. వెంటనే రాజుగారు ఆ తాతను ఇలా అడిగాడు.. 'ఈ చెట్టును ఇంత ప్రయాసతో నాటుతున్నావెందుకు?' అనడిగాడు. 'ప్రయాసకాదు రాజావారు. సంతోషంతో నాటుతున్నా' అన్నాడు ముసలాయన. 'చూస్తే ఆరేళ్లు కూడా బతికేట్లు లేవు. మరి ఈ చెట్టు కాయలు ఎప్పుడు కాస్తుంది?' అనడిగాడు రాజు. 'ఈ మామిడిచెట్టు ఐదేళ్లకు కాయలు కాస్తుంది. మా మనవళ్లకు ఈ కాయలు ఉంటాయి' అన్నాడు. రాజుగారు ఆశ్చర్యపోయారు. ఎలాగ అన్నాడు. అసలు ఆ అవసరం నీకెందుకు? అన్నాడు. 'అలా అనుకుంటే ఎలా అయ్యా.. మనిషి ఆశాజీవి. మా తాతయ్యగారు నాటిన చెట్లు ఇప్పుడు కాయలు కాస్తున్నాయి. ఆ ఫలితం నాకు ఉంది కదా. నేను కూడా అందుకే.. నా మనవళ్లకోసం ఈచెట్టు నాటుతున్నా' అన్నాడు. అతని ఆలోచన, అతనిలోని ఉండే సంతోషం చూసి రాజుగారు సంతోషపడ్డారు. ఆయన మాటలు విని ఇంటికి బయలుదేరాడు. గుర్రం ఎక్కి వెళ్తున్నప్పుడు 'ఇంతటి ఆశాజీవి. నా రాజ్యంలో ఉన్నందుకు గర్వంగా ఉంది' అని మనసులో అనుకున్నాడు. అప్పటి నుంచి ఆ తాత బతికి ఉండేవరకు బంగారు నాణేలను రాజుగారు పంపించేవారు.

దారి కనుక్కోండి



10 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 210

4	2		9		5			
6	8				3	9		
			2					
1		4					7	
3								8
	9					4		6
					2			
		7	4				1	5
			6		7		2	9

సుడోకు - 209 సమాధానం

8	5	3	4	9	6	2	7	1
2	9	7	8	3	1	4	6	5
1	4	6	2	7	5	3	8	9
3	2	8	6	4	9	5	1	7
5	7	4	3	1	8	6	9	2
9	6	1	5	2	7	8	4	3
6	3	9	7	5	4	1	2	8
4	1	5	9	8	2	7	3	6
7	8	2	1	6	3	9	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.